ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శుద్ధ పాడ్యమి రా. 3.24 వరకు, అనంతరం విదియ; నక్షత్రం: ధనిష్ఠ ఉ. 9.30 వరకు, అనంతరం శతభిషం ; అమృతకాలం: తె. 3.05 నుండి 4.50 వరకు; వర్జ్యం: సా. 5.10 నుండి 6.52 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, తదుపరి మ. 12.24 నుండి 1.12 వరకు; రాహుకాలం: ఉ. 10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ. 3.00 నుండి 4.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి: 56 • సంచిక: 306 • శుక్రవారం 16 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ * పేజీలు: 12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ఇంటింటికీ సీసీ కెమెరా!

• డీజీపీ మహేందర్‌రెడ్డి అభిమతం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: టెక్నాలజీ ఓ ఫోర్స్‌మల్టీప్లేయర్ అని, సీసీ కెమెరా ఓ వెపన్ వంటిదని డీజీపీ ఎం. మహేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధి ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌లో 9 గ్రామ పంచాయతీల్లో ప్రజల భాగస్వామ్యంతో నేను సైతం ప్రాజెక్టు కింద 52 లక్షల వ్యయంతో ఏర్పాటైన 150 సీసీ కెమెరాలు,

➪ 2వ పేజీలో...

డ్రోన్‌తో మూసీ సర్వే!

• హైదరాబాద్ చెరువులపై దృష్టి: కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్‌లోని చెరువులు, మూసీనది అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఇందులో ఎలాంటి కాలయాపన జరగొద్దని సూచించారు. రానున్న వర్షాకాలం నాటికి కనీసం యాభై చెరువులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని

➪ 2వ పేజీలో...

కృష్ణాపై ఎవరివాదన వారిదే

మా రాష్ట్రం వాటా!

• సాగునీటిలో అన్యాయం ఇక సహించబోం
• ముందు కేటాయింపులు... ఆ తర్వాతే బోర్డు పరిధి నిర్ణయం
• అసంపూర్తిగా ముగిసిన సమావేశం
• పట్టిసీమలో తెలంగాణ హక్కు 45 టీఎంసీలు
• కేంద్రం ముందు వాదనలు

న్యూఢిల్లీ/ హైదరాబాద్, ఆంధ్రప్రభ: గోదావరిలో నీటిలభ్యత, వాడకంపై ఆంధ్రప్రదేశ్ అధికారులు గందరగోళం, అయోమయం సృష్టించేందుకు చేసిన ప్రయత్నాలను తెలంగాణ భగ్నం చేసింది. ఢిల్లీలో గురువారం ఈ సన్నివేశం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న జలవివాదాలపై కేంద్రప్రభుత్వం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో వాడివేడి చర్చ జరిగింది. కావేరి మళ్ళింపు పథకంపై చర్చసందర్భంలో గోదావరి నదిలో నీటిలభ్యత ఉందన్న ఆంధ్రప్రదేశ్, కాళేశ్వరం ప్రాజెక్టు విషయానికొస్తే నీటిలభ్యత లేదంటూ తొండివాదన చేస్తున్నారని తెలంగాణ ప్రభుత్వం ఆక్షేపించింది. కృష్ణా, గోదావరి

➪ 2వ పేజీలో...





దేశానికే ఇది ఆదర్శం!

రైతుకు రొక్కం బాగు...బాగు!

• కేసీఆర్‌కు కేంద్ర ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం ప్రశంసలు

3 లో

వారంలో ఎయిమ్స్ నిధులు!

• సీఎం కేసీఆర్‌కు కేంద్రమంత్రి జైట్లీ హామీ
• రైతులకు పెట్టుబడి ప్రోత్సాహకం పథకానికి అరవింద్ సుబ్రహ్మణ్యం కితాబు
• నేడు ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశం?

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీని కోరారు. గురువారం నాడిక్కడ నార్త్‌బ్లాక్‌లోని ఆర్థిక శాఖ కార్యాలయంలో ఆయనతో సుమారు 20 నిమిషాల పాటు సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన ఎయిమ్స్‌కు నిధులు, ఐఐఎం ఏర్పాటు తదితర అంశాలను చర్చించారు. ఈ సమావేశంలో ఉన్నతాధికారులు సిఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగ్‌రావు, ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావు ఉన్నారు. గతంలో ఇచ్చిన హామీల మేరకు తెలంగాణ రాష్ట్రానికి ఎయిమ్స్, ఐఐఎమ్ లు (ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ మేనేజమెంట్) మంజూరు చేయాలని సీఎం కోరారు. గతంలో తెలంగాణ రాష్ట్రానికి ఆల్ ఇండియా ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని సిఎం గుర్తుచేశారు. కేంద్రం ఎయిమ్స్ మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన స్థలం ఇవ్వడంతో పాటు మిగతా మౌలిక వసతులు కల్పించడానికి సిద్ధంగా వున్నట్లు సిఎం తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి ఐఐఎమ్ మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి స్మృతి ఇరాని మాట ఇచ్చారని, దాని ప్రకారం ఐఐఎమ్ మంజూరు చేయాలని కోరారు. తెలంగాణ లోని 10 పాత జిల్లాల్లోని 9 జిల్లాలను వెనుకబడిన ప్రాంతాల జాబితాలో చేర్చి ప్రతీ ఏటా రూ.450 కోట్ల చొప్పున సహాయం అందిస్తున్నందుకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. గడిచిన

➪ 3వ పేజీలో...

ఫ్లోరిడా పాఠశాలలో...

మారణహోమం



• 17 మంది విద్యార్థులను హతమార్చిన యువకుడు
• ఆధునిక ఆయుధాలతో దాడి
• విద్యార్థులే లక్ష్యంగా కాల్పులు
• ఉగ్రవాద తరహాలో ఫైరింగ్
• ట్రంప్ ఖండన

11 లో





క్షుద్ర పూజలకే

• బలిచ్చింది ఆడశిశువునే
• కోయదొర సూచనతోనే
• రోడ్డుమీద చిన్నారిని ఎత్తుకొచ్చాం: నిందితులు

8

నీరవ్ మోడీకి ఈడీ సెగ!



• దేశవ్యాప్తంగా సోదాలు
• రూ.5,100 కోట్ల ఆభరణాలు స్వాధీనం
• ఐదు చోట్ల ఆస్తులు జప్తు
• హైదరాబాద్‌లోనూ దాడులు
• పాస్‌పోర్టు రద్దుకు సీబీఐ, ఈడీ విజ్ఞప్తి

రూ. 11,400 కోట్ల విలువైన పిఎన్‌బీ కుంభకోణం, తదనంతరం పరిణామాలతో దేశం రోజంతా వేడెక్కిపోయింది. కీలక నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నీరవ్ మోడీ కార్యాలయాలు, నివాసాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు జరిపింది. రూ.5,100 కోట్ల విలువైన స్వర్ణ, వజ్రాభరణాలను స్వాధీనం చేసుకుంది. ముంబైలో ఐదు చోట్ల ఆస్తులను జప్తు చేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ మోసపూరిత ఆర్థిక లావాదేవీలకు కారణమైన 150 ఎల్‌ఓయూల జాబితాను సిబిఐకి అప్పగించింది. నగదు తిరిగి చెల్లింపుపై నీరవ్ మోడీ తమకు అస్పష్టమైన సందేశాలు పంపుతున్నారని పిఎన్‌బి సిఎండి తెలిపారు. నీరవ్ మోడీ, అతడి కుటుంబ సభ్యులు జనవరి మొదటి వారంలోనే దేశం విడిచి వెళ్ళిపోయారు. ఆ తర్వాత జనవరి 23న దావోస్‌లో ప్రధాని నరేంద్రమోడీతో భారతీయ సీఈఓలు దిగిన గ్రూప్ ఫొటోలో నీరవ్ మోడీ కనిపించడం పెను రాజకీయ దుమారానికి దారి తీసింది. కాంగ్రెస్‌సిబిఐకి పార్టీ విపక్షాలు పాలక ఎన్డీయేపై విరుచుకుపడ్డాయి. కుంభకోణానికి ప్రధాని మోడీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశాయి. అయితే నీరవ్ మోడీ ప్రధాని నరేంద్ర మోడీతో పాటుగా దావోస్ వెళ్ళిన ప్రతినిధుల బృందంలో సభ్యుడు కాడని బీజేపీ స్పష్టం చేసింది. ఆయన వ్యక్తిగత హోదాలో అక్కడకు వెళ్ళారని తెలిపింది.

3

ఎర్రజొన్న రైతు కన్నెర్ర

వ్యాపారులంతా కుమ్మక్కై ఎర్రజొన్న, పసుపు, కంది, మిర్చి, సుబాబుల్ పంటలకు మద్దతు ధరలు అమలు కాకుండా చేస్తున్నారు. అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దీనిని నిరసిస్తూ రైతులు రోడ్డెక్కారు. మద్దతు ధర కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు శ్రీకారం చుట్టారు.

• పసుపు, కంది రైతుల ఉగ్రరూపం
• నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులు
• మద్దతు ధర కల్పించాలంటూ రహదారుల దిగ్బంధం..
• ఆందోళనలు... నిరసనలు
• ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి
• భారీగా పోలీసు బందోబస్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఎర్రజొన్న రైతులు కన్నెర్ర చేశారు. దళారుల దోపిడీని నియంత్రించలేదని ప్రభుత్వాన్ని నిందిస్తూ ప్రత్యక్ష దాడులకు దిగుతున్నారు. గత వారం రోజులుగా నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంతాల్లో తీవ్రంగా కొనసాగుతున్న ఆందోళన కార్యక్రమాలు గురువారం మరింత పెరిగాయి. ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులను నిలదీయడం, వారి ఇండ్లను ముట్టడించడం, రోడ్లపై తిరగకుండా చేయడం లాంటి కార్యక్రమాలు జరిగాయి. దీంతో ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో తిరగలేని పరిస్థితి నెలకొంటోంది. ఎక్కడ రైతులు ప్రత్యక్ష దాడులకు దిగుతారోనని భయాందోళన చెందుతున్నారు. అదే సమయంలో కనీస మద్దతు ధరలు అమలు చేయకుంటే తమ ఆగ్రహానికి గురికాక తప్పదని రైతులు, రైతు సంఘాలు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాయి. కొన్నిచోట్ల

➪ 9వ పేజీలో...





హైదరాబాద్‌లో ఇరాన్ అధ్యక్షుడు

• తాజ్‌కృష్ణలో మత పెద్దలు, ఉలేమా, స్కాలర్స్‌తో భేటీ
• నేడు మక్కా మసీదు సందర్శన

2 లో



కాంగ్రెస్ రాద్ధాంతం!

• నిజామాబాద్ ఎంపీ కవిత
• మార్క్‌ఫెడ్ ద్వారా ఎర్రజొన్న కొనుగోలు
• మంత్రి పోచారం వెల్లడి

9 లో

దేవాదులకు రూ.450 కోట్లు

'భీమా'కు రూ. 35 కోట్లివ్వండి

● ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా నిధులు సమకూర్చాలి ● జలవనరుల శాఖ సమావేశంలో గడ్కరినీ కోరిన హరీశ్‌రావు ● పర్యావరణశాఖ మంత్రి హర్షవర్ధన్‌తో విడిగా భేటీ ● కాళేశ్వరం సందర్శనకు రావాలని మంత్రులకు ఆహ్వానం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) కింద ఎంపిక చేసిన ప్రాజెక్టుల్లో దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు రూ. 450 కోట్లు, భీమా ప్రాజెక్టుకు రూ. 35 కోట్లు విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి టి. హరీష్ రావు కేంద్రాన్ని కోరారు. కేంద్ర జల వనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరిగిన 19 రాష్ట్రాల మంత్రులు, అధికారుల సమావేశానికి హాజరైన హరీష్ రావు, తెలంగాణ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు కోసం గట్టిగా పట్టుబట్టారు. నాబార్డు లేదా తదితర సంస్థల ద్వారా ఇచ్చే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి తీసుకురావద్దని కేంద్రానికి ఆయన విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా 99 సాగు నీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులుగా గుర్తిస్తూ వాటిని త్వరిత గతిన పూర్తి చేసేందుకు ఏఐబీపీ కింద కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన 11 ప్రాజెక్టుల్లో ఇప్పటికే 2 ప్రాజెక్టులు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మరో 6 ప్రాజెక్టులు జూన్ 2018 నాటికల్లా పూర్తి కానున్నాయి. మిగతా ప్రాజెక్టులను 2019 మార్చి నాటికల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలంగాణ మంత్రి హరీష్ రావు తెలిపారు. ఢిల్లీలోని ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో జరిగిన ఈ సమావేశం అనంతరం ఆయన అక్కడే మీడియాతో మాట్లాడారు. "కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ వాటర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం (క్యాడ్‌వ్యాం)" కింద తాము అడుగుతున్న రూ. 1,000 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరినట్టు ఆయన తెలిపారు. ఇందులోనే దేవాదులకు కేటాయించిన రూ. 450 కోట్లతో పాటు, భీమా ప్రాజెక్టుకు రావాల్సిన రూ. 35 కోట్లు ఉన్నాయని హరీష్ రావు వివరించారు. ఈ నిధులను నేరుగా గ్రాంటు రూపంలో కాకుండా నాబార్డు ద్వారా రుణం రూపేణ ఇచ్చే పక్షంలో వాటిని ఎఫ్.ఆర్.బీ.ఎం పరిధిలోకి తీసుకురావద్దని విజ్ఞప్తి కోరినట్టు ఆయన తెలిపారు. అప్పుడే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన లక్ష్యాలను చేరుకోవచ్చని, ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయి రైతులకు మేలు జరుగుతుందని హరీష్ రావు అన్నారు. తన అభిప్రాయాలతో కేంద్ర మంత్రి గడ్కరీ సూత్రప్రాయంగా ఏకీభవించారని తెలిపారు. అన్ని రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రుల అభిప్రాయాలతో నివేదికను సమర్పిస్తే తాను కేంద్ర మంత్రివర్గం ముందుకు ఈ అంశాన్ని తీసుకొస్తానని గడ్కరీ హామీ ఇచ్చినట్టు రాష్ట్ర మంత్రి చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతులపై కృతజ్ఞతలు

కేంద్ర జల వనరుల శాఖ మంత్ర గడ్కరీ ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యేందుకు ఢిల్లీ వచ్చిన హరీష్ రావు, మధ్యాహ్నం కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌తో భేటీ అయ్యారు. జోర్ బాగ్‌లోని పర్యావరణ్ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు త్వరితగతిన అన్ని రకాలు అనుమతులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు మొదటి దశ అటవీ అనుమతులు ఇవ్వాలని కోరారు. దీంతో పాటు సీతారామ ప్రాజెక్టుకు పర్యావరణ, వన్యప్రాణి అనుమతులు మంజూరు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు రావాల్సిందిగా ఇటు హర్షవర్ధన్‌ను, అటు కేంద్ర జల వనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని హరీష్ రావు ఆహ్వానించారు. ఇద్దరూ సుముఖత వ్యక్తం చేసినట్టు హరీష్ రావు అనంతరం మీడియాకు చెప్పారు.



బేగంపేట్ విమానాశ్రయంలో ఇరాన్ అధ్యక్షుడికి స్వాగతం పలుకుతున్న గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్

ఇరాన్ అధ్యక్షుడికి ఘన స్వాగతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం హైదరాబాద్‌కు వచ్చిన ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ హసన్ రౌహనీకి బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, కేంద్ర మంత్రి ఆర్‌పి సింగ్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, జీఏడీ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా, డీజీపీ ఎం. మహేందర్‌రెడ్డి, ఇంటలిజెన్స్ ఐజీ నవీన్‌చంద్, నగర పోలీస్ కమిషనర్ వివి శ్రీనివాసరావు, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్ సింగ్, రీజనల్ పాస్‌పోర్టు ఆఫీసర్ ఇ.విష్ణు వర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దారితప్పిన గరీబ్ రథ్

● రెండు గంటల తర్వాత గుర్తింపు



న్యూఢిల్లీ: రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా గరీబ్ రథ్ రైలు దారి తప్పింది. పంజాబ్‌లోని అమృత్‌సర్ నుంచి బీహార్‌లో సహర్స వెళ్లాల్సిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ మధ్యలో రెండు గంటలు కనిపించకుండా పోయింది. ఘజియాబాద్ జంక్షన్‌లో ఆ రైలు దారి తప్పింది. దీంతో యూపీలోని మొరాదాబాద్ వెళ్లాల్సిన రైలు.. అలీగఢ్‌వైపు రాంగ్ రూట్‌లో వెళ్లింది. గంటన్నర తర్వాతగానీ డ్రైవర్ కూడా రైలు రాంగ్‌రూట్‌లో వెళ్తున్నట్లు గుర్తించలేకపోయాడు. వెంటనే రైలును ఆపి విషయాన్ని అధికారులకు చెప్పాడు. ఘజియాబాద్‌కు మధ్యాహ్నం 1.30 గంటలకు వచ్చిన రైలు.. దారి తప్పింది. డ్రైవర్ సమాచారంతో రంగంలోకి దిగిన అధికారులు.. ఆ రైలు ఎక్కడుందో గుర్తించి మళ్లీ ఘజియాబాద్‌కు తీసుకొచ్చారు. ఆ తర్వాత మళ్లీ మొరాదాబాద్ వైపు వెళ్లింది. ఈ ఘటనపై రైల్వేశాఖ విచారణకు ఆదేశించింది.

తప్పిపోయిన భార్యకోసం..

● సైకిల్‌పై 28 రోజుల పాటు 55 గ్రామాల్లో వెతుకులాట!



రాంచీ: మతిస్థిమితం లేని భార్య తప్పిపోతే ఆ భర్త పోలీస్ కంప్లైంట్ ఇచ్చి ఊరుకోలేదు. తప్పిపోయిన భార్య కోసం దాదాపు 750 కిలోమీటర్లు సైకిల్ పై ప్రయాణించాడు. ఈ క్రమంలో ఆయన 28 రోజులలో 55 గ్రామాలు తిరిగాడు. సైకిల్ తొక్కుకుంటూ ఒక్కో గ్రామానికీ వెళ్లి అక్కడి పోలీస్ స్టేషన్‌లో, గ్రామ పెద్దకు తన భార్య ఫొటో ఇచ్చి ఆచూకీ తెలిస్తే చెప్పాలని అభ్యర్థించాడు. సరిగ్గా నెల రోజుల తరువాత ఆయన వెతుకులాట ఫలించింది. అతడి భార్య జార్ఖండ్‌లోని ముసబోని గ్రామంలో ఉందన్న సమాచారం అందింది. వెంటనే అక్కడకు వెళ్లి భార్యను కలుసుకుని తనతో తెచ్చుకున్నాడు. ఆ భర్త పేరు మనోహర్ నాయక్. జార్ఖండ్‌కు చెందిన మనోహర్ నాయక్‌కు అనితా నాయక్‌తో 2001లో వివాహమైంది. కొంత కాలంగా అనితా నాయక్‌కు మతిస్థిమితం తప్పింది. ఈ నేపథ్యంలో ఆమె గత నెల 24న తప్పిపోయింది. తన భార్యకు వైద్యం చేయించి బాగుచేయించుకుంటానని మనోహర్ నాయక్ చెప్పాడు.

ఎనిమిదేళ్ల బాలిక సాహసం

తమ్ముడిని కాపాడుకునేందుకు ఆవుతో పోరాటం!

బెంగళూరు: ఎనిమిదేళ్ల పాప... తన తమ్ముడిని కాపాడుకునేందుకు దూసు కొస్తున్న ఆవుతో ప్రాణాలకు తెగించి పోరాడింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కర్ణాటక హొన్నావర్ తాలూకా నావిలాగాన్ గ్రామం లో జరిగింది. ఆరతి అనే 8 ఏళ్ల పాప రెండేళ్ల తన తమ్ముడితో ఆడుకుంటోంది. ఆ సమయంలో ఆ బాబు మీదకు ఒక ఆవు దూకుడుగా వచ్చింది. ఏం చేయాలో అర్థం కాని ఆ పాప వెంటనే తన తమ్ముడిని తీసుకుని పక్కకు దూకేసింది. కేకలు పెడుతూ ఆవుకు అందకుండా అటూ ఇటూ పరుగెడుతూ ఆవును ఆయోమయానికి గురిచేసింది. ఆవు కూడా వారి వెంటపడింది. ఆరతి కేకలు విన్న ఆమె కుటుంబ సభ్యులు బైటకు పరుగెత్తుకొచ్చి ఆవును తరిమివేయడానికి ప్రయత్నించారు. ఈలోగా ఆ పాప తన తమ్ముడితో ఇంట్లోకి పారిపోయింది. ఈ మొత్తం సంఘటన అంతా ఆ పాప తండ్రికి ఉన్న నగల దుకాణంలోని వీడియోలో రికార్డయింది. ఇప్పుడది సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. ఆ సమయంలో ఏం చేయాలో తనకు అర్థం కాలేదని, ఆవునుంచి తమ్ముడిని రక్షించుకోవాలని తప్ప ఎలా అనే ఆలోచన కూడా రాలేదని ఆ పాప చెప్పింది.



మేక-కుక్క విడాకుల కోసం..

● ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు



కోయంబత్తూరు: తమిళనాడులోని కోయంబత్తూరు ఫ్యామిలీ కోర్టులో చిత్రమైన పిటిషన్ దాఖలైంది. ఒక మేక, కుక్క జంటకు విడాకులు ఇప్పించాల్సిందిగా పిటిషన్ దాఖలైంది. థాంతై పెరియార్ ద్రవిడర్ ఖజగమ్ (టీపీడీకే) పార్టీ సభ్యులు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. నిన్న వాలెంటైన్స్ డే సందర్భంగా ఒక మేకకు, కుక్కకు వివాహం జరిపించారు. నేడు ఈ జంటకు విడాకులు ఇప్పించాలని కోర్టుకు వచ్చారు.

బహిరంగంగా మంత్రి మూత్ర విసర్జన



జైపూర్: రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం పరువు గంగలో కలిసింది. ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి కాళీచరణ్ సరఫ్ బహిరంగంగా మూత్ర విసర్జన చేశారు. జైపూర్‌లో ఈ ఘటన జరిగింది. రోడ్డు మీద బహిరంగంగా మంత్రి మూత్ర విసర్జన చేస్తున్న ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనను మంత్రి కొట్టిపారేశారు. ఇదేమీ పెద్ద విషయం కాదన్నారాయన. పింక్ సిటీ రూల్స్ ప్రకారం ఎవరైనా రోడ్డు మీద మూత్రం పోస్తే వారికి రూ.200 జరిమానా విధిస్తారు. ఇదేమీ పెద్ద విషయం కాదని, దీని గురించి మాట్లాడాల్సిన అవసరం లేదని మంత్రి అన్నారు. ఒకవైపు స్వచ్ఛ భారత్ కోసం ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తుంటే, ఇలాంటి మంత్రులు వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని ఆ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. బహిరంగ మూత్ర విసర్జన చేయకూడదని.. టాయిలెట్స్, లాట్రిన్స్ లేని వాళ్లకు ప్రభుత్వం డబ్బులు చెల్లించి మరీ వాటిని కట్టిస్తున్నది. మరి.. ఇలా విస్తృతంగా స్వచ్ఛ భారత్ ఉద్యమం దేశ ప్రజల్లో నాటుకుపోతున్న సమయంలో బీజేపీకి చెందిన నేత స్వచ్ఛ భారత్ ఉద్యమాన్ని తుంగలో తొక్కారు. ఉద్యమ ప్రతిష్ఠతను కాలరాశారని సోషల్ మీడియాలో నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు.

తెలంగాణకు నగదు సరఫరా చేయండి

● బ్యాంకుల్లో కొరతను తీర్చాలి ● కేంద్ర ఆర్థికమంత్రికి ఎంపీ వినోద్ లేఖ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రాష్ట్ర వ్యాప్తంగా ఏటీఎంలు, బ్యాంకులలో నెలకొన్న నగదు కొరత సమస్యను కరీంనగర్ ఎంపీ బి. వినోద్ కుమార్ కేంద్రం దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఆయన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి లేఖ రాశారు. రాష్ట్రంలో ఏ ఏటీఎం చూసిన 'నగదు లేదు' అన్న బోర్డులే కనిపిస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. అన్ని బ్యాంకులకు నగదు లభ్యతను పెంచేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి సరఫరా పెంచాలని వినోద్ కేంద్రాన్ని కోరారు. ఏ ఏటీఎంలోనూ నగదు లేని పరిస్థితి లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ టి. పాపి రెడ్డి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ, అధ్యాపకులు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూ జీసీ) ఛైర్మన్ డీపీ సింగ్‌ను కలిశారు. అందులో ప్రధానంగా 100 ఏళ్లు దాటిన విశ్వ విద్యాలయాలకు ఇచ్చే ప్రత్యేక గ్రాంట్ ఉస్మానియా యూని వర్సిటీకి అందలేదని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాలకు వన్ టైం గ్రాంట్ రూపంలో నిధులు సమకూర్చి, ఉన్నత విద్య నాణ్యత పెంపొందించేందుకు సహకరించాలని కూడా ఈ బృందం యూజీసీ ఛైర్మన్‌ను కోరింది. శాతవాహన యూనివర్సిటీ స్టేటస్ అంశం, నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీకి రూ. 5 కోట్ల బకాయిల విడుదల, వుమెన్స్ హాస్టల్ ఏర్పాటు, కాకతీయ యూనివర్సిటీలో బీఈడీ కోర్సుకు గుర్తింపు తదితర అనేక అంశాలపై యూజీసీ ఛైర్మన్‌తో చర్చించడంతో పాటు లిఖితపూర్వక విజ్ఞప్తులను ఈ బృందం అందజేసింది.



యూజీసీ ఛైర్మన్‌తో ఎంపీ వినోద్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్

బచావత్ అవార్డుకు కట్టుబడాలి

● పోలవరంపై ఒడిశా పిటీషన్ విచారణ ● అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఎందుకు జరగలేదన్న సుప్రీం ● ఏప్రిల్ 17కు కేసు వాయిదా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : బచావత్ అవార్డుకు అన్ని రాష్ట్రాలు కట్టుబడి ఉండాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఏమైనా అభ్యంతరాలుంటే మార్చి 30కల్లా అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. బుధవారం జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాతో కూడిన సుప్రీం ధర్మాసనం కేసు విచారణ చేసింది. పోలవరంపై అభ్యంతరాలు తెలుపుతూ ఒడిషా రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణ్యం వాదనలు వినిపించారు. తొలుత 36 లక్షల క్యూసెక్కుల సామర్థ్యంతో పోలవరం నిర్మాణానికి డీపీఆర్ రూపొందించగా, ప్రస్తుతం దాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుతున్న విషయాన్ని ప్రస్తావించారు. దీని వల్ల పోలవరం ప్రాజెక్టుపై మరింత ఒత్తిడి పెరుగు తుందన్నారు. అయితే గోదావరి జలాలకు సంబంధించి అన్ని రాష్ట్రాలు బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు కట్టుబడి ఉండాలని సుప్రీం పేర్కొంది. ఈ మేరకు అభ్యంతరాలుంటే సంబంధిత రాష్ట్రాలు అఫిడవిట్ సమర్పించాలని ఏపీ, ఒడిషా, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలను ఆదేశించింది. పర్యావరణ, తదితర అంశాలకు సంబంధించి దాఖలైన పిటీషన్‌లపై విచారణ తర్వాత చేస్తామన్నారు. అలాగే పోలవరం పిటీషన్‌లోని అంశాల పరిష్కారానికి సంబంధిత రాష్ట్రాల సీఎంలతో కూడిన అపెక్స్‌కౌన్సిల్ సమావేశం ఎందుకు జరగలేదని ప్రశ్నించింది. అయితే కేంద్ర నుంచి సరైన సహకారం లేదని రాష్ట్రాలు పేర్కొన్నాయి. అయితే అన్ని రాష్ట్రాల సిఎంల సమావేశానికి తమకు అభ్యంతరం లేదని ఏపీ ప్రభుత్వం తరుపు న్యాయవాది పేర్కొన్నారు. తదుపరి విచారణను ఏప్రిల్ 17కి వాయిదా వేసింది.

మా రాష్ట్రం.. మా వాటా!

(మొదటిపేజీ తరువాయి)

నదులలో తెలంగాణ వాటా తేల్చాల్సిందేనని గట్టిగా వాదించింది. అరవైఏళ్ళుగా నీళ్ల విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎంతమాత్రం సహించేదిలేదని తెలంగాణ ప్రకటించింది. కృష్ణాలో ఆంధ్రప్రదేశ్ 512, తెలంగాణ 299టిఎంసిలు వాడుకునేందుకు ఒక ఏడాది కోసం వర్కింగ్ అరేజ్‌మెంట్ జరిగిందని సిఎస్ జోషి సమావేశంలో చెప్పారు. కానీ నాలుగేళ్ళయినా కేటాయింపులు తేలడంలేదన్నారు. తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటా తేల్చాకే కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిని నిర్ణయించాలని తెలంగాణ పట్టుబట్టింది. ఈ ప్రక్రియను త్వరితగతిన ముగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ డిమాండ్ చేసింది. బోర్డుల పరిధిని ఖరారుచేయడానికి తమకు అభ్యంతరం లేనప్పటికీ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకటించాకే బోర్డుల పరిధిలో ప్రాజెక్టు నిర్ణయించాలని తెలంగాణ డిమాండ్ చేసింది. తెలంగాణ ప్రాంతానికి సాగునీటిలో జరుగుతున్న అన్యాయాలను , వాటిని ఇప్పటికైనా సరిదిద్దాల్సిన అవసరాన్ని జోషి వివరించారు. తెలంగాణ ప్రాజెక్టుల డిపి ఆర్‌లకు సంబంధించి చర్చ వచ్చినపుడు రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులన్నీ పాత వేనని, ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను జోషి స్పష్టం చేశారు. కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు మాత్రమే అపెక్స్ బాడీ ఆమోదం అవసరమనే విషయాన్ని సిఎస్ గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ వితండవాదం చేస్తోందని, ఆ వాదనలో హేతుబద్ధత లేదన్నారు.

కెఆర్ఎంబి, జిఆర్ఎంబి అనుమతి లేకుండా అక్రమంగా ఎపి ప్రాజెక్టులను నిర్మిస్తున్నదని తెలంగాణ ప్రభుత్వ సిఎస్ జోషి ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా ఆయన ఏకరువుపెట్టారు. పట్టిసీమ ప్రాజెక్టు కు ఎవరు అనుమతించారని జోషి ప్రశ్నించారు. పట్టిసీమకు ఎలాంటి అనుమతి లేకపోగా, ఆ ప్రాజెక్టులో తమ వాటా 45టిఎంసిలు రావాల్సి ఉందన్నారు. పోలవరంలో తెలంగాణకు 45టిఎంసిలు కేటాయించాలన్న బజాజ్‌కమిటీ చేసిన సూచనలను ఖాతరు చేయడంలేదని తెలంగాణ ప్రభుత్వం విమర్శించింది. తెలంగాణలో చిన్ననీటి వనరుల కింద 30టిఎంసిల వాడకం ఉన్నట్లు చాలా కాలంగా తెలంగాణ ప్రభుత్వం చెబుతూనే ఉందని సిఎస్ గుర్తు చేశారు. ఎపిలో కూడా 60వేల పైచిలుకు మైనర్ ఇరి గేషన్ వనరులున్నట్లు జోషి తెలిపారు. మైనర్ ఇరిగేషన్ కింద ఎపిలో జరుగుతున్న సాగు వివరాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



కృష్ణానీటివాడకంపై గరంగరం చర్చ

కృష్ణానీటివాడకంపై గరంగరం చర్చ సాగింది. శ్రీశైలం ప్రాజెక్టు నుండి పోతిరెడ్డి పాడు ప్రాజెక్టుకు నీటిని అడ్డగోలుగా తరలించుకుపోతున్నారని, జలదోపిడీ జరుగుతున్న దని తెలంగాణ సిఎస్ జోషి ఆరోపించారు. రెండు నెలల్లో టెలిమెట్రీ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చి రెండేళ్ళు గడిచినా ఇంతవరకు వాటికి అతీగతీ లేదన్నారు. ఉమ్మడి కృష్ణా ప్రాజెక్టుల దిగువ ప్రాంతాల్లో ఏ ప్రాజెక్టుకు ఎంత కేటాయించాలో తేలకపోతే ఆపరేషన్ ప్రొటోకాల్ ఆఫ్ రిజర్వాయర్స్‌ను ఎలా అమలుచేస్తారని తెలంగాణ ప్రభుత్వం కీలక చర్చకు తెరలేపింది. సాగునీటి ప్రాజెక్టులలోని విద్యుత్ ఉత్పత్తిపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. గోదావరి నీటి మళ్ళింపుకు సంబంధించి తమ టర్మ్స్ అండ్ రిఫరెన్స్‌లో బజాజ్ కమిటీ పెట్టినపుడు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం తెలిపిందని జోషి గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్టులో ముంపు తీవ్రత తగ్గించాలని డిమాండ్ చేసింది. తుంగభద్ర ప్రాజెక్టు కూడా అంతర్రాష్ట్ర ప్రాజెక్టు కనుక దానిని కూడా కృష్ణాబోర్డు పరిధిలోకి తీసుకు రావాలని తెలంగాణ కోరింది. ఈ సమావేశంలో కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యుపిసింగ్, జాయింట్ సెక్రటరీ సంజయ్ కుందు, కెఆర్ఎంబి నూతన ఛైర్మన్ వైకె శర్మ, జిఆర్ఎంబి ఛైర్మన్ శ్రీవాస్తవ, తెలంగాణ ప్రభుత్వ సిఎస్ జోషి, ఎపి ఇరిగేషన్ సెక్రటరీ శశిభూషన్ ఈఎన్‌సిలు మురళీధర్ రావు, అంతర్రాష్ట్ర జలవనరుల సిఐ నరసింహారావు పాల్గొన్నారు.

వాడివేడిగా జరిగిన సమావేశం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండానే అసంపూర్తిగా ముగిసింది. దీనిపై మంత్రి హరీష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరింత లోతైన చర్చలు జరిపి వివాదాలపై అవగాహనకు రావాలని సమావేశం నిర్ణయించింది.

ఇంటింటికీ సీసీ కెమెరా

(మొదటిపేజీ తరువాయి)

కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ ఓ లైఫ్‌లైన్ లాంటిదన్నారు. ట్రై కమిషనరేట్ల పరిధిలో రానున్న మూడేళ్లలో 10 లక్షల సీసీ కెమెరాల స్థాపన దిశగా పోలీసు సిబ్బంది కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. టెక్నాలజీ వినియోగం వల్ల గత మూడున్నరేళ్ల కాలంలో ఎలాంటి చిన్న సంఘటన చోటుచేసుకోకపోగా 40 శాతం నేరాలు తగ్గాయన్నారు. రాష్ట్రంలోని 800 పై చిలుకు పోలీసుస్టేషన్ల అన్నింటిలోనూ ఒకే రకమైన సేవలందించాల్సిన అవసరం ఉందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల ప్రాధాన్యత ఎంతగా ఉందోనన్న విషయాన్ని ప్రజలకు మరింతగా తెలియజెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రతి ఎస్టాబ్లిష్‌మెంట్ కంపల్సరీగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్న చట్టం కూడా చాలా ఉపయుక్తమైందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి నేరగాళ్లు రైళ్లల్లో, విమానాల్లో వస్తూ ఇక్కడ చోరీలకు పాల్పడి ఉడాయిస్తుండేవారన్నారు. సీసీ కెమెరాలు ఏర్పడ్డాక చోరీలకు పాల్పడ్డ పలు అంతరాష్ట్ర ముఠాలు పట్టుబడిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇక్కడ భీంరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో దసరా రోజున జరిగిన దొంగతనం కేసులో పక్కింటి సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా దొంగలను పట్టుకున్నారని, 70 తులాల బంగారంను స్వాధీనం చేసుకున్నారని తెలిపిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. సీసీ కెమెరాల ప్రాధాన్యత ఎంతగా ఉందో గుర్తెరిగిన ఆయన తర్వాత తన ఇంట్లోనే కాక ఇంటి బయట ప్రాంతాలను కవర్ చేసే విధంగాగానూ సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకున్నారని చెప్పారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సిబ్బందిని, టెక్నాలజీని సమకూర్చడం జరిగిందన్నారు. శాంతిభద్రతలు సజావుగా వుంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు తరలి వస్తాయని, తద్వారా ఇక్కడివారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని, ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని ఆయన అన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రజలతో మమేకమవుతూ ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ ముందుకు కదలాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. తొలుత సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజల నుంచి కొంత విముఖత వ్యక్తమైనప్పటికీ.. వారికి సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల జరిగే ఉపయోగాన్ని ఆనక వారికి తెలియజెప్పడంతో వారిలో చైతన్యం వెల్లి విరిసిందన్నారు. ప్రస్తుతం నేను సైతం ప్రాజెక్టుకు అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. ఇది చాలదని ప్రతి ఎస్టాబ్లిష్‌మెంట్, ప్రతి ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే దిశగా సిబ్బంది పాటుపడాలన్నారు. టెక్నాలజీ వినియోగం వల్ల తక్కువ కష్టంతో ఎక్కువ పని చేయవచ్చన్నారు. సిబ్బంది కొరత నివారణకు ఇటీవలే 18,000 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రధాన కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం జరుగుతోందన్నారు. సీసీ కెమెరాలకు అలుపు ఉండదని, పోలీసు కాని స్టేబుల్ అయినా ఎనిమిది గంటల డ్యూటీ తర్వాత విశ్రమించే అవకాశం ఉండ వచ్చునేమో కానీ సీసీ కెమెరా 24 గంటలు పనిచేస్తూనే ఉంటుందన్నారు. ఒక్క సీసీ కెమెరా వందమందితో పెట్టు అని అన్నారు. ఇక మహిళల భద్రతకు సీఎం కేసీఆర్ అత్యధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. ఇందుకు ఏం చేయాలన్న దానిపై కసరత్తులో షీటీమ్స్ ఆవిర్భవించాయన్నారు.

విత్ ఎవిడెన్స్‌తో పోకిరీల భరతాన్ని షీ టీమ్‌లు పడుతున్నాయన్నారు. మరోవైపు డ్రంక్ అండ్ డ్రైవ్‌ని సైతం ఎవిడెన్స్ బేస్డ్‌తో నిర్వహిస్తుండటంతో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. సీసీ కెమెరాల నీడలో ఉండటంతో వాహనదారులలో సైతం క్రమశిక్షణ వచ్చిందని, తాను ఈ రోజు ఇక్కడకు వచ్చే సమయంలో ఎంతమంది హెల్మెట్‌లు ధరించారన్న విషయాన్ని నిశితంగా పరిశీలించానని, దాదాపు 90 శాతం మంది హెల్మెట్‌లు ధరించడం నిజంగా సంతోషాన్ని కలిగించే అంశమన్నారు.

సీసీ కెమెరా మ్యాజిక్ ఏపాటిదో స్పష్టమైందన్నారు. రాష్ట్రం నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్ది తద్వారా పెట్టుబడుల ధామంగా రాష్ట్రాన్ని మలచడంతో పాటు పలు ప్రాజెక్టుల పనులను సైతం వేగవంతం చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. రాచకొండ సీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ సీసీ కెమెరాల వల్ల కలిగిన ప్రయోజనాలను విశదీకరించారు. కుషాయిగూడలో ఓ యాక్సిడెంట్ కేసులో సీసీటీవీ ఫుటేజ్‌లను విశ్లేషిస్తే.. ఆ ఘటనలో సదరు యువకుడు తనకు తానుగా ఆత్మహత్య చేసుకున్న దృశ్యం గోచరించిందన్నారు. దీంతో వాహనదారుడికి విముక్తి లభించినట్లైందన్నారు. కమిషనరేట్ పరిధిలో వాహనాలను దగ్ధం చేస్తున్న ఓ వ్యక్తిని సైతం సీసీ కెమెరాలు పట్టించిన తీరును వివరించారు. భార్య విడిచి పెట్టడంతో అసూయ వల్లే నిందితుడు ఆ పనిచేసినట్లు వెల్లడైందన్నారు. ఇలా పలు ఉదాహరణలను ఆయన విశదీకరించారు. నేను సైతం ప్రాజెక్టు కింద సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, సీఎస్ఆర్ కింద వివిధ సంస్థలు ఇతోధిక సహాయాన్నందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సీసీకెమెరాలకు నిధులిచ్చిన దాతలను ఆయన ప్రస్తుతించారు. భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లా నీరు మాదిరిగానే నేను సైతం ప్రాజెక్టు కింద ఇంటింటికి సీసీ కెమెరా ఏర్పాటు కావాలని ఆయన అభిలషించారు. కార్యక్రమంలో భాగంగా నేను సైతం పథకంపై కరపత్రాలు, సీసీ కెమెరాల ఉపయోగం తెలిపే లఘు చిత్రంను విడుదల చేశారు. అనంతరం గుర్తింపు పొందిన వివిధ కంపెనీల సీసీ కెమెరాల ప్రదర్శనను సందర్శించారు. కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ కంపెనీల ప్రతనిధులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో మూసీ సర్వే!



(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు. దీనిని ఒక బృహత్తర కార్యక్రమంగా చేపట్టాలన్నారు.

గురువారం బేగంపేట్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ శాఖపై మంత్రి కేటీఆర్ సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నగరంలోని చెరువులు, మూసీనది అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా చర్చించారు. మూసీ అభివృద్ధి కోసం ఒక మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. మూసీ అభివృద్ధి, సుందరీకరణ వంటి అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేయాలని సూచించారు. ఇందులో భాగంగా మూసీనది మొత్తాన్ని సర్వే చేయాలన్నారు. 40 కిలోమీటర్ల మేరకు ఉన్న మూసీ సర్వేను డ్రోన్ వంటి అత్యాధునిక టెక్నాలిజీతో నిర్వహించాలన్నారు. దీంతో పాటు గతంలో ఉన్న సాటిలైట్ మ్యాపులతో ప్రస్తుతమున్న పరిస్థితులను అధ్యయానం చేయాలన్నారు. అలాగే మూసీకి ఇరువైపుల రోడ్లు, నదిపై నుంచి ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వేతో పాటు రెండింటకలయికతో కూడిన ప్రణాళికలను తయారు చేయాలన్నారు. వీటి కోసం అయ్యే ఖర్చు, సాధ్యసాధ్యాలను క్షున్నంగా అధ్యాయం చేయాలన్నారు. ప్రస్తుతమున్న రోడ్లకు అనుబంధంగా రూపకల్పన చేస్తున్న బ్రిడ్జిల డిజైన్ల, నిర్మాణం సైతం చారిత్రక, సంస్కృతికి అద్దంపట్టేలా ఉండలన్నారు. నగర పరిధిలోని చెరువుల అభివృద్ధి ప్రణాళికలను మంత్రి ఈ సమావేశంలో సమీక్షించారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులను దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించుకుని దశల వారిగా అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యంగా రానున్న వర్షాకాలం నాటికి కనీసం 50 చెరువులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలన్నారు. ఇప్పటికే 20 చెరువుల అభివృద్ధి, సుందరీకరణ ప్రణాళికలు సిద్ధంగా ఉన్నట్లు ఈ సందర్భంగా సంబంధిత అధికారులుకు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వీటితో పాటు దుర్గం చెరువు సుందరీకరణ వేగంగా నడుస్తోందన్నారు. వర్షకాలం నాటికి ఆయా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించడంతో పాటు, బండ్ అభివృద్ధి చేయడం లాంటి పనులను ప్రారంభించాలన్నారు. చెరువులను అభివృద్ధి చేసేలోపల అవి కబ్జాకాకుండా ఉంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లతో మాట్లాడాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు.



నీరవ్ మోడీకి ఈడీ సెగ

• దేశవ్యాప్తంగా సోదాలు • రూ. 5,100 కోట్ల ఆభరణాలు స్వాధీనం

• ఐదు చోట్ల ఆస్తుల జప్తు • హైదరాబాద్‌లోనూ సోదాలు • పాస్‌పోర్టు రద్దుకు సీబీఐ ఈడీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: అతి పెద్ద బ్యాంకు కుంభకోణంలో ప్రమేయం ఉన్న ఆభరణాల డిజైనర్ నీరవ్ మోడీకి కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు గురువారం వేడి పుట్టించాయి. దేశవ్యాప్తంగా జరిపిన సోదాల్లో రూ.5,100 కోట్ల విలువైన స్వర్ణ, వజ్రాభరణాలను స్వాధీనం చేసుకున్నాయి. ఆయన పాస్‌పోర్టును రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాయని అధికారులు తెలిపారు. మోడీ, ఆయన మేనమామ, గీతాంజలి జ్యువలరీ చైన్ ప్రమోటర్ మెహుల్ చోక్సీ పాస్‌పోర్టుల రద్దు కోరుతూ సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు విడివిడిగా దరఖాస్తులు చేసుకున్నాయి. నీరవ్ మోడీ కార్యాలయాల నుంచి స్వాధీనం చేసుకున్న కంప్యూటర్ల అధ్యయనాన్ని సిబిఐ పూర్తి చేసింది. పిఎన్‌బి మంగళవారం దాఖలు చేసిన తాజా ఫిర్యాదులపై దర్యాప్తు చేపట్టనుంది. ఈడీ గురువారం ముంబై, ఢిల్లీ, గుజరాత్‌లో నీరవ్ మోడీకి చెందిన కార్యాలయాలు, నివాసాల్లో సోదాలు జరిపింది. ఆ క్రమంలో ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, జైపూర్, సూరత్ నగరాల్లో 17కు పైగా ప్రాంతాల్లో దాడులు చేసింది. ముంబైలో మోడీ, మరో నిందితుడికి చెందిన ఐదు ఆస్తులను ఈడీ జప్తు చేసిందని అధికారులు వెల్లడించారు.

సీబీఐ చేతికి 150 మోసపూరిత ఎల్ఓయూల జాబితా

న్యూఢిల్లీ: రూ.11,400 కోట్ల పిఎన్‌బి కుంభకోణంలో వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, తదితరులు ఉపయోగించిన 150 లెటర్స్ ఆఫ్ అండర్‌స్టాండింగ్(ఎల్ఓయూలు) జాబితాను పంజాబ్ నేషనల్ బ్యాంక్ గురువారం సిబిఐకి అందజేసింది. నీరవ్ మోడీ, ఇతర నిందితుల కంపెనీలు, నివాసాల్లో జరిపిన సోదాల్లో దిగుమతి బిల్లులకు సంబంధించిన 95 కీలకమైన పత్రాలను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కంప్యూటర్లు, ఇతర డిజిటల్ పరికరాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. సోదాల సందర్భంగా స్వాధీనం చేసుకున్న కంప్యూటర్ల మిర్రర్ ఇమేజింగ్ ప్రక్రియ పూర్తయినట్టు అధికారులు తెలిపారు.

నీరవ్ గురించి నరేంద్ర మోడీకి ముందే తెలుసు

ఇదే అంశంపై కాంగ్రెస్ కమ్యూనికేషన్ల ఇన్‌చార్జ్ రణదీప్ సుర్జేవాలా మీడియాతో మాట్లాడుతూ లలిత్ మోడీని చోటా మోడీ వన్, నీరవ్ మోడీని చోటా మోడీ టు అని పేర్కొన్నారు. ముందస్తు సమాచారంతోనే నీరవ్ మోడీ దేశం నుంచి పారిపోయాడని సుర్జేవాలా ఆరోపించారు. నీరవ్ మోడీ, ఆయన వ్యాపార భాగస్వామి మెహుల్ ఛోక్సీపై చర్య తీసుకోవాలని కోరుతూ బెంగళూరుకు చెందిన హరిప్రసాద్ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు ప్రతిని ఆయన విడుదల చేశారు. ఫిర్యాదు లేఖ ప్రధాని కార్యాలయానికి 2016, జులై 26వ తేదీన చేరిందని తెలిపారు. యావత్ కుంభకోణా నికి పాల్పడింది ఇద్దరు ఉద్యోగులే అని ప్రజలను నమ్మించడానికి మోడీ ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు.



ప్రధాని బాధ్యత వహించాలి

ప్రజా ధనంతో వ్యక్తులను పారిపోయేలా చేయడం రివాజుగా మారిపోయిందా? దీనికి ఎవరు బాధ్యులు అని సుర్జేవాలా నిలదీశారు. ప్రధానమంత్రికి 2016, జులై 26నాటికి ఈ వ్యవహారం గురించి తెలిసినప్పుడు దీనికి ఆయన జవాబుదారీ కారా? తనతో పాటుగా దావోస్‌కు వచ్చిన వాణిజ్య ప్రతినిధుల బృందంలో అలాంటి వ్యక్తిని ప్రధాని అనుమతించవచ్చా? దీనిపై ప్రధానమంత్రికి మరింత బాధ్యత ఉంది అని సుర్జేవాలా అన్నారు.

నీరవ్ ప్రధాని బృందంలో లేడు

కేంద్ర మంత్రి రవిశంకర్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటుగా దావోస్‌కు వెళ్ళిన ప్రతినిధుల బృందంలో నీరవ్ మోడీ ఒక సభ్యుడు కాడని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పష్టం చేశారు. అతడు వ్యక్తిగతంగా అక్కడకు చేరుకున్నాడని తెలిపారు. ఇక్కడి బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నీరవ్ మోడీతో ప్రధాని ప్రయివేట్‌గా సమావేశమయ్యారంటూ కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. సాధారణ బ్యాంకింగ్ వ్యవస్థను పక్కదారి పట్టించేవారు ఎంతటి వారైనా సరే వారిని ఉపేక్షించేది లేదని ప్రభుత్వం తరపున నేను స్పష్టం చేస్తున్నాను అని రవిశంకర్ ప్రసాద్ తెలిపారు.

నిర్ణీత కాల వ్యవధిలో దర్యాప్తు జరపాలి: మమతా

పిఎన్‌బి కుంభకోణంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు ఏం జరిగిందో చూడండి. అది 11,000 కోట్లకు పై చిలుకుమొత్తంతో ముడిపడిన ఒక కుంభకోణం. ప్రజలు పొదుపు సొమ్ము సురక్షితంగా లేదు. ఒక సమగ్రమైన, నిర్ణీత కాలవ్యవధితో కూడిన దర్యాప్తు జరగాలి అని ఆమె ట్వీట్ చేశారు.

పేదల పన్నులు.. ధనికుల దోపిడీ

నీరవ్ మోడీని దేశం నుంచి ఎలా పారిపోనిచ్చారని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై మోడీ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఒక వైపు పేద, మధ్యతరగతి ప్రజలతో పన్నులు కట్టిస్తూనే మరోవైపు ధనికులతో ప్రజాధనాన్ని దోచుకోనిస్తున్నదని ఆయన ఆరోపించారు.

ఎవ్వరినీ వదిలిపెట్టం: ఆర్థిక మంత్రిత్వ శాఖ

పిఎన్‌బి, నీరవ్ మోడీ కుంభకోణ కేసులో ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని, ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకు వద్ద సరిపడినంత నిధులు ఉన్నాయని తెలిపారు. ఇది కేవలం ఒక బ్రాంచ్‌కు చెందిన అంశం మాత్రమేనని చెప్పారు. ఈ కేసుపై తాము ఇప్పటికే పట్టు బిగించాము కాబట్టి ఇది ఇతర బ్యాంకులకు విస్తరించే అవకాశం లేదని, అన్ని బ్యాంకులను అప్రమత్తం చేశామని రాజీవ్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వ ఒత్తిడితోనే కుంభకోణం వెలుగులోకి వచ్చిందని చెప్పారు. అంతకుమునుపు ఆయన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో సమావేశమై కేసు పురోగతిని వివరించారు.

జనవరి ఒకటిన నీరవ్ పరార్

దావోస్‌లో ప్రధానితో ఫొటో

పిఎన్‌బి కుంభకోణంలో కీలక సూత్రధారిగా అభియోగాలు ఎదుర్కొంటున్న నీరవ్ మోడీ జనవరి ఒకటవ తేదీన దేశం నుంచి పరారయ్యాడు. అతడు భారతీయ పాస్‌పోర్ట్ కలిగి ఉన్నాడని సిబిఐ అధికారులు గురువారం తెలిపారు. అదే రోజున అతడి సోదరుడు, బెల్జియం పౌరుడైన నిశ్చల్ సైతం పరారయ్యాడని, అయితే వారిద్దరూ కలిసి ప్రయాణించింది లేనిదీ అనే దానిపై దర్యాప్తు చేయాల్సి ఉందని తెలిపారు. అమెరికా పౌరురాలైన నీరవ్ మోడీ భార్య అమి జనవరి ఆరవ తేదీన దేశాన్ని వీడగా, నీరవ్ బంధువు, వ్యాపార భాగస్వామి, గీతాంజలి జ్యువలరీ చైన్ ప్రమోటర్ మెహుల్ చోక్సీ అదే నెల నాల్గవ తేదీన పరారయ్యారని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లో ఉన్నట్టుగా భావిస్తున్న నీరవ్ మోడీ జనవరి 23న ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా ప్రధానితో భారతీయ సీఈఓలు తీయించు కున్న గ్రూప్ ఫొటోలో ఉన్నాడని సిబిఐ అధికారులు చెప్పా రు. సదరు ఫొటోను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో విడుదల చేసింది.

నగదు చెల్లింపుపై నీరవ్ వర్తమానం

మీడియాతో పిఎన్‌బి సీఎండీ

న్యూఢిల్లీ: నగదు తిరిగి చెల్లింపుపై నీరవ్ మోడీ అస్పష్టమైన ఆఫర్లు ఇచ్చారని పంజాబ్ నేషనల్ బ్యాంక్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ మెహతా తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2011లోనే అంకురార్పణ జరుపుకున్న కుంభకోణంలో నిందితులపై పూర్తి సామర్థ్యంతో చర్య తీసుకుంటామని మెహతా చెప్పారు. నీరవ్ మోడీ నగదు చెల్లింపుపై ఇప్పటిదాకా స్పష్టమైన ప్రణాళికతో రాలేదని, కానీ వారు సూచించిన కొన్ని అస్పష్టమైన ఆఫర్లు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. బ్యాంకుకు వ్యక్తిగతంగా వచ్చి తిరిగి చెల్లింపుపై ఒక లిఖితపూర్వక ప్రణాళికను అందించాలని నీరవ్ మోడీని తాము కోరినట్టు పిఎన్‌బి సీఎండీ తెలిపారు. నగదు రికవరీపై మాట్లాడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటికే ఆస్తుల స్వాధీన ప్రక్రియ చేపట్టిందని చెప్పారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరుగుతున్నదని, తమ రెగ్యులేటర్ భారతీయ రిజర్వు బ్యాంకు ఆదేశాలకు లోబడి నడుచుకుంటామని సునీల్ మోహతా తెలిపారు. కుంభకోణంలో ఎంత మొత్తం ఇమిడి ఉందనే విషయం ఇప్పటికిప్పుడు చెప్పడం కష్టమని ఆయన అన్నారు.

ఇలాంటి బ్యాంకుకు మూలధనమెందుకు?

సభా సంఘం నిలదీత

పిఎన్‌బి కుంభకోణంపై ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులను పార్లమెంట్ ఆర్థిక వ్యవహారాల సంఘం నిలదీసింది. దానిపై ఒక నివేదిక సమర్పించాలని ఆదేశించింది. కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మొయిలీ అధ్యక్షతన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సభ్యులుగా ఉన్న సభా సంఘం గ్రాంట్ డిమాండ్లపై చర్చించడానికి గురువారం సమావేశమైంది. ఈ సందర్భంగా నిర్వహణా లోపంతో సతమవుతున్న ఒక బ్యాంకు కోసం పన్ను చెల్లింపుదారుల ధనాన్ని మూలధనంగా ఎలా వినియోగిస్తారని ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ సహా ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన అధికారులను ప్రశ్నించింది. కుంభకోణంపై ఒక నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

మోడీని హత్తుకోండి.. దేశాన్ని లూటీ చేయండి

రాహుల్ ట్వీట్



స్వతంత్ర భారతావనిలో అతి పెద్ద బ్యాంక్ కుంభకోణం గురించి ఎన్డీయే ప్రభుత్వానికి ముందుగా తెలిసినప్పటికీ దానిని నిలువరించడానికి ప్రయత్నించలేదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీటర్ సాక్షిగా యావత్ వ్యవహారంపై వ్యంగ్యాస్త్రాలు సంధిం చారు. అందులో భాగంగా, భారత్‌ను దోచుకోవడంలో నీరవ్ మోడీకి దారి చూపిన అంశాలను ఆయన ప్రస్తావించారు.ముందుగా ప్రధాని నరేంద్ర మోడీని ఆలింగనం చేసుకోవాలి. దావోస్‌లో ఆయనతో పాటు కనిపించాలి. ఆ పలుకుబడితో రూ.12, 000 కోట్లు లూటీ చేయాలి, ప్రభుత్వం ఏటో చూస్తుండగా మాల్యా తరహాలో దేశం నుంచి పరారీ కావాల రాహుల్ ట్వీట్ చేశారు.

నీరవ్‌పై ప్రియాంక దావా అవాస్తవం

ముంబై : పిఎన్‌బి కుంభకోణంలో అభియోగాలు ఎదుర్కొంటున్న నీరవ్ మోడీ వజ్రాభరణాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న సినీ నటి ప్రియాంక చోప్రా ప్రస్తుతం ఆ బాధ్యతల నుంచి తప్పుకునే ఆలోచనలో ఉన్నట్టు ఆమె అధికార ప్రతినిధి తెలిపారు. ప్రచార ప్రకటనలకు సంబంధించి చెల్లించాల్సిన బకాయిలపై ఆమె న్యాయ పరమైన చర్యలు తీసుకుంటారంటూ వస్తున్న వార్తలపై మాట్లాడుతూ అవన్నీ ఊహాగానాలేనని, వాస్తవం కాదని తెలిపారు. అయితే కాంట్రాక్టు నుంచి తప్పుకునే అంశంపై ఆమె ప్రస్తుతం న్యాయనిపుణుల అభిప్రాయం కోరుతున్నారని అధికార ప్రతినిధి చెప్పారు.

ఎస్ఎస్‌సీ ప్రీఫైనల్ పరీక్ష మధ్యాహ్నం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: వార్షిక పరీక్షలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగం నేడు ఉదయం 11.45 గంటలకు ఉన్నందున ఎస్ఎస్‌సి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీఫైనల్ పరీక్షను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు నిర్వహించాలని పాఠశాల విద్య సంచాలకులు జి కిషన్ జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు ఇస్తూ గురువారం సర్క్యులర్ జారీ చేశారు. విద్యార్థులు ప్రధాని మోడీ ప్రసంగం వినేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. 17న సాయంత్రం 4గంటలకు సచివాలయంలో ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఉంటుందని, సమావేశంలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి పాల్గొంటారని తెలిపారు.

24 టీశాట్ పీర్ ప్రసారాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు ఇక నుంచి టీశాట్‌లో ప్రసారం కానున్నాయి. ఈ నెల 24న పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు వీటిని ప్రారంభించనున్నారు. ప్రతి వారం గంట సమయం ఈ ప్రసారాలకు కేటాయించారు.

సర్పంచుల సమ్మేళనాలు

• జిల్లాకు 100 మందికి ఆహ్వానాలు

• మూడు ప్రాంతాల్లో వేదికలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో అనుభవాలను పంచుకుని గ్రామాల్లో మరింత మెరుగైన అభివృద్ధిని సాధించాలన్న లక్ష్యంతో టీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచుల సమ్మేళనాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రాంతాల వారీగా ఈ సదస్సులను నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది ఉత్తమ గ్రామ పంచాయతీలుగా గుర్తింపు పొందిన గ్రామ సర్పంచులతో తమ అనుభవాలను పంచుకునే విధంగా ఈ సమ్మేళనాలను నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం, పంచాయతీల ఆర్థిక పరిపుష్టి, ఆర్థిక క్రమశిక్షణ లక్ష్యంగా పంచాయతీ పరిధిలో వందశాతం ఆస్తిపన్నుల వసూళ్లు, ఇందన వనరులను సమర్థవంతంగా , పొదుపుగా వినియోగించటంలో భాగంగా ఎల్ఈడీ లైట్ల వినియోగం, గ్రామ పంచాయతీ పరిధిలో చెరువులు,కుంటల పునరుద్ధరణ, నీటి సంరక్షణ , కేంద్రప్రభుత్వం నుంచి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను సమర్థవంతంగా ఉపయోగించు కుంటూ గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పంచాయతీ భవనాల నిర్మాణం, కాలువల్లో పూడికల తొలగింపు తదితర కార్యక్రమాలను లక్ష్యం మేరకు పూర్తిచేయటం వంటి వాటిలో సర్పంచులు ఏవిధంగా ముందుకు వెళ్లారు, క్షేత్రస్థాయిలో సర్పంచుల అనుభవాలు పంచుకునేందుకు సర్పచుల సమ్మేళనాలను వేదికలుగా మలచనున్నారు. టీసీపార్ట్ ఈ సమ్మేళనాలకు మార్గదర్శనం చేయనుంది. పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు ఈ శాఖలకు చెందిన అధికారులు , ఆయా జిల్లాల ప్రజా ప్రతినిధులు సర్పంచుల సమ్మేళనాలకు హాజరు కానున్నారు. హైదరాబాద్ జిల్లా మినహా రాష్ట్రంలోని 30 జిల్లాల సర్పంచులను ఈ సమ్మేళనాల్లో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేయను న్నారు. అయితే ఒక్కో జిల్లానుంచి ఎంపిక చేసిన వంద మందికి మాత్రమే ఈ సమ్మేళనాల్లో పాల్గొనేందుకు ఆహ్వానాలు పంపనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెల్లడించారు.

23నుంచి సమ్మేళనాలు ప్రారంభం:

సర్పంచుల సమ్మేళనాలను మూడు ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. సర్పంచులకు సౌలభ్యంగా ఉండేందుకు రాష్ట్రంలోని మూడు జిల్లా కేంద్రాలను ఇందుకు వేదికలుగా ఎంపిక చేశారు. ఈ నెల 23 నుంచి సర్పంచుల సమ్మేళనాలు ప్రారంభం కానున్నాయి. తొలుత మహబూబ్ నగర్ కేంద్రంగా 23 జరిగే సర్పంచుల సమ్మేళనానికి జోగులంబ గద్వాల, మహబూబ్ నగర్, మేడ్చెల్ -మల్కాజిగిరి, నల్లగొండ, రంగారెడ్డి, నాగర్ కర్నూలు, సూర్యాపేట, వికారాబాద్ , వనపర్తి జిల్లాల సర్పంచులను ఆహ్వానించనున్నారు. అదే విధంగా ఈ నెల 27న వరంగల్ కేంద్రంగా జరిగే సర్పంచుల సమ్మేళనానికి భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్ ,వరంగల్ రూరల్ , వరంగల్ అర్బన్ , యాదాద్రి -భువనగిరి జిల్లాల సర్పంచులను ఆహ్వానించనున్నారు. మార్చి 5న నిజామాబాద్ కేంద్రంగా జరిగే సర్పంచుల సమ్మేళనానికి అదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, కమురంభీం, మంచిర్యాల, నిర్మల్ , నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ , సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల సర్పంచులను ఆహ్వానించనున్నారు.

జీఎస్టీ ఎగవేత దారులపై కేసులు

హై దరాబాద్, ఆంధ్రప్రభ : జీఎస్టీ ఎగవేతదారులపై ప్రభుత్వం కఠిన చర్యలకు దిగుతోంది. గడువులోగా తమ రిటర్నులను దాఖలు చేయని వ్యాపారులపై దాడులకు సిద్ధమవుతోంది. వస్తు సేవల పన్ను వసూలును మరింత కఠినం చేసి రాబడిని పెంచుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ భావిస్తోంది. రాష్ట్రంలో దాదాపు 3లక్షలకుపైగా జీఎస్టీ పరిధిలోకి వచ్చే వ్యాపారులు ఉండగా అందులో 60వేల మంది రిటర్నులను దాఖలు చేయడంలేదని గుర్తించారు. మరోవైపు ఈ వే బిల్లులను తప్పనసరిచేసిన ప్రభుత్వం పన్ను ఎగవేత దారులపై కఠాడా కీలక చర్యలకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. సరుకుల రవాణాను కట్టుదిట్టం చేసేందుకు మహా చెక్ పేరిట భారీ ఎత్తున స్పెషల్ డ్రైవ్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇందుకుగానూ ప్రతీ 250 మంది డీటర్లకు ఒక ఆఫీస్ ఇంచార్జీని నియమించుకుని రహస్యంగా ఆపరేషన్ చేయనున్నారు. అక్రమంగా సరుకుల రవాణాకు దీనితో అడ్డుకట్ట వేయనున్నారు. మరోవైపు రాష్ట్ర అధికారులతోపాటు కేంద్ర జీఎస్టీ అధికారులు కూడా సంచార బృందాలను వేగుల రూపంలో పంపుతున్నారు. అదేవిధంగా వ్యాట్ బకాయిలపై కూడా దృష్టి సారించారు. నోటీసులను ఆన్‌లైన్‌లో పంపుతూ అవరమైతే రెవెన్యూ రికలవరీ యాక్ట్ ద్వారా జప్తులూ చేయాలని యోచిస్తున్నారు. ప్రతీ నెలా 20తేదీలోగా వ్యాపారులు తమ రిటర్నులను దాఖలు చేయాలని చట్టంలో ఉంది. ఇంటర్నెట్‌లో జీఎస్‌టీఎన్ వెబ్‌సైట్‌లో ఈ మేరకు ఫారాలను సిద్దంగా ఉంచారు. అయితే 60వేల మంది గడువులోగా నమోదు చేసుకోలేదని, పన్నుల రిటర్నులను దాఖలు చేయలేదని తేలింది. దీంతో వారికి నోటీసులను వ్యక్తిగతంగా, మరికొందరికి ఆన్‌లైన్‌లో పంపాలని నిర్ణయించారు. నోటీస్ అందిన 15 రోజుల్లో రోజుకు రూ.50 లేట్ ఫీజుతోపాటు 18 శాతం అపరాధ రుసుమును వసూలు చేసేందుకు చట్టంలో వెసులుబాటు ఉంది. 15 రోజుల్లో స్పందించని వారిపై కార్యాలయాలు, ఆస్తులపై సోదాలు, ఆర్ఓఆర్ యాక్ట్ ప్రకారం ఆస్తుల జప్తుకు అవకాశం ఉంది. ఈ మేరకు ఉన్నతాధికారులు కసరత్తును వేగవంతం చేశారు. ఈ అంశంపై మరింత దూకుడుగా ముందుకు వెళతామని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ వి అనిల్ కుమార్ ఆంధ్రప్రభకు చెప్పారు.

రైల్వేలో భారీ కొలువుల జాతర

న్యూఢిల్లీ: లోకో పైలెట్లు, టెక్నిషియన్లు సహా దాదాపు 90 వేలకు పైగా దిగువ స్థాయి ఉద్యోగాలకు భారతీయ రైల్వే దరఖాస్తులను ఆహ్వానించింది. అభ్యర్థులకు కనీస విద్యార్హత పదవ తరగతి, ఐటీఐ ఉండాలి. గ్రూప్ సి లెవల్ 2 స్థాయిలో ఫిట్టర్, క్రేన్ డ్రైవర్, బ్లాక్‌స్మిత్, కార్పెంటర్ లాంటి టెక్నీషియన్ పోస్టులు, ట్రాక్ మెయింటైనర్, పాయింట్స్ మెన్, హెల్పర్, గేట్‌మ్యాన్ లాంటి గ్రూప్ సి లెవల్ 1 పోస్టులు ఉన్నాయి. భారతీయ రైల్వేల మంత్రిత్వ శాఖ గ్రూప్ సి లెవల్ 1, లెవల్ 2 కేటగిరీల్లో 89,409 పోస్టులకు ప్రపంచంలోనే అత్యంత భారీ నియామక ప్రక్రియను ప్రకటించింది అని ఒక ప్రకటనలో పేర్కొంది. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను పొందవచ్చు. గ్రూప్ సి లెవల్ 2 పోస్టులకు 18-28 సంవత్సరాల మధ్య వయసున్నవారు, గ్రూప్ సి లెవల్ 1 పోస్టులకు 18- 31సంవత్సరాల మధ్య వయసున్నవారు అర్హులు. గ్రూప్ సి లెవల్ 2 పోస్టు లకు మా ర్చి ఐదవ తేదీ వరకు, గ్రూప్ సి లెవల్ 1 పోస్టులకు మార్చి 12వ తేదీ వరకు దర ఖాస్తులను ఆమోదిస్తారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఏప్రిల్, మే మాసాల్లో ఉంటుంది.

దేశానికే ఇది ఆదర్శం!

రైతుకు రొక్కం బాగు...బాగు!

• కేసీఆర్‌కు కేంద్ర ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం ప్రశంసలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతు పెట్టుబడి పథకం ప్రారంభానికి ముందే ఈ పథకానికి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుతున్నాయి. ఈ పథకం ద్వారా ప్రతి ఎకరాకు రూ.4వేల చొప్పున రెండు దఫాలు చెల్లించాలని తెలంగాణ సీఎం కేసీఆర్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 1వ తేదీనుంచి రైతులకు పెట్టుబడి పథకం చెక్కులను పంపిణీ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన సంగతి తెలిసిందే. రైతులకు పెట్టుబడి కింద ఏటా ఎకరాకు రెండు దఫాలుగా రూ.8వేలు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం కొనియాడారు. ఈ పథకాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీని కలిసేందుకు తెలంగాణ సీఎం కేసీఆర్ వెళుతున్న సమయంలో అరవింద్ సుబ్రహ్మణ్యం ఎదురు పడ్డారు. కేసీఆర్‌ను దాటివచ్చి తిరిగి వెనకకు వడివడిగా నడుస్తూ కేసీఆర్‌కు అభివాదంచేసి పలుకరించారు. రైతు వెతలకు గొప్ప ఉపశమనం కలిగించేలా రైతు పెట్టుబడి పథకాన్ని ప్రారంభిస్తున్నారని ఆయన కేసీఆర్‌నుద్దేశించి ప్రశంసించారు. సీఎం కేసీఆర్‌కు కేంద్ర ఆర్థిక సలహాదారు అరవింద్ నుంచి పెట్టుబడి పథకంపై ప్రత్యేక ప్రశంసాపూర్వక అభినందనలు అందాయి. తెలంగాణలో ప్రతి రైతుకు ఎకరానికి రెండు పంటలకు రూ.8వేల చొప్పున ఇవ్వనున్న విశిష్ట పథకానికి తాను పెద్ద అభిమానినయ్యానని ఈ సందర్భంగా అరవింద్ సుబ్రహ్మణ్యం అభినందించారు. ఈ ప్రతిపాదిత వ్యవసాయ పెట్టుబడి పథకానికి చేసే ఆర్థిక సాయం రైతులకు ఎంతో తోడ్పాటును అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆదర్శమని సీఎం కేసీఆర్ చేపడుతున్న పథకాలపై కేంద్రం అధ్యయనం చేయాలని ఆయన చెప్పారు. రైతు పెట్టుబడి పథకానికి సంబంధించి ఇప్పటికే తాను ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీతో చర్చించానని తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతులకు మేలు చేకూర్చేందుకు ఈ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందన్న విషయాన్ని తాను జైట్లీ దృష్టికి తీసుకువచ్చానని అరవింద్ కేసీఆర్‌తో మాట్లాడుతూ పేర్కొన్నారు. సోమవారం తాను హైదరాబాద్ వస్తున్నానని రైతు పెట్టుబడి పథకానికి సంబంధించి కూలంకషంగా చర్చించేందుకు కేసీఆర్‌తో కలుస్తానని ఆయన ఈ సంద ర్భంగా చెప్పారు. అధికారులు అన్ని వివరాలు అందిస్తారని ఈ పథకానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని అంది స్తానని ఆయనతో కేసీఆర్ చెప్పారు. సోమవారం హైదరా బాద్ వస్తున్న అరవింద్‌ను సీఎం కేసీ ఆర్ ప్రగతి భవన్‌కు ఆహ్వానించారు. ఈ సందర్భంగా తన ఆతిథ్యం స్వీకరించాలని భోజనానికి రావాలని ఆహ్వానించారు.

వారంలో ఎయిమ్స్ నిధులు!

జైట్లీకి సీఎం వినతుల జాబితా

• ఎయిమ్స్‌కు నిధులివ్వండి

• ఐఐఎం హామీని నెరవేర్చండి

• ఎఫ్ఆర్‌బీఎం పరిమితి పెంచండి

• వెనకబడిన జిల్లాలకు నిధులివ్వండి

ఆర్థిక మంత్రి సానుకూల స్పందన

• ఎయిమ్స్‌కు వారంలో నిధులు పంపిస్తాం

• ఎఫ్ఆర్ఎంబీఎమ్‌కు పత్యక విధానం ఉండాలి



(మొదటిపేజీ తరువాయి)

మూడు సంవత్సరాల మాదిరిగానే 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.450 కోట్లను విడుదల చేయాలని కోరారు. అలాగే 3.5 శాతం ఎఫ్.ఆర్.బి.ఎమ్ పరిమితిని పెంచాలని కోరారు. ఎయిమ్స్ నిర్మాణానికి సంబంధించి తక్షణమే నిధులు అందజేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ హామీ ఇచ్చారు. ఎఫ్ ఆర్‌బిఎం రుణపరిమితి పెంపునకు సంబంధించి దేశవ్యాప్తంగా ఓ విధానాన్ని అనుసరించాల్సి ఉందని చెప్పారని తెలిసింది. తెలంగాణ రాష్ట్రం ఆర్థిక పరిస్థితి మేరకు పరిమితిని పెంచాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రధాని, రాజ్‌నాథ్‌తో భేటీ!

విభజన చట్టంలోని పలు పెండింగ్ అంశాలు, రాష్ట్రానికి సంబంధించి రావాల్సిన నిధులు తదితర అంశాలపై గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోడీని, హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలవనున్నారు.

గ్రోత్‌లో తెలంగాణది అగ్రస్థానం: ఎంపీ జితేందర్ రెడ్డి

కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ సీఎం కేసీఆర్ తో మూడు అంశాలపై చర్చించారని టిఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత జితేందర్ రెడ్డి తెలిపారు. వెనకబడిన జిల్లాలకు రావాల్సిన రూ. 450 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారని చెప్పారు. దేశంలోనే ఆర్థికవృద్ధిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నందున ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని 3.5 శాతానికి పెంచాలని కోరారని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ప్రశంసించారన్నారు. గ్రోత్ రేట్‌లు తెలంగాణ మొదటి స్థానంలో గుజరాత్ రెండో స్థానంలో, మహారాష్ట్ర మూడో స్థానంలో ఉందని వివరించారన్నారు. తెలంగాణలో ఎయిమ్స్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారన్నారు. వారం రోజుల్లో ఎయిమ్స్‌కు నిధులు విడుదల చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు.

గర్భిణీ హత్యకేసులో నిందితుల అరెస్ట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బొటానికల్ గార్డెన్ గర్భిణీ హత్య కేసులో పరారీలో ఉన్న వికాస్ కశ్యప్(32), అమర్‌కాంత్ ఝూ(24)లను మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. అమర్ కాంత్ ఝూను బీహార్ స్టేట్‌లో ఈ నెల 12న అరెస్టు చేసి ట్రాన్సిట్ వారెంట్‌పై గచ్చిబౌలీ పీఎస్‌కు తీసుకురాగా, 14వ తేదీన పరారీలో ఉన్న వికాస్ కశ్యప్‌ను అంజయ్యనగర్‌లో అరెస్టు చేశారు. ఈ కేసులో పింకీని నలుగురు కలిసి కొట్టి చంపారు. మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి గోనెసంచుల్లో చుట్టి బైక్‌పై బొటానికల్ గార్డెన్ వద్ద పడేశారు. నిందితుడు అమర్‌కాంత్ ఝూ వివిధ వ్యక్తులనుంచి మోటార్‌సైకిల్స్‌ను తీసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. చివరిగా నేరానికి వినియోగించిన మోటార్‌సైకిల్‌ను సిద్ధార్థ బర్ధన్ నుంచి అమర్‌కాంత్ ఝూ కొనుగోలు చేశాడని పోలీసులు తెలిపారు. ఇక్కడి అంజయ్యనగర్‌లోనే కటింగ్ మెషిన్‌ను కొనుగోలు చేశాడు. అదే అంజయ్యనగర్‌లో షాప్ వెండర్‌నుంచి పాలిథిన్ గార్బేజీ బ్యాగ్స్‌ను కొనుగోలు చేశారు. అరెస్టయిన నిందితులలో అమర్‌కాంత్ ఝూ నుంచి సెల్‌ఫోన్, యమహా బైకు (ఏపీ10ఏఎల్9947), హెల్మెట్, బ్లూకలర్ టీషర్ట్, బ్లూకలర్ జీన్స్ పాయింట్, ఆధార్, ఓటర్, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు పోలీసులు స్వాధీనం చేసుకోగా, వికాస్ కశ్యప్‌నుంచి సెల్‌ఫోన్, ఉత్తరాఖండ్ ఇష్యూ చేసిన ఆధార్‌కార్డ్, పింకీ ఇచ్చిన ఒక జత సిల్వర్ లెగ్ చైన్స్, ఒక బంగారు ముక్కుపుడకను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మాదాపూర్ డీసీపీ మీడియాకు వెల్లడించారు.



బెంగళూరు: నిర్మాణ దశలో ఉన్న బహుళ అంతస్థుల భవనం పేకమేడలా కుప్పకూలింది. ఈ ఘటన బెంగళూరులోని కేశనహల్లిలో చోటుచేసుకుంది.

జనసేనానితో యోగేంద్ర యాదవ్ భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : స్వరాజ్ అభియాన్ నేత ఆమ్‌ఆద్మీ మాజీ కార్యనిర్వాహక సభ్యుడు యోగేంద్ర యాదవ్ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో కలుసుకున్నారు. ఇటీవల అనంతపురం జిల్లాలో తాను జరిపిన పర్యటన వివరాలను యోగేంద్ర యాదవ్.. పవన్‌కల్యాణ్‌కు తెలిపారు. ఢిల్లీ వాసిన అయిన తనకు ఆంధ్రప్రదేశ్ అంటే పచ్చటి పొలాలు గోదావరి, కృష్ణ నదులతో కళకళలాడుతుందని మాత్రమే తెలుసని, అయితే అనంతపురం జిల్లాను చూసిన తర్వాత తన అభిప్రాయం పూర్తిగా మారిపోయిందని చెప్పారు. అనంతపురం జిల్లా కరవు, నిరుద్యోగం, ఆకలిచావులు, నేతన్నల కష్టాలు చూసి తాను చలించిపోయానని చెప్పారు. జనసేన కార్యాలయానికి వచ్చిన యోగేంద్ర యాదవ్‌కు పవన్ కల్యాణ్ సాదర స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకహోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు గురువారం సాయంత్రం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ని కలుసుకున్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 16 ఫిబ్రవరి 2018

డ్రాగన్ రెక్కల చప్పుడు

చైనా జాతీయ జంతువు డ్రాగన్. డ్రాగన్ అంటే రెక్కలున్న భయంకరమైన సర్పం. ఎప్పుడూ ప్రత్యర్థిని శత్రువుగా చూస్తుంది. ఎప్పుడెప్పుడు కబళించేద్దామా అనే దాని ఆలోచన. తన ఆలోచనలకు తగినట్టుగానే చైనా తన జాతీయ జంతువుగా డ్రాగన్‌ను ఎంచుకుంది. చైనా చూపులు కూడా నిరంతరం పక్క దేశాలపైనే. వ్యాపార సామ్రాజ్య విస్తరణతో పాటు అది ప్రవేశించిన దేశాల రెవెన్యూలో వాటాను అడిగే లక్షణాన్ని బీజింగ్ బయటపెట్టింది. శ్రీలంకకు ఆ అనుభవం ఎదురైంది. చైనా వస్తువులను సరఫరాచేసే ధరలకే అందిస్తూ మొదలైన చైనా వ్యాపారం అంచెలంచెలుగా ప్రపంచమంతటికీ పాకిపోయింది. ఎంతగా అంటే వాటిని వద్దంటే కొన్ని లక్షలమంది రోడ్డున పడిపోయేటంతగా. తన వ్యాపారాన్ని చైనా రూపుదిద్దుకుంది. వ్యాపారం సంగతి పక్కన పెడితే.. సిల్క్ రోడ్డు పేరుతో దేశాల మీదుగా తలపెట్టిన వాణిజ్య రహదారి పేరుతో కొన్ని దేశాలలో తిష్ట వేయడానికి ప్రయత్నిస్తోంది. ఇక భారత్ విషయానికొస్తే.. దాని ఆగడాలు చెప్పాల్సిన అవసరంలేదు. బుద్ధి పుట్టినప్పుడల్లా అరుణాచల్‌ప్రదేశ్ తమదేనంటూ కయ్యానికి కాలు దువ్వుతుంది. మన నాయకులు అక్కడ పర్యటించడానికే వీలు లేదని హుంకరిస్తుంది. 2015 మేలో తొలిసారి పర్యటించిన ప్రధాని నరేంద్రమోడీపై బీజింగ్ ఇదే గురిని ఎక్కుపెట్టింది. తాజాగా అదే అస్త్రాన్ని ప్రయోగించింది. అరుణాచల్‌లో నరేంద్ర మోడీ పర్యటించకూడదని, అలా చేస్తే.. దౌత్యపరంగా నిరసన తెలుపుతామని హెచ్చరించింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికే మోడీ గురువారం పర్యటించారు.

భారత్‌తో సరిహద్దు తగాదాపై తమ వైఖరి సున్నితమైనదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గెంగ్ షువాంగ్ చెప్పారు. మొదటి నుంచి ఆ దేశం అరుణాచల్‌ప్రదేశ్‌ను టిబెట్‌లో భాగంగా పరిగణిస్తోంది. ఇది భారత్‌కు చెందినది ఎంతమాత్రం కాదని దాని వాదన. అరుణాచల్ ఇండియాలో భాగమేనని జపాన్ ఏనాడో స్పష్టంచేసింది. చైనాతో వైరమున్న ప్రతీ దేశమూ మన పక్షమే పలుకుతున్నాయి. కొన్నేళ్ళక్రితం అరుణాచల్ ప్రదేశ్‌ను తమ దేశంలో భాగంగా చూపుతూ చైనా భౌగోళిక పటాన్ని కూడా విడుదల చేసి, దుందుడుకుతనాన్ని ప్రదర్శించింది. అప్పట్లో భారత్ ఈ అంశంపై అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర నిరసన తెలిపింది. ఐక్యరాజ్యసమితి సమావేశంలో కూడా ప్రస్తావించింది. అయినప్పటికీ చైనీ భాయి తన వైఖరిని మార్చుకోలేదు. ఎప్పటికప్పుడు భారత్‌ను చికాకు పెడుతూనే ఉన్నాడు. కిందటేడాది డోక్లామ్ వివాదాన్ని సృష్టించింది. దౌత్యపరమైన ఒత్తిడికి తట్టుకోలేక వెనుకంజ వేసింది. మన నాయకులు అరుణాచల్‌లో అడుగుపెట్టినప్పుడల్లా చైనా గొణగడం సర్వసాధారణమైపోయింది. ప్రధానిని అడుగుపెట్ట వద్దనడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. గెంగ్ షువాంగ్ ఈరోజు చేసిన ప్రకటన ప్రకారం, భారత్-చైనా మధ్య సరిహద్దు వివాదం నెలకొంది. దాన్ని దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. తద్వారా ఇరు దేశాల మధ్య సాధారణ పరిస్థితులు నెలకొనేలా చూడాలన్నది షువాంగ్ మాటల సారాంశం. ఎవరైనా అరుణాచల్ ప్రదేశ్ నుంచి చైనా వెళ్ళాలనుకుంటే.. వారి పాస్‌పోర్ట్‌పై వీసా స్టాంపింగ్ కూడా వెయ్యరు. ఈ విధంగా వేయడం ద్వారా అరుణాచల్ ప్రదేశ్ పౌరులను తమ పౌరులుగానే పరిగణిస్తున్నట్టు చైనా అన్యాపదేశంగా చెబుతోంది. ఈ రకంగా చేయడం భారత్‌ను అవమానించడమే. టిబెట్ స్వతంత్ర ప్రాంతమన్న భారత్ వాదన కారణంగానే చైనా అరుణాచల్ వివాదాన్ని రేపింది. అప్పటి నుంచి చిలిపి తగాదాలు పెట్టుకోవడం.. అస్థిరతను సృష్టించడానికి ప్రయత్నించడం చేస్తూనే ఉంది. దలైలామాకు భారత్ కొన్నాళ్ళు ఆశ్రయం కల్పించడం కూడా ఆ దేశానికి మంట కలగడానికి కారణం. సరిహద్దుపరంగా భారత్‌కు అరుణాచల్‌ప్రదేశ్ చాలా కీలకమైన ప్రాంతం. ఎవరైనా కూడా చైనా తన విదేశాంగ విధానాన్ని స్పష్టం చేసింది. స్నేహం...రాజీ పడకపోవడం రెండూ తన విదేశాంగవిధానానికి రెండు స్తంభాలని పేర్కొనడం బట్టి.. భారత్‌తో స్నేహహస్తం కూడా. అరుణాచల్ లోని రాజీ పడని ధోరణి కావాలన్నట్టు స్పష్టమైంది. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ప్రభావంవల్లనే విదేశాంగ విధానం వివాదంపై పడడం వల్లే ఆ దేశం అంత స్థిరంగా చెప్పడానికి కారణమై ఉండవచ్చు. ఇందుకు అనుగుణంగా భారత్ వైఖరిని రూపొందించుకోవాలి. డోక్లామ్ వివాద సమయంలో మాదిరిగా వ్యవహరించాలి. అరుణాచల్ మాదే అనే మాట మళ్లీ చైనా నోటివెంట రాకుండా ఏం చేయగలమో ఆలోచించాలి. ఒక పక్క అరుణాచల్‌తో ఆగకుండా ఇటీవల పాకిస్తాన్‌కు అండగా నిలుస్తోంది. ఇది దాయాది దేశానికి కొండంతబలాన్ని చేకూర్చింది. అంతర్జాతీయ సమాజంలో పాకిస్తాన్‌కు మద్దతిచ్చే దేశమైనా ఏదైనా ఉంది అంటే అది చైనా ఒక్కటే. శత్రువుకు శత్రువు మిత్రుడన్న సూత్రాన్ని ఈ విషయంలో అవలంబించి, మనని ఇరుకున పెట్టడానికి ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం భారత విదేశాంగ విధానం మునుపెన్నడూ లేనంత బలీయంగా ఉంది. ఆసియాన్ దేశాల మద్దతు కూడా మనకే ఉంది. అమెరికా సైతం పాక్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. ఇదే అదునుగా అరుణాచల్ వివాదానికి ముగింపు పలికే దిశగా భారత్ అడుగులేయాలి.

అతివల వైరం... బంగ్లాకు శాపం

బంగ్లాదేశ్ ఆవిర్భవించి నలభై ఏడేళ్లు అయింది. ఇద్దరు మహిళల పాలనలో తప్ప మిగతా కాలం అంతా సైనిక పాలనలోనే ఉంది. ఆ ఇద్దరి మహిళల మధ్య వైరం దేశాభివృద్ధిని దెబ్బతీసింది. ఇప్పటికీ అడ్డుపడుతోంది. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆ ఇద్దరు మహిళలు పోటీ పడితే అభినందించ వలసిందే. కానీ, ఇద్దరిమధ్య వ్యక్తిగత వైరం, ప్రతీకారేచ్ఛ దేశ భవిష్యత్‌కు శాపంగా మారింది. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బిఎన్‌పి) అధ్యక్షురాలు బేగం ఖలీదా జియాకు ఢాకా ప్రత్యేక న్యాయస్థానం ఐదేళ్ళ జైలు శిక్ష విధించింది.ఇదే కేసులో ఆమె కుమారుడు తారీఖ్ రహమాన్‌కీ, మరో నలుగురికి పదేళ్ళ జైలు శిక్షవిధించింది. ఖలీదా జియా వయసు 72సంవత్సరాలు. రెండు సార్లు ప్రధానమంత్రి పదవిని నిర్వహించిన మహిళ కావడం వల్ల ఆమెకు కోర్టు తక్కువ శిక్ష విధించింది. జైలుకి వెళ్ళడం వల్ల ఆమె, ఆమె కుమారుడు ఈ ఏడాది చివరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులయ్యారు. ఇది పూర్తిగా ఆమె స్వయంకృతం. అయితే, ఆమెను జైలుకి పంపడంలో ప్రస్తుత ప్రధాని షేక్ హసీనా హస్తం ఉందన్న బీఎన్‌పి ఆరోపణ అసత్యం కాకపోవచ్చు. వీరి మధ్య కొనసాగుతున్న వైరం అటువంటిది. అలాగే, ఖలీదా అధికారంలో ఉన్నప్పుడు షేక్ హసీనాను జైలుకి పంపారు. అయితే, ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్లో జైలుకి వెళ్ళడం వేరు.అవినీతి కేసుల్లో జైలుకి వెళ్ళడం వేరు. ఖలీదా జియా నిరంకుశ పోకడల వల్ల ఆమెకు మిత్రులు కన్నా, శత్రువులు ఎక్కువ. ఆమెకు హసీనాతోనే కాకుండా మాజీ సైనిక పాలకుడు జనరల్ ఎర్షాద్‌తో కూడా వైరం ఉంది. బంగ్లాదేశ్ కూడా పాక్ మాదిరిగానే ఉగ్రవాదులకు స్వర్గధామమే. ఇస్లామిక్ ఉగ్రవాదులకే కాకుండా, ఈశాన్యరాష్ట్రాల తీవ్రవాదులకు బేగం ఖలీదా జియా హయాంలో ఆటపట్టుగా ఉండేది. అసోంలో యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం(ఉల్ఫా) తీవ్రవాదులకు బంగ్లాదేశ్‌లో స్థావరాలు ఉండేవి. షేక్ హసీనా అధికారంలోకి వచ్చే వరకూ అవి పని చేస్తూనే ఉన్నాయి. అలాగే, నాగా తీవ్రవాదులకు మయన్మార్ చాలా కాలం స్థావరంగా ఉండేది. బేగం ఖలీదాకు భారత్ పట్ల శత్రు వైఖరిని అనుసరిస్తే ,షేక్ హసీనా సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఆమె తండ్రి బంగబంధు షేక్ ముజిబూర్ రెహమాన్‌కు భారత్ అండగా నిలిచినందుకు కృతజ్ఞతగా ఆమె ఇప్పటికీ భారత్‌తో సత్సంబంధాలనే కోరుకుంటున్నారు. భారత్‌తో హసీనా సన్నిహితంగా ఉండటం ఖలీదా జియాకు సుతరాము ఇష్టం లేదు. ఖలీదా జియా పాలనలో బంగ్లాలో నేరస్తులు, ఉగ్రవాదులు రెచ్చిపోయారు. ఆమె కేబినెట్‌లో ముగ్గురో, నలుగురో మంత్రులకు ఉగ్రవాదులతో నేరుగా సంబంధాలు ఉండేవి. పాకిస్తాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థలు లష్కర్ ఎ తోయిబా, జైష్ ఎ మహ్మద్ వంటి ఉగ్రవాద సంస్థల నాయకులు అప్పట్లో బంగ్లాదేశ్ తరచూ సందర్శించేవారు. అలాంటి ధోరణులను సహించకపోవడం వల్ల కూడా హసీనాపై ఖలీదా కక్ష కట్టారు. ముజిబూర్ రెహమాన్ హత్యకేసులో జమత్ ఎ ఇస్లామ్ అనే ఉగ్రవాద సంస్థ నాయకుల హస్తం ఉందన్న ఆరోపణలను పురస్కరించుకుని ఆ సంస్థ ప్రధాన నాయకులపై హసీనా విచారణ జరిపించి ఉరితీయించారు. హసీనాపై ఖలీదా కోపానికి అది కూడా ఒక కారణం. ఇద్దరి మధ్యా సైద్ధాంతికమైన, మతపరమైన విభేదాలు లేవు. హసీనా భారత్‌కు, ఖలీదా పాక్‌కు అనుకూలురు. అదే తేడా. ఈ దృష్ట్యా మన దేశంహసీనాకే ప్రాధాన్యం ఇస్తోంది. కేంద్రంలో పూర్వపు యూపీఏ ప్రభుత్వం, ప్రస్తుత ఎన్‌డిఏ ప్రభుత్వమూ హసీనాకే అనుకూలం. యూపీఏ హయాంలో ఆ కూటమి చైర్‌పర్సన్, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ తన అత్తగారు మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి బంగ్లాదేశ్ ప్రభుత్వ అత్యున్నత పురస్కారాన్ని (స్వాధీనతా సన్మానోహ అవార్డు)ను అందుకున్నారు. ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీకి కూడా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ఇరువురూ కూడా ఈ అవార్డులను ప్రస్తుత బంగ్లా ప్రధాని షేక్ హసీనా హయాంలోనే అందుకోవడం గమనార్హం. అంతేకాక, హసీనా, మోడీలు మరో అడుగు ముందుకు వేసి నాలుగు దశాబ్దాలుగా నలుగుతున్న భూభాగాల వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకున్నారు. బంగ్లాదేశ్‌తో నదీజలాల వివాదాన్ని పరిష్కరించేందుకు కూడా మోడీ కృషి చేస్తున్నారు. తీస్తానది జలాల పంపిణి విషయంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహకారం అవసరం.ఈ విషయంలో ఆమె కొంత బెట్టు చేయడంవల్ల పరిష్కారం కాలేదు. బంగ్లాదేశ్ నుంచి మనదేశానికి విదేశీయుల ప్రవాహం గతంలో మాదిరిగా లేదు. దానిని అరికట్టడంలో కూడా భారత్‌కి షేక్ హసీనా సహకరించారు. అలాగే, ఇటీవల మయన్మార్ నుంచి రొహింగ్యా ముస్లింలు వెల్లువలా వచ్చి పడినా, వారి కోసం చిట్టగాంగ్ సమీపంలో ప్రత్యేక స్థావరాలు ఏర్పాటు చేసి ఆశ్రయం కల్పించారు. అదే ఖలీదా జియా అయితే శరణార్థులను మన దేశంలోకి తరిమి ఉండేవారు.

బేగం ఖలీదా జియా తొలిసారి ప్రధాని అయినప్పుడు ఆమెను పాకిస్తాన్ మాజీ ప్రధాని బెనజీర్ భుట్టోతో పోల్చేవారు. బెనజీర్ అధికారంలో ఉండగా, ఆమె భర్త జర్దారీ ఏ హోదా లేకుండా రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించినట్టే, బేగం ఖలీదా బంగ్లా ప్రధానిగా ఉన్నప్పుడు ఆమె కుమారుడు తారీఖ్ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించాడు. పెద్ద కాంట్రాక్టులను తనకుసన్నిహితులకు ఇప్పించాడు. ప్రస్తుతం తల్లీ,కొడుకులు జైలుకు వెళ్ళడానికి కారణమైన చిన్న పిల్లల చారిటబుల్ ట్రస్టు నిధుల దుర్వినియోగం అతడి కనుసన్నలలోనే జరిగింది. ఇంకా అనేక కాంట్రాక్టుల విషయంలో కూడా అతడి ప్రమేయం ఉంది. ఖలీదా జియా భర్త జియావుర్ రెహమాన్ మాజీ సైనిక పాలకుడు కావడంవల్లసైనికుల్లో ఒక వర్గం ఆమెకు విధేయంగా ఇప్పటికీ ఉంటోంది. పాకిస్తాన్‌లో మాదిరిగానే బంగ్లాదేశ్ లో సైనికాధికారుల పెత్తనం సాగుతోంది. పాక్‌లో అంత కాకపోయినా, బంగ్లాలో కూడా మత నాయకులు చక్రం తిప్పడం సహజ లక్షణం. ఈ ఇద్దరు మహిళల హయాంలో బంగ్లా దేశ్ అభివృద్ధి అంతంత మాత్రమే. హసీనా హయాంలో స్థూల జాతీయోత్పత్తి 6.51శాతం. జియా హయాంలో కన్నా నయం. ఢాకాలో ఢాకా నవాబుల కాలం నాటి అషన్ మంజిల్, హిందువులకు పవిత్రమైన ఢాకేశ్వరి ఆలయం,17వ శతాబ్దం నాటి లాల్‌బాగ్ కోట ప్రధాన సందర్శనీయ ప్రదేశాలు.

పశ్చిమ బెంగాల్‌తో సత్సంబంధాలు: బంగ్లాదేశీయులకు పశ్చిమ బెంగాల్ వాసులతో సత్సంబంధాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. వారి భాషాభిమానం అనుపమానమైనది. బంగ్లాదేశ్ అవతరణకు దారి తీసిన యుద్ధం సమయంలోమన దేశంలోని బెంగాలీలు ఆవేశంతో ఊగిపోయేవారు. సబ్ కలెక్టర్ వంటి ఉన్నత స్థానాల్లో ఉన్న అధికారులు సైతం బంగ్లాదేశ్ అవతరణ ను బహిరంగంగా స్వాగతిస్తూ కవితలు కూడా రాశారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లు రెండూ ఒకనాటి అఖండ భారత్‌లో అంతర్భాగాలు కావడం వల్ల అటువారు ఇటు, ఇటు వారు అటు పర్యటనలు జరిపినప్పుడు భావోద్వేగాలు పెల్లుబుకుతుంటాయి. రాజకీయాల కన్నా, భాషా, సంస్కృతి సంప్రదాయాలకు సామాన్యులు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. బేగం ఖలీదా జియా, ముషార్రఫ్ వంటి పాలకుల వల్లే ఇరుగుపొరుగు దేశాల మధ్య చిచ్చులు రేగుతున్నాయి.

-ఎ.పి. స్వామి



బేగం ఖలీదా



షేక్ హసీనా

బంగ్లాదేశ్ రాజకీయాలను గడిచిన రెండు దశాబ్దాలుగా ఇద్దరు మహిళలు శాసిస్తున్నారు.వంతుల వారీగా ప్రధానమంత్రులు అవుతున్నారు.ప్రస్తుత ప్రధాని,అవామీలీగ్ అధినేత్రి షేక్ హసీనా,మాజీ ప్రధాని,బంగ్లాదేశ్ నేషలిస్టు పార్టీఅధ్యక్షురాలు బేగం ఖలీదా జియాల మధ్య వ్యక్తిగత వైరం వల్ల బంగ్లాదేశ్ అభివృద్ధి అడుగంటుతోంది. దేశరాజధాని ఢాకాలోనూ,చిట్టగాంగ్‌లలో మినహా ఎక్కడా ప్రధాన పరిశ్రమలు లేవు. దేశ జనాభా 18.80 మిలియన్లు.వారిలో కోటి ఇరవై లక్షల మంది హిందువులు ఉన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య 30 శాతంపైనే. బంగ్లాదేశ్ జనపనారఉత్పత్తులకుప్రసిద్ధి. సుందరబన్ అడవులు ,రాయల్ బెంగాల్ టైగర్‌కి బంగ్లాదేశ్ నెలవు. పర్యాటకంగా ఎన్నో ఆకర్షణీయప్రాంతాలు ఉన్నప్పటికీ, రాజకీయ ఘర్షణలు,ఉగ్రవాదుల కదలికల వల్ల బంగ్లా దేశ్‌కు వెళ్ళే పర్యాటకుల సంఖ్య పెద్దగా లేదు.రాజకీయ,మత ఘర్షణలు బంగ్లాదేశ్ ప్రగతికి ఆటంకంగామారాయి.

ఆకలి కేకలు ఇంకెన్నాళ్ళు?

నిరక్షరాస్యుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా 2010లో కేంద్రం ప్రవేశపెట్టిన సాక్షర భారత్ కార్యక్రమంలో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. ప్రతి గ్రామంలో నిరక్షరాస్యులను విద్యావంతులుగా చేయడానికి గ్రామ కో- ఆర్డినేటర్‌ను నియమించారు. ఒక్కో పంచాయతీ పరిధిలో నిరక్షరాస్యుల సంఖ్యను బట్టి సాక్షర గ్రామ కో-ఆర్డినేటర్ పోస్టులను మూడుకు పెంచారు. ప్రతి మండలానికి మండల స్థాయి (ఎమ్‌సిఓ) కో ఆర్డినేటర్లను నియమించారు. ప్రతి గ్రామానికి ప్రతిరోజు దిన పత్రికలు, ఇతర పుస్తకాలు, సినీ వ్యాగజైన్లు మంజూరు చేశారు. 60 శాతం కేంద్రం, 40 శాతం స్టేట్ నిధులతో ఈ కార్యక్రమంలో గత 7 సంవత్సరాలుగా నడిచింది. వేలిముద్రలు వేసేవారు తమ సంతకం పెట్టడం నేర్చుకుని విద్యావంతులయ్యారు. సాక్షర భారత్ అక్షరాస్యులైన వారు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నేషనల్ ఓపెన్ స్కూల్‌లో పరీక్షలు రాసి ఉన్నత విద్యావంతులుగా నమోదయ్యారు. ఇప్పటివరకు సుమారు 6 లక్షల మంది అక్షరాస్యులయ్యారని గణాంకాలు తెలుపుతున్నాయి. ఇంకా 4 లక్షలమంది మిగిలిపోయారు. గ్రామస్థాయిలో ఈ పథకం సక్రమంగా నడవటం లేదనే సాకుతో కేంద్రం గత సంవత్సరం నుండి నిధులు ఇవ్వటంలేదు. అసలు ఈ పథకాన్ని రద్దు చేసినట్టు ప్రకటించలేదు. ఉన్నట్లు ప్రకటన చేయలేదు. గతసెప్టెంబర్ 30తో దీని గడువు ముగిసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు మాత్రం ఈ పథకాన్ని పొడిగించాలని పార్లమెంట్‌లో గొడవ చేశాయి. ఏడాదిగా గ్రామ స్థాయిలో విసిఓ లకు మండల స్థాయిలో (ఎమ్‌సిఓ) లకు జీతాలు చెల్లించడం లేదు. గ్రామాల్లో ఉన్నవారికి చదువు సాగటం లేదు. కొన్ని తెలంగాణ జిల్లాల్లో గ్రామ, మండల కో- ఆర్డినేటర్లు ప్రభుత్వ నిధులను దిగమింగారు. వారి మీద చర్య తీసుకోలేదు. కరీంనగర్ జిల్లాలో కుంభకోణంలో నిందితులు తప్పించుకొని తిరుగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 17 వేల మంది గ్రామ కో ఆర్డినేటర్లు, 550 మంది మండల కో- ఆర్డినేటర్లు ఈ పథకంలో పనిచేస్తున్నారు. గ్రామ కో -ఆర్డినేటర్‌కు నెలకు 2 వేలు, మండల అధికారికి 8 వేలు గౌరవ వేతనం ఇవ్వాలి. అప్పోసప్పో చేసి గత 12 నెలలుగా సాక్షర భారత్ సిబ్బంది కుటుంబాలను పోషిస్తున్నారు. నిరక్షరాస్యుల జీవితాల్లో వెలుగులు నింపే కో -ఆర్డినేటర్లు ఆకలితో అలమటిస్తున్నారు. జీతాలు ఇచ్చి జీవితాలు కాపాడమని అధికారులను వేడుకుంటున్నారు. గ్రామాల్లో ఇంతకాలం ఉన్న వయోజన విద్య పథకం రద్దు కావడంతో గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడానికి సాక్షర భారత్ పథకం ఎంతో ఉపయోగపడింది. నెలసరి వేతనాలను పెంచటంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్‌ను కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ లిటరసీ మిషన్ ద్వారా దేశంలోని 70 మిలియన్ల ప్రజలను అక్షరాస్యులుగా చేయవల్సిన పథకం ఆగిపోయింది. ఉన్న పథకాన్ని రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం వేరే పథకాన్ని ప్రవేశపెట్టకపోవడం విచారకరం. దేశంలోను, తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికి అక్షరాస్యత శాతం 75 కి దాటలేదు. ఇంకా 25 శాతం మంది నిరక్షరాస్యులుగా ఉన్నారు. విద్యాశాఖ ద్వారా ఎన్నో రకాల కార్యక్రమాలు చేపడుతున్న సత్ఫలితాలు రావటంలేదు. 7 సంవత్సరాలపాటు సాగిన సాక్షర భారత్ పథకంలో ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 23 వేల మంది, ఆంధ్రలో 30 వేల మంది 12 నెలలుగా ఆకలితో అలమటిస్తున్నారు. పాత స్కీమును రద్దుచేసి కొత్త స్కీమును వెంటనే ప్రకటించాలి. మా నౌఖరీ ఉన్నట్లా? ఊడినట్లా? అనేదానిపై తెలుగు రాష్ట్రాల్లో 50 వేల మంది పరేషాన్‌లో పడ్డ పాలకులకు చెవికి ఎక్కడం లేదు. తెలంగాణ ప్రభుత్వం ఈ స్కీమును పొడిగించమని ఎన్నోసార్లు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగా కేంద్రం మిన్నకుండిపోయింది. ఈ సస్పెన్స్‌కు వెంటనే తెరదించాలి. పాత జీతాలు ఇవ్వాలి. స్పష్టత ఇవ్వాలి.

-రావుల రాజేశం
9848811424

పాఠకీయం

బ్యాంకు వారి నిలువు దోపిడీ

తాజాగా పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఒకే శాఖలో 11,000 కోట్ల రూపాయల మేరకు మోసం జరిగి, నష్టం వాటిల్లిందని తేలింది. అది కూడా ముగ్గురు, నలుగురు ఉద్యోగుల చేతి వాటం వల్ల నని భావించడంలో గగుర్పాటు కలుగుతుంది. ఒక బడా వ్యాపారికి మేలు చేసేలా లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ జారీ చెయ్యడం ద్వారా జరిగినట్టు బ్యాంకు వర్గాలు తెలియజెయ్యడం విస్తు గొలిపేదే. ఆ రకమైన గ్యారంటీ ఉత్తరాలు తీవ్రమైన తనిఖీ క్రియలు దాటి, వివిధ పరీక్షల్ని దాటాల్సి ఉంటుంది. ఈ మధ్య వివిధ బ్యాంకులు విడుదల చేసిన లెక్కల ప్రకారం ప్రతీ బ్యాంకు ఫ్రాడ్ ద్వారా నష్టపోయిన మొత్తం వెయ్యి కోట్ల రూపాయలపైనే. అందులో ప్రముఖ ఎస్‌బిఐ ది మొదటి స్థానం.. ఎనిమిది వేల కోట్ల రూపాయలతో. ఇవి అధికారికంగా, పాక్షికంగా తేలిన కొన్ని గణాంకాలు మాత్రమే. నిరర్థక ఆస్తులు, మొండి బకాయిల రూపంలో లక్షల కోట్ల రూపాయలు.

బ్యాంకు నిర్వాకాలు ఇలా ఉంటే, ప్రభుత్వ చికిత్సలు వేరేలా ఉన్నాయి. ఇలా బాధ్యతారాహిత్యంతోనో, కుమ్మక్కు వ్యవహారాలతోనో బ్యాంకు దివాళా తీస్తే, దానికి సర్దుబాటు ఖాతాదారుల సొమ్ము నుండి చేస్తారట. పైసా పైసా కష్టపడి కూడబెట్టుకొన్న సొమ్ముని ఖాతాదారు బెయిల్ ఇన్ పేరుతో బ్యాంకు పాలు చేయాలన్న మాట. ఎవడో చేసే దోపిడీకి సామాన్యుడు బలి కావాలా, అదీ అధికారికంగా, బ్యాంకు ద్వారా!

-డా.డి.వి.జి.శంకరరావు, మాజీఎంపీ

మహా యుద్ధం అనివార్యమా!

అంతర్జాతీయంగా ఉత్తరకొరియా, అమెరికా మధ్య యుద్ధంపై చర్చలు మొదలయ్యాయి. కార్పొరేట్ శక్తులు అమెరికా సామ్రాజ్యవాదానికి వంత పాడుతూ ఉత్తర కొరియా అణ్వాయుధాల తయారీ తప్పంటున్నాయి. అణ్వాయుధాలున్నాయంటూ ఉత్తరకొరియా హెచ్చరించడం సరికాదంటున్నాయి. ఉత్తరకొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ అణుబాంబులు తయారుచేస్తూ, నియంతగా వ్యవహరిస్తున్నారని, అమెరికాపై ఉత్తపుణ్యానికే యుద్ధానికి కాలుదువ్వుతు న్నాడని, భారత్ అనుకూల ప్రచారం చేస్తోంది. ఇది అన్యాయమని, అమెరికాకు మద్దతుగా ప్రపంచ దేశాలు నిలవాలని, ఉత్తరకొరియాను ఒంటరి చేయాలనే పిలుపిస్తున్నారు.

దొరికిందే తడవుగా అమెరికా, యూరోపియన్ దేశాలు ఐరాసతో కలసి ఉత్తరకొరియాపై కఠిన వాణిజ్య, ఆర్థిక ఆంక్షలను ప్రకటించాయి. 4 బిలియన్ డాలర్లుగా ఉన్న ఉత్తర కొరియా ఎగుమతుల్లో తాజా ఆంక్షల వల్ల 25 శాతం ఆదా యం తగ్గిపోయింది. చైనా సైతం ఆంక్షలను విధించడంతో ఉత్తర కొరియా పేద ప్రజలు మరింత దారిద్ర్యాన్ని అనుభ విస్తున్నారు. 1950 - 53 నుండి ఉత్తర కొరియా అమెరికా సామ్రాజ్యవాద విధానాలకు బలి అవుతూ ఉంది. 2 కోట్ల 50 లక్షల మంది ప్రజలు ఉన్న ఉత్తర కొరియా ప్రపంచ శత్రువుగా పరిగణిస్తున్నారు. గతంలో ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో ఉగ్రవాదు లు తలదాచుకున్నారని, ఆ దేశాల్లోని రసాయన ఆయుధాల వల్ల ప్రపంచ ప్రజలు ప్రమాదంలో పడతారని ప్రకటించారు. ఆ దేశాలపై యుద్ధాలు చేసి అక్కడ సాధారణ ప్రజలను, పిల్లలను చంపేశారు. దక్షిణ కొరియాలో ఉన్న అణుబాంబుల కన్నా ఉత్తరకొరియాలో ఉన్న అణుబాంబులు చాలా తక్కువని బిబిసి ప్రకటించింది. దక్షిణ కొరియాలో అణుబాంబులు ఉన్నాయని భయపడి 3 అణుబాంబులు తయారు చేసుకున్నామని ఉత్తరకొరియా ఇందుకు బదులిచ్చింది.

అమెరికా, యూరోపియన్ దేశాలు ఐరాస మీద వత్తిడి తెచ్చిన లిబియాను అణ్వస్త్ర రహిత దేశంగా ప్రకటించారు. లిబియా మాజీ అధ్యక్షుడు గడాఫీ 2003 తర్వాత అణుబాంబులను నాశనం చేశాడు.తర్వాత లిబియా అమెరికా ఆధీనంలోకి వెళ్లిపోయింది. అరబ్ వసంతం పేరుతో లిబియాలో తిరుగుబాటును లేపారు. గడాఫీ నియంత అని ప్రకటించి అమెరికా తయారు చేసిన ఉగ్రవాదుల చేతిలో హత్యకు గురయ్యారు. ఇప్పటికీ లిబియాలో అస్థిరత రాజ్యమేలుతోంది. ఉక్రెయిన్ కూడా లిబియా తరహాలోనే కుప్పకూలింది. లిబియాను, ఉక్రెయిన్ చూసి ఉత్తరకొరియా గుణపాఠాలను నేర్చుకుంది. ఉత్తరకొరియాపై రాజకీయ, మార్కెట్ ఆధిపత్యాన్ని పొందేటందుకే అమెరికా ఉత్తర కొరియాపై తప్పుడు ప్రచారం చేస్తోంది.



అణ్వాయుధాలు కొత్తగా పేద, వర్ధమాన దేశాలు తయారు చేసుకోకూడదని అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి), సమగ్ర అణుపరీక్షల నిషేధ ఒప్పందం (సిటిబిటి)లో భాగం చేస్తున్నాయి. ఇప్పటికే అణ్వాయుధాలు తయారు చేసుకున్న సంపన్నదేశాలు మాత్రం వాటిని ధ్వంసం చేయడం లేదు. భారత్‌పై కూడా అణు నిషేధాన్ని సామ్రాజ్యవాద దేశాలు అమలు పరిచాయి. జపాన్ నుండి 370 మైళ్ల దూరం లోను, పసిఫిక్ మహాసముద్రంలో 1700 మైళ్ల దూరంలోనూ ఉత్తర కొరియా అణుపరీక్షలు నిర్వహించింది. జపాన్‌పై యుద్ధా నికే ఉత్తరకొరియా ఈ పనికి పాల్పడిందని అమెరికా దుష్ప్రచారం చేసింది. దక్షిణ కొరియా సముద్రతీరంలో అమెరికా యుద్ధనౌకలు, అణుబాం బులను వేసే బాంబర్లను మోహరించి యుద్ధవాతావరణాన్ని నెలకొల్పింది. ఉత్తరకొరియాలో రాజకీయ ఆధిపత్యాన్ని సాధిస్తే, అమెరికా చైనాకు, రష్యాకు చెక్ పెట్టవచ్చు. ఇప్పటికే చైనా తన పొరుగు దేశాల తీర ప్రాంతాలలో ఎక్స్‌ప్రెస్ హైవేలను, సిల్క్ రోడ్లను వేస్తోంది. నౌకాదళాలను ఏర్పాటు చేస్తూ తన శక్తిని పెంచుకుంటున్నచైనాను కట్టడి చేయాలంటే ఉత్తరకొరియాను వ్యూహాత్మక యుద్ధ ప్రాంతంగా అమెరికా తయారు చేయాలి. చైనా మార్కెట్ అంతర్జాతీయంగా బలీ యంగా ఉంది. అనేక రకాల రాయితీలతోను, వత్తిడులతోను ఆసియా దేశాలలో చైనా తన మార్కెట్‌ను విస్తరించుకుం టోంది. మిలటరీ శక్తిని ఇతోధికంగా పెంచుకుంటోంది. అదనపు విలువను పెంచుకుంటూ పెట్టుబడులను పెద్దఎత్తున పోగుచేస్తూ, మార్కెట్ కోసం చైనా తన విషకౌగిలిని విస్తరించు కుంటోంది. అమెరికా సిరియాలో రాజకీయ ఆధిపత్యాన్ని సాధించడానికి ఎంత కష్టపడ్డా విఫలం అయింది. చైనా, రష్యా మద్దతు వల్లే సిరియాలో అమెరికా ఆధిపత్యానికి గండి పడింది.

అమెరికాలో ట్రంప్‌కు రాజకీయ ఆధిపత్యం లేదని తేలిపోయింది. ట్రంప్ నియమించుకున్న అధికారులపై ఆరోపణలను చేసి వారిని ఇంటికి పంపించారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా సిఐఏ ప్రవర్తిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఉత్తర కొరియాను నాశనం చేస్తామని ట్రంప్ ప్రకటిస్తారు. విదేశాగ మంత్రి టిల్లర్సన్ చర్చల ద్వారా సమస్యను పరిష్కరిస్తామని చెప్తాడు. అమెరికాలోని పెట్టుబడిదారులకు మధ్యవున్న వైరుధ్యం పాలకవర్గాల్లోను కన్పిస్తోంది. అమెరికా సంపదలో ఎక్కువభాగం రక్షణ శాఖకే కేటాయిస్తారు. పెట్రోలు దొరికే దేశాల మార్కెట్‌ను అమెరికా తన గుప్పెట్లో పెట్టుకుంది. ఈ మార్కెట్ అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా పని చేస్తోంది.

1950- 53లో కొరియా యుద్ధం వల్ల ఉత్తర -దక్షిణ కొరియాలు ఆర్థికంగా నష్టపోయాయి. జపాన్ ఉమ్మడి కొరియాను ఆక్రమించేందుకు 1871 నుండి ఎత్తులు వేస్తోంది. 1905లో కొరియాను రక్షిత ప్రాంతంగా ప్రకటించి, జపాన్ ఆధిపత్యాన్ని కొనసాగించింది. కొరియా లో భూస్వా ములు దోపిడీ అనంతరం, జపాన్ వలసపాలన మొదలైంది. 1901 లో జపాన్ వలస ప్రభు త్వం, కొరియాలోని ఫ్యూడల్ వర్గాలతో కలసి దోపిడీని కొనసాగిం చింది. కొరియా ప్రజల ఆకాంక్షలను అణిచివేయ డమే గాక, ప్రశ్నించిన వారిని కాల్చి చంపడం రివాజుగా మారింది. 1919లో కొరి యా ప్రజల శాంతి యుత ప్రదర్శనను అడ్డుకుని జపాన్ సైన్యం 7000 మందికి పైగా ప్రజలను చంపేసింది. 1931 నుండి జపాన్ సైన్యం కొరి యా మహిళలపై అత్యాచారాలకు దిగింది. సుమా రు 2 లక్షలకు పైగా కొరియా మహిళలపై అత్యాచారాలు చేశారు. వారిచేత వెట్టి లైంగిక పనులను చేయిస్తున్నారు. 1930లో ఉత్తర కొరియా ప్రాంతంలో కిమ్ ఇల్ సంగ్ స్థానిక భూస్వామ్య, వలస ప్రభుత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా ఎదిగాడు. 1939-45 మధ్య రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ ఓడిపోయింది. కొరియాకు స్వాతంత్ర్యం లభించింది. అప్పటికే దక్షిణ కొరియా లో పీపుల్స్ కమిటీ నాయకత్వంలో ప్రజలు సంఘటితమ య్యారు. రష్యా, అమెరికా మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొరియా విభజనకు దారితీసింది. కొరియా విభజన తదనంతరం దక్షిణ కొరియా అమెరికా ఆధిపత్యంలోకి వెళ్లిపోయింది. అక్కడ ఉన్న పీపుల్స్ కమిటీ సామ్యవాద ప్రతిపాదనలు అమెరికాకు కంటగింపుగా మారాయి. 1945 -50 ల మధ్య పీపుల్స్ కమిటీపై తీవ్ర నిర్బంధం మొదలైంది. అమెరికా కీలుబొమ్మ సింగ్మన్ రీ నాయకత్వంలో రిపబ్లిక్ ఆఫ్ కొరియా దక్షిణ కొరియాలో ఏర్పడింది. కిమ్ ఇల్ సంగ్ నాయకత్వంలో డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా ఉత్తరకొరియాలో ఏర్పడింది. దక్షిణ కొరియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా చెజు ద్వీపంలోని ఆదివాసీలు తిరుగుబాటు చేశారు. అమెరికా సైన్యం, దక్షిణ కొరియా పోలీసులు చెజు ప్రజలపై చేసిన తీవ్రమైన హింస వల్ల వేలల్లో ప్రజలు చనిపోయారు. 1948లో చెజు ప్రజలు చేసిన తిరుగుబాటును ప్రభుత్వం అణిచేసింది. ఇందులో 70 వేల మందికి పైగా చనిపోయారు. దక్షిణ కొరియా లోని భిన్న ప్రాంతాలలో ప్రభుత్వం అమలు చేసిన నిర్బంధం 1950లో కొరియా యుద్ధానికి దారితీసింది. దక్షిణ కొరియాపై ఆధిపత్యాన్ని ప్రకటించు కోవటానికి అమెరికా ఉత్తరకొరి యాను దుష్టదేశంగా ప్రకటిస్తూ వస్తోంది. కొరియా యుద్ధ సమయంలో అమెరికా దక్షిణ కొరి యాకూ, రష్యా, చైనా ఉత్తరకొరియాకు అండగా నిలిచాయి. ఈ యుద్ధంలో అమెరికన్ సైన్యం ఉత్తరకొరియా జనాభా శాతంలో 20 శాతానికి పైగా జనాభాను చంపేసింది. 37 నెలలపాటు ఈ యుద్ధం జరిగింది. 78 నగరాలు ధ్వంసమ య్యాయి. ఉత్తరకొరి యా ప్రజలు అమెరికా అణుబాంబు వేస్తుందని భీతిల్లారు. 1950 లోను అమెరికా - దక్షిణ కొరియాల సైనిక విన్యాసాలే కొరియా యుద్ధానికి దారితీశాయి. ప్రతి ఏటా అమెరికా - దక్షిణ కొరియా సంయుక్తసైనిక విన్యాసాల్లో ఎక్కడ అణుబాంబు వేస్తారేమోనని ఉత్తరకొరియా ప్రజలు ఇప్పటికీ భయపడుతుంటారు. 1953లో కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చాయి. ఉత్తరకొరియా ప్రజల భయాన్ని పోగొట్టుకోవడానికే ఆ దేశం అణుబాంబును ఆత్మరక్షణార్థం తయారు చేసుకుంది. యుద్ధం తర్వాత జపాన్‌ను అమెరికా తన అనుంగు రాజ్యంగా మార్చుకుంది. ఉత్తర కొరియాపై బి 29, బి 1బి బాంబర్లను అమెరికా ప్రయోగిస్తూనే ఉంది. ఉత్తరకొరియా కమ్యూనిస్టు దేశం కాదు. అయినప్పటికీ స్వతంత్ర అభివృద్ధి విధానాన్ని వారు రూపొందించుకుంటున్నారు. 1953లో కాల్పుల విరమణ ఒప్పందం శాంతి ఒప్పందంగా చేసుకోవాల్సిన అవసరం ఉంది. శాంతి ఒప్పందానికి ఉత్తరకొరియా అణ్వస్త్ర రహిత దేశంగా మారాలని అమెరికా వత్తిడి చేస్తోంది. 2005లో 6 దేశాలు (ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, జపాన్, అమెరికా, రష్యా, చైనా) చర్చించాయి. ఈ చర్చలు పరిష్కార దిశగా రాకుండా అమెరికా అడ్డుపడుతోంది. తాత్కాలిక ఒప్పందం 2005లో కుదిరినప్పటికీ, అమెరికా ఉత్తరకొరియాపై మరిన్ని వాణిజ్య ఆంక్షలను విధించింది. దీనివల్ల అమెరికా ఒప్పందానికి విలువలేకుండా చేసింది. 2007, 2012లోనూ ఒప్పందాలు కుదిరాయి. వీటి మేరకు బాంబుల తయారీని, ఫ్లుటోనియమ్ నిల్వలను తగ్గించింది. అయినా ఉత్తరకొరి యాపై అమెరికా ఆంక్షలను ఎత్తేయలేదు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఉత్తరకొరియా రష్యా, చైనాపై ఆధారపడకుండా ఉండాలని భావిస్తోంది. ఉత్తరకొరియాలో సంక్షోభం అమెరికా సృష్టించిందే. ఈ సమస్యను అమెరికానే చొరవతో పరిష్కరించాలి. ఉత్తరకొరియాతో శాంతి ఒప్పందం చేసుకోవాలి. అమెరికాపై ఆ విధంగా వత్తిడి చేయడానికి రష్యా, చైనాతో పాటు భారత్ ప్రయత్నించాలి. ఉత్తరకొరియాపై అమెరికా ఆర్థిక, వాణిజ్య ఆంక్షలు ఎత్తివేసి తన చిత్తశుద్ధిని చూపించాలి.



-ఎమ్.కె. కుమార్

సిద్ధిపేట సుందరం..హరితం

చత్తీస్‌గఢ్ ప్రతినిధి బృందం కితాబు



సిద్ధిపేట, ప్రభన్యూస్ : తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు చాలా బాగున్నాయని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఎస్ఎంఎంయూ ప్రతినిధి బృందం సౌరవ్ శ్రీ వాస్తవ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ అమృత్ రంజన్, సిటీ మిషన్ మేనేజర్ యశోధర తివారీలు ఆనందం వ్యక్తం చేశారు. సిద్దిపేట మున్సిపాలిటీని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెంది ఎస్ఎంఎంయూ యూనిట్ బృందంతో పాటు రాష్ట్ర మహిళా సంఘాల మానిటరీ మిషన్ యూనిట్ రాయపూర్ పట్టణానికి చెందిన లీండ్ బ్యాంక్ బృందం గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పేదరిక నిర్మూలన సంస్థ, తెలంగాణ రాష్ట్ర మిషన్ సమన్వయ కర్త సుజాత ఆధ్వర్యంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సిద్దిపేట మున్సిపల్‌లో మహిళా సమైక్య చేపడుతున్న సీఎల్‌సీ కేంద్రం, సిటీ లవ్‌లీ ఉడ్ కేంద్రం, పట్టణ మహిళా సమైక్య సీఎల్‌ఫ్ పనితీరుతో పాటు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను మహిళా సమైక్యలు ప్రజలు ఏ విధంగా అందజేస్తున్నాయన్న విషయంపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి అడిగి తెలుసుకున్నారు. పట్టణ మహిళా సమైక్యలు ప్రజలకు అవగాహన కల్పించడంపై ప్రముఖ పాత్ర పోషిస్తున్నతీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణకు హరితహారం, బహిరంగ మలవిసర్జన రహిత పట్టణం, డిక్లరేషన్‌లో ఓడీఎఫ్ ముఖ్య పాత్ర, ఇంటింటికి చెత్త సేకరణలో భాగంగా తడి, పొడి చెత్తలు వేరు చేయు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు మహిళా సమైక్య సంఘం సభ్యులు బుక్ కీపింగ్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట పట్టణం చాలా అందంగా క్లీన్‌గా ఉందని, సిద్దిపేటలో మహిళా సమైక్య సంఘం సభ్యుల పని తీరు చాలా బాగుందని హర్షం వ్యక్తం చేశారు. సిద్దిపేట ఇంత గొప్పగా ఉండటంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యం ఎంతో గొప్పదని వర్ణించారు. సిద్దిపేటకు వచ్చి తాము ఎంతో నేర్చుకున్నామని తమ రాష్ట్రంలో ఇక్కడ చేపడుతున్న పలు పథకాలను అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు. మహిళా గ్రూప్‌లు చేస్తున్న పొదుపును చూసి వారు సంతృప్తి చెందారు. ఈ బృందాన్ని మున్సిపల్ అధికారులు పట్టణంలోని స్లమ్ ఏరియా, ఐటీసీ తదితర ప్రాంతాలను పరిశీలించి అధ్యాయనం చేశారు. ఈ బృందంలో స్టేట్ మిషన్ మేనేజర్ సుభాష్ రంజన్, లీడ్ బ్యాంక్ బృందం ప్రతినిధులు చంద్రమెహత, అమృత్‌రంజన్, కౌశల్‌సింగ్, సురేంద్రషా తదితరులు ఉన్నారు.

సంత్‌సేవాలాల్ అడుగుజాడల్లో

యువత నడవాలి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : సంత్ సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో బంజారా యువత నడవాలని రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహా రెడ్డి పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 279వ జయంతి మహా భోగ్ బండోరా కార్యక్రమాన్ని రవీంద్రభారతిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ బంజారా సమాజాన్ని ఆధ్యాత్మిక మార్గాల్లో నడిపించడానికి సేవాలాల్ విశేష కృషి చేశారన్నారు. మూడు సంవత్సరాలుగా సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను త్వరలో పాఠ్యపుస్తకాల్లో చేర్చే అంశంపై సీఎంతో మాట్లాడతానన్నారు. దీంతోపాటు సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున సెలవుదినంగా ప్రకటించేలా ప్రభుత్వాన్ని ఒప్పిస్తానన్నారు. సేవాలాల్ జీవిత చరిత్ర పుస్తకాన్ని శంకర్‌నాయక్ రాయడం అభినందనీయమన్నారు. టీజీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున సేవాలాల్ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. గతంలో బంజారాలను పట్టించుకోని ప్రభుత్వాలు ప్రస్తుత ప్రభుత్వాన్ని చూసి చాలా నేర్చుకోవాలన్నారు. ప్రతి విశ్వ విద్యాలయంలో గిరిజన పీఠాన్ని ఏర్పాటు చేసి గిరిజన సంస్కృతిని పరిరక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, మద్దిమడుగు పీఠాధిపతి జయరాం స్వామి, రాంబాబు, గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాజు నాయక్, శ్రీను నాయక్, వినోద్‌నాయక్, మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. సేవాలాల్ జీవిత మాల సీడీని ఆవిష్కరించారు.

అజాద్ ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణకు ఆదేశం

ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : మావోయిస్టు అగ్రనేత చెరుకూరి రాజ్ కుమార్ అలియాస్ ఆజాద్ జర్నలిస్టు హేమ చంద్రపాండేల ఎన్‌కౌంటర్‌పై గురువారం జిల్లా కోర్టులో వాదనలు కొనసాగాయి. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై న్యాయ విచారణకు ఆదేశించాలని ఆజాద్ భార్య పద్మ తరపున న్యాయవాదులు న్యాయమూర్తిని కోరారు. సానుకూలంగా స్పందించిన న్యాయమూర్తి భరత లక్ష్మీ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న 29 మంది పోలీసులపై విచారణకు అనుమిస్తూ ఆదేశించారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాంకిడి మండలం, సర్కపెల్లి అటవీ ప్రాంతంలో 2010 జులై 2న మావోయిస్టులకు పోలీసులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్, జర్నలిస్టు హేమచంద్ర పాండేలు మృతి చెందిన విషయం తెలిసింది. కాగా ఈ ఎన్‌కౌంటర్ బూటకమని పోలీసులు తమ ఉనికిని కాపాడుకోవడానికివీరిని ముందుగానే పట్టుకుని అటవీ ప్రాంతంలో కాల్చి చంపారని ఎన్‌కౌంటర్‌కు బాధ్యులైన పోలీసులపై కేసులు నమోదు చేయాలని ఆజాద్ భార్య పద్మ , జర్నలిస్టు హేమ చంద్ర పాండే భార్య బబిత , సామాజిక వేత్త స్వామి అగ్నివేశ్‌లు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా సుప్రీం కోర్టు విచారణకు సీబీఐకి ఆదేశించింది. విచారణ జరిపిన సిబిఐ అధికారులు సాక్షులు లేవని కేసును మూసివేశారు.ఆజాద్ భార్య పద్మ, హేమచంద్రపాండే భార్య బబితలు మున్సిపల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ తరపున న్యాయవాదులు ఆజాద్, హేమ చంద్ర పాండేల తరపు న్యాయవాదులు వాదనలు వినిపించగా 2015 లో కేసు కొట్టి వేస్తు అప్పటి న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కాగా హైకోర్టు తిరిగి జిల్లా కోర్టుకు కేసును బదిలీ చేసింది. గురువారం ఈ ఎన్‌కౌంటర్‌కు బాధ్యులైన పోలీసులపై న్యాయ విచారణకు ఆదేశించాలని పద్మ, బబితల తరుపు న్యాయవాదులు న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు.

'పెండింగ్ నిధులు ఇప్పించండి'



హైదరాబాద్,ఆంధ్రప్రభ: కొత్తగా ఏర్పడిన తెలంగాణలోని రాష్ట్ర యూనివర్సిటీలకు గ్రాంట్లను ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేసింది. యుజిసి నుంచి పెండింగ్‌లో ఉన్న గ్రాంట్లను వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మన్లు ఆచార్య లింబాద్రి, ఆచార్య వెంకటరమణ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య సీతారామారావు గురువారం యుజిసి చైర్మన్ ఆచార్య డిపి సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం విడిపోయిన తరువాత యుజిసి నుంచి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి రావల్సిన రెగ్యులర్ గ్రాంట్స్ రావడం లేదన్నారు. శాతవాహన యూనివర్సిటీకి 2ఎఫ్, 12 బి స్టేటస్ ఇంకా పెండింగ్‌లో ఉందని దానిని క్లియర్ చేసి న్యాక్ గుర్తింపు వచ్చేలా చూడాలన్నారు. తెలంగాణ యూనివర్సిటీకి రావల్సిన రూ. 5 కోట్లను విడుదల చేయాలన్నారు. కాకతీయ యూనివర్సిటీకి యుజిసి నుంచి పెండింగ్‌లో ఉన్న బిఈడీ కోర్సు అనుమతి ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని 5 యూనివర్సిటీల్లో ఏర్పాటు చేయనున్న ఇంక్యూబేటర్లకు యుజిసి రూ. 50 కోట్ల నిధులను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డిగ్రీ, పీజీతోపాటు వృత్తి విద్య కోర్సులకు ఆన్‌లైన్ అడ్మిషన్లను చేపడుతున్నట్టు యుజిసి చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

ఇంటెలిజెన్స్ వైపు అకున్ చూపు!

విడుదల చేయాలని కోరుతున్న సబర్వాల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎక్సైజ్ శాఖ బాధ్యతల నుంచి తప్పుకుని ఇంటెలిజెన్స్ బాధ్యతలను నిర్వహించేందుకు అకున్ సబర్వాల్ సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న అకున్ సబర్వాల్‌ను స్వంత శాఖకు పంపించాలని డిజిపి ఎం. మహేందర్‌రెడ్డి ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాయడం, పంపిస్తే ఇబ్బందికరమంటూ ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సోమేష్‌కుమార్ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసిన విషయం తెలిసిందే. పోలీసు శాఖకు అకున్ సబర్వాల్ వస్తే ఆయనకు కీలకమైన ఇంటెలిజెన్స్ బాధ్యతలను కట్టబెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ప్రజల నాడిని తెలుసుకుని మెసలుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నందున వత్తిళ్ళకు ఏ మాత్రం లొంగని అకున్‌కు ఈ పదవిని అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు డిజిపి లేఖ రాశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా అకున్ సబర్వాల్ విధి నిర్వహణలో చండశాసనుడిగా పేరు తెచ్చుకున్నారు. వత్తిళ్ళకు తావు లేకుండా, పైరవీ కారులకు దూరంగా ఆయన విధి నిర్వహించి పలువురి ప్రశంసలను అందుకున్నారు. డ్రగ్స్ కేసులో టాలీవుడ్‌ను గఢగఢలాడించి దేశ ప్రజల దృష్టిలో పడ్డారు. తెలంగాణ ప్రభుత్వ ఆకాంక్ష మేరకు గుడంబా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో అకున్ సబర్వాల్ కీలక పాత్ర పోషించారు. బెల్టు షాపులను అరికట్టడంతో పాటు మత్తు పదార్థాల రవాణాదారుల గుండెల్లో సింహ స్వప్నంగా నిలిచారు. డ్రగ్స్ కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్న సమయంలో అకున్ సబర్వాల్ డిప్యుటేషన్ సమయం ఈ నెల 19 తో పూర్తి కావస్తుండటంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కీలకకమైన పలు కేసులు, ముఖ్యంగా డ్రగ్స్ కేసు దర్యాప్తు కొలిక్కి వస్తున్న తరుణంలో ఆయనను తప్పించడం వల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తవచ్చని అంటున్నారు. అయితే వీలైనంత తొందరగా కేసు దర్యాప్తును కొలిక్కి తెచ్చి చార్జ్‌షీట్ దాఖలు చేస్తే సరిపోతుందన్న ఉద్దేశ్యంతో ఉన్న అకున్‌సబర్వాల్ వడివడిగా దర్యాప్తును సాగిస్తున్నారు. ఎక్సైజ్ శాఖలో పని చేసింది చాలని కీలకమైనఇంటెలీజెన్స్‌లో పని చేసి తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకోవాలన్న ఉద్దేశ్యంతో ఉన్న సబర్వాల్ తనను విడుదల చేయాలని సోమేష్‌కుమార్‌ను కోరినట్లు తెలిసింది.

నవీన్‌చంద్‌కు సైబరాబాద్

అకున్ సబర్వాల్‌కు ఇంటెలీజెన్స్ బాధ్యతలను కట్టబెట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న నవీన్‌చంద్‌కు సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా నియమించనున్నట్లు తెలిసింది. సైబరాబాద్ సిపిగా పని చేస్తున్న సందీప్ శాండిల్యకు పదోన్నతి కల్పించి మరో కీలక శాఖను కట్టబెట్టనున్నారని సమాచారం.

ఉద్యోగులకు అన్యాయం జరగదు

ట్రాన్స్‌కో, జెన్కో సీఎండీ ప్రభాకర్ రావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఏ ఉద్యోగికి అన్యాయం జరగనీయం అని టీఎస్‌ట్రాన్స్‌కో, జన్కో సంస్థల సీఎండీ డి.ప్రభాకర్ రావు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీకి హామీ ఇచ్చారు. గురువారం టీఎస్‌పీఇ జేఏసీ కన్వీనర్ పి.రత్నాకర్ రావు అధ్యక్షతన విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతృత్వంలో మహాధర్నా జరిగింది. విద్యుత్ సౌధలో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎండీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకుపోతామన్నారు. విద్యుత్ సంస్థల్లో తెలంగాణ ఉద్యోగులకు ఇచ్చిన ప్రమోషన్లను తిరిగి వెనక్కు తీసుకోబోమన్నారు. ఏపీ స్థానికతగా ఉన్న ఉద్యోగుల అంశానికి సంబందించి హైకోర్టు తీర్పుపై రివ్యూ పిటీషన్ వేసేందుకు న్యాయ నిపుణల సలహాలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులకు ఏవిధమైన అన్యాయం జరగనీయం అని భరోసా ఇచ్చారు . అంతకు మందు మహాధర్నాలో కన్వీనర్ రత్నాకర్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వచ్చిన పోస్టుల్లో, ప్రమోషన్లలో ఏపీ ఉద్యోగులు ఎలా కొనసాగుతారన్నారు. ఇందుకేనా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నది అని ప్రశ్నించారు.తెలంగాణలో పదోన్నతులు పొందిన వారిని యధావిధిగా కొనసాగించాలన్నారు. విద్యుత్ ఉద్యోగుల విభజన వెంటనే పూర్తి చేయాలన్నారు. విభజన స్థానికత ప్రాతిపదికన జరగాలన్నారు.హైకోర్టు తీర్పుపై రివ్యూ పిటీషన్ వేయాలన్నారు.

విభజన హామీలపై నేడు జేఎఫ్‌సీ సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీల అమలుపై జనసేన పార్టీ ఏర్పాటు చేసిన సంయుక్త నిజనిర్ధారణ కమిటీ (జెఎఫ్‌సి) శుక్రవారం సమావేశం కానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న పరస్పర విరుద్ధ ప్రకటనల్లో వాస్తవాలు ధృవీకరించేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గత వారంలో ఈ మేరకు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాజకీయ నాయకులు, న్యాయ కోవిదులు, ఆర్థిక శాస్త్రవేత్తలు, విద్యా వేత్తలు, సామాజిక నిపుణులతో పాటు ఇతర రంగలకు చెందిన ప్రముఖులు హాజరవుతారని జనసేన ఉపాధ్యక్షుడు బి.మహేందర్‌రెడ్డి తెలిపారు.

'రూ.20వేల కోట్లతో


బీసీ సబ్‌ప్లాన్ చేపట్టాలి'



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో రూ. 20వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్‌ను ప్రవేశ పెట్టేలా చూడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బీసీల అభివృద్ధి కోసం ప్రవేశ పెడుతున్న పథకాల కోసం రూ. 10వేల కోట్లను కేటాయించాలని కోరుతూ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య గురువారం బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేషంకు వినతిపత్రం సమర్పించారు. కార్యదర్శిని కలిసిన వారిలో సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, జి రమేష్, బిఆర్ కృష్ణ, టిఆర్ చందర్, నర్సింహాగౌడ్ తదితరులు ఉన్నారు. బీసీ కార్పొరేషన్‌కు ఏటా రూ. 2వేల కోట్లు కేటాయించాలని, ఎంబీసీ కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా మరో రూ. 2వేల కోట్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

జీడీపీ,ఐఐటీ బేస్ సంవత్సరంలో మార్పు



న్యూఢిల్లీ : జీడీపీ, ఐఐటీ గణాంకాలను లెక్కించడానికి ప్రభుత్వం బేస్ సంవత్సరానికి 2017-18గా మార్చనుంది. అలాగే రిటైల్ ద్రవ్యోల్బణం బేస్ సంవత్సరాన్ని 2018కి మారుస్తున్నట్లు కేంద్రమంత్రి డీవీ సదానంద్‌గౌడ్ గురువారం నాడు చెప్పారు.వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19లో తమ మంత్రిత్వశాఖ స్థూలదేశీయోత్పత్తి లేదా జీడీపీ గణాంకాల లెక్కింపుతో పా టు పారిశ్రామికోత్పత్తి లేదా ఐఐపీ, రిటైల్ ద్రవ్యోల్బణం బేస్ సంవత్సరాన్ని మా ర్చాలని తమ ప్రభుత్వం ప్రతిపాదించిందని గౌడ చెప్పారు. దీంతో దేశంలో ఆర్థిక స్థితిగతులు ఎలా మారుతున్నాయని ఇట్టే తెలిసిపోతుందని, ఈ గ ణాంకాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తమ సంక్షేమ కా ర్యక్రమాలను అమలు చేస్తుందని బడ్జెట్ తర్వాత జరుగుతున్న సదస్సులో మాట్లాడుతూ చెప్పారు. కేంద్ర గణాంకాల మంత్రిత్వశాఖ జీడీపీ, ఐఐపీకి కొత్త బేస్ సం వత్సరాన్ని 2017-18గా ప్రతిపాదించిందని, రిటైల్ ద్రవ్యో ల్బణానికి 2018ని ప్రతిపదికగా తీసుకుంటుందని వివరించారు.

తన మంత్రిత్వశాఖ వచ్చే ఆర్థిక సం వత్స రం నుంచి అంటే ఏప్రిల్ ప్రా రంభం నుంచి గణాంకాల వ్యవస్థను మెరు గుపరు స్తామని చెప్పారు.ఖ చ్చితమైన గణాంకాలు అం దు బాటులోకి వస్తే దేశ ఆర్థిక వ్య వస్థపై పూర్తి అవగాహన కలుగుతుంద న్నారు. ది మినిస్ట్రీ ఆఫ్ స్టా ట్సిటిక్ అండ్ ప్రోగ్రాం ఇంప్లి మెంటేషన్ (ఎంఒ ఎస్‌పీఐ)కి కేం ద్ర బడ్జెట్ 2018-19 లో రూ. 4, 859 కోట్ల నిధులు కే టాం యంచిం ది.

పీఎన్‌బీలో లుకలుకలు!


- కనీస నిఘా గాలికి... • 7ఏళ్లుగా ఒకే మేనేజర్ విధుల నిర్వాహణ • విశ్లేషణలో వెల్లడవుతున్న లోపాలు



గీతాంజలి సీఎండీ మెహుల్ చోక్సీతో విజయ మాల్యా

ముంబై : ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో రూ. 11,400 కోట్ల స్కాం బహిర్గతం కావడంతో బ్యాంకులు ఒకదానిపై మరొకటి నిందారోపణలు చేసుకుంటున్నాయి. తాజా పరిణామాలను చూస్తుంటే భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ ఎంత లోపభూయిష్టంగా పనిచేస్తోందో ఇట్టే తెలిసిపోతోంది. బలహీనమైన రిస్క్ మేనేజ్‌మెంట్‌తో లోపాలు ఎక్కడ జరుగుతున్నాయో కనిపెట్టడంతో విఫలం అవుతున్నాయి. 2008 లో సబ్‌ప్రైమ్ క్రెడిట్ సంక్షోభతలెత్తడంతో అంతర్జాతీయ బ్యాంకులు కార్పొరేట్ గవర్నెన్స్‌తో పాటు బ్యాంకుల్లో జరిగే ప్రతి లావాదేవీని క్షుణ్ణంగా గమనిస్తున్నాయి. అయితే దీనికి భిన్నంగా భారతీయ బ్యాంకులు మాత్రం కనీస కొలమానాలను పాటించడంలో తీవ్రంగా విఫలం అవుతున్నాయి. బ్యాంకింగ్ రంగానికి చెందిన చాలా మంది నిపుణులు చెప్పేదేమిటంటే ముంబైలోని బ్రాడీ హౌస్ బ్రాంచీ నుంచే లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ఒయు) ఇది దాదాపు బ్యాంకు గ్యారంటీలతో సమానమైన ప్ర క్రియ.. పీఎన్‌బీ ఉన్నతాధికారులకు ఎలా తెలియకుండా ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నీరవ్ మోడీకి చెందిన కంపెనీలకు ఏడేళ్ల నుంచి పీఎన్‌బీ బ్యాంకు గ్యారంటీ ఇస్తోందంటే బ్యాంకు యాజమాన్యానికి తెలి యకుండా ఇంత తతంగం జరుగుతుందా అనే అ నుమానాలు తలె త్తుతున్నాయి. పీఎన్‌బీఐ విడుదల చేసిన బ్యాం కు గ్యారంటీని తీసుకొని భారత్‌కు చెందిన విదేశీ బ్యాంకులు ని ధులిచ్చాయి. యాక్సిస్ బ్యాంకు, అలహాబాద్ బ్యాంకులు ఇందులో ఉన్నాయి. అయితే ని ధులు పీఎన్‌బీ బ్రాంచీకి చెందిన నోస్ట్రో ఖాతా లో జమ చేశాయి. ఇక్కడ నోస్ట్రో ఖాతా అనే సరికి.. ఇతర బ్యాంకుల విదేశీ కరెన్సీ ఖాతాలను మరో బ్యాంకు ఖాతాలో జమ చేయడం (ఇక్కడ యాక్సిస్ బ్యాంకు తన విదేశీ కరెన్సీని పీఎన్‌బీ)కి అందజేసినట్లు చెప్పు కోవాల్సి ఉంటుంది. అయితే పీఎన్‌బీ జారీ చేసి న బ్యాంకు గ్యారంటీలను జనవరి 5 వరకు అం గీకరిస్తూ వచ్చింది. దీనిపై బ్యాంకు సీఈవో సు నీల్ మెహతా గురువారం మొట్టమొదటిసారి స్పందిస్తూ.. నీరవ్ మోడీ మోసపూరితంగా నకిలీ బ్యాంకు గ్యారంటీ సృష్టించి బ్యాంకు రుణాలు పొందారని చెప్పారు.అయితే పీఎన్‌బీఐ బ్యాంకు గ్యారంటీలు నకిలీవి అయితే.. గత కొన్ని సంవత్సరాలనుంచి ఈ నకిలి గ్యారంటీ సర్టిఫికేట్లను పీఎన్‌బీఐ ఎలా ఆమోదిస్తూ డబ్బు ఎలా ఇచ్చిందని గతంలో మూడు బ్యాంకులకు సీఈవోగా పనిచేసిన మాజీ బ్యాంకర్ ఒకరు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. కేవలం కొంత మందికి మాత్రమే ఈ అక్రమాలు తెలుసు అంటే నమ్మశక్యం లేదని, దీన్ని బట్టి చూస్తే బ్యాంకు యాజమాన్యం పూర్తిగా విఫలమైనట్లు స్పష్టం కనిపిస్తోందని ఆయన అన్నారు. బ్యాంకుల్లో ప్రస్తుతం నోస్ట్రో ఖాతాలు సాధారణ ఖాతాలు మాదిరిగా పనిచేస్తున్నాయి, అన్నీ బ్రాంచీలకు విదేశీమారకద్రవ్యం ఎక్స్ఛేంజీలో డీల్ చేసుకునేందుకు ఆర్‌బీఐ అనుమతులు మంజూరు చేసింది. బ్యాంకు నకలీ గ్యారంటీ పత్రాలను తీసుకుని బ్యాంకులు రుణాలు మంజూరు చేసిన సం ఘటనలు గతంలో కూడా జరిగాయని పలు వురు సీనియర్ చార్టర్డ్ అకౌంటెట్ అన్నారు. బ్యాంకులు అంతర్గత నిఘా రోజు వారి లావాదేవీలపై పట్టుఉండాలని, బ్యాంకుల్లో ఎలాంటి మోసాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం బ్యాంకులు బాధ్యత అని చార్టర్డ్ అకౌంటెంట్లు చెబుతున్నారు.కేంద్ర విజిలెన్స్ కమిషన్ నిబంధనల ప్రకారం సంస్థల్లో పనిచేసే చీఫ్ విజిలెన్స్ అధికారులు తమ సంస్థల్లో కీలక పదవుల్లో ఉన్నవారిపై పక్కాగా నిఘా ఉంచాలనే నిబంధనలున్నాయి. అదీ కాకుండా ప్రతి రెండు లేదా మూడు సంవత్సరాల తర్వాత వారిని బదలీ చేయాలనే నిబంధనలున్నాయి. అం తర్జాతీయ బ్యాంకులు అయితే బ్యాంకులో జరిగే లావా దే వీల పై సమీక్షజరపాలనుకుంటే ఆయా ప దవుల్లో ఉన్న అధికారులను సెలవుపై వెళ్లమం టుంది. అయితే మన భారతీయ బ్యాంకుల్లో ఈ సంప్రదాయం ఇంకా అమల్లోకి రాలేదు. ఇక్కడ ఆశ్చర్యం కలిగించే అంశం ఏమిటంటే స్కామ్ జరిగిన పంజాబ్ నేషనల్ బ్యాంకు బ్రాంచీ మేనేజర్ గత ఏడు సంవత్సరాల నుంచి అదే హోదాలో అదే బ్రాంచీలో ఈ ఏడాది జనవరిలో రిటైర్మెంట్‌వరకు కొనసాగారు.

గతకొన్ని సంవత్సరాలనుంచి ఆయనే ఈ నకిలీ బ్యాంక్ గ్యా రంటీ తతంగాన్ని నిర్వహించారు. దీన్ని బట్టి చూస్తే భారతీయ బ్యాంకర్ల రిస్కు మేనేజ్‌మెంట్ ఎలా ఉందో అద్దంపడుతోందని చెబుతు న్నారు. ఇప్పటికీ భారతీయ బ్యాంకులు నిబం ధనలు గాలికి వదిలేస్తున్నాయని సీనియర్ బ్యాంకర్ ఒక ఆవేదన వ్యక్తం చేశారు.



నీరవ్‌మోడీ లగ్జరీ బొటిక్

ఎల్ఓయులు ఎప్పుడో అమ్మేశాం : యాక్సిస్ బ్యాంకు

తాజాగా పీఎన్‌బీ రూ.11,400 కోట్ల స్కాం బయటపడ్డం.. పీఎన్‌బీ జారీ చేసిన గ్యారంటీను కొన్ని ప్రైవేట్ బ్యాంకులతో పాటు పీఎస్‌యు బ్యాంకుల ఆమోదించి నీరవ్ మోడీ ఖాతాకు నగదు బదలీ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై యాక్సిస్ బ్యాంకు గురువారం స్పందించింది. యాక్సిస్ బ్యాంకు సెకండరీ మార్కెట్ లావాదేవీల్లో చురుకుగా పాల్గొంటోందని స్పష్టం చేసింది. పీఎన్‌బీ జారీ చేసిన గ్యారంటీలను ఎప్పుడో విక్రయించేశామని తెలిపింది. తాజాగా మీడియాలో వస్తున్న వార్తలను గురించి ప్రస్తావిస్తూ.. బ్యాంకింగ్ రంగంలో లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్స్ (ఎల్ఓయు) లావాదేవీలు జరుగుతుంటాయి. బ్యాంకులు జారీ చేసిన ఎల్‌వోయులు విదేశీ బ్రాంచీలనుంచి వస్తుంటాయి. వాటిని ఏదైతే బ్యాంకు జారీ చేసింది ఆ మొత్తాన్ని నోస్ట్రో ఖాతాలో జమ చేస్తామని యాక్సిస్ బ్యాంకు పేర్కొంది. పీఎన్‌బిజారీ చేసిన ఇలాంటి ఎల్ఓయులను స్విఫ్ట్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా బ్యాంకు గ్యారంటీ అసలుదా లేక నకిలీదా గుర్తించి తర్వాత చెల్లింపులు చేసేవారమని బ్యాంకు బీఎస్ఈకి సమాచారం అందించింది. ఇదిలా ఉండగా ఇలాంటి బ్యాంకు గ్యారంటీలను యాక్సిస్ సెకండరీ మార్కెట్లో విక్రయించుకుని తమ డబ్బు తాము వసూలు చేసుకొనేది. ప్రస్తుతం పీఎన్‌బీఐ జారీ చేసిన బ్యాంకు గ్యారంటీలను విక్రయించేశామని బీఎస్ఈకి సమాచారం అందించింది.

సిబ్బంది చేతిలో బకరాలయ్యాం : పీఎన్‌బీ

ఇదిలా ఉండగా పీఎన్‌బీఐ మొత్తం మూడు కంపెనీలను దోషులుగా పేర్కొంది. అవి సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్స్, డైమండ్ ఆర్ యూఎస్ ఇవన్నీ నీరవ్‌మోడీకి చెందిన అతి ఖరీదైన నగల దుకాణాలు. ఆయన షోరూంలు న్యూయార్కు నుంచి హాంగ్‌కాంగ్ వరకు విస్తరించి ఉన్నాయి. ఫోర్బ్స్ ర్యాంకింగ్ ప్రకారం ఆయన సంపద 173 కోట్ల డాలర్లు. మోడీ కంపెనీలు తమ సిబ్బందితో కుమ్మక్కాయ్యాయని, విదేశీ బ్రాంచీల్లో పనిచేస్తున్న ఇతర బ్యాంకు అధికారులపై అనుమానాలున్నాయని, వీరంతా నకిలీ గ్యారంటీలు తీసుకొని ఉదారంగా రుణాలు మంజూరు చేశాయని పీఎన్‌బీ ఆరోపిస్తోంది. మోడీ మామ మెహుల్ చోక్సీ.. గీతాంజలి జెమ్స్, గిలీ ఇండియా, నక్షత్ర కంపెనీ ప్రమోటర్‌ను కూడా దోషిగా పేర్కొంది. అయితే చోక్సీ మాత్రం ఈ స్కాంతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. సీబీఐ కేసునుంచి తన పేరు తప్పించడానికి న్యాయపోరాటం చేస్తానని అన్నారు. ఇదిలా ఉండగా పీఎన్‌బీ ఇద్దరు సిబ్బందిపై క్రిమినల్ కేసుతో పాటు మరికొందరిని సస్పెండ్ చేసింది. రాయిటర్స్ వార్తా సంస్థ ఇద్దరు ఉద్యోగులను పలుకరించాలంటే వారు అందుబాటులోకి రాలేదు.

మాల్యా వారంవారం అలవెన్స్
మూడు రెట్లు పెరిగింది

- బ్రిటన్ కోర్టు ఆమోదం
- వారానికి 18వేల పౌండ్ల అలవెన్స్



లండన్ : లిక్కర్‌కింగ్ విజయ్‌మాల్యాకు బ్రిటన్ కోర్టులో కాస్తా ఊరట లభించింది! ప్రస్తుతం ఆయన ఇస్తున్న వారం వారం అలవెన్స్‌ను బ్రిటన్ హైకోర్టు మూడు రెట్లు 18వేల పౌండ్లు పెంచుతూ తాజాగా ఆర్డర్ జారీ చేసింది. మాల్యా భారత్‌లో కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ పేరుతో రూ.9వేల కోట్ల వరకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఎగ్గొట్టి బ్రిటన్ పారిపోయారు. మాల్యాను భారత్ రప్పించడానికి భారత ప్రభుత్వం బ్రిటన్ ప్రభుత్వాన్ని కోరడంతో పాటు బ్రిటన్ కోర్టు దావా వేసింది. దీంతో బ్రిటన్ కోర్టు ప్రపంచవ్యాప్తంగా మాల్యాకు చెందిన 150 కోట్ల డాలర్ల ఖాతాలను స్తంభింపజేసింది. దీంతో మాల్యా న్యాయవాదులు బ్రిటన్ హైకోర్టును ఆశ్రయించి ఆయన రోజు వారి ఖర్చులకు అలవెన్స్ పెంచాలని విన్నవించుకుంది. దీనికి కోర్టు అనుకూలంగా స్పందించింది. జనవరి 30 తేదీ ఇచ్చిన ఆర్డర్‌లో జస్టిస్ రాబిన్ నోవెల్స్ మాల్యాకు రోజు వారి ఖర్చుల కోసం వారానికి 18,325.31 పౌండ్ల వరకు బ్యాంకుల నుంచి విత్‌డ్రాయల్స్ చేసుకోవడానికి అనుమతించింది. ఇంతకం ముందు ఆయనకు కోర్టు వారానికి 5,000 పౌండ్ల వరకు విత్‌డ్రాయల్స్ అనుమతించిన విషయం తెలిసిందే.

ఆపిల్ నుంచి మూడు ఐఫోన్లు

- ఈ ఏడాది చివరి నాటికి ధర.699 డాలర్లు



శాన్‌ఫ్రాన్సిస్కో : ఈ ఏడాది ఆపిల్ కొత్తగా మూడు ఐఫోన్‌లను గ్లోబల్ మా ర్కెట్లకు పరిచయం చేయ నుంది. ఒక దానితో ఒకటి పోటీ పడేలా ఫోన్‌లు ఉంటా యని తైవాన్ బిజినెస్ గ్రూపు కెజీఐ సెక్యూరిటీస్ తెలిపిం ది. 6.1 అంగుళాల ఐఫో న్‌ను 100 మిలియన్ యూనిట్లను విక్రయించాలని కం పెనీ లక్ష్యంగా పెట్టుకుంది. 6.1 అంగుళాల ఎల్‌సీడీ ఐఫోన్ .. ఐఫోన్ ఎక్స్‌లా పోలి ఉంటుంది. ఫుల్‌స్క్రీన్ డిజై న్ ఉంటుంది. అయితే ఐఫోన్ ఎక్స్‌తో పోల్చుకుంటే ధర కాస్తా అందుబాటులో ఉంటుంది. కొత్త ఐఫోన్ .. ప్రస్తుతం ఐఫోన్ 8, ఐఫోన్ 8 ఫ్లస్ స్థానాన్ని ఆక్ర మి స్తుంది. దీని ధర అతి తక్కువగా 699 డాలర్లుగా ఉం టుందని బుధవారం నా డు విశ్లేషకులు చెప్పారు. ఈ మూడు ఫోన్లకు 'ఫేస్ ఐడి' ఫీచర్ కలిగి ఉంటుందన్నారు.

కొనుగోళ్లతో కళకళ

ముంబై : టోకు ద్రవ్యోల్బణం గణాంకాలు తగ్గముఖం పట్టడంతో పాటు బ్లూచిప్ షేర్లు ప్రస్తుతం అందుబాటు ధరల్లో ఉన్నందున మదుపరులు ఎంపిక చేసిన షే ర్లను కొనుగోలు చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,400కోట్ల భారీ స్కాం బయటపడ్డంతో దీని షేరు గురువారం నాడు మరో 12 శాతం క్షీణించింది. దేశంలోని అతి పెద్ద పీఎస్‌యు బ్యాంకుల్లో పీఎన్‌బీ రెండవ స్థానంలో ఉంది. రెండు రోజుల్లో రూ.8,000 కోట్ల మార్కెట్ క్యాప్ ఆవిరైంది. ఈ మొత్తం ఎంతంటే పూర్తి సంవత్సరం నికరలాభంతో పోల్చుకుంటే ఆరు రెట్లు ఉంటుంది. మిగిలిన బ్యాంకింగ్ షేర్లు కాస్తా కోలుకున్నాయి. బీఎస్ఈ 30 షేర్ల సూచి 141.52 పా యింట్ల లాభపడి 34,297.47 వద్ద, నిఫ్టీ 44.60 పాయింట్లు లాభపడి 10,545.50 వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో 10,618.10 మార్కుకు ఎగబాకాయి. వీటితో పా టు మార్కెట్లకు అనుకూలించే అంశాల విషయానికి వస్తే టోకు ద్రవ్యోల్బణం ఆరు నెలల కనిష్టానికి 2.84 శాతానికి దిగివచ్చింది. డిసెంబర్ త్రైమసిక ఫలితాలు కూ డా ప్రోత్సాహకరంగా ఉండటంతో ఇన్వెస్టర్లు బ్లూచిప్ షేర్లు కొనుగోళ్ల వైపు మొ గ్గు చూపారు. విదేశీ ఫోర్టు పోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ)లు బుధవారం నాడు రూ. 728.21 కోట్ల షేర్లు విక్రయిస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.152.39 కోట్ల షేర్లను విక్రయించాయి. అమెరికా ద్రవ్యోల్బణం 2.1 శాతానికి ఎగబాకినా.. వినియోగవస్తువుల అమ్మకాలు బలహీనంగా ఉన్నా గ్లోబల్ మార్కెట్లు మాత్రం లాభాలతో ముగిశాయి. బీఎస్ఈలో అత్యధికంగా ఐసీఐసీఐ బ్యాంకు 3.15 శాతం పెరిగితే.. ఇన్ఫోసిస్ 1.47 శాతం వృద్ధి చెందింది. లాభాలను మూటగట్టుకున్న ఇ తర షేర్లు ఇలా ఉన్నాయి. పవర్‌గ్రిడ్, ఓఎన్‌జీసీ, బజాజ్ ఆటో, హెచ్‌డీఎఫ్‌సీ లి మి టెడ్, ఎస్‌బీఐ, హెచ్‌యూఎల్, ఎంఅండ్ఎం, ఐటీసీ, డాక్టర్ రెడ్డీస్, సన్‌ఫార్మా, టీసీఎస్, రిల్, మారుతి సుజుకి, ఎన్‌టీపీసీలు 1.46 శాతం వరకు లాభపడ్డాయి. దీనికి వ్యతిరేకంగా హీరోమోటోకార్ప్, టాటాస్టీల్, భారతి ఎయిర్‌టెల్, ఎ ల్ండ్‌టి, విప్రో, కొటక్ మహీంద్రా బ్యాంకు, ఏషియన్ పెయింట్స్ నష్టపోయిన వా టిలో ఉన్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకుల్లో రూ.11,400 కోట్ల స్కాం బయ టపడ్డంతో దాని ప్రభావం గీతాంజలి జెమ్స్‌పై పడి 19.97 శాతం క్షీణించింది. మి గిలిన నగల స్టాక్‌లు పీసీ జువెలర్స్, త్రిభువన్‌దాస్ భీంజీ జవేరీ, రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ 5.31 శాతం వరకు నష్టపోయాయి. నెస్లే ఇండియా షేర్లు 4.28శాతం వరకు లా భపడింది. కంపెనీ నికరలాభం క్యూ4లో 40శాతం వృద్ధి చెందడమే దీనికి కార ణం. 2017లో అమ్మకాలు రూ.10వేల కోట్లు దాటాయి. టెలికం, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, క్యాపిటల్‌గూడ్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విద్యుత్, హెల్త్‌కేర్, ఆటో రంగానికి చెందిన షేర్లు 1.16శాతం వరకు నష్టపోయాయి. గ్లోబల్ మార్కెట్ల లాభాలతో ముగిశాయి.

6 నెలల కనిష్టానికి టోకు ద్రవ్యోల్బణం

- జనవరిలో 2.84శాతానికి
- కూరగాయలు, ఇంధన ధరలు పెరిగినా...
- ఆదుపులోనే ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : టోకు ద్రవ్యోల్బణం (డబ్ల్యుపీఐ) వరుసగా రెం డో నెల తగ్గముఖం పట్టింది. జనవరిలో ఆహారం, కూరగాయలు, ఇంధన ధరలు పెరిగినా.. టోకు ద్రవ్యోల్బణం మాత్రం 2.84 శాతానికి దిగివచ్చిందని కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. టోకు ద్రవ్యోల్బణం...సాధారణంగా పెద్దమొత్తంలో సరకు కొనుగోలు చేసే వ్యాపారులకు, అటు నుంచి షాపులకు వెళ్లే ధర గా చెప్పుకోవచ్చు. డిసెంబర్ నెల టోకు ద్రవ్యోల్బణం 3.58 శాతానికి ఎగబాకింది. కాగా నవంబర్‌లో తొమ్మిది నెలల గరిష్ఠానికి 3.93 శాతానికి చేరింది. వివరాల్లోకి వెళితే ప్రాథమిక వస్తువులు టోకు ధరల సూచిలో ఐదవ వంతు ఆక్రమిస్తాయి. జనవరి ద్రవ్యోల్బణం మొత్తానికి చూస్తే 2.37 శాతం నమోదు కాగా.. క్రితం ఏడాది ఇదే జనవరి నెలలో 1.98 శాతంగాను, డిసెంబర్ నెలలో 3.86 శాతానికి ఎగబాకింది. తాజా గణాంకాలను బట్టిచూస్తే ప్రాథమిక వస్తువులు, ఆహార పదార్థాల ధరలు, ముఖ్యంగా కూరగాయలు ... బంగాళాదుంపలు, ఉల్లి, గుడ్లు, పాలు, పండ్ల ధరలు క్రమంగా పెరుగుతూపోయాయి. దీనికి వ్యతిరేకంగా గోధుమ, పప్పుల ధరలు గతేడాదితో పోల్చుకుంటే తగ్గముఖం పట్టాయి. మొత్తానికి చూస్తే 2018 జనవరి టోకు ద్రవ్యోల్బణం అంచనా కంటే చాలా తక్కువగానే నమోదయ్యిందని చెప్పవచ్చు. దీనికి ప్రధాన కారణం ఆహార పదార్థాల ధరలు కూరగాయలు, పప్పులు, చక్కెర ధరలు తగ్గము ఖం పట్టగా... దీనికి వ్యతిరేకంగా ఇంధనం, విద్యుత్ ధరలు స్వల్పంగా పెరిగాయని ఇక్రా ప్రిన్సిపల్ ఆర్థికవేత్త ఆదితి నాయర్ చెప్పారు. కమాడిటి ధరలు క్రమంగా పెరగడంతో పాటు దాని ప్రభావం టోకు ద్రవ్యోల్బణంపై కనిపించిందని నాయర్ చెప్పారు. జనవరిలో కూరగాయల ధరలు 40.77 శాతం పెరి గితే డిసెంబర్‌లో 56.46 శాతం పెరిగాయి.. జనవరి 2017లో నెగెటివ్ వృద్ధి (-23.49)గా నమోదైంది. ఉల్లి ధరలుమాత్రం జనవరిలో 194 శాతం పెరిగితే.. ఏడాది క్రితం (-)36.08 శాతం క్షీణించాయి. అ కాల వర్షాల కారణంగా ఉల్ల సరఫ రా దెబ్బ తింది.



దీంతో ఉల్లి రిటైల్ ధరలు పెరిగాయి. ఏడాది పాటు బంగాళాదుపంపల ధరలు నెగెటివ్ (తగ్గితే) జనవ రిలో మాత్రం పెరిగాయి. జనవరిలో 8.68 శాతం పెరిగితే ఏడాది క్రితం (-)16.67 శాతం తగ్గముఖం పట్టాయి. కేంద్రబడ్జెట్ 2018లో ప్రభుత్వం టమోటా, ఉల్లి, బంగాళాదుంపలు దేశంలోని మారుమూల ప్రాంతాల్లో అందరికి లభ్యమయ్యేలా చూస్తామని ప్రకటించింది. ధరల్లో పెద్ద వ్యత్యాసం లేకుండా చూస్తామని, దీంతో రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని తెలిపింది. ఆహారేతర వస్తువుల విషయానికి వస్తే జనవరిలో (-)1.23 శాతానికి దిగివస్తే.. ఏడాది క్రితం 0.74 శాతంగా నమోదుకాగా... డిసెంబర్‌లో (-)0.34శాతంగా నమోదైంది. ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం జనవరిలో 4.08 శాతంగా నమోదు కాగా.. ఏడాది క్రితం 16.67శాతం , డిసెంబర్‌లో 9.16 శాతంగా నమోదైంది. ఇక పెట్రోల్ విషయానికి వస్తే జనవరి నుంచి క్రమంగా తగ్గముఖం పడుతున్నాయి. జనవరిలో 1.2 శాతం వృద్ధి కనిపిస్తేఅదే డిసెంబర్‌లో 8.8 శాతం పెరిగింది.

పప్పుల ధరలు కూడా క్రమంగా తగ్గముఖం పడుతూ వస్తున్నాయి... ఏడాది కనిష్ఠానికి దిగివచ్చాయి. గత వారం ప్రభుత్వం విడుదల చేసిన రిటైల్ ద్రవ్యోల్బ ణంలో కూడా ఇదేపరిస్థితి కనిపించింది. జనవరి రిటైల్ ద్రవ్యో ల్బణం 5.07 శాతానికి దిగివచ్చింది. ము ఖ్యంగా పం డ్లు, కూరగాయలు,చమురు ధరలుతగ్గ ముఖం పట్ట డమే కారణమని తెలిపింది. ప్రస్తుతం ద్ర వ్యోల్బణం గణాంకాలు ఆర్‌బీఐకి అత్యంత కీలకం.. అంచనా కంటే ద్రవ్యోల్బణం పెరిగితే రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లలో కోత విధించడం ఇబ్బందికరంగా మారు తుంది. ప్రభుత్వం వృద్ధిరేటు పుంజుకోవడానికి, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి వడ్డీరేట్లను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఆర్‌బీఐపై ఒత్తి డి తెస్తుంటాయి. గత కొన్ని నెలల నుంచి దేశ ఆర్థిక వ్య వస్థ క్రమంగా పుంజుకుంటున్న సంకేతాలు కనబ డు తున్నాయి.

ఫుజిత్సు జనరల్ ఏసీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, వినియోగదారుల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా ఫుజిత్సు జనరల్ కంపెనీ సరికొత్త మోడల్ ఎయిర్ కండిషనర్లను మార్కెట్‌లోకి అందుబాటులోకి విడుదల చేసింది. ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన తమ సంస్థ జనరల్, క్లాసిక్ ప్రీమియం బ్రాండ్స్ ఎయిర్ కండిషనర్లు సామాన్యులకు, ఉన్నత వర్గాలకు అందుబాటులోకి తెచ్చామని ఈజీపీఎల్ సంస్థ సీఈవో ఎం.ఇజాజుద్దీన్ గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. జనరల్ కేవలం సూపర్ ప్రీమియం బ్రాండ్ మాత్రమే కాదని, మార్కెట్‌లో 4శాతం వాటా కలిగి ఉందని చెప్పారు. భారత్‌లో మార్కెటింగ్ అవకాశాలను పరిగణలోకి తీసుకుని ఫుజిత్సు జనరల్ భారత అనుబంధ సంస్థ ఈజీపీఎల్‌తో కలిసి దేశీయ మార్కెట్‌లో ఈ ఉత్పత్తులను వినియోగదారులకు అందించనుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం దేశంలో తమకు 2500 మంది డీలర్లు, 350 సర్వీస్ ఫ్రాంచైజీలతో నెట్‌వర్క్ ఉందని ఫుజిత్సు కంపెనీ ఇప్పటి వరకు 26 రకాల ఏసీలను విడుదల చేసిందని ఇజాజుద్దీన్ తెలిపారు. ఇందులో 14 రకాల ఏసీలు ప్రత్యేకించి 52 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాల్లో వినియోగించేందుకు అనువుగా రూపొందించామని చెప్పారు. అన్ని రకాల టెక్నాలజీలతో రూ పొందించిన ఇన్వర్టర్ ఏసీ లు రూ.25,200 నుంచి 1,52,250 వరకు వినియోగదారులకు అందు బాటులో ఉన్నాయని చె ప్పారు. జపాన్‌లోని ఫుజిత్సు జనరల్ ఇండియా అధ్యక్షుడు ఎట్సూరో సైటో, ఈజీపిఎల్ మార్కె టింగ్ విభాగం హెడ్ కేసీ పూవయ్యా కూడా పాల్గొన్నారు.



ఆటో ఎక్స్‌పో 2018 సమాప్తం

- 605,715 సందర్శన
- చివరి ఎక్స్‌పోతో పోల్చుకుంటే తక్కువే
- ఎక్స్‌పో విజయవంతం : సియావమ్



న్యూఢిల్లీ : ఢిల్లీలో జరిగిన 14వ ఎడిషన్ ఆటో ఎక్స్‌పో ఎగ్జిబిషన్ బుధవారంతో ముగిసింది. 119 ఎగ్జిబిటర్లు సుమారు 500 ప్రొడక్టుల కంటే ఎక్కువనే ఇక్కడ ప్రదర్శించాయి. ఈ ఏడాది మొత్తం 605,175 మంది సందర్శకులు ఎక్స్‌ఫోను సందర్శిస్తే.. రెండేళ్ల క్రితం జరిగిన ఎక్స్‌ఫో 601.914 మంది సందర్శించారు. రెండేళ్ల క్రితంతో పోల్చుకుంటే సందర్శకులు స్వల్పంగా తగ్గారని చెప్పవచ్చు. 53 కార్ల ఉత్పత్తిదార్లు కొత్త ప్రొడక్టులతో పాటు ప్రస్తుతం మార్కెట్లో కొనసాగుతున్న ప్రొడక్టులను 120 వరకు ప్రదర్శించారు. 22 కొత్త కార్లు, ద్విచక్ర వాహనాలు 81 ప్రొడక్టులు, వాటిలో ఆటో విడిభాగాలను కూడా ఆవిష్కరించాయి. వీ టితో పా టు 18 కొత్త కాన్సెప్ట్ వాహనాలను ప్రదర్శనకు ఉంచాయి. సొసైటీ ఆఫ్ ఇం డియన్ ఆటో మొ బైల్ మా న్యూఫ్యాక్చరర్స్ (సి యామ్) విడు దల చేసి న ప్రకటనలో 14 కొత్త బ్రాం డ్‌లను ఆవిష్కరిం చ డం జరిగిందని, వాటిలో కియా మోటార్స్ ఇండియా, ఇండియా కావాసాకీ మో టార్స్, క్లీవ్‌ల్యాండ్ సైకిల్‌వెర్క్స్, వీటితో పాటు 25 ఎలక్ట్రిక్ వాహనాలు ప్రద ర్శించబడ్డాయి. 11 స్టార్టప్‌లు కూడా మొ ట్టమొదటిసారి ఎంట్రీఇచ్చాయి. ఆటోఎక్స్ మోటార్ షో -2018ను గత కొన్ని సంవత్సరాల నుంచి నిర్వ హించడంతో భారత్‌కు ఒక బ్రాండ్ ఇమేజ్‌ను తీసు కొచ్చామని సియామ్ డైరెక్టర్ జనరవల్ విష్ణుమాథూర్ చెప్పారు.



భారతీయ ఆటో ఓుబైల్ పరిశ్రమకు ఇది చక్క టి ప్లాట్‌ఫాం అని తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిం చుకోవడానికి అవకాశం చిక్కుతుందని, కొత్త టెక్నా లజీతో పాటు ప్రపంచస్థాయి ప్రొడక్టులను ప్రద ర్శించుకోవచ్చునని పేర్కొన్నారు. మొత్తా నికి ఆటోఎక్స్-2018 విజయవంతం గా ము గిసిందని ఆయన సంతృప్తి వ్యక్తం చే శారు. తమ అంచనాకు తగ్గట్టే సందర్శ కులు వచ్చా రని అన్నారు.



అయితే రెండేళ్ల క్రితం తో పోల్చుకుంటే ఈ సారి సం దర్శకుల సంఖ్య తగ్గ డానికి ప్రధానకారణం ఏమిటని ప్రశ్నిం చగా... ప్రపం చవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఫోక్స్‌వ్యాగెన్ గ్రూ పు, జాగ్వార్ ల్యాండ్ రోవర్ లిమిటెడ్, నిస్సాన్ ఇండియా ప్రై వేట్ లిమిటెడ్, ఫో ర్డ్ మోటార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ట్రియంఫ్ మో టార్ సైకిల్, ఐచర్ ఇండియా లిమిటెడ్ లాంటి అ తి పెద్ద కం పెనీలు ఈ సారి ప్రదర్శనకు దూరంగా ఉన్నా యని అందుకే సందర్శకులు తగ్గి ఉంటారని ఆయన పేర్కొ న్నా రు.. అయితే షోషల్ మీడియాలో మంచి స్పందన లభిం చిందన్నారు.

భూ రికార్డులకు జియో రెఫరెన్స్


గ్రామ పటాలు, గ్రాఫికల్ రికార్డుల డిజిటలైజేషన్‌తో నూతన పంథా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రతీ ఇంచు భూమికీ ఆధునిక జియో రిఫరెన్స్ జోడవనుంది. తద్వారా ఆయా భూముల చిరునామా చిటికెలో ప్రత్యక్ష్యం కానుంది. దీంతో భూ రికార్డుల నిర్వహణ మరింత ఆధునికం కానుంది. అద్భుత రీతిలో గ్రామ పఠాలు, టిప్పన్‌లు రూపొందుతున్నాయి. దీంతో రెవెన్యూ వ్యవహారాల్లో దేశంలో ఎక్కడాలేని స్పష్టత తెలంగాణలో అందుబాటులోకి రానుంది. ముఖ్యమంత్రి ఆశించిన భూ నిర్వహణ త్వరలో సాకారం కానున్నది. భూ దస్త్రాల ప్రక్షాళన పూర్తికావడంతో ప్రతీ భూ కమతానికి జియో రిఫరెన్స్ ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. టిప్పన్‌లను డిజిటలైజ్ చేసి వాడుక భాషలో వెలుగులోకి తేనున్నారు. గతంతో మరాఠా, ఉర్దూ భాషల్లో ఉన్న టిప్పన్‌లను తెలుగులోకి అనువదిస్తున్నారు. ఇందుకు గ్లోబల్ ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఐఎస్)ను వినియోగించనున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో భూములకు గ్రాఫికల్ రికార్డులు డిజిటలైజ్ చేసేందుకు రెవెన్యూ శాఖ సిద్ధమైంది. గ్రామ పటం, టిప్పన్‌లను డిజిటలైజ్ చేసేందుకు ప్రత్యేక ప్రాజెక్టును ప్రారంభించింది. సీఎంఆర్ఓ ప్రాజెక్టు కింద 10829 గ్రామాలకుగానూ 10,559 గ్రామాల మ్యాపుల డిజిటలీకరణ పూర్తి చేశారు. ఆ తర్వాత ప్రతీ భూ కమతానికి లెక్క చెప్పేలా దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రతీ సర్వే నెంబర్‌లోని భూమిని నేరుగా గూగుల్ ఎర్త్‌లో చూసుకునేలా సరికొత్త సాంకేతికత అందుబాటులోకి వస్తోంది. దేశంలో ఎక్కడా లేని రీతిలో సేత్వారీ, డిజిటలైజ్డ్ విలేజ్ మ్యాపులను సర్వే సెటిల్‌మెంట్, భూమి రికార్డుల శాఖ సిద్ధం చేస్తోంది. తాజాగా తెలంగాణలో వెలుగులోకి వస్తున్న భూ అక్రమాల నేపథ్యంలో సరన్వే సెటిల్‌మెంట్ శాఖ అప్రమత్తమైంది. తొలుత భూ సమగ్ర సర్వే చేపట్టాలని యోచించినా రాష్ట్రప్రభుత్వ అనుమతి లేనికారణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అక్రమాలకు తావులేకుండా రాష్ట్రంలోని ప్రతీ ఇంచు భూమితో సేత్వారీ అప్‌డేట్ అవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004నుంచి 2009 మధ్య కాలంలో సేత్వారీ రికార్డులను కొంతమేరకు స్కానింగ్ చేసి అప్‌డేట్ చేశారు. ఆ తర్వాత సదరు కార్యాచరణను ఆపివేసిన అధికారులు వాటిని డిటిటలైజ్ చేయడాన్ని పూర్తిగా విస్మరించారు. ఇప్పుడు మేల్కొన్న తెలంగాణ భూమి రికార్డుల శాఖ రాష్ట్రం మొత్తం యూనిట్‌గా ప్రత్యేక నెంబర్ల వారీగా సేత్వారీ అప్‌డేట్ చేస్తోంది. తద్వారా 10829 గ్రామాల్లో సర్వే నెంబర్ల వారీగా ఒక్కో గ్రామపు భూములన్నీ ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. వీటిని కాస్రా పహాణీలో తెప్‌డేట్ చేసిన తర్వాతే ఏది ప్రభుత్వ భూమి...ఏది పట్టా భూమి అనేది క్షణాల్లో తెలిపోనుంది.

విలేజ్ మ్యాపులు పూర్తి

విలేజ్ మ్యాప్‌ల డిజిటలైజేషన్‌ను కూడా ఇదే సందర్భంగా ఎస్ఎస్ఎల్ఆర్ డిపార్ట్‌మెంట్ శాఖ వేగవంతం చేస్తోంది. 10800 గ్రామాల్లో పనులను ఆరంభించింది. గతంలో డేటాబేస్‌లో తెలుగు, ఉర్దూ, మరాఠా, ఇంగ్లీష్‌లో ఉన్న రికార్డులను తెలుగు, ఇంగ్లీషలలో రూపొందించాలని, ఇందుకు అనువుగా డిజిటలైజేషన్‌తో మరింత సులువు చేయాలన్న ప్రయత్నాలను వేగవంతం చేశారు. తద్వారా మ్యాపులను కొత్తగా గీస్తున్నారు. ఇందుకు తెలంగాణ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ సహాయంతో డేటా వెక్టోరైస్ చేసి జియో రిఫరెన్స్‌ను వర్తింపజేయనున్నారు. ఆ తర్వాత రాష్ట్రంలోని ప్రతీ ఇంచు భూమి సర్వే నెంబర్, గ్రామం పేరు కొట్టగానే క్షణాల్లో వీక్షించవచ్చు. ఇప్పటికే ఈ కసరత్తులో భాగంగా వేలాది మ్యాపులను అప్‌లోడ్ చేశారు. మ్యాపులను వెబ్‌ల్యాండ్‌లో అప్‌లోడ్ చేయడంద్వారా సర్వే నెంబర్ల ద్వారా లొకేషన్‌ను చూడవచ్చు. కేంద్ర ప్రభుత్వ సహకారిత భూ నక్ష ద్వారా ఆన్‌లైన్‌లో మ్యాప్‌పై క్లిక్ చేస్తే సర్వే నెంబర్‌తో ఉన్న భూమి, శాటిలైట్ ఇమేజీతో ప్రత్యక్షమవుతుంది. ఆయా భూమి హద్దులతో సహా కనిపించనుంది. దీంతో భూ రికార్డులు ఎలా ఉన్నాయి...ఎవరి పేరు మీద ఉన్నాయి....హద్దుల స్థితిగతులు...వంటివన్నీ ప్రాంతంతో సహా కనిపిస్తాయి. భూమి యజమాని పేరు, ఫోటో, ఆయా సర్వే నెంబర్‌లో ఉన్న మొత్తం భూముల బిట్లు, విస్తీర్ణం, పట్టాదార్ల వివరాలు, పొజిషన్ వంటివన్ని వెలుగులోకి వస్తాయి. దీంతో భూ సమస్యలు అనేకం ప్రాథమిక స్థాయిలోనే నివారించేందుకు వీలు కల్గుతుంది.

చెరువుల్లో నిర్మాణాలపై హైకోర్టు ఆందోళన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : చెరువులు, కుంటలను ఆక్రమించి ఇళ్లను నిర్మించడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ చెరువులకు పది కిలోమీటర్ల పరిధిలో నిర్మాణాలను నిషేధిస్తూ 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 111 వ్యవహారంలో మార్చి రెండో వారంలో తుది విచారణ జరుపుతామని హైకోర్టు స్పష్టం చేసింది. జీవో 111 వివాదంపై దాఖలైన పిటిషన్లలో మార్చి మొదటి వారంలోగా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులందరినీ హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.అమర్ నాథ్ గౌడ్ లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. జీవో 111 లోని మార్గదర్శకాల మేరకు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ పరిధిలో పది కిలోమీటర్ల వరకు ఆక్రమణలు, ఎలాంటి నిర్మాణాలు జరకుండా చూసేలా అధికారులను ఆదేశించాలని అభ్యర్థిస్తూ కొన్ని పిటిషన్లు, మరో వైపు జీవో 111 చట్టబద్ధతను సవాలు చేస్తూ మరి కొన్ని వ్యాజ్యాలు హైకోర్టులో దాఖలయ్యాయి. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ తరపు స్టాండింగ్ కౌన్సెల్ రామారావు వాదనలు వినిపిస్తూ..ఆ జీవో పరిధిలో శాస్త్రీయ సర్వే నిర్వహించేందుక ు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీ నుంచి నివేదికలు అందాల్సి ఉందన్నారు. ఈ వ్యాజ్యాలపై తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్ రెడ్డి వాదనలు వినిపించనున్నారని నివేదించారు.

రేపు జాబ్ మేళా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రముఖ మానవ వనరుల సంస్థ హెచ్ఆర్ స్క్వేర్ ఆధ్వర్యంలో మెగా బిఎస్సీ సైన్స్ ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ మేనేజర్ అనిత తెలిపారు. ఫార్మాస్యూటికల్ ప్రొడక్షన్ రంగంలో ఉన్న సుమారు 250 ఉద్యోగాల కోసం నిర్వహించనున్న ఈ మెగా ఉద్యోగ మేళా ఈనెల 17న గచ్చిబౌలిలోని హెచ్ఆర్ స్క్వేర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.బిఎస్సీ సైన్స్ చేసిన వారికోసం నిర్వహిస్తున్న ఈ ఉద్యోగ మేళాలో ఎన్నికైన వారికి రూ.10,500 మంది నుంచి రూ.16,500 వరకు వేతనం, ఇఎస్ఐ, పీఎఫ్, వసతి, భోజనం కంపెనీ అందిస్తుందన్నారు.

మైనింగ్ రంగానికి పరిశ్రమ హోదా



- బిల్లులో ప్రతిపాదన
- మైనింగ్‌టుడే సదస్సులో సుశీల్‌కుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వం 2018లో ప్రకటించనున్న మైనింగ్ పాలసీలో ఈ రంగాన్ని పరిశ్రమగా గుర్తించే అవకాశాలు ఉన్నాయని మైనింగ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డిఆర్‌వి సుశీల్ కుమార్ చెప్పారు. ప్రస్తుతం ఉన్న మైనింగ్ పాలసీకి 2015లో చేసిన సవరణలతో అనేక మార్పులు వచ్చాయని, కొత్త పాలసీ మరింత సరళీకృతంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. హెచ్ఐసిసిలో నిర్వహిస్తున్న మైనింట్ టుడే - 2018 సదస్సులో గురువారం ఆయన ప్రసంగించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చిన్న మైన్స్‌కు వేలం లేకుండా చూడాలని రాష్ట్రాలు సిఫారసు చేశాయన్నారు. అలాగే గిరిజనులకే ఏజెన్సీలో మైన్స్ లీజుకు ఇచ్చినపుడు వారికి పెట్టుబడి లేకపోవడంతో సబ్‌లీజుకు ఇచ్చే అవకాశం కల్పించే అంశంపై కూడా కొత్త పాలసీలో పొందుపరిచే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. అలాగే సిమెంట్ పరిశ్రమలకు ఇచ్చే సున్నపురాయి లీజు కూడా ప్రస్తుతం ఇస్తున్న 50 ఏళ్ళ నుంచి గడువు పెంచి కొనసాగించే అవకాశాలు కూడా ఉన్నాయని సుశీల్ కుమార్ చెప్పారు. క్లస్టర్ మైనింగ్స్ తవ్వకాలు రాష్ట్రాలకే ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్టు ఆయన చెప్పారు.మైనింగ్‌పై విద్యుత్, ఇంధన వినియోగదారులు పూర్తిగా ఆధార పడ్డారని ఆయన చెప్పారు. సుస్థిర మైనింగ్ అభివృద్ధి అవసరమని, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆరోగ్యం, స్థానిక సంస్థలకు రాయితీ చెల్లింపు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని సుస్థిర మైనింగ్ సాధించాలని సుశీల్ కువమార్ చెప్పారు. గనుల లీజులో పారదర్శకత ఎంతో అవసరమని అన్నారు.

ప్రభుత్వాలు మారితే మైన్స్ లీజింగ్ రద్దు చేయొద్దు : రాజగోపాల్

ప్రభుత్వాలు మారిన ప్రతీసారి లీజింగ్ లైసెన్స్‌ను రద్దుచేస్తే వందేళ్ళు పనిచేసే కంపెనీలు మూతపడే ప్రమాదం ఉందని ఎన్ఇఎఐ మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ విడి రాజగోపాల్ ఆందోళన వ్యక్తంచేశారు. 2015 సవరణ మేరకు క్యాప్టివ్ మైన్స్ లీజ్‌ను మార్చి 2020, నాన్ క్యాప్టివ్ మైన్స్ లీజ్‌ను 2030 నాటికి ముగిసేలా చేశారని ఆయన గుర్తుచేశారు. దీనిని ఉప సంహరించుకోకుంటే సిమెంట్ కంపెనీలు దెబ్బ తింటాయని రాజగోపాల్ చెప్పారు. 31 రకాల మైన్స్‌ను మైనర్ మినరల్స్‌గా మార్చడంతో వాటిపై రాయల్టీ భారీగా పెరిగిందని ఆయన చెప్పారు. లీజు బదిలీని రద్దుచేయడంతో పెట్టుబడి లేనపుడు చిన్న కంపెనీలు నష్టపోతున్నాయని ఆయన చెప్పారు. మైనింగ్ పాలసీ ముసాయిదా బిల్లు చట్టరూపం దాల్చక ముందే మైనింగ్ ఇంజనీర్స్ అసోసియేషన్ కేంద్రంపై ఒత్తిడి తేవాల్సి ఉందని రాజగోపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గనుల మంత్రిత్వశాఖ సహాయ కార్యదర్శి బిపుల్ పాటక్, కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వశాఖ సలహాదారు డివెన్ ప్రసాద్ కూడా పాల్గొన్నారు.

టీ-హబ్ స్టార్టప్స్ నుంచి హెచ్ఎస్‌బీసీకి సాఫ్ట్‌వేర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హెచ్ఎస్‌బీసీ అవసరమైన అత్యాధునిక సాఫ్ట్‌వేర్ టెక్నాలజీని టి-హబ్ స్టార్టప్స్ అందించనున్నాయి. స్టార్టప్‌ల ఎంపికకు సంబంధించి టి-హబ్‌తో చర్చలు జరిపిన హెచ్ఎస్‌బీసీ ఈ మేరకు గురువారం ఒక అవగాహన కుదుర్చుకుంది. ఈ సందర్భంగా టి-హబ్ సీఈవో జైకృష్ణన్ మాట్లాడుతూ, హెచ్ఎస్‌బీసీకి అవసరమైన కొత్త సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసేందుకు 5 నుంచి 10 స్టార్టప్స్‌ను ఎంపిక చేయనున్నట్లు గురువారం మీడియా సమావేశంలో చెప్పారు. టి-హబ్‌లోని స్టార్టప్స్ ఇప్పటికే అనేక పెద్ద కంపెనీలకు కొత్త అన్వేషణలు అందించే ప్రక్రియ చేపట్టాయని ఆయన చెప్పారు. హెచ్ఎస్‌బీసీకి అవసరమైన బ్లాక్‌చైన్ టెక్నాలజీస్, క్లౌడ్ సీడింగ్, బిగ్‌డేటా, ఆర్టిపిషీయల్ ఇంటలిజెన్స్ తదితర సాఫ్ట్‌వేర్‌లపై స్టార్టప్స్ అభివృద్ధి చేస్తాయని జైకృష్ణన్ చెప్పారు.తమకు సాఫ్ట్‌వేర్ అందించే స్టార్టప్స్ ఐదు వారాల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి

- వారి వర్ధంతులు,జయంతులు ప్రభుత్వమే నిర్వహించాలి
- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: సమాజ హితం కోసం, సమ సమాజం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ప్రజల కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన సర్దార్ సర్వాయి పాపన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ, దొడ్డి కొమురయ్య, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ వంటి మహనీయుల కాంస్య విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని గురువారం జరిగిన ధర్మభిక్షం వర్ధంతి సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. వర్ధంతి సభలో సంఘం నేతలు ఈ నిరంజన్, కుల్కచర్ల శ్రీనివాస్, కనకల శ్యాం కురుమ, జాజుల లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరోచితంగా పోరాడి, తన ప్రాణాలను ప్రజల కోసం త్యాగ చేసిన మహనీయుడు ధర్మభిక్షం అని కొనియాడారు. మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ హామి ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన ఇప్పటి వరకు అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అగ్రకుల నేతల పేర్ల మీద జిల్లాలు, పార్కులు చేస్తూ వారి విగ్రహాలను పెడుతున్న ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల నాయకులపై ఎందుకు వివక్ష ప్రదర్శిస్తోందని ప్రశ్నించారు.

రెండు రోజుల్లో ఇంటర్ హాల్‌టికెట్లు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను రెండు రోజుల్లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ వార్షిక పరీక్షలు 28 నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలకు 9.25 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో మొదటి సంవత్సరం వారు 4.75 లక్షల మంది ఉండగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4.50 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1.25 లక్షల మంది ప్రైవేటు విద్యార్థులున్నారు. ఇంటర్ పరీక్షల కోసం 31 జిల్లాల్లో 1560 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసిన పరీక్షల నిర్వహణాధికారి సుశీల్ కుమార్ తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులపై నిబంధనల సడలింపు

హైదరాబాద్ , ఆంధ్రప్రభ : ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. నిరుద్యోగుల అభ్యర్థన మేరకు నిబంధన లను సడలిస్తూ తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ జీఓని జారీ చేసింది. నిబంధనలను సడలిస్తూ, ఫిబ్రవరి 25వ తేదీ వరకు గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

జీఓ-67 ద్వారా నోటిఫికేషన్ జారీ

తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖలో ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ జీఓ-67 ద్వారా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అభ్యర్థుల అర్హతలను ప్రకటించింది.1.సర్టిఫికేట్ ఇన్ ల్యాబరేటరీ టెక్నీషియన్ కోర్సు చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. 2.ఎంఎల్‌టీ (విఓసి) ఇంటర్మీడియట్ ఎంఎల్‌టి-ఒకేష నల్ కనీసం ఏడాదిపాటు క్లీనికల్ శిక్షణ లేదా అప్రెంటీస్‌షిప్ చేసిన వారు.3.డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు (డిఎంఎల్‌టి).4.బీఎస్సీ (ఎంఎల్‌టి, ఎంఎస్సీ (ఎంఎల్‌టి).5.డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ క్లీనికల్ పాథాలజీ టెక్నికల్ కోర్సు.6.బ్యాచిలర్ ఇన్ మెడికల్ ల్యాబరేటరీ టెక్నాలజీ (బీఎంఎల్‌టీ). 7.పీజీ డిప్లమా ఇన్ క్లీనికల్ బయో కెమిస్ట్రీ 8. పీజీ డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబరేటరీ టెక్నాలజీ. 9.బెస్సీ మైక్రోబయాలజీ, ఎంఎస్సీ ఇన్ మైక్రో బయాలజీ10.ఎమ్మెస్సీ ఇన్ మెడికల్ బయో కెమిస్ట్రీ.11.ఎమ్మెస్సీ ఎన్ క్లీనికల్ బయాలజీ.12.ఎమ్మెస్సీ ఇన్ బయో కెమిస్ట్రీ, అర్హతలుగా ప్రకటించింది.

జీడీపీలో మనమే టాప్

- అధునాతన టెక్నాలజితో గిరిజన విశ్వవిద్యాలయం
- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రా ల్లో తెలంగాణ రాష్ట్రం మొదటిస్థానంలో ఉందని ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. జీడీపీలో 16.5 శాతంతో తెలంగాణ రాష్ట్రం ముందుందని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎంపి సీతారాంనాయక్‌తో కలిసి గురువారం సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా గొప్ప హ్యాపెనింగ్ నగరంగా పేరొందిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన టిఎస్ ఐపాస్ మూలంగా ప్రపంచంలోని పేరొందిన పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి తెలంగాణ వైపు చూస్తున్నారని అన్నారు. రూ. 40వేల కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. నీతి అయోగ్ కూడా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను మెచ్చుకుందన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నామని కడియం శ్రీహరి తెలిపారు. పేద, మధ్యతరగతి వర్గాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఎక్కడా లేని విధంగా గత మూడేళ్లల్లోనే 540 గురుకులాలను ఏర్పాటు చేశామని తెలిపారు. యూనివర్సిటీల్లో 1551 పోస్టుల భర్తీకీ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని స్పష్టం చేశారు. యూనివర్సిటీల్లో మౌలిక వసతుల కోసం రూ. 420 కోట్లను కేటాయించిందని చెప్పారు. అత్యంత అధునాతన సాంకేతిక టెక్నాలజీతోపాటు అన్ని రకాల మౌలిక వసతులతో గిరిజన విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పనున్నట్టు స్పష్టం చేశారు. అందుకోసం ఇందిరిగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ సహకారం కూడా కావాలని కోరారు. నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ టివి కట్టిమణి యూనివర్సిటీలో కల్పించిన వసతుల గురించి వివరించారు.

17న డిఎంహెచ్ఓల ఎదుట ధర్నా

ప్రజారోగ్య వైద్య, ఉద్యోగుల యూనియన్ హెచ్చరిక



హైదరాబాద్ ,ఆంధ్ర ప్రభ : సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేయడానికి తామంతా సిద్ధమని ప్రజారోగ్య మరియు వైద్య ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్‌లు ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. సమస్యల సాధన కోసం 17వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని డీఎం హెచ్ఓల ఎదుట ధర్నా చేయడానికి సిద్ధమని వారు పేర్కొన్నారు. గురువారం కోఠిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జనవరి 27వ తేదీన సమ్మె నోటీసును అందరూ ఉన్నతాధికారులతో మంత్రి, సీఎంకు కూడా ఇచ్చామని అయినా ఇంతవరకు దీనిపై ఎలాంటి సానుకూల స్పందన రాలేదని వారు వాపోయారు. సమ్మె చేయడానికి మొదటగా పోస్టుకార్డు ఉద్యమం కూడా చేపట్టామని, అయినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదన్నారు. రెండోదఫా ఉద్యమం లో భాగంగా 17వ తేదీ నుంచి అన్ని జిల్లాల డీఎం హెచ్ఓ కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వానికి చాలాసార్లు విన్నవించామని ఇప్పటివరకు దీనిపై నిర్ణయం తీసుకోలేదన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్యాం సుందర్ మాట్లాడుతూ ప్రస్తుతం 23 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచామని అయినా ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిం చాలని ఈనెల 27వ తేదీ నుంచి చేపట్టే నిరవధిక నిరాహార దీక్షకు ఉద్యోగులందరూ సంఘీభావం తెలపాలన్నారు.

వృద్ధ దంపతుల దారుణ హత్య

బిహార్: రిటైర్డ్ ప్రభుత్వాధికారి, అతని భార్యను దుండగులు దారుణంగా గొంతుకోసి హత్య చేశారు. ఈ ఘటనకు సంబంధించి అడిషనల్ సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ హరిశంకర్ ప్రసాద్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గురువారం ఉదయం పేపర్ బాయ్ పేపరు వేసేందుకు వెళ్లగా ఇంట్లోంచి బయటకు రక్తం బయటకు రావటాన్ని గమనించాడు. ఈ విషయం చుట్టుపక్కలవారికి తెలియజేయటంతో వారు బలవంతంగా తలుపులు తెరిచి చూడగా రిటైర్డు ప్రభుత్వోద్యోగి రంజిత్ కున్వార్ (75), అతని భార్య కాంతి మృతి చెంది కనిపించారు. వారిని దారుణంగా గొంతుకోసి చంపారని పోలీస్ అధికారి ప్రసాద్ తెలిపారు. మృతుడు కున్వర్ పోస్టల్ అధికారిగా 2002 పదవీ విరమణ చేశారన్నారు. కాగా నిందితులెవరేనది ఇంకా తెలియలేదని, హత్యలకు గల కారణాలు దర్యాప్తులో తెలుస్తాయన్నారు.

2017లో ఆత్మాహుతి దాడుల్లో 2,300 మంది దుర్మరణం

కాబుల్ : 2017లో ఆత్మాహుతి దాడులతో ఆఫ్గనిస్తాన్‌లో సుమారు 2,300 మంది పౌరులు మృతి చెందారని ఐక్యరాజ్య సమితి తెలిపింది. అదేవిధంగా వేలాది మంది తీవ్ర గాయాలపాలయ్యారని వివరించింది. అర్బన్ ఏరియాల్లో ఉగ్రదాడులు అధికంగా జరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత ఆగస్టులో ఆఫ్గనిస్థాన్‌లో అమెరికా ఉనికి బహిరంగంగా చూపించారు. అక్కడి ఉగ్రవాదులపై అమెరికా దాడులు నిర్వహించింది. యూనైటెడ్ నేషన్స్ అసిస్టెంట్స్ మిషన్ ఇన్ ఆఫ్గనిస్థాన్ 2017లో పౌరులు మృతి 9 శాతానికి పెరిగిందని తెలిపింది. 10,453 మంది ఉగ్రవాదుల బారినపడగా 3,438 మరణించగా, వారిలో 7,015 మంది గాయపడ్డారు. తాలిబన్, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థలు అత్యధికంగా మారణహోమాన్ని సృష్టించాయి. ఉగ్రవాద దాడులు 17 శాతం పెరిగిపోయాయి. అత్యధికంగా ఉగ్రవాద దాడుల్లో మృతి చెందిన వారు ఆఫ్గనిస్థాన్‌లోనే ఉన్నారు. కేవలం కాబూల్‌లోనే 1,831 మందిని ఉగ్రవాదులు పొట్టనపెట్టుకున్నారు. బస్సులు, మసీదులు, జనాలు అత్యధికంగా ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్టు ఐక్యరాజ్య సమితి మానవహక్కుల హైకమిషనర్ జీద్ రాడ్ అల్ హుస్సేన్ తెలిపారు. 2018లో ఈ దాడులు మరింత పెరిగే అవకాశం ఉందని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది.

చొరబాటును తిప్పికొట్టిన భారత్

జమ్మూ : జమ్మూ, కాశ్మీర్‌లోని ఎల్‌ఓసీ వద్ద మిలిటెంట్లు భారత్‌లో చొరబాటుకు యత్నించారని ఆర్మీ సీనియర్ అధికారి వివరించారు. నలుగురు నుండి ఐదుగురు మిలిటెంట్లు ఈ దుశ్చర్యకు పాల్పడినట్టు తెలిపారు. పూంచ్‌లోని మెందర్ సెక్టార్ నుండి చొరబాటుకు యత్నించే క్రమంలో ఆర్మీ వారిపై కాల్పులు జరిపిందని, దీంతో వారు అక్కడి నుండి పారిపోయారని, వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

బాంబు పేలి ఇద్దరికి గాయాలు

అరా (బిహార్): బాంబు పేలిన ఘటనలో దోపిడీ దొంగలుగా అనుమానిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటనపై భోజ్‌పూర్ సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ అవినాశ్ కుమార్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఐదుగురు సభ్యుల ముఠా బోజ్‌పూర్ జిల్లా హరికెన్ కుమార్ జైని ధర్మశాలకు పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చారన్నారు. కాగా అనంతరం దర్యాప్తులో ఈ ఐదుగురు నేరస్థులని, వీరు పొరుగు రాష్ట్రమైన బిహార్ నుంచి ఇక్కడ బ్యాంకు దోపిడీ చేసే ఉద్దేశ్యంతో వచ్చారన్నారు. దీనికోసం ఒక బాంబును బ్యాగ్లో ఉంచి తీసుకువచ్చారన్నారు. బాంబు పేలటంతో ఇద్దరు అనుమానితులు గాయపడగా మిగిలిన ముగ్గురు పారిపోయారని ఎస్పీ తెలిపారు.

అమరావతిలో జూ ఏర్పాటుకు డీపీఆర్‌లు సిద్ధం చేయండి

అమరావతి ఆంధ్రప్రభ: నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ప్రపంచ స్థాయి జంతు ప్రదర్శన శాల (జూ) ఏర్పాటు చేసేందుకు స్థల ఎంపిక, డిపిఆర్‌లను సిద్దం చేయాలని అటవిశాఖ అధికారులను ఆ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు ఆదేశించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో అటవీశాఖ అధికారులతో జూ ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూ అథారిటీ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి సమావేశం త్వరలో జరగనుందని తెలిపారు.

బ్యాంకుల్లో నగదు కొరత

- మళ్లీ కరెన్సీ కష్టాలు
- మూత పడిన ఏటీఎంలు
- నో క్యాష్ బోర్డుల దర్శనం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రజల అవసరాలకు అనుగుణంగా బ్యాంకులు డబ్బులు ఇవ్వకపోవడంతో మళ్లీ నగదు కష్టాలు ఎదురవుతున్నాయి. జంట నగరాల్లోని ప్రధాన బ్యాంకులన్నీ అరకొర నిల్వలతో ఖాతాదారులు అడిగిన డబ్బులు ఇవ్వలేక పోతున్నాయి. బ్యాంకులు నగదు ఇవ్వకపోవడం, మరోవైపు ఎటిఎంలలో నిల్వలు లేకపోవడంతో మళ్ళీ కరెన్సీ కష్టాలు మొదలయ్యాయి. సంక్రాంతి సందర్భంగా నగదు కోసం వారం రోజులపాటు తీవ్ర ఇబ్బందులు పడిన జనం మళ్లీ ఇప్పుడు అలాంటి పరిస్థితినే ఎదుర్కోవలసి వచ్చింది. బ్యాంకుల్లో రూ.10వేలకు మించి విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం లేకపోవడం, ఎటిఎంలలో అరకొరగా పెడుతున్న నిధులతో జనం ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని చాలా బ్యాంకు ఎటిఎంలు ఇప్పటికే మూతపడగా, మరికొన్ని ఎటిఎంలు నో క్యాష్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. జంట నగరాల్లో పరిస్థితి తీవ్రంగా ఉన్నప్పటికీ బ్యాంకు యాజమాన్యాలు స్పందించకపోవడంతో ప్రజలు బ్యాంకుల్లోనే గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి దాపురించింది. పని మానుకుని క్యూలో నిల్చున్నప్పటికీ డబ్బులు తమదాకా వస్తాయన్న నమ్మకం కూడా లేని పరిస్థితి నెలకొంది. దీంతో మళ్ళీ డీమానిటేషన్ రోజులు గుర్తుకు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇలా ఉండగా, నగదు లావాదేవీలు తగ్గించి డిజిటల్ లావాదేవీలు పెంచాలన్న లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోడీ చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా బ్యాంకుల్లో నగదు నిల్వలు లేకుండా చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రతి లావాదేవీకి లెక్క ఉండాలన్న రీతిలో ఆదాయ పన్నుశాఖ ఆధార్, పాన్‌కార్డుతో అనుసంధానం చేసి నగదు చలామణిని తగ్గించే యత్నం చేస్తోంది. డిమానిటేషన్ సందర్భంలోనే ప్రతి బ్యాంకు తమ ఖాతాదారుడికి ఎటిఎం కార్డులు అందజేసిన విషయం తెలిసిందే. దీంతో బ్యాంకుల్లో సిబ్బందికి పనిభారం తగ్గించి డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేరీతిలో ఎటిఎం కార్డులను వినియోగించాలని రిజర్వు బ్యాంకు ఆదేశించింది. అప్పటి నుంచి సామాన్య ఖాతాదారులకు నగదు ఇవ్వడంలో బ్యాంకులు తాత్సారం చేయడంతో ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు నగదు డిపాజిట్లు కూడా బ్యాంకుల్లో తీసుకోకుండా ఎటిఎం ద్వారానే వేయించడం గమనార్హం. బ్యాంకు లావాదేవీలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్న నిర్ణయంతో డిపాజిట్లు, విత్‌డ్రా కూడా ఎటిఎం ద్వారానే చేసే విధంగా బ్యాంకులు ఖాతాదారులపై ఒత్తిడి తెస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో నగదు కొరత ఏర్పడడంతో తమ రాష్ట్రంలోని బ్యాంకులకు రూ.5వేల కోట్లు వెంటనే విడుదల చేయాలంటూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రిజర్వు బ్యాంకును కోరారు. ప్రజల ఇబ్బందులు గమనించి సరైన నిర్ణయం తీసుకోవాలంటూ ఈ మేరకు ఆర్‌బిఐకి ఆయన లేఖ రాశారు. అలాగే తెలంగాణ ఎంపీ వినోద్ కుమార్ కూడా తమ రాష్ట్రానికి నిధులు కేటాయించాలంటూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖకు లేఖ రాశారు. రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను వివరిస్తూ నిధుల విడుదల అవసరాన్ని ఆయన గుర్తుచేశారు.

నరబలి కేసులో వీడిన మిస్టరీ..

- బలి ఇచ్చింది ఆడశిశువునే
- నిందితులు రాజశేఖర్ దంపతులే
- రోడ్డుమీద చిన్నారిని ఎత్తుకొచ్చి క్షుద్రపూజలకు బలి చేశారు
- ఆ రక్తపు చుక్కలే పట్టిచ్చాయి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నరబలి అనుమానాలే నిజమయ్యాయి. మూఢవిశ్వాసాల మాటున అభం శుభం తెలియని చిన్నారిని బలి చేశారు. క్షుద్రపూజలు చేసి నరబలి ఇస్తే ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులు మెరుగవుతాయన్న కోయదొర మాటలను పరిగణ నలోనికి తీసుకున్నారు. రోడ్డుమీద కేరింతలు కొట్టే చిన్నారిని తీసుకొచ్చి నిర్దా క్షిణ్యంగా పొట్టన బెట్టుకున్నారు. పెను సంచలనం రేపిన ఉప్పల్ చిలుకానగర్ కేసులో ఆడశిశువును నరబలి ఇచ్చారని పోలీసులు తేల్చారు. ఇంటి డాబాపై లభ్యమైన చిన్నారి తల, ఇంట్లో కనిపించిన రెండు చుక్కల రక్తనమూనాల డీఎన్‌ఏ టెస్టులో సరిపోలడంతో ఈ కేసులో మిస్టరీ వీడింది. నరబలి కేసులో ప్రధాన నిందితుడు క్యాబ్ డ్రైవర్ రాజశేఖర్ అని పోలీసులు తెలిపారు. ఈ కేసులో టెక్నాలజీ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. రెండేళ్ల క్రితం సమక్క సారక్క జాతరకు వెళ్లిన రాజశేఖర్‌కు కోయదొర నరబలి ఇవ్వాలని సలహా ఇచ్చాడు. గ్రహణం రోజున నరబలి ఇస్తే ఇంకా ప్రయోజనం ఉంటుందని సూచిస్తే రాజశేఖర్ చంద్రగ్రహణం రోజున నరబలి ఇచ్చాడు. జనవరి 31న రాత్రి 7-8 గంటల సమయలో బోయిగూడలో రెక్కీ నిర్వహించి రోడ్డు సైడ్‌న ఉన్న 3-6 నెలల ఆడశిశువును ఫిబ్రవరి 1న ఉదయం కిడ్నాప్ చేశాడు. అదే సమయంలో చిన్నారితో పాటు ఆమెకు అవసరమైన ఫీడింగ్ బాటిల్‌ను కూడా తీసుకువచ్చాడు. అక్కడ్నించి పాపతో ప్రతాప్‌సింగారం అవుట్‌స్కర్ట్స్ మూసి నదికి వెళ్లాడు. 2 గంటలకు చిన్నారి తలను కత్తితో నరికాడు. మొండెంతో పాటు కత్తని మూసీలో పడేశాడు. అక్కడ అర్ధగంట గడిపాడు. బ్లీడింగ్ ఆగిన వెంటనే చిన్నారి తలను పాలిథిన్ బ్యాగ్‌లో పెట్టి దానిని కారులో ఉంచుకుని మూడు గంటలకు ఇంటికి రాజశేఖర్ చేరాడు. ఇంటికి చేరిన తర్వాత రాజశేఖర్ తన భార్యతో కలిసి తన ఇట్లోని లివింగ్ రూమ్‌లో చిన్నారి తలను ఉంచి నగ్నంగా క్షుద్రపూజలు చేశాడు. పూజ అనంతరం చిన్నారి తలను టెర్రస్‌పైకి తీసుకెళ్లి సౌత్ వెస్ట్ కార్నర్‌లో చంద్రుడి కాంతి పడే విధంగా 4 గంటలకు ఉంచాడు. అనంతరం ఎవరికీ అను మానం కలగని రీతులో ఇంటినుంచి రాజశేఖర్ తన క్యాబ్‌లో మాదాపూర్ వెళ్లాడు. మధ్యే మార్గంలో చిన్నారితల తీసుకొచ్చిన పాలిథిన్ బ్యాగ్‌ను నాచారంలోని జీహెచ్‌ఎంసీ బిన్‌లో పడేసి మాదాపూర్ వెళ్లాడు. తిరిగి ఉదయం 10-20కు చిలుకానగర్‌లోని తన ఇంటికి చేరాడు. 11 గంటల సమయంలో రాజశేఖర్ అత్త టెర్రస్‌లో చిన్నారి తల కనపడటంతో పెద్దగా అరిచి కేకలు వేసింది. తర్వాత ఆ ఇంటి పక్కన ఉండే కిరాణా షాపు ఓనర్ నాగరాజు డయల్ 100 కు ఫిర్యాదు చేశాడు. చిన్నారి తల భాగాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. ఫిబ్రవరి 2వ తేదీన అసిస్టెంట్ ప్రొఫెసర్ వసంత్ నాయక్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆ సమయంలో 24-48 గంటల మధ్య చనిపోయి ఉంటుందని ప్రొఫెసర్ తన అభిప్రాయంగా తెలిపారు. కాగా, ఫిబ్రవరి 1వ తేదీన చిన్నారి తల నమూనాలను క్లూస్ టీం సేకరించింది. ఈ కేసుని రాజశేఖ ర్ మిస్‌లీడ్ చేస్తూ వస్తుండటంతో పోలీసులు ఈ కేసుపై మరింతగా దృష్టిసారించారు.

పర్యాటక శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులపై వేటు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రపర్యాటకశాఖలో కాంట్రాక్టు పద్దతిపై పనిచేస్తున్న ఉద్యోగులమీద వేటుపడింది. మొత్తం ఉద్యోగులలో 22మందిపై వేటుపడినట్లు సమాచారం. 2000సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కాంట్రాక్టు పద్దతిన 261మందిని విధుల్లోకి తీసుకోగా, వీరు హరిత హోటల్స్, టూరిజం కార్పోరేషన్‌లలో పనిచేస్తున్నారు. వీరికి 9వ పిఆర్‌సి ప్రకారం 2011నుండి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తోంది. అయితే 2014లో ప్రభుత్వం పిఆర్‌సిని అమలుచేసినా వీరిని పరిగణనలోకి తీసుకోలేదు. అప్పటినుండి వారు ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు అధికారులపై కాంట్రాక్టు సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. దీనిపై విచారణ జరపకపోగా.. కాంట్రాక్టు ఉద్యోగుల్లో కొందరిపై వేటు వేసినట్లు సమాచారం. తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కక్ష్యసాధింపుచర్యల్లో భాగంగానే ఇది జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

పాల్ఘర్: టెంపో, ట్రక్ ఢీకోవటంతో ఇద్దరు మరణించారు. ఈ దుర్ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ముంబై, అహ్మదాబాద్ జాతీయ రహదారిపై గురువారం ఉదయం లారీ ఎదురుగా వస్తున్న టెంపోను ఢీకొనడంతో ఇద్దరు మరణించారన్నారు. కాగా ఈ ఘటనలో మరో ఇద్దరు గాయపడ్డారన్నారు. దీంతో జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదం కారణంగా రెండు గంటల సేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడిందని పోలీసులు తెలిపారు. లారీ గుజరాత్ వైపు వెళుతుండగా, టెంపో ముంబై వైపు పయ నిస్తున్నాయన్నారు. జాతీయ రహదారిపై సమత గ్రామం వద్ద ఉదయం 8.30 సమ యంలో ఈ ప్రమాదం జరిగిందన్నారు.

కాసా పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారి ఒకరు మాట్లాడుతూ టెంపోలోఉన్న ఇద్దరు సంఘటన ప్రాంతంలోనే మరణించారన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అంది స్తున్నామన్నారు.

బాధితుల వివరాలు ఇంకా తెలియాలసి ఉందన్నారు. ట్రక్ డ్రైవరును అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


ఏపీకి చాలా చేశాం

- రాజకీయ దురుద్దేశ్యంతోనే కేంద్రంపై నిందలు
- ఏపీ భాజాపా అధికార ప్రతినిధి సుధీష్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం ఎంత చేయాలో అంత చేస్తున్నదని, ఇకపై కూడా ఆదుకుంటుందని ఏపీ భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సుధీష్ రాంబొట్ల అన్నారు. రాజకీయ దురుద్దేశ్యంతోనే కొన్ని పార్టీలు కేంద్రంపై నిందలు వేస్తున్నాయని ఆయన మండి పడ్డారు. రాజకీయ లబ్ధి కోసమే మరోసారి రాజీనామాల డ్రామాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. గురువారం నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుధీష్ రాంభొట్ల మాట్లాడుతూ, ప్రత్యేక హోదాకు సమానంగా ప్యాకేజీ ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, భారీ ప్రాజెక్టులకు మాత్రం కేంద్రం నుంచి నిధులు అందుతాయని, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సంక్షేమ పథకాలను కేంద్రం నేరుగా నిధులివ్వదన్నారు. ఏపీను ఆదు కునేందుకు కేంద్రం సిద్దంగా ఉందని ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రం ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జెట్లీ పలుమార్లు స్పష్టం చేశారన్నారు. ఇప్పటికైనా ఆందోళనలు, విమర్శలు చేస్తున్న రాజకీయ పార్టీలు వాస్తవాలు గ్రహించాలని సూచించారు.

ఆత్మగౌరవం-అహంకారం మధ్య పోరాటం

- వైసీపీ ఎంపీ మిధున్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా లక్ష్యంగా వైఎస్‌ఆర్‌కాంగ్రెస్ పార్టీ ఎంపీలు చేసే రాజీనామాల ద్వారా వచ్చే ఉప ఎన్నికలు ఢిల్లీ అంహకారానికి తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి మధ్య పోరాటం అని వైకాపా ఎంపి మిధున్ రెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మిధున్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదానా లేక ప్యాకేజీనా అనేది ప్రజల్లోనే తేల్చుకుందాం రమ్మన్నారు. తమను విమర్శించే వారు 2019జూన్ 4 వరకూ 15 నెలలపాటు ఎంపీలుగా కొనసాగే అవకాశం ఉన్నట్టు ఎన్నికల కమీషన్ పేర్కొన్న అంశాన్ని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. వైకాపా ఎంపీలు చేసే రాజీనా మాలు అమలయ్యేలా చూడటంతోపాటు వైకాపానుంచి గెలిచి టీడీపీలో చేరిన ముగ్గురు ఎంపీలు , 23 మంది ఎమ్మెల్యేలతో కూడా రాజీనామ చేయించి ఉప ఎన్నికలు వచ్చేలా చంద్రబాబు సాయం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం తన వల్లేనే వచ్చిందని హైదరాబాద్‌లో ప్రకటించి , ఏపీకి వచ్చాక మనకు అన్యాయం జరిగిందని చెప్పిన చంద్రబాబు నాయుడు మరో సారి అదే విధంగా చేయాలని చూస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా విషయంలో టీడీపీ, బీజేపి ఇద్దరూ దోషులే అని మిధున్ రెడ్డి పేర్కొన్నారు.

చింతమనేనిపై అనర్హత వేటు వేయాలి

- వైసీపీ నాయకుడు పేర్ని నాని

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కోర్టులో శిక్షపడ్డ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై తక్షణం అనర్హత వేటు వేయాలని వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ నాయకుడు పేర్ని వెంకట్రామయ్య(నాని) ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏ నాయకుడికైనా కోర్టులో రెండేళ్లు శిక్ష పడితే ప్రజాప్రాతినిధ్యచట్టం 1951 ప్రకారం వెంటనే ఎమ్మెల్యే సభ్యత్వంపై అనర్హత వేటు పడుతుందన్నారు. దెందలూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగానే కాకుండా విప్‌గా కూడా ఉన్న చింతమేని ప్రభాకర్ రావును తక్షణం ఎమ్మెల్యే సభ్యత్వానికి అనర్హుడిగాప్రకటించి విప్ పదవినుంచి కూడా తప్పించాలన్నారు.

జగన్‌కు ఈడీ కోర్టు సమన్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అక్రమాస్తుల కేసులో వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో పాటు పలువురికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. ఇందూటెక్‌జోన్ వ్యవహారంపై ఈడి దాఖలు చేసిన చార్జీషీట్‌ను విచారించిన కోర్టు ఈ నెల 16 న కోర్టుకు హాజరవాలని ఆదేశించింది. జగన్మోహన్‌రెడ్డితో పాటు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఎఎస్ అధికారి బిపి ఆచార్య, వ్యాపారవేత్త నిమ్మగడ్డ ప్రసాద్, ఇందూ శ్యాంప్రసాద్‌రెడ్డిలకు కూడా సమన్లు జారీ అయ్యాయి.

రచయిత దేవీప్రియకు సన్మానం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవీప్రియకు ఢిల్లీలోని తెలుగు వారు ఘన సన్మానం చేశారు. గురువారం సాయంత్రం ఉమ్మడి భవన్ లోని గురజాడ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన అభినందన సభలో కేంద్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ మాఢభూషి శ్రీధర్, కవి, వక్త సీనియర్ జర్నలిస్టు ఏ.కృష్ణారావుతో పాటు పలురువు పాల్గొని దేవిప్రియ ఘనతను కొనియాడారు. దేవరకొండ సుబ్రమణ్యం సమన్వయ కర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఢిల్లీలోని వివిధ సంఘాలకు చెందిన తెలుగు వారూ పాల్గొన్నారు.

కియా రాకతో 'అనంత' అభివృద్ధి

పెనుకొండ, ప్రభన్యూస్: అనంతపురం జిల్లా పెనుకొండ పట్టణంలో కియా రాకతో అనంత అభివృద్ధి చెందుతుందని మంత్రి కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. పెనుకొండపట్టణ పరిధిలోని కియా పరిశ్రమకు మంత్రి కాల్వశ్రీనివాసులు, కలెక్టర్ వీరపాండ్యన్, ఎస్పీ అశోక్‌కుమార్‌లు కియా పరిశ్రమలో పనులను పరిశీలించారు. అంతేకాకుండా కియా ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ కరువుకు వెనుకబాటుగా వున్న అనంత జిల్లాను ఉపాధి లేక కరువుకు శాశ్వత జిల్లాగా వున్న అనంత జిల్లాను కియా పరిశ్రమను ఏర్పాటు చేసి అభివృద్ధికి మారుపేరుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడకే దక్కుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ నెల 22న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ , మంత్రి కియా అధికారులతో సమావేశం నిర్వహించారు. కియా రాకతో అనంత ఆర్థిక ముఖచిత్రం మారబోతోందని గత 60 ఏళ్లుగా తీవ్ర కరువు కాటకాలు, వలసలు, రైతు ఆత్మహత్య లతో పారిశ్రామిక ప్రగతిలో అగ్ర భాగానాకి చెందిందన్నారు. కియా పరిశ్రమను అనంతకు రప్పించడానికి ముఖ్యమంత్రి చేసిన కృషి అనంత ప్రజలు మరువ లేనిద ని ఆయన పేర్కొన్నారు. 22న కియా పరిశ్రమ ఫ్రేమ్ వర్క్ ఇన్‌స్టిలేషన్ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొంటున్నారు. దాదాపు కియా కంపెనీలో 12వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. 800 ఎకరాలలో కియా పరిశ్రమ, మరో 500 ఎకరాలలో 18 అనుబంధ పరిశ్రమలు వస్తున్నాయి. మరో ఐదేళ్లలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పొట్ట చేత పట్టుకొని వలస వెళ్తున్న జిల్లా, ఇతర ప్రాంతాల వారికి కూడా ఉపాధి కల్పించే స్థాయికి చేరడం ముఖ్యమంత్రికి అనంత జిల్లా పట్ల వున్న ప్రేమానురాగాలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రతిఒక్కరు నిరుద్యోగ సమస్య లేకుండా తీరబోతోందని ఆయన పేర్కొన్నారు.

ఆయుధ తయారీ కేంద్రంపై దాడి

ముజఫర్ నగర్ : ఉత్తర ప్రదేశ్‌లో ఓ అక్రమ ఆయుధ తయారీ కేంద్రంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ముజఫర్‌నగర్ జిల్లా బూదన గ్రామంలో జరిగిన ఈ దాడి విషయాన్ని జిల్లా రూరల్ ఎస్పీ అజయ్ సహదేవ్ మీడియాకు వెల్లడించారు. మాకు విశ్వసనీయ సమాచారం మేరకు ఈ అక్రమ ఆయుధ కర్మాగారంపై దాడి చేయడం జరిగింది. ఇక్కడ తయారు చేస్తున్న తుపాకులు, ఇతర ఆయుధాలను హర్యానా లోని పానిపట్, సోనేపట్ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించాము. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేయడంతో పాటు 12 పిస్టల్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్నాం అని ఆయన తెలిపారు.

రూ.270 కోట్లు ఆర్జించాం

లాభాల బాటలో 29 డిపోలు: ఆర్టీసీ ఎండి రమణరావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇంధన పొదుపులో టిఎస్ఆర్టిసి మెరుగైన స్థానంలో ఉండటానికి కారణం డ్రైవర్ల కృషి ఫలితమేనని టిఎస్ఆర్టిసి ఎండి జివి రమణారావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గురువారం ఆర్టీసీ కళాభవన్‌లో ఇంధన పొదుపు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎండి పాల్గొన్నారు. రాష్ట్ర, రీజియన్ స్థాయిలలో అత్యుత్తమ కెఎంపిఎల్ సాధించిన డ్రైవర్లకు, ఉత్తమ మెయింటనెన్స్ ద్వారా ఇంధన పొదుపునకు దోహదం చేసిన మెకానిక్‌లకు అవార్డులు, రివార్డులను అందించారు. గతంతో పోలిస్తే సంస్థ ఆదాయం రూ. 270 కోట్లు పెరిగిందన్నారు. ప్రస్తుతం 29 డిపోలు లాభాల బాటలోకి రాగా మరో 36 డిపోలు నష్టాల నుంచి గట్టెక్కుతున్నాయన్నారు. పెట్రోలియం కన్జర్వేషన్ రిసర్చ్ అసోసియేషన్ నుంచి 26 సార్లు, ఎఎస్ఆర్‌టిఎం నుంచి 37 సార్లు జాతీయ స్థాయిలో సంస్థ అవార్డులను అందుకుందన్నారు. ఇంధనాన్ని ఆదా చేయడం వల్ల కాలుష్యం కొంత మేర తగ్గుతుందని, ఇంధన వనరులు అంతరించి పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో ప్రత్యామ్నాయ ఇంధన వినియోగంపై ప్రత్యేకదృష్టిసారించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇడి రవిందర్, సిఎంఇ వెంకటేశ్వర్లుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

28న చేవెళ్ల నుంచి టీపీసీసీ బస్సుయాత్ర

- మార్చి 11న వరంగల్‌లో ముగింపు సభ
- రోజుకు రెండు జిల్లాలు, రెండు సభలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : టీ పీసీసీ ఆధ్వర్యంలో తెలంగాణలో చేపట్టే మొదటి విడత బస్సుయాత్ర రూట్‌మ్యాప్ ఖరారైంది. ఈ నెల 26 నుంచి మార్చి 11 వరకు మొదటి విడత బస్సుయాత్రను చేపట్టాలని నిర్ణయం తీసుకున్నది. బడ్జెట్ సమావేశాల తర్వాత రెండో విడత యాత్రను చేపట్టాలని టీకాంగ్రెస్ నేతలు నిర్ణయం తీసుకున్నారు. కాగా మొదటి విడత యాత్రను కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్‌గా భావించే చేవెళ్ల నియోజక వర్గం నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. ఇక ముగింపు యాత్ర ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాల పల్లిలో నిర్వహించనున్నారు. నూతన జిల్లాల ప్రకారం రోజుకు రెండు జిల్లాల మేర బస్సుయాత్ర చేయనున్నారు. ఈ నెల 26న మధ్యాహ్నం 1 గంటలకు చెవెళ్లలో ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు వికారాబాద్‌కు చేరుకుంటుంది. 27న తాండూరు, సంగారెడ్డి, 28న జహీరాబాద్, ఆందోల్, మార్చి 1న నర్సాపూర్, నారాయణఖేడ్, 2న ఎల్లారెడ్డి, కామారెడ్డి, 3న బాన్సువాడ, బోదన్, 4న నిజామాబాద్, ఆర్మూర్, 5న బాల్కొండ, నిర్మల్, 6న మెట్‌పల్లి, జగిత్యాల, 7న సిరిసిల్ల, కరీంనగర్, 8న మానుకొండూర్, హుస్నాబాద్, 9న హుజురాబాద్, పెద్దపల్లి, 10న రామగుండం, మంథని, 11న భూపాలపల్లి, వరంగల్ అర్బన్ నియోజక వర్గాల్లో సభలు, సమావేశాలు ఉండే విధంగా రూట్ మ్యాప్ రూపొందించారు. ఈ బస్సుయాత్ర ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని టీ పీసీసీ నేతలు నిర్ణయం తీసుకున్నారు.

నలుగురి చేతిలో రాష్ట్రం నలుగుతోంది



భువనగిరి, ప్రభన్యూస్ : తెలంగాణలో కేసీఆర్ కుటుంబానికే అధికారం వచ్చిందని, రాష్ట్రం ఆ నలుగురి చేతుల్లోనే నలిగి పోతుందని తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ 68 ఏళ్లలో లేని అప్పులు 44 నెలల లోనే లక్షల కోట్లు అప్పులు చేసి అప్పుల రాష్ట్రంగా తయారు చేశారని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండ మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ప్రాజెక్టుల పేర కోట్ల రూపాయల కమిషన్‌లు కాజేశారని చెప్పారు. బీబీనగర్‌లో ఎయిమ్స్‌పై కాలయాపన చేయడమేమిటని ప్రశ్నించారు. పేదల నిధులతో ప్రగతి భవనం నిర్మాణం చేసి కేసీఆర్ విలాసవంతమైన జీవితం గడపుతున్నాడని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన అంతరం ప్రగతి భవనంను ప్రజా ఆసుపత్రిగా మారుస్తామని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో టీడీపీకి క్యాడర్ ఉందని ప్రజా సమస్యలపై టీడీపీ నిరంతరం పోరాటం చేస్తుందని ఇందులో భాగంగా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

మల్కాజిగిరి పార్లమెంట్

బరిలో రేణుకా చౌదరి?

- టీడీపీ నేత నామాను కాంగ్రెస్‌లోకి తీసుకు వచ్చే యత్నం
- ఖమ్మం లోక్‌సభ బరిలో దింపాలని కాంగ్రెస్ పార్టీ యోచన





హైదరాబాద్,ఆంధ్రప్రభ : వచ్చే ఎన్నికల్లో లోక్‌సభ నియోజక వర్గాలకు కాంగ్రెస్ పార్టీ నుంచి బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేందుకు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారు. గెలిచే అభ్యర్థులను రంగంలోకి దింపాలనే ఆలోచన చేస్తున్నారు. ప్రధానంగా నగరంలోని మల్కాజ్‌గిరి పార్లమెంట్ నుంచి రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిని బరిలోకి దింపే ప్రయత్నాలు కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు సన్నహాలు చేస్తున్నట్లు సమాచారం. రేణుకాచౌదరీని మల్కాజ్‌గిరి నుంచి పోటి చేయించడం వల్ల ఖమ్మం నుంచి టీడీపీ సీనియర్ నేత, పోలిట్‌బ్యూర్ సభ్యుడు నామా నాగేశ్వర్‌రావును కాంగ్రెస్ అభ్యర్థిగా పోటికి దింపాలనే ఆలోచన చేస్తున్నట్లుగా తెలుస్తుంది. ఇదే విషయంపై తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యనేతలు పార్టీ హై కమాండ్‌కు కూడా ఒక నివేదిక ఇచ్చినట్లుగా కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ పొత్తులో భాగంగా టీడీపీ అభ్యర్థిగా సీఎచ్ మల్లారెడ్డి విజయం సాధిం చారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ ప్రాతినిధ్యం వహించగా.. 2014 ఎన్నికల్లో ఓటమి చెందారు. అయితే ఈ పార్లమెంట్ నియోజక వర్గంలో ఆంధ్రప్రాంతానికి చెందిన సెటిలర్స్ ఓట్లతో పాటు టీడీపీ ఓట్లను కూడా అనుకూలంగా మల్చుకునేందుకు అవకాశం ఉంటుందనే అభిప్రాయంతో ఉన్నారు.

ఇకపోతే తెలంగాణ అడపడుచుగా చెప్పుకునే రేణుకా చౌదరి మాల్కాజ్‌గిరి లోక్‌సభ నుంచి పోటి చేస్తే కాంగ్రెస్ విజయం సాధిస్తుందనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. రేణుకా చౌదరి గతంలో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కార్పోరేటర్‌గా పని చేశారు. పార్టీ నిర్ణయం మేరకు నడుచుకుంటానని కూడా రేణుకా చెప్పినట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇక పోతే ఖమ్మంలో టీడీపీకి చెందిన బలమైన నాయకుడు నామానాగేశ్వర్‌రావును కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చేందుకు మంతనాలు సాగిస్తున్నట్లుగా సమాచారం. ఖమ్మంలో నామాకు బలమైన కేడర్ ఉండటమే కాకుండా మంచి పేరుతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తారని అంటున్నారు. అయితే నామాను కాంగ్రెస్‌లోకి వచ్చే విషయంపై రేణుకా చౌదరీ వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. నామా కాంగ్రెస్‌లోకి వస్తే రాజకీయంగా ఇబ్బందులు తప్పవనే అంశతోనే రేణుకాచౌదరి అడ్డుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రయత్నాలు సఫలీకృతమైతే రెండు పార్లమెంట్ నియోజక వర్గాలు కాంగ్రెస్ ఖాతాలో పడుతాయని భావిస్తున్నారు.

17న కేసీఆర్ జన్మదిన వేడుకలు

- మంత్రి తలసాని ఆధ్వర్యంలో జలవిహార్‌లో భారీ ఏర్పాట్లు
- సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో ప్రత్యేక ఆయుష్ హోమం
- హాజరుకానున్న నిజామాబాద్ ఎంపీ కవిత



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈ నెల17వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు అత్యంత భారీగా జరగనున్నాయి. దీనికి నగరంలోని జల విహార్ వేదిక కాబోతోంది. ఇందులో పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు, వికలాంగులకు వీల్ చైర్లు, పేద మహిళలకు ఉచిత చీరల పంపిణీ కార్యక్రమాన్ని తలపెట్టారు. అలాగే సికింద్రాబాద్ లోని మహంకాళి దేవాలయంలో ప్రత్యేకంగా ఆయుష్ హోమం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఎంపీ కవిత ముఖ్యఅతిథిగా పాల్గొనున్నారు.

కాగా జలవిహార్‌లో తలపెట్టిన కేసీఆర్ జన్మదిన వేడుకల ఏర్పాట్లను గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన సృష్టికర్త , పేదల పెన్నిధి అయిన కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా జరపను న్నామన్నారు. అధికారాన్ని చేపట్టిన కేవలం నాలుగు ఏళ్లల్లోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుక పోతున్నదన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో దేశంలోని ఇతర రాష్ట్రా లకు తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇందుకు కేసీఆర్ తీసుకుంటున్న పలు సంస్కరణలే ప్రధాన కారణమని తలసాని అన్నారు. కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని సికింద్రా బాద్ మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజకార్యక్రమాలు, హోమాలను నిర్వహిస్తున్నా మన్నారు. ముఖ్యంగా ఆయుష్ హోమాన్ని చేపడుతున్నామన్నారు. తదనంతరం బన్సీలాల్‌పేటలోని చాచానెహ్రునగర్ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణ పనులకు శంకుస్థాపన ఉంటుందన్నారు. తదనంతరం జలవిహార్‌లో పెద్దఎత్తున కేసీఆర్ జన్మదిన వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి, సరోజిని దేవి కంటి ఆసుపత్రి డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరుగుతుందన్నారు. అలాగే ఉచిత వైద్య కంటి సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నామన్నారు. తదనంతరం వికలాంగులకు పెద్దఎత్తున ట్రైసైకిళ్ళను పంపిణీ చేయడంతో పాటు పేదమహిళలకు చీరలను అందజేయ నున్నామని తలసాని తెలిపారు. తదనంతరం జలవిహార్ లోనే పార్టీ నేతలకు, కార్యకర్తలకు భోజన సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కార్పొరేటర్లు, తెరాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి

- ప్రజా సమస్యలపై పోరాడండి
- పార్టీ బలోపేతానికి సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టండి
- తెలంగాణ తెదేపా నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు స్పందించాలని తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తెలంగాణ తెదేపా నాయకులకు సూచించారు. పార్టీ తప్పిదాలను వెలుగులోకి తెచ్చి ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించి గుర్తింపు తెచ్చుకోవాలని ఆయన చెప్పారు. తెలంగాణలో పార్టీ పరిస్థితిపై గురువారం ఆ పార్టీ నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పార్టీ తెలంగాణశాఖ అధ్యక్షుడు ఎల్.రమణ, నేతలు రావుల చంద్రశేఖరరెడ్డి, ఇ.పెద్దిరెడ్డితో పాటు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా సమస్యలపై చేసే పోరాటంలో తెలుగుదేశం ముందుండాలని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుని ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఆయన సూచించారు. గతంలో మాదిరిగా ఇకనుంచి దూకుడు పెంచాలని, ప్రతి అంశంపై నిర్దిష్టమైన అవగాహన పెంచుకునేలా కార్యకర్తలను కూడా సంసిద్ధం చేయాలని ఆయన సూచించారు. కార్యకర్తలకు ఉన్నత స్థాయిలో రాజకీయ అవగాహన పెంచేందుకు శిక్షణా తరగతులను దశల వారీగా నిరంతరం కొనసాగించాలని చంద్రబాబు సూచించారు. ఇటీవల నిర్వహించిన శిక్షణా తరగతులు కొత్త ఉత్సాహాన్ని నింపాయని, భవిష్యత్తులో వీటిని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు.

పార్టీని బలోపేతం చేసేందుకు సంస్థాగత నిర్వహణపై దృష్టి సారించాలని ఆయన సూచిం చారు. గ్రామస్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రజా సమస్యలపై స్థానికంగానే పార్టీ కార్య కర్తలు స్పందించేవిధంగా ఎప్పటికప్పుడు వారికి సూచనలు ఇవ్వాలని చంద్రబాబు చెప్పారు. గ్రామ కమిటీలతోనే క్షేత్రస్థాయి నుంచి పార్టీ నిర్మాణం జర గాలని, అప్పుడే కార్యకర్తలు ప్రజలతో మమేకమై పార్టీని బలోపేతం చేసేందుకు వీలవుతుందని ఆయన అన్నారు.

పార్టీ చేపట్టిన పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమం విజయవంతం అయ్యాయని రమణ ఈ సందర్భంగా చంద్రబాబుకు వివరించారు. ఈ శిక్షణా తరగతులను నిరంతరం కొన సాగిస్తామని ఆయన వివరించారు. ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి మంచి స్పందన వస్తోందని చెప్పారు. రైతాంగ సమస్యలపై శాసనసభ స్పీకర్, రాష్ట్ర మంత్రులను తమ పార్టీ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రాలు ఇచ్చిందని చంద్రబాబు కు ఆయన చెప్పారు. ప్రజా సమస్యలపై గళం విప్పుతున్నామని, ప్రతి అంశంపై చర్చించి ప్రభుత్వాన్ని నిల దీస్తున్నామని ఈ సందర్భంగా రమణ వివరించారు.

చంద్రబాబు స్పందిస్తూ, ప్రజా సమస్యలపై ప్రభుత్వ వైఫ్యలాలను ఎండగట్టడంలో కార్యకర్తలను చైతన్యవంతులను చేయాలని చంద్రబాబు చెప్పారు. పార్టీ నేతలతో ఈనెల 28న హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించి భవిష్యత్తు పార్టీ నిర్మాణంపై చర్చిద్దామని ఆయన పార్టీ నేతలకు వివరించారు. ఆ సమావేశంలోనే అన్ని విషయాలు కూలంకషంగా చర్చించి భవిష్యత్తు ప్రణాళిక నిర్ణయిద్దామని చంద్రబాబు చెప్పారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జానారెడ్డి

తొర్రూరు, ప్రభన్యూస్ : మేనిఫెస్టోలో ఇబ్బడి ముబ్బడిగా హామీలిచ్చి వాటి అమలును టీఆర్ఎస్ నాయకత్వంలో ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీ హోంమంత్రి, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత జానారెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా, తొర్రూరులోమీడియాతో మాట్లాడుతూ పిట్టల దొరను కేసీఆర్ మించిపోయాడని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కొత్త హామీలనిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాడన్నారు. వరంగల్ నగరాన్ని డల్లాస్ చేస్తానన్న సీఎం నగరాన్ని మురికి కూపంగా మారుస్తు న్నాడన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు పూర్తిగా అసంబద్ధమని, అర్హులకు మొండిచేయి చూపుతున్నారన్నారు. తెలం గాణ ఇచ్చిన కాంగ్రెస్ ను కేసీఆర్ నమ్మకద్రోహం చేశాడన్నారు. నిండు శాసన సభలో రాజ్యాంగంపై ప్రమాణం చేసి అబద్ధాలు చెప్పే ఏకైక వ్యక్తి కేసీఆరే అన్నారు. కాంగ్రెస్ మహాసముద్రమని, పార్టీకి ఆటుపోట్లు సహజమేనన్నారు. 2019లో కాంగ్రెస్ అధికారం లోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు ఇవ్వలేని చేతకాని ప్రభుత్వం ఇదేనని విస్మరించారు. బడ్జెట్ కేటాయింపుల్లో కేవలం 30శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారన్నారు. గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అధికారికంగా నిర్వహించేదుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో వరంగల్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్, పాలకుర్తి నియోజక వర్గ ఇన్‌చార్జ్ రాఘవరెడ్డి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.



(మొదటిపేజీ తరువాయి)

ఎర్రజొన్న రైతు కన్నెర్ర

జాతీయ రహదారులపై ధర్నాలు చేసిన రైతులు అధికారులు, ప్రజా ప్రతినిధులపై రాళ్ళ దాడికి సిద్ధమని ప్రకటించాయి. దీంతో నిజామాబాద్‌లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి ఇండ్లవద్ద పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్మూర్‌లో ఎర్రజొన్న రైతులు మహాధర్నాకు పూనుకున్నారు. అందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ మద్దతు తెలిపాయి. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉద్రిక్త పరిస్థితులను అదుపు చేసేందుకు పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కొన్నిచోట్ల పసుపు రైతులు నిరాహారదీక్షలకు సిద్ధమైనప్పటికీ పోలీసులు నిరాకరించి అడ్డుకున్నారు. రైతుల పక్షాన ఆయా రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలుపడంతో ఈ ఆందోళనలు మరింత ఉధృతమవుతున్నాయి. నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, కామారెడ్డి తదితర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం 144వ సెక్షన్ విధించింది. ఎలాంటి ర్యాలీలు, సభలు నిర్వహించకుండా చూడాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఇలా ఉండగా, రైతుల న్యాయబద్ధమైన ఆందోళనను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఎర్రజొన్న, పసుపు, మిర్చి, సుబాబుల్ రైతులకు మద్దతు ధరలు కల్పించి ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది. కనీస మద్దతు ధరల అంశం కేంద్రం పరిధిలోని అయి నందున రాష్ట్రం తనవంతు ప్రయత్నాలు మొదలు పెట్టింది. అదే సమయంలో కొన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులు అంచనాకు మించి దిగుబడి అయినందున కొనుగోలు సామర్థ్యాన్ని పెంచాలన్న డిమాండ్‌ను సీఎం కేసీఆర్ ప్రధాని దృష్టికి తీసుకువెళ్ళారు.

కనీస మద్దతు ధరల కోసం ఎర్రజొన్న, పసుపు రైతులు తీవ్రస్థాయిలో ఆందోళనకు దిగారు. గత వారం, పది రోజులుగా నిజామాబాద్, కామారెడ్డి, ఆర్మూర్, సిరిసిల్ల, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగుతున్నా ప్రభుత్వం తరపున ఎలాంటి హామీ రాకపోవడంతో గురువారం పెద్దఎత్తున రైతులు రోడ్డెక్కారు. ఈ పంటలకు సగటున ప్రతి ఎకరాపై రూ.50వేల నుంచి లక్ష వరకు నష్టపోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి ఏటా ఎర్రజొన్న పంట ప్రతి క్వింటాలుకు రూ.4,500 నుంచి రూ.6వేల వరకు ధర పలికేది. ఈ ఏడాది ఉత్పాదకత కాస్త పెరగడంతో మద్దతు ధరలు ఎక్కడా అమలుకాని పరిస్థితి నెలకొంది. అందుకు తోడు ఈ నాలుగైదు జిల్లాల్లో వ్యాపారులంతా సిండికేట్‌గా మారి రైతును దగా చేస్తున్నారు. పూర్తి అధ్వాన్నంగా రూ.1500లకు క్వింటాలు చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో ఎర్రజొన్న రైతు ఒక్కో ఎకరంపై రూ.50వేల వరకు నష్టపోవాల్సి వస్తోంది. అదే సమయంలో పసుపు రైతుల పరిస్థితి కూడా పూర్తి దయనీయంగా మారింది. గతంలో కాంగ్రెస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకోగా, క్వింటాలు పసుపు రూ.16వేల వరకు ధర పలికింది. ప్రస్తుతం పెట్టుబడి వ్యయం దాదాపు రెండింతలు పెరిగినప్పటికీ ఈ పంటకు మద్దతు ధర మాత్రం నాలుగింతలు పడిపోయింది. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా పండించే ఈ పంటకు ఎక్కడ కూడా రూ.2వేల నుంచి రూ.2,500 మించి కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడంలేదు. పసుపు రైతు ప్రతి ఎకరాపై సగటున రూ.లక్షనుంచి లక్షన్నర వరకు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదే సమయంలో మిర్చి రైతుల పరిస్థితి కూడా ఆందోళనకరంగా కనిపిస్తోంది. ఖమ్మంలో అత్యధికంగా పండించే మిర్చికి మద్దతు ధరలు అందక రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. గత ఏడాది మిర్చి ధర ప్రతి క్వింటాలుకు రూ.4,500 నుంచి రూ.6వేల వరకు పలికింది. కానీ ఈ ఏడాది ఆ ధర అమాంతం రూ.1500లకు పడిపోయింది.

వ్యాపారులంతా కుమ్మక్కై మిర్చి మద్దతు ధరలను అమలు కాకుండా చేస్తున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలకు పూనుకోకపోవడాన్ని నిరసిస్తూ రైతులు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వ్యాపారుల వద్ద లంచాలు తీసుకుంటున్న అధికారులు రైతుల పక్షాన ఎక్కడా మద్దతు ఇవ్వడం లేదంటూ ఆరోపిస్తున్నారు. ఇదే పరిస్థితిని సుబాబుల్ రైతులు కూడా ఎదుర్కొంటున్నారు. ప్రతి ఏటా కొనుగోలు చేసే వ్యాపారులే ఈ ఏడాది ధరను అమాంతం సగానికి తగ్గించేశారు. ఇదివరకు నేరుగా పేపర్ మిల్లుల ప్రతినిధులే రంగంలోకి దిగి రైతుల దగ్గర కేవలం రూ.5,500 చొప్పున కొనుగోలు చేసేవారు. కానీ ఈ ఏడాది దళారుల బెడద విపరీతమైంది. కంపెనీలకు, రైతులకు మధ్య దళారులు సిండికేట్‌గా మారి మద్దతు ధర ఎక్కడా రూ.4వేలకు మించకుండా చేస్తున్నారు. దీంతో రైతుల్లో ఆవేదన, ఆందోళన నానాటికి పెరుగుతోంది. మద్దతు ధరల కోసం ఉద్యమబాట పట్టాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

సోమవారం నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా ఎర్రజొన్న కొనుగోళ్ళు : మంత్రి పోచారం

ఎర్రజొన్న కొనుగోళ్ళ విషయాన్ని ఢిల్లీలో ఉన్న సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్ళామని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. త్వరలోనే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధరలు అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ అంశంపై గురువారం సచివాలయంలో నిజామాబాద్ ఎంపీ కవితతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. క్వింటాలుకు రూ.2300 చొప్పున కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.

ఇదంతా కాంగ్రెస్ రాద్ధాంతం : ఎంపీ కవిత

రెండు రోజుల క్రితమే ఎర్రజొన్న కొనుగోళ్ళపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని నిజామాబాద్ ఎంపీ కవిత తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వంపై బురద జల్లేందుకు కాంగ్రెస్ రాద్ధాందం చేస్తోందన్నారు. మార్కెట్ యార్డుల్లో ఆఖరి బస్తా వరకు ఎర్రజొన్నలను పూర్తిగా కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. గతంలో మద్దతు ధరలకోసం ఆందోళన చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కాల్పులు జరిపిందని ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు.

ఎర్ర జొన్న రైతుల

ఆమరణ నిరహార దీక్ష

నిషేధాజ్ఞలు ఉల్లంఘించి తరలివచ్చిన రైతులు

నిజామాబాద్ బ్యూరో / ఆర్మూర్‌రూరల్, ప్రభ న్యూస్ : ఎర్రజొన్న, పసుపు పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్మూర్ డివిజన్‌లోని 11 మండలాల రైతులు, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని జక్రాన్‌పల్లి మండలంలోని రైతులు గురువారం భారీగా తరలి వచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. డివిజన్‌లో 50 వేల ఎకరాలలో ఎర్రజొన్నను సాగు చేశారు. ఎర్రజొన్న వ్యాపారులు సిండికెట్‌గా మారి క్వింటాలుకు రూ.1800లకు కొనుగోలు చేస్తున్నారు. గతంలో క్వింటాలుకు రూ.4 వేలు ధర పలుకగా ఈసారి వ్యాపా రుల మయాజాలంతో ధరలేక ఎర్రజొన్న రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో పార్టీలకతీతంగా రైతులు ఏకమై రైతు ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి రైతులు ఆమరణ నిరాహారదీక్షచేపడుతారని ప్రకటించారు. రైతుల దీక్షలకు పోలీసు కమిషనర్ కార్తికేయ అనుమతి నివ్వకపోవడంతో పాటు ఆర్మూర్‌లో 48గంటల పాటు 144సెక్షన్‌ను విధిం చారు. ఉదయం 10గంటల నుంచి డివిజన్‌లోని వివిధ గ్రామాల నుంచి రైతులు మోటార్ సైకిళ్ళు, వాహ నాలు, ట్రాక్టర్లు, లారీలపై మండలంలోని మామిడిపల్లి చౌరస్తాకు తరలివచ్చారు. ఉదయం 11 గంటలకు వేల సంఖ్యలో రైతులు చేరుకోవడంతో పాటు నిషేధాజ్ఞలు ఉల్లఘించి 63వ జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. రహదారిపై రైతులు బైఠాయించి ఎర్రజొన్నకు క్వింటాలుకు రూ. 4,500లు, పసుపును క్వింటాలుకు రూ.15వేలకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని, పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించి రైతుల న్యాయమైన డిమాండ్‌ను అంగీకరించాలని కోరారు. రహదారిపైనే ఆర్మూర్ మండలం మంథని గ్రామానికి చెందిన రైతు నవీన్‌రెడ్డి ఆమరణ నిరాహరదీక్ష చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతో పాటు మరో 20 మంది రైతులు సైతం దీక్షలో కూర్చొవడంతో రైతు నాయకులు వారికి పూల మాలలు వేసి నినాదాలు చేశారు. మూడు గంటల పాటు రహదారిపై బైఠా యించిన రైతులు ఆ తర్వాత మామిడిపల్లి నుంచి కొత్తబస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని దీక్షచేస్తున్న వారితో సహా రోడ్డుపై బైఠాయించారు. మరో వైపు రైతు ఐక్య కార్యచరణ కమిటీ ప్రతినిధులు వి.ప్రభాకర్, మార చంద్రమోహన్, బి. దేవరాం, కంచెట్టి గంగాధర్, పోల సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి యాదాగౌడ్, పల్లపు వెంకటేష్, నచ్చు రాజన్న, తదితరులు టెంట్లు వేసి దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించగా సీఐలు సీతారాం, రమణరెడ్డిలు అడ్డుకున్నారు. ఐక్య కార్యచరణ కమిటీ ప్రతినిధులు పోలీసులు అధికారులతో చర్చించి పట్టుదలతో టెంట్లు వేసి దీక్ష శిభిరాన్ని ప్రారంభించారు.



హామీలను విస్మరించిన కేసీఆర్




హైదరాబాద్,ఆంధ్రప్రభ : సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపారని టీ పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ప్రజలు మోసపోయి.. టీఆర్ఎస్ అధికారం ఇచ్చారని ఆయన తెలిపారు. ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆయన దుయ్యబట్టారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వివిధ పార్టీలకు చెందిన దాదాపు 200 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పొన్నాల మాట్లాడుతూ సర్కార్ పరిస్థితి మేడిపండుతా ఉందన్నారు.

ఘనంగా పొన్నాల జన్మదిన వేడుకలు..

పొన్నాల జన్మదినం సందర్భంగా గురువారం ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రజా సంఘాలు, కుల సంఘాల నేతలు అభినందించారు.

అధిష్టానం నిర్ణయం మేరకే పోటీ



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ సీఎం చంద్రశేఖర్‌రావు ఇంకా మోసం చేస్తూనే ఉన్నారని మండలిలో విపక్ష నేత షబ్బీర్‌అలీ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లతోనే ముస్లింలకు విద్యా, ఉద్యోగం, ఉపాధి రంగాల్లో లాభం జరుగుతోందని ఆయన వివరించారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. ఎప్పటికైనా కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకా..? లేదా పార్లమెంట్‌కా పోటి చేసే విషయం హైకమాండ్ నిర్ణయం బట్టి ఉంటుందని ఆయన తెలిపారు. షబ్బీర్ అలీ జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద కేక్‌కట్ చేసి మాట్లాడారు. అనాథ పిల్లలకు దుస్తులు, స్కాలర్‌షిప్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబస్తీకి మాటలతో తాయిలాలు ఇవ్వకుండా.. నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే న్యాయం జరుగుతోందని మాజీ మంత్రి దానం నాగేందర్ అన్నారు.

'టీఆర్ఎస్‌కు ఓటు అడిగే హక్కు లేదు'

హైదరాబాద్,ఆంధ్రప్రభ: కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే హక్కులేదని మంత్రి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను టీ పీసీసీ అధికార ప్రతినిధి ప్యాట రమేష్ ఖండించారు. టీఆర్ఎస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలో మంత్రి హరీష్‌రావు చెప్పాలన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో మీడియతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పినందుకు టీఆర్ఎస్‌కు ఓటేయాలా..? అని ఆయన ప్రశ్నించారు. దళిత సీఎం, మూడు ఎకరాల భూ పంపిణీ, గిరిజనులకు, ముస్లింలకు చెరో 12 శాతం రిజర్వేషన్లు, రెండు పడక గదులు ఇళ్ల నిర్మాణం హామీలన్ని ఏమైనాయన్నారు. ఈ ప్రభుత్వం హయాంలో ఎన్నో కుంభకోణాలు జరుగు తున్నాయని ఆయన విమర్శించారు.

వాళ్లది గన్‌తంత్రం



- లెఫ్ట్ కూటమిపై నిప్పులు చెరిగిన మోడీ
- అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి
- త్రిపుర ఎన్నికల సభలో ప్రధాని పిలుపు

అగర్తల: త్రిపురలో అధికార వామపక్ష కూటమిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిప్పులు చెరిగారు. గురువారం అగర్తల ఎన్నికల ప్రచారసభలో పాల్గొన్న ఆయన, మాణిక్ సర్కార్ ప్రభుత్వాన్ని విమర్శలతో కడిగేశారు. ఈసారి భారతీయ జనతాపార్టీకి ఓటువేసి గెలిపించాలని త్రిపుర ప్రజలకు పిలుపునిచ్చారు. ఇక్కడి ప్రజలు గత 25 ఏళ్లుగా మాణిక్ సర్కార్ దుష్టపాలనతో ఇబ్బందులు పడుతున్నారు. ఈసారి ఎన్నికల్లో వాళ్లను అధికారం నుంచి దించేయండి. కమ్యూనిస్టు పార్టీకి గణతంత్రంపై నమ్మకం లేదు. వాళ్లు హింసతో కూడిన గన్‌తంత్రాన్నే విశ్వసిస్తారు అంటూ తనదైన శైలిలో విమర్శలు చేశారు. 7వ వేతన కమిషన్‌ను రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదు. కనీస వేతనాలకు చొరవ చూపరు. పే కమిషన్ నిబంధనలనూ అమలు చేయరు? ఏమిటి కారణం? అంటూ స్థానిక ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీజేపీని గెలిపిస్తే, ఆధునిక, కొత్త త్రిపురను నిర్మిస్తామని భరోసా ఇచ్చారు.

ఇదేనా మీ జాతీయవాదం?

- త్రిపురలో బీజేపీ కూటమిపై

కేరళ సీఎం ఎదురుదాడి



తిరువనంతపురం: బీజేపీ అవకాశవాద విధానాలపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అధికారం కోసం దేశ వ్యతిరేక, విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలపడాన్ని ఆయన తప్పుబట్టారు. జాతీయవాదం గురించి పెద్దపెద్ద మాటలు చెప్పే బీజేపీ, దేశ వ్యతిరేక శక్తులతో చెట్టాపట్టాల్ వేసుకోవడం ఎలాంటి సంకేతాలకు నిదర్శనమని ప్రశ్నించారు. గురువారం ఫేస్‌బుక్ వేదికగా విజయన్ ఈ మేరకు పదునైన విమర్శలు సంధించారు. 'బీజేపీ కూటమికి సీపీఐ కార్యకర్తలపై దాడి చేస్తున్నది. కానీ, హింసాత్మక వ్యూహాలతో వారు విజయం సాధించాలని అనుకోవడం పగటికలే. త్రిపుర ప్రజలు వ్యతిరేక శక్తులను, శాంతి వ్యతిరేకులను ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిపించరని విజయన్ నొక్కిచెప్పారు. మరోసారి వామపక్ష కూటమిని మెజార్టీ స్థానాల్లో గెలిపిస్తారని ధీమా వ్యక్తంచేశారు. శాంతి, సౌభ్రాతృత్వానికి త్రిపుర సంకేతమని, భిన్న మతాల ప్రజల ఐక్యతకు నిదర్శనమని, గిరిజను లు-గిరిజనేతరులు జాతివైరుధ్యానికి అతీతంగా కలిసిమెలిసి వుంటారని కితాబిచ్చారు.

2 లక్షల ఉద్యోగాలా?

- బీజేపీ మేనిఫెస్టోపై కాంగ్రెస్ ఎద్దేవా



షిల్లాంగ్: భారతీయ జనతా పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేసింది. ఉద్యోగాలు, పెన్షన్ల పేరుతో ప్రజలను మభ్యపెడు తున్నారంటూ ధ్వజమెత్తారు. సాధ్యంకాని హామీలతో ప్రజలతో మాయ చేయడంలో బీజేపీకి సాటి ఎవరూ లేరన్నారు. సీనియర్ నేత ఆనంద్ శర్మ మాట్లాడుతూ, బీజేపీ ఏ హామీలైనా ఇవ్వగలదు. సూర్యుడు... చంద్రుడు.. చుక్కలను కూడా తెచ్చిస్తామంటారు. దీనిపై మాకేమీ అభ్యంతరం లేదు. కలలను అమ్ముకోవడంలో వాళ్లతో ఎవరూ పోటీపడలేరు. ఈ విషయం దేశమందరికీ తెలుసు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆనంద్ శర్మ ధ్వజమెత్తారు. పర్యాటక రంగం ద్వారా రెండు లక్షల మంది యువకులకు ఉద్యోగాలు ఇస్తామంటున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం నిరుద్యోగ యువకులు ఉన్నది లక్ష మంది మాత్రమే. అంటే, మిగతా ఉద్యోగాలకు ఇతర రాష్ట్రాల నుంచి నిరుద్యోగులను ఇక్కడికి తరలిస్తారా? అంటూ నిలదీశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో రెండు కోట్ల మందికి ఉద్యోగాలిస్తామన్న ప్రధాని హామీలు ఏమేరకు నెరవేరాయో.. ఇదీ అంతేనంటూ ఎద్దేవా చేశారు. మూడున్నరేళ్లు గడిచాయి.. దేశవ్యాప్తంగా ఏడు కోట్ల మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.

ఉద్యోగాలు.. పెన్షన్లు

- రెండు లక్షల ఉద్యోగాలిస్తాం
- దినసరి కూలీలకు పెన్షన్లు
- మేఘాలయ ఓటర్లకు బీజేపీ హామీలు
- మేనిఫెస్టో విడుదల చేసిన రక్షణ మంత్రి

షిల్లాంగ్: మార్పు సాధించేందుకు ఇదే సరైన సమయం. అభివృద్ధి వేగంగా జరగాలంటే బీజేపీని గెలిపించండి అని కేంద్ర రక్షణ మంత్రి, బీజేపీ నాయకురాలు నిర్మాలా సీతారామన్ మేఘాలయ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ఆమె పార్టీ మేనిఫెస్టో విడుదల చేశారు. యువతకు రెండు లక్షల ఉద్యోగాలు.. దినసరి కూలీలకు పెన్షన్లు వంటి ఆకర్షణీయ హామీలను గుప్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి కేజే ఆల్ఫోన్స్, మాజీ ఎమ్మెల్యే సాన్‌బోర్ షులాయ్ పాల్గొన్నారు. ఎన్నికల్లో గనుక



బీజేపీని గెలిపిస్తే, రాష్ట్రాన్నిఅన్నిరం గాల్లో అభివృద్ధి బాట పట్టిస్తామని అభయమిచ్చారు. మేనిఫెస్టో విడుదల అనంతరం మీడియా



సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో మార్పు అవశ్యం. ఇందుకు బీజేపీ సిద్ధంగా ఉంది. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ అన్నదే బీజేపీ నినాదమని, దేశంలోని ప్రతి ఒక్కరికి అభివృద్ధి ఫలాలు అందాలన్నదే తమ పార్టీ అభిమతమని సీతారామన్ చెప్పారు. అధికార కాంగ్రెస్‌పై విమర్శలు సంధించారు. గత పదేళ్లుగా ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఆ పార్టీయే ఉన్నా, మేఘాలయ ముఖచిత్రాన్ని మార్చివేసే చక్కని అవకాశాన్ని వృథా చేశారని మండిపడ్డారు. మేఘాలయ పౌరుల ఆశయాలను, ఆకాంక్షలను ఢిల్లీకి తీసుకెళ్లి, నెరవేర్చాల్సిన బాధ్యతను వారి విస్మరించారని దుయ్యబట్టారు. 60 సీట్లున్న మేఘాలయ అసెంబ్లీకి 27న ఎన్నికలు జరుగుతున్నాయి. 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను గద్దెదించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కోసం బీజేపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. కాంగ్రెస్ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుండగా, బీజేపీ 47 చోట్ల అభ్యర్థులను నిలబెట్టింది.

జేడీఎస్‌తో ఎన్‌సీపీ పొత్తు!



బెంగళూరు: కర్నాటకలో ఎన్నికల హడావుడి మొదలైంది. పొత్తుల కోసం చర్చలు వేగం పుంజుకున్నాయి. బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డునేందుకు ప్రధాన పార్టీలైన ఎన్సీపీ, జేడీఎస్ వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఎన్‌సీపీ అధినేత శరద్‌పవార్, మాజీ ప్రధాని, జేడీఎస్ నేత దేవెగౌడ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ శ్రేణులతో సమావేశం అనంతరం పవార్ మీడియాతో మాట్లాడారు. 'దేవెగౌడ,కుమారస్వామి, పీజీఆర్ సింధియాలతో వేర్వేరు అంశాలపై మాట్లాడటం జరిగింది. రానున్న ఎన్నికల్లో కలసి పనిచేసే అవకాశం ఉంది. కర్నాటకలో ఎన్సీపీ ప్రాబల్యం పరిమిత స్థాయిలోనే ఉంది. అయినప్పటికీ బీజేపీని ఎదుర్కొనేందుకు జేడీఎస్‌తో కలిసి పనిచేయాలని భావిస్తున్నాం. మా భాగస్వామ్యం కేవలం సీట్ల పంపకాలకే పరిమితం కాదు. ఇద్దరం కలిసికట్టుగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మేనిఫెస్టో రూపొందిస్తాం. మేనిఫెస్టో తర్వాతే సీట్ల సర్దుబాటుపై చర్చిస్తాం' అని పవార్ వివరించారు. మహాకూటమిపై మీ అభిప్రాయం ఏమిటన్న ప్రశ్నకు బదులిస్తూ, ఎన్నికలకు ఇంకా బోలెడు సమయం ఉంది. ఇలాంటి వ్యూహాలపై ఇప్పుడే మాట్లాడటం తొందరపాటే అవుతుంది. మహాకూటమిని మేం కోరుకుంటున్నాం. ఈ వ్యూహం సాధ్యమో కాదో చెప్పలేను. ఇప్పటికైతే జేడీఎస్‌తో మాత్రమే సంప్రదింపులు జరిపాం. మిగతా పార్టీలను కలవాల్సి ఉంది' అని చెప్పారు. ఎన్నికల తర్వాత బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా అన్న ప్రశ్నకు అవకాశం లేదన్నారు. కాషాయ పార్టీతో ఎట్టిపరిస్థితుల్లోనూ కలసేది లేదని పవార్ స్పష్టం చేశారు.

ఆమె గెలవాలి..

- నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల బరిలో ఐదుగురు మహిళలు
- 54 ఏళ్ల రాష్ట్ర చరిత్రలో ఒక్కరూ ఎమ్మెల్యేకాని వైనం

కోహిమా: నాగాలాండ్ రాష్ట్రం ఏర్పడి 54 ఏళ్లయింది. ఇప్పటి వరకు 12 పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అయినా నేటికీ ఒక్కరంటే ఒక్క మహిళా ప్రతినిధి కూడా శాసనసభకు ఎన్నిక కాలేదు. మరో పదిరోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 60 స్థానాలకు 195 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో మహిళా అభ్యర్థులు ఐదుగురు మాత్రమే. వెడై యుక్రొను, మంగ్యాంగ్‌పులా నేషనల్ పీపుల్స్‌పార్టీ తరపున బరిలో నిలిచారు. దిమాపూర్-3, నొక్సెన్ స్థానాల్లో పోటీ చేస్తున్నారు. కాగా, బీజేపీ నుంచి రఖిలా నామినేషన్ వేశారు. కొత్తగా ఏర్పడ్డ ఎన్‌డీపీపీ తరపున అవాన్ కొన్యాక్‌కు అబోయి సీటు ఇచ్చారు. రేఖా రోజ్ డుక్రు అనే మహిళ స్వతంత్ర అభ్యర్థిగా చిజామి నియోజకవర్గం నుంచి పోటీకి సిద్ధమయ్యారు. ఇక అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) మహిళలకు అవకాశం ఇవ్వలేదు. అదేమంటే, మా పార్టీలో మహిళలెవరూ పోటీకి ఆసక్తి చూపలేదంటూ ఎన్‌పీఎఫ్ చీఫ్ వ్యాఖ్యానించడం కొసమెరుపు. ఈ ఐదుగురిలో రఖిలాను మినహాయిస్తే మిగతా ఐదుగురూ కొత్త ముఖాలే. విద్యావంతులైన ఈ ఐదుగురూ సామాజిక మాధ్యమాలను ప్రచారానికి విస్తృతంగా ఉపయోగించుకుంటున్నారు. కాగా, కిందటిసారి ఇద్దరు మాత్రమే పోటీకి సిద్ధమవగా, ఈసారి ఈ సంఖ్య ఐదుకి చేరడం హర్షణీయమని నాగాలాండ్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ అభిజిత్ సిన్హా వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి వెళ్లలేక పోయిన నాగా మహిళ, 1977లోనే పార్లమెంటులో అడుగుపెట్టింది. యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీకి చెందిన రానో షాజియా లోక్‌సభకు ఎన్నికై రికార్డు సృష్టించింది. అనారోగ్య కారణంగా 2015లో మరణించింది.

- బీజేపీ అభ్యర్థి రఖిల దివంగత మాజీ మంత్రి సతీమణి. భర్త మరణంతో 2006లో రాజకీయ ఆరంగేట్రం చేశారు.
- ఎన్‌డీపీ అభ్యర్థి అవాన్ కొన్యాక్ మాత్రం నాలుగు సార్లు ఎమ్మెల్యే అయిన నైవాంగ్ కొన్యాక్‌కు స్వయానా కుమార్తె. కొద్దిరోజుల కిందట తండ్రి మరణించడంతో ఆమెకు రాజకీయ ప్రవేశం లభించింది.
- మంగ్యాంగ్‌పులా వైద్యవృత్తి నేపథ్యం నుంచి వచ్చారు. రేఖారోజ్ పారిశ్రామిక వేత్త. తొలిసారి రాజకీయ క్షేత్రంలోకి అడుగిడారు.



- వీడెయు క్రొను సాధారణ సామాజిక కార్యకర్త. మహిళలు మాత్రమే సమాజంలో మార్పును తీసుకొస్తారని బలంగా విశ్వసించే వ్యక్తి.



ఎన్నికలపై సీఈసీ సమీక్ష



కోహిమా: 27న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, పాదర దర్శకంగా జరిగేందుకు పాటుపడాలని నాగాలాండ్ ప్రధాన ఎన్నికల అధికారి ఓపీ రావత్ ఉన్నతాధి కారులను ఆదేశించారు. రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారుల తో గురువారం ఆయన సమీక్ష జరిపారు. నిర్భయంగా పౌరులు పోలింగ్ బూత్‌కు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. నాగా ట్రైబల్ ఆర్గనైజేషన్స్ ఎన్నికల రోజు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గతేడాది నవంబర్ నాటికి, ఇప్పటికీ పరిస్థితులు చాలా వరకు మెరుగయ్యాయని రావత్ పేర్కొన్నారు. సమావేశంలో రావత్‌తోపాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సునీల్ అరోరా, అశోక్ లావాసా, డిప్యూటీ ఈసీ సుదీప్ జైన్, ఇద్దరు డైరెక్టర్ జనరల్లు దిలీప్ శర్మ, దిరేంద్ర ఓఝా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నరేంద్ర ఎన్ బుటోలియా తదితరులు పాల్గొన్నారు. మొత్తం 60 స్థానాలకు గాను 59 సీట్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. అంగామి-2 నియోజకవర్గం నుంచి ఎన్‌డీపీపీ చీఫ్ నైఫ్యూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఇక్కడ ఎన్నికల అవసరం లేకుండా పోయింది. ఎన్నికల ఏర్పాట్లపై అన్ని రాజకీయ పార్టీలు సంతృప్తి వ్యక్తం చేశాయని రావత్ వెల్లడించారు.

'మతాన్ని రుద్దకుండా ఉంటామంటే బీజేపీతో పొత్తుకు సిద్ధం



కోహిమా: నాగాలాండ్ శాసనసభ ఎన్నికలలో బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి తమ నాగా పీపుల్స్ ఫ్రంట్ సిద్ధంగానే ఉందని ముఖ్యమంత్రి టిఆర్ జెలియాంగ్ అన్నారు. అయితే బీజేపీ రాష్ట్రంలో బలవంతంగా మతాన్ని రుద్దే ప్రయత్నం చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ, ఎన్‌పీఎఫ్‌ల మధ్య విభేదాలు లేవని ఆయన అన్నారు. అయితే సంస్కృతీ, మతాలకు సంబంధించి వారు తమను డామినేట్ చేయడానికి ప్రయత్నించాలనుకునే ఎజెండాతో వస్తే అది సరికాదని జెలియాంగ్ అన్నారు. మతపరంగా డామినేట్ చేయడం కాని, సంస్కృతిని దెబ్బ తీయడం కాని జరుగకూడదని ఆయన చెప్పారు.

త్రిపురలో ప్రచారానికి తెర

షిల్లాంగ్: త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. 18న పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. 60 స్థానాలకు గాను 297 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం ఓటర్లు 25, 79, 060 మంది. వీరిలో మహిళా ఓటర్లు 12, 67, 785 మంది. 25 మందిసాధారణ పరిశీలకులు, 8 మంది పోలీసు పర్యవేక్షకులు, 19 మంది వ్యయగణన పరిశీలకులు విధుల్లో ఉన్నారు. 30వేల మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారు. 18 న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. కమ్యూనిస్టుల కంచుకోటపై ముప్పేట దాడికి దిగిన బీజేపీ, విజయం కోసం సర్వశక్తులు ఒడ్డింది. ప్రధాన పార్టీ యంత్రాంగాన్నంతా ఈశాన్య రాష్ట్రంలో మోహరింపజేసింది. మరోవైపు కామ్రేడ్లు తిరిగి అధికారంలోకి వచ్చేందుకు గట్టిగానే ప్రయత్నాలు చేశారు. బీజేపీ విమర్శ లను తిప్పికొడుతూ, ప్రభుత్వ పథకాల ఆధారంగా ప్రచారం కొనసాగించారు. ఆరోసారి అసెంబ్లీ సమరంలో గెలుపే ధ్యేయంగా వామపక్షశ్రేణులు పోలింగ్‌కు సిద్ధమయ్యాయి.

పోరుబాటే...మడమ తిప్పం!

- కీలక నిర్ణయాలకూ వెనుకాడం
- హోదా, ప్యాకేజీ ఒక్కటే - జైట్లీ చెప్పింది కూడా అదే
- కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా ఇచ్చింది ఏమీలేదు
- అన్ని సాధారణ కేటాయింపులే
- మా లెక్కలిస్తాం... బీజేపీ శ్వేతపత్రమివ్వాలి
- సమన్వయ కమిటీ భేటీలో ఏపీ సీఎం



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రయోజనాలు, హక్కులు సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తామని రాష్ట్రానికి న్యాయం జరిగేంతవరకు పోరాటం కొనసాగుతుందని మడమ తిప్పే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దీనికోసం అవసరమైన కార్యాచరణ రూపొందిస్తున్నా మని, అవసరమైతే త్వరలోనే ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోడానికి కూడా వెనకాడమని అన్నారు. ప్రత్యేక హోదా, ప్యాకేజీ రెండూ ఒకటేనని, పేరుమార్పే తప్ప అందులో ఏమున్నాయో దీనిలో కూడా అవే ఇస్తామని కేంద్రం చెప్పింది కాబట్టే ప్యాకేజీకి అంగీకరించామ న్నారు. 2016 సెప్టెంబరు 8న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అర్ధరాత్రి చేసిన ప్రకటనలో ఇదే విషయం స్పష్టంగా పేర్కొన్నారన్నారు. అప్పటి ప్రధాని ప్రకటించిన హామీలకు సమానమైన ప్రత్యేక ఆర్థిక సాయం ఇస్తామని దీనిని ఐదేళ్లపాటు కొనసాగి స్తామని ప్రకటన చేశారన్నారు. గురువారం ఉండవల్లిలో జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి చేసిన ప్రకటన సారాంశాన్ని మంత్రులకు, సభ్యులకు వివరించారు. ప్రత్యేక హోదాకు కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక సాయానికి తేడా ఏంటో ప్రశ్నించాలని దిశానిర్దేశం చేశారు. ఈ రెండింటికీ ఏ చిన్న తేడా కూడా లేదన్న విషయం ప్రజలకు వివరించాలని స్పష్టంచేశారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు తదిత అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇచ్చామని ఎప్పుడు, ఎక్కడ కేంద్రాన్ని కానీ, బీజేపీని గానీ ఇబ్బంది పెట్టలే దని అన్నారు. అయినా సరే అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తలసరి ఆదాయంలో పొరుగు రాష్ట్రాలకన్నా రూ. 35 వేలు తక్కువ ఉన్నామని ముఖ్యమంత్రి వివరించారు. 10 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో జరిగిన దుష్పరిణామాలవల్ల ఉమ్మడి రాష్ట్ర ఆదాయం అనుకున్నంతగా పెరగలేదన్నారు. చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ నగరాలు ఆయా రాష్ట్రాలకు అదనపు బలాలు అయ్యాయని, నవ్యాంధ్రకు అటువంటి రాజధాని నగరం లేకుండా పోయిందన్నా రు. కట్టు బట్టలతో నెత్తిన బండెడు అప్పుతో హైదరాబాద్ నుండి అమరావతికి తరలి వచ్చి మూడున్నరేళ్లు కష్టపడి రెండంకెల వృద్ధి సాధించగలిగామ న్నారు. రాష్ట్రానికి వచ్చినప్పుడు బస్సునుండే పరిపాలన సాగించి రేయింబవళ్లు కష్టం చేయడం వల్ల స్వల్ప కాలంలోనే దేశంలో మంచి గుర్తింపును సాధించగలిగామన్నారు. చాలా రంగాల్లో మిగిలిన రాష్ట్రాలకన్నా ముందంజలోఉన్నామని చెప్పారు.

మీరూ ఎంపీలతో రాజీనామా చేయించాలి

చంద్రబాబుకు జగన్ సవాల్



నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో: మీరు నిజంగా రాష్ట్రాభివృద్ధిని కోరుకుంటుంటే ప్రత్యేక హోదా కోసం జరుగుతున్న యుద్ధంలో మాతో కలిసి పోరాటం చేసేందుకు రండి.. అదేవిధంగా మా పార్లమెంట్ సభ్యులతోపాటు మీ ఎంపీలతో కూడా రాజీనామా చేయించండి... ఆంధ్రప్రదేశ్ నుంచి 25 మంది ఎంపీలు ఒక్కసారిగా రాజీనామా చేస్తే ఖచ్చితంగా కేంద్రం దిగి వస్తుందంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సవాల్ విసిరారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా గురువారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొండాపురం మండలం రేణమాలలో జరిగిన మహిళా ఆత్మీయ సమ్మేళనా సదస్సులో జగన్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా పోరుబాటలో భాగంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. మొదటి నుంచి వైసీపీ ప్రత్యేక హోదాకు కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మధ్యలో మాటమార్చి హోదాకు బదులు ప్యాకేజీకి అమ్ముడుపోయారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వైసీపీ ప్రత్యేక హోదాపై మరోసారి ఉద్యమాన్ని ఢిల్లీ పెద్దలకు వినపడేలా ఉధృతం చేయబోతోందని ఈ మహా యుద్ధంలో టీడీపీ కూడా కలిసి పోరాటం చేయాలని ఆయన అధికార పార్టీ శ్రేణులకు మహిళా సదస్సు వేదికగా పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క వాగ్దానాన్ని కూడా బాబు నెరవేర్చలేకపోయారన్నారు. ప్రతి మహిళను లక్షాధికారిని చేస్తానన్న ఆయన పొదుపు సంఘాలను సైతం నిలువునా మోసం చేశారన్నారు. మద్యం అమ్మకాలను దశలవారీగా నియంత్రిస్తానని చెప్పిన బాబు నాలుగేళ్ల కాలంలో 26 శాతం మద్యం అమ్మకాలను పెంచారన్నారు. ఫలితంగా ప్రతి గ్రామంలో మద్యం ఏరులై పారుతుందన్నారు. ఫలితంగా మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇటువంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైసీపీ అధికారంలోకి వస్తే దశల వారీగా రాష్ట్రవ్యాప్తంగా మద్యం నిషేదం అమలు చేస్తామన్నారు. అలాగే పొదుపు సంఘాలకు సంబంధించి ప్రస్తుతం బ్యాంకుల్లో ఉన్న అప్పులు మొత్తం తమ ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వారి కోసం ప్రత్యేకంగా నాలుగు దశల్లో రుణాలను కూడా అందిస్తామని ఆ సొమ్మును నేరుగా బ్యాంకులతో సంబంధం లేకుండా మహిళల చేతికే అందిస్తామన్నారు. అలాగే ప్రతి మహిళను పారిశ్రామికవేత్తలుగా చేస్తామన్న చంద్రబాబు నేడు ఆ మాటే మరిచి పొరుగు దేశాల పారిశ్రామికవేత్తల మెప్పు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని జగన్ చంద్రబాబును ఎద్దేవా చేశారు. వైసీపీ అధికారంలోకి వస్తే ఖచ్చితంగా ప్రతి మహిళకు అండగా ఉండడంతో పాటు వారికి అవసరమైన అన్ని వనరులను అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే ప్రతి మహిళకు ఇల్లు నిర్మించి ఉచితంగా ఇవ్వడంతో పాటు ఆ ఇంటిని ఆ మహిళ పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. భవిష్యత్తులో వారికి ఏదైనా బ్యాంకుల ద్వారా రుణం తీసుకోవాలంటే ఆ ఇంటి కాగితాలు వారికి పనికొచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల కోసం అవసరమైనన్ని పథకాలు ప్రవేశపెట్టి వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపుతామన్నారు. అంతకుముందు నగరి ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు రోజా మాట్లాడుతూ చంద్రబాబునాయుడుపై నిప్పులు చెరిగారు. ప్రతి మహిళను పారిశ్రామికవేత్తలను చేస్తానన్న బాబు తన భార్య భువనేశ్వరీ, కోడలు బ్రహ్మణిలను పారిశ్రామి కవేత్తలుగా చేసి మహిళలను నిలువునా మోసం చేశారని ఆమె ఈ సందర్భంగా బాబు పాలనపై ధ్వజమెత్తారు.

ఏప్రిల్ 6 కాదు... డెడ్‌లైన్ మార్చి 5

- మా మంత్రులు తప్పుకుంటారు
- బీజేపీతో కటీఫ్ చెప్పేస్తాం - మంత్రి

ఆదినారాయణరెడ్డి సంచలనం

- ఆతర్వాత సొంత అభిప్రాయమని వివరణ

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా తో సమానంగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జెట్లీ ప్రకటించిన విధంగా ప్రత్యేక ప్యాకేజీలోని అంశాలను నెరవేర్చకపోతే కేంద్ర క్యాబినెట్ లోంచి టీడీపీ మంత్రులు ఇద్దరు వైదొలుగుతారని మార్కెటింగ్ శాఖమంత్రి ఆదినారాయణరెడ్డి సంచలన ప్రకటన చేశారు. మార్చి 5వ తేదీ లోపు ప్రత్యేక ప్యాకేజీల అంశాలను ఏ ఒక్కటి అమలు చేయకపోయినా బీజేపీతో తెగతెపులు ఖాయమని మంత్రి ఖరాకండీగా చెప్పారు. గురువారం సాయంత్రం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఆదినారాయణ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సీఎం అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశంలో ఈ విషయంపైనే ప్రధానంగా చర్చ జరిగిందన్నారు. ప్రత్యేక ప్యాకేజీ 19 హామీలు నెరవేర్చకపోతే కేంద్రం నుంచి వైదొలగటంతో పాటు 2019 లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు బీజేపీకి దూరంగా ఉంటామన్నారు. హోదా ఇవ్వకపోతే విపక్షనేత జగన్ ఏప్రిల్ 6న వైకాపా ఎంపీలు రాజీనామా చేస్తారన్న ఘటనపై మంత్రి సవాల్ విసిరారు. వాళ్ళది పోస్ట్ నిర్ణయమని. మాది ఫాస్ట్ నిర్ణయమని అభివర్ణించారు.

ఏపీ అభివృద్ధికి జగనే విలన్

ఏపీ అభివృద్ధి విషయంలో విపక్షనేత జగన్ విలన్‌లా వ్యవహరిస్తున్నారని మంత్రి ఆదినారాయణరెడ్డి ధ్వజమెత్తారు. వైకాపా ప్రతిపక్షంలో ఉంటే రాష్ట్రానికి పరిశ్రమలు రావన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు జగన్ అసమ్మత ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఇందుకు నిదర్శనమే హోదా వస్తే ఆదాయం పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదని చెప్పటమేనన్నారు. హోదాకు ఆదాయపన్నుకు సంబంధమేంటని ప్రశ్నించారు. జగన్ రాష్ట్ర బడ్జెట్ కంటే రెండింతలు అక్రమాలు చేశారని ఆరోపించారు.



ఫ్లోరిడా పాఠశాలలో మారణహోమం

● 17 మంది విద్యార్థులను హతమార్చిన యువకుడు ● అత్యాధునిక ఆయుధాలతో దాడి ● విద్యార్థులే లక్ష్యంగా కాల్పులు ● ఉగ్రవాది తరహాలో ఫైరింగ్ ● దాడిని ఖండించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్: ఫ్లోరిడాలోని ఓ పాఠశాల తుపాకి మోతతో దద్దరిల్లింది. విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని ఓ యువకుడు ఈ మారణ హోమానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో 17 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో భారత సంతతికి చెందిన అమెరికన్ విద్యార్థులు కూడా ఉన్నారు. 19 ఏళ్ల యువకుడు నికొలస్ క్రూజ్‌ను పోలీసులు అనుమానితుడిగా గుర్తించారు. పార్క్‌ల్యాండ్‌లోని స్టోన్‌మన్ డగ్లస్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థిగా పోలీసులు నిర్ధారించుకున్నారు.

ఈ ఘటన అనంతరం పాఠశాల ఆవరణ అంతా నెత్తుటి మరకలతో నిండిపోయింది. ఈ పాఠశాలలో చాలా వరకు ఇండో-అమెరికన్ విద్యార్థులే విద్యనభ్యసిస్తున్నారు. క్రూజ్ ఈ దాడికి పాల్పడే ముందుకు సోషల్ మీడియాలో కొన్ని అభ్యంతరకరమైన పోస్టులు చేశాడని అధికారులు వివరించారు. ఉగ్రవాద దాడిని తలపించేలా ఈ క్రూజ్ మారణ హోమం సృష్టించాడు. తన మనస్సు అస్సలు బాగోలేదని, ఏదో సంచలనం చేయాలని అనుకున్నాడని, ఈ విషయాన్ని సోషల్ మీడియాలో ముందుగానే తాము గుర్తించామని, కాల్పులు జరిపింది క్రూజ్ అని నిర్ధారించుకున్నామని పోలీసు అధికారులు వివరించారు. ప్రస్తుతం అతన్ని కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నామని విలేకరుల సమావేశంలో తెలిపారు. అతని వద్ద నుండి ఏఆర్-15 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నామని, బుల్లెట్ మ్యాగ్జైన్స్ కూడా చాలా పెద్ద ఎత్తున అతని వద్ద కనుగొన్నారు. బుల్లెట్లతో పాటు గ్యాస్ మాస్కులతో పాటు స్మోక్ గ్రెనేడ్స్ కలిగి ఉన్నాడని వివరించారు.

ముందుగా క్రూజ్ దాడి చేస్తున్న సమయంలో అలారం బెల్ మోగించాడు. దీనికి ముందు రోజు పాఠశాలలో ఫైర్ డ్రిల్ నిర్వహించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతా ఒక్కసారిగా బయటికి వచ్చే ప్రయత్నం చేశారు. ఆ సమయంలోనే క్రూజ్ కాల్పులు జరుపుతూ వచ్చాడు. క్రూజ్ తన మాజీ ప్రియురాలి స్నేహితుడితో గొడవ పడటంతో క్రూజ్‌ను పాఠశాల నుండి సస్పెండ్ చేశారు. పాఠశాలలో అడుగు పెట్టినప్పటి నుండి క్రూజ్ కాల్పులు జరుపుతూనే ఉన్నాడు. దాడి జరిపిన సమయంలో ఇద్దరు విద్యార్థులు పాఠశాల భవనం సమీపంలోని ప్రాణాలు విడిచారు.



12 మంది విద్యార్థులు పాఠశాలలో చనిపోయారు. ముగ్గురు విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురు చికిత్స పొందుతున్నారని తెలిపారు. దేశానికి ఇదో పెద్ద మచ్చ అని, గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఇండో, అమెరికన్ ప్రజలు దేవుణ్ని ప్రార్థించాలని గాయపడిన ఓ విద్యార్థి తండ్రి స్నేహితుడు శేఖర్‌రెడ్డి తెలిపారు. కాల్పులు జరపడం దారుణం అని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ప్రకటించారు.

20 ఏళ్లలో స్కూళ్లలో జరిగిన కాల్పుల సంఘటనలు

జనవరి 23, 2018 : బెంటాన్‌లోని కెంటుకీలోని మార్షల్ కంట్రీస్కూల్‌లో కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో గబే పార్కర్ అనే విద్యార్థి తన తోటి 15 ఏళ్ల ఇద్దరు విద్యార్థులను తుపాకితో కాల్చి హతమార్చాడు.

డిసెంబర్ 7, 2017 : 21 ఏళ్ల విలియం న్యూమెక్సికోలోని పాఠశాలలో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు చనిపోయారు. అనంతరం విలియం తనను తాను కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఏప్రిల్ 10, 2017 : కాలిఫోర్నియాలో అండర్‌సన్ నార్త్ పార్క్ ఎలిమెంటరీ పాఠశాలలో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో తన భార్యను కాల్చి చంపాడు. అనంతరం 8 ఏళ్ల విద్యార్థిని కూడా పొట్టనపెట్టుకున్నాడు. తరువాత అండర్‌సన్ తనను తాను కాల్చుకున్నాడు.

అక్టోబర్ 1, 2015 : 26 ఏళ్ల క్రిస్ హార్పర్ మార్సర్ రోసేబర్గ్‌లో ఉంప్కా కమ్యూనిటీ కళాశాలలో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో 9 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. అనంతరం పోలీసులు అతన్ని కాల్చి చంపేశారు.

అక్టోబర్ 24, 2014 : 15 ఏళ్ల జైలిన్ ఫ్రైబర్గ్ మ్యార్స వెల్లీలోని పిల్‌చక్ ఉన్నత పాఠశాలలో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో తనను తాను కాల్చుకునే ముందుకు నలుగురు విద్యార్థులను గాయపర్చాడు.

జూన్ 7, 2013 : 23 ఏళ్ల జాన్ జవ్హారీ సాంటా మోనికా కళాశాలలో కాల్పులు జరిపాడు. ముందుగా అతని తండ్రి, తోబుట్టువును కాల్చి చంపేశాడు. అనంతరం అక్కడి నుండి కళాశాలకు వచ్చి ముగ్గురిపై కాల్పులు జరిపి హతమార్చాడు.

డిసెంబర్ 14, 2012 : 20 ఏళ్ల ఆడం ల్యాంజ సాండీ హుక్ ఎలమెంటరీ స్కూల్‌లో కాల్పులు జరిపాడు. అతని తల్లిని చంపేశాడు. 20 మంది చిన్నారులతో పాటు ఆరుగురు సిబ్బందిని హత మార్చాడు. అనంతరం తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఏప్రిల్ 2, 2012 : ఓక్లాండ్‌లో ఓ పూర్వ నర్సింగ్ విద్యార్థి మారణహోమం సృష్టించాడు. ఓయికోస్ యూనివర్సిటీలోని కొరియన్ క్రిష్టియన్ కళాశాలలో కాల్పులు జరిపి ఏడుగురిని హతమార్చాడు.

ఫిబ్రవరి 27, 2012 : 17 ఏళ్ల థామస్ చర్డాన్ ఉన్నత పాఠశాలలో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో 3 చని పోయారు.

ఫిబ్రవరి 12, 2010 : బయాలజీ ప్రొఫెసర్ అమీ బిషప్ అలాబయా యూనివర్సిటీలో మారణహోమం సృష్టించాడు. స్టాఫ్ మీటింగ్ కొనసాగుతున్న సమయంలో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో 3 తోటి ప్రొఫెసర్లు మరణించారు.

ఫిబ్రవరి 14, 2008 : స్టీవ్ కజ్మీర్‌జాక్ అనే పూర్వ విద్యార్థి నార్తర్న్ ఇలినియస్ యూనివర్సిటీలో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు.

ఫిబ్రవరి 8, 2008 : నర్సింగ్ విద్యార్థి లాటినా వీలియమ్స్ లూసియానా టెక్నికల్ కళాశాలలో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇద్దరు తోటి విద్యార్థులను అతను కాల్చి చంపాడు. అనంతరం అదే తరగతి గదిలో తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఏప్రిల్ 16, 2007 : వర్జినియా పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో సియుంగ్ హై చో 32 మందిని కాల్చి చంపాడు. తరువాత తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

అక్టోబర్ 2, 2006 : పెన్సిల్విేనియాలో చార్లెస్ కార్ల్ రాబర్ట్ ఒకే తరగతి గదిలోని ఐదుగురు అమ్మాయిలను చంపేశాడు. మొత్తం పది అమ్మాయిలను చంపేశాడు. ఈ ఘటన అమీష్ స్కూల్ హౌస్‌లో చోటు చేసుకుంది. అనంతరం తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

సెప్టెంబర్ 6, 2006 : 49 ఏళ్ల డగ్లస్ పెన్నిగాంటన్ షెపర్డ్ యూనివర్సిటీలో ఇద్దరిని హత మార్చాడు. మృతులు అతని ఇద్దరు కుమారులే కావడం గమనార్హం. 26 ఏళ్ల లోగన్, 24 ఏళ్ల బెంజమిన్‌ను క్యాంపస్ చూపిస్తున్న సమయంలో కాల్చి చంపేశాడు.

మార్చి 21, 2005 : 16 ఏళ్ల ఉన్నత పాఠశాల విద్యార్థి జెఫ్రీ వైస్ ఏడుగురిని కాల్చి చంపేశాడు. ఈ ఘటన మిన్నిసోటాలో చోటు చేసుకుంది. మృతుల్లో అతని తాతయ్య కూడా ఉన్నాడు. అతనో ట్రైబల్ పోలీస్ ఆఫీసర్. అనంతరం క్యాంపస్‌లో మరో ఇద్దరిని కాల్చి చంపేశాడు. తరువాత తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

సెప్టెంబర్ 24, 2003 : మిన్నిసోటలో 15 ఏళ్ల విద్యార్థి జాన్ జాసన్ మెక్ లాంగ్లిన్ రోకోరీ హైస్కూల్‌లో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇద్దరిని తుపాకితో కాల్చి చంపేశాడు.

అక్టోబర్ 29, 2002 : 41 ఏళ్ల రాబర్ట్ ఎస్ ఫ్లోర్స్ ముగ్గురు ప్రొఫెసర్లను కాల్చి చంపేశాడు. అరిజోనా స్కూల్ ఆఫ్ నర్సింగ్ యూనివర్సిటీలో ఈ ఘటన చోటు చేసుకుంది. అనంతరం తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

జనవరి 16, 2002 : నైజీరియన్ పీటర్ ఓడిగిజువా గ్రాడ్యుయేట్ విద్యార్థి. అతన్ని సస్పెండ్ చేయడంతో 41 ఏళ్ల పీటర్ అప్పల్‌చైన్ స్కూల్ ఆఫ్ లాలో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో డీన్‌తో పాటు ఓ ప్రొఫెసర్, విద్యార్థి చనిపోయాడు.

మార్చి 5, 2001 : చార్లెస్ ఆండ్ర్యు వీలియమ్స్ సంటానా స్కూల్ విద్యార్థి. ఇద్దరు విద్యార్థులను కాల్చి చంపేశాడు. 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కాలిఫోర్నియాలో చోటు చేసుకుంది.

ఏప్రిల్ 20, 1999 : ఇద్దరు యువకులు ఎరిక్ హరీస్, డైలన్ క్లీబోల్డ్ కొలంబిన్ హైస్కూల్‌లో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 11 మంది విద్యార్థులు, ఓ ఉపాధ్యాయుడు కూడా ఉన్నారు. అనంతరం వారు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

మార్చి 24, 1998 : ఇద్దరు బాలురులో 13 ఏళ్ల మైఖేల్ జాన్సన్, 11 ఏళ్ల ఆండ్రీ గోల్డెన్ పాఠశాలలో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నలుగురు అమ్మాయిలు చనిపోయారు.

కట్నం కోసం ఆమె అతడైంది



లక్నో : ఉత్తరప్రదేశ్‌కి చెందిన స్వీటీసేన్ మగరాయుడి అవతారం ఎత్తింది. కృష్ణసేన్‌గా పేరు మార్చుకుని 2013లో ఫేస్‌బుక్ ఖాతా ప్రారంభించింది. పురుషుడిగా నమ్మిస్తూ, యువతులకు ఆకర్షించే ప్రయత్నం చేసింది. ఆమె వ్యూహం ఫలించింది. ఇద్దరు యువతులను పెళ్లాడింది. ఆ తర్వాత వరకట్నం కోసం వారిని వేధించసాగింది. వారిలో ఒకరు వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన నైనిటాల్ పోలీసులు కృష్ణసేన్ ముసుగు తొలగించి స్వీటీసేన్ రూపాన్ని బయటపెట్టారు. 2014లో ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన హల్ద్వానీ యువతితో స్నేహం పెంచుకుంది. తనను తాను అలీఘర్ సీఎఫ్ఎల్ బల్బ్ వ్యాపారి కొడుకుగా పరిచయం చేసుకుంది. డబుల్ మాస్టర్ డిగ్రీ హోల్డర్ అయిన ఈ యువతిని వివాహం చేసుకుంది. ఆమె నుంచి 8.5లక్షలు కట్నంగా తీసుకుంది. అదనపు కట్నం కోసం వేధించడంతో గుట్టుబయట పడింది. కలదుంగికి చెందిన మరో మహిళను 2016లో పెళ్లాడింది. కృష్ణసేన్ అతడు కాదు.. ఆమె అని కలదుంగి మహిళ గుర్తించింది. అయితే, ఈ విషయం బయటపెడితే కట్నం డబ్బు తిరిగి ఇవ్వనని బెదిరించి నోరు మూయించింది. హల్ద్వానీ సాహసించి కేసు పెట్టడంతో కృష్ణసేన్ వేషానికి తెరపడింది.

బీజేపీకి వ్యతిరేకంగా భోపాల్ గ్యాస్ బాధితులు

భోపాల్ : ప్రపంచాన్ని కుదిపేసిన భోపాల్ దుర్ఘటన ప్రపంచ పారిశ్రామిక ప్రమాదాల్లో అత్యంత ఘోరమైంది. 33 సంవత్సరాల తర్వాత కూడా బాధితులు న్యాయం కోసం ప్రభుత్వాలపై పోరాడుతున్న దుస్థితే అందరినీ కలిచి వేస్తోంది. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో అధికారంలో ఉన్న బీజేపీ కూడా ఇదే హామీతో గద్దెనెక్కింది. అయితే యధావిధిగా తమ హామీలను మర్చిపోయింది. ఈ విషయమై పలు మార్లు బాధితుల తరుపున పోరాడుతున్న ఐదు సంఘాలు ప్రభుత్వాన్ని నిలదీసినా కనీస స్పందన కూడా లేదు. ఇక లాభం లేదనుకున్న భోపాల్ బాధిత సంఘాలు అన్నీ ఏక తాటిపైకి వచ్చాయి. ఈనెల 24న ముగ్నోలి, కోలారస్ అసెంబ్లీ నియోజకవర్గాలకు జరగనున్న ఉప ఎన్నికల్లో అధికార బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ ఉప ఎన్నికలతో పాటు వచ్చే సాధారణ ఎన్నికల్లో కూడా బీజేపీకి వ్యతిరేకంగానే తాము ప్రచారం చేయనున్నట్లు భోపాల్ గ్యాస్ పీడిత్ మహిళా స్టేషనరీ కర్మచారీ సంఘ్ అధ్యక్షురాలు రషీదా బీ చెప్పారు. అంతేగాక ఉప ఎన్నికలు జరుగనున్న ప్రాంతాలలో ప్రజలను చైతన్యవంతులను చేస్తాం అన్నారు. మేం ఏ పొలిటికల్ పార్టీకి అనుకూలం కాదు అని మరో పోరాట సమితి పేర్కొంది.

రక్త పరీక్షల్లో ప్రపంచ రికార్డు

ఖర్గోనే : ఆరు గంటల వ్యవధిలో 2,501 మందికి రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది లక్ష్య పరివార్ అనే సమాజ సేవా సంస్థ. ప్రేమికుల రోజును పురస్కరించుకుని మధ్యప్రదేశ్‌లోని భికన్గాన్ నగరంలో ఉన్న లక్ష్య పరివార్ అనే సమాజ సేవా సంస్థ కేవలం 6 గంటల వ్యవధిలో 2,501 మందికి రక్త పరీక్షలు నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. గతంలో అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన ఓ సంస్థ 1,460 మందికి 6 గంటల్లో రక్త పరీక్షలు నిర్వహించి రికార్డు నెలకొల్పింది. తాజాగా రికార్డును గోల్డెన్ బుక్ ప్రతినిధులు తమ కెమెరాలలో చిత్రీకరించారు. కార్యక్రమం అనంతరం లక్ష్యపరివార్ కార్యదర్శి చందన్ శర్మకు ప్రపంచ రికార్డు సర్టిఫికేట్‌ను అందజేశారు.

ఈడీ ఎదుట కార్తీ చిదంబరం

న్యూఢిల్లీ : ఐఎన్ఎక్స్ మీడియా మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం గురువారం ఎన్స్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎదుట హాజరయ్యారు. రెండు సార్లు ఈడీ ఎదుట ఆయన హాజరయ్యారు. సమన్లు జారీ చేసిన నేపథ్యంలో కార్తీ విచారణ అధికారి ఎదుట హాజరు కావాల్సి వచ్చిందని సంబంధిత శాఖ అధికారులు వివరించారు. ఫిబ్రవరి 2న మనీ లాండరింగ్ కేసు విషయంలో అధికారులు సమన్లు జారీ చేశారు. కేసుకు సంబంధిన విషయాల్లో గతంలోనే కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం జరిగిందని, తనను ఈడీ అధికారుల ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఇప్పటికే మద్రాస్ హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేశారు.

గోవా సీఎం పారికర్‌కు అస్వస్థత

పనాజి: గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ అస్వస్థతకు గురవటంతో ఆయన్ని ఆరోగ్య పరీక్షల కోసం ముంబై తరలించారు. ముందుగా గోవా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పటల్ (జిఎంసిహెచ్)కు చెందిన వైద్యులు ఆయనకు ప్రాథమిక పరీక్షల నిర్వహించగా ఫుడ్ పాయిజన్‌గా తేలిందన్నారు. బుధవారం రాత్రి సీఎం పారికర్ కడుపునొప్పిగా ఉందని తెలపటంతో తొలుత ఆయన్ని జిఎంసిహెచ్ ఆసుపత్రికి తరలించామని అధికారులు తెలిపారు. ప్రాథమిక పరీక్షల అనంతరం ఆయన్ని ముంబైకి తరలించారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందన్నారు.

గర్భవతిపై దాడి: ఆరుగురి అరెస్టు

కోజీకోడ్: ఓ గర్భవతిపై దాడి చేయడం దారా ఆమె గర్భస్రావానికి కారకులైన 6 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేరళ రాష్ట్రంలోని వెలమ్‌కోడ్ ప్రాంతంలో నివశిస్తున్న 4 నెలల గర్భవతి జోస్నా సిబి (28) భర్తకు, పక్కనే ఉన్న నివాస గృహానికి చెందిన వ్యక్తికి మధ్య స్థల వివాదం నడుస్తోంది. ఈ విషయంలో స్థానిక సీపీఎం నాయకుడు కలుగు జేసుకుని సిబిని, ఆమె భర్తను బెదిరించారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో సిబిని కడుపుపైన తన్నడంతో తీవ్ర రక్తస్రావం అయింది. వెంటనే ఆమెను దగ్గరలోని మెడికల్ కాలేజీ హాస్పటల్‌కు తరలించారు. అక్కడ ఆమెకు అబార్షన్ చేశారు. జనవరి 28న ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 8న ఈ ఘటనకు కారకుల్లో ఒకరిని అరెస్ట్‌చేయగా, మిగిలిన 5 మందిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు.

ఎయిర్‌క్రాఫ్ట్ కూలి పైలెట్ల మృతి



అస్సాం : ఏయిర్ క్రాఫ్ట్ కూలడంతో ఇద్దరు పైలట్లు మృతి చెందిన ఘటన అస్సాంలోని మజోలిలో గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను రక్షణ శాఖ ప్రతినిధి వివరించారు. చిన్నతరహా ఏయిర్ క్రాఫ్ట్ జోర్‌హట్ ఏయిర్ బేస్ నుండి బయలుదేరింది. ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించినట్టు అధికారులు తెలిపారు. మృతి చెందిన వారిలో వింగ్ కమాండర్‌లు జైపాల్ జేమ్స్, డి వాట్స్‌గా గుర్తించినట్టు తేజ్‌పూర్‌కు చెందిన రక్షణ శాఖ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ హర్షవర్ధన్ పాండే తెలిపారు. ప్రమాదాన్ని తెలుసుకుని ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని వివరించారు.

మరణభిక్ష పెట్టండి



న్యూఢిల్లీ: 'బతికేందుకు అవకాశం ఇవ్వనప్పుడు.. కనీసం మరణించేందుకైనా అనుమతి ఇవ్వండి. భారత ప్రభుత్వం నా బతుకుదెరువు గురించిన ఉద్యోగ అంశంపై స్పందించడం లేదు. రోజువారీ అవసరాలు తీరడం లేదు. ఈ పరిస్థితిలో న్యాయ పోరాటానికి అడ్వకేట్‌కు ఫీజులు కూడా చెల్లించడం సాధ్యంకాదు. లింగభేదం కారణంగా ప్రాథమికహక్కులు పొందలేకపోతున్నాను' అంటూ చెన్నైకి చెందిన ఓ హిజ్రా రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌కు లేఖ రాసింది. తనకు ఎయిరిండియా ఉద్యోగం నిరాకరించిన నేపథ్యంలో షణవి పొన్నుస్వామి ఈ మేరకు రాష్ట్రపతికి తనగోడు వెల్లబుచ్చింది. క్యాబిన్ క్రూ సిబ్బంది ఉద్యోగం ఇచ్చేందుకు ప్రభుత్వరంగ విమానయాన సంస్థ నిరాకరించింది. దీనిపై ఆమె గతేడాది నవంబర్‌లో ధర్మాసనాన్ని ఆశ్రయించింది. నాలుగు వారాల్లోగా బదులివ్వాలని ఎయిరిండియా, పౌరవిమానయాన సంస్థలను సుప్రీం ఆదేశించింది. అయినా ప్రయోజనం కనిపించలేదు. దాంతో మెర్సీకిల్లింగ్ కోరుతూ లేఖ రాసింది. వాస్తవానికి పొన్నుస్వామి ఎయిరిండియా ప్యాసింజర్ సపోర్టు ఎగ్జిక్యూటివ్‌గా ఏడాది కాలం పనిచేసింది. ఆ తర్వాత ట్రాన్స్‌జెండర్ ఆపరేషన్‌కు వెళ్లింది. తిరిగి వచ్చిన తర్వాత ఉద్యోగం కోసం రెండేళ్లలో నాలుగు సార్లు విజ్ఞప్తి చేసింది.

దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రాజీనామా



జోహెన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకోబ్ జుమా గురువారం తన పదవికి రాజీనామా చేశారు. పదవి నుండి వెంటనే తప్పుకోవాలని, లేనిపక్షంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడ్తామని అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేసినట్టు తెలుస్తున్నది. జుమా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు దేశాభివృద్ధి కోసం తోడ్పాటు అందించడం లేదని, సమస్యలు పరిష్కారంలో ఘోరంగా విఫలం అయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త ఉద్యోగాలు సృష్టించలేకపోయారని పలువురు విమర్శించారు. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ సమావేశమై వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని జుమాను ఆదేశించింది. దీనికి అతను ఒప్పుకోలేదు. అనంతరం తానే స్వయంగా గురువారం తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. ఆయన తొమ్మిదేళ్లు దక్షిణాఫ్రికాను పాలించారు. 2019లో ఆయన పదవీ కాలం ముగియనుండగా, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి పెంచడంతో ఆయన ఈ రాజీనామా సమర్పించారు.

నేపాల్ ప్రధానిగా కేపీ ఓలీ ప్రమాణం

ఖాట్మండూ: నేపాల్ ప్రధానమంత్రిగా కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ నేపాల్ (యుఎం ఎల్) నాయకుడు ఖడ్గప్రసాద్ శర్మ ఓలి గురువారం రెండోసారి ప్రమాణం చేశారు. ఆయన 2015 అక్టోబర్ 11 వతేదీ నుంచి 3016 ఆగస్టు 3వ తేదీ వరకూ ప్రధానిగా వ్యవహరించారు.ఈసారి ఆయన యుసిపిఎన్ -మావోయిస్టుల మద్దతుతో అధికారాన్ని చేపట్టారు. గతంలో ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు చైనాకు అనుకూల వైఖరిని అనుసరించారు. కొద్ది వారాల క్రితం మన విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ ఖాట్మండూను సందర్శించినప్పుడు భారత్‌తో సత్సంబంధాలు తన అజెండాలో ముఖ్యాంశమని ప్రకటించారు.ఓలీ చేత దేశాధ్యక్షురాలు బిద్యాదేవి భండారీ ప్రమాణం చేయించారు.ఆయన నేపాల్ 41వ ప్రధాని.ఈ సందర్భంగా జరిగిన సభలో పదవీ విరమణ చేసిన ప్రధాని,నేపాలీ కాంగ్రెస్ నాయకుడు షేర్ బహదూర్ దేవుబా ప్రసంగిస్తూ, తన హయాంలో ప్రజాస్వామిక పద్ధతిలో మూడంచల వ్యవస్థ ఏర్పడి పాలక వర్గాలు అధికారంలోకి వచ్చాయనీ, రాజకీయ సుస్థిరతకు ఇది నిదర్శనమని చెప్పారు.ఓలీ కూటమి 275 మంది సభ్యులు గల పార్లమెంటులో 121 సీట్లు సాధించి మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించిందని అన్నారు. నేపాలీకాంగ్రెస్‌కు 63 సీట్లు ,సీపీఎన్ మావోయిస్టుసెంటర్‌కు 53 సీట్లు వచ్చాయి.

ఉగ్రదాడిలో 12 మంది మృతి

కాబూల్: తాలిబాన్ ఉగ్రవాదులు ఉత్తర, పశ్చిమ అఫ్గానిస్థాన్ ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో ఇద్దరు చిన్నారులతో సహా పదిమంది పోలీసులు మరణించారు. గురువారం పశ్చిమ అఫ్గాన్ ప్రాంతంలో ల్యాండ్ మైన్ పేలి ఇద్దరు చిన్నారులు దుర్మరణం చెందారన్నారు. ఈ సందర్భంగా పశ్చిమ ఫరా పోలీస్ కమాండర్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ బుధవారం రాత్రి తాలిబాన్ ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఏడుగురు పోలీసులు మరణించారన్నారు. ఉత్తర ప్రాంతం అఫ్గాన్ పోలీస్ ప్రతినిధి కరీం యురేశ్ ఈ దాడులు సందర్భంగా మాట్లాడుతూ తాలిబాన్ దాడిలో కయ్యార్ జిల్లాలో బుధవారం ముగ్గురు పోలీసులు మరణించారని తెలిపారు. పదిమంది తాలిబాన్‌కు చెందిన ఉగ్రవాదులు కూడా ఎదురు దాడిలో మరణించారన్నారు. కాగా ఈ రెండు ప్రాంతాల్లో దాడులు జరిపింది మేమే అంటూ తాలిబాన్ ఉగ్రవాదులు ఎటువంటి ప్రకటన చేయలేదు.

అమెరికాలో ఇద్దరు ఎన్నారైలకు జైలు

వాషింగ్టన్: అమెరికాలో సిగరెట్లు స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డ భారతీయ సంతతికి చెందిన ఇద్దరిని ఫ్లోరిడాలోని ఫెడరల్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. అభిషేక్ శుక్లా, హరీష్ షభాయ్ పంచల్‌కు అమెరికా పోలీసులకు దొరకడంతో భారతదేశానికి చెందిన జుబ్లీ టొబాకో ఇండ్రస్టీస్ కార్పొరేషన్ తలదించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కంపెనీ 3,00,000 డాలర్ల ప్రాఫిట్‌ను వదులుకోవాల్సి వచ్చింది. 68 వేల కార్టూన్‌లలో నకిలీ సిగరెట్‌లను అమెరికన్ బ్రాండ్ న్యూపోర్ట్ సిగరెట్స్ పేరుతో దిగుమతి చేసుకోవడానికి కుట్ర పన్నారు.

రాహుల్‌పై అక్కసుతోనే విమర్శలు

● బీజేపీపై ఉద్ధవ్ థాకరే విమర్శ



ముంబై: భాజపా మాజీ మిత్రపక్షం శివసేన బీజేపీపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై కర్ణాటక మాజీ సీఎం ఎడ్యూరప్ప ఇటీవల చేసిన ఆరోపణలు చూస్తే భాజపాలో నెలకొన్న నైరాశ్యం వెల్లడవుతోందని శివసేన వ్యాఖ్యానించింది. ఇటీవల రాహుల్ గాంధీ చికెన్ తిని దేవాలయాన్ని సందర్శించారని ఆరోపించటం చర్చనీయాంశంగా మారిన సంగతి విదితమే. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బీజేపీకి గుజరాత్ ఎన్నికల్లో చుక్కలు చూపించిన సంగతి గుర్తుకువచ్చి భాజపా నేతలకు నిద్రపట్టడంలేదన్నారు. అదే పరిస్థితి కర్ణాటకలోనూ పునరావృతమవుతోందన్నారు. గుజరాత్ ఎన్నికల సందర్భంలోనూ రాహుల్ గాంధీ అనేక దేవాలయాలు సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో బీజేపీ నేతలు రాహుల్ గాంధీ హిందుత్వ నినాదాన్ని ఎక్కడ సొంతం చేసుకుంటారో అని భయపడి ఆయనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారని శివసేన తన అధికారక పత్రికలో పేర్కొంది. రాహుల్ గాంధీ తన సామర్థ్యంతో బీజేపీని ఆత్మరక్షణలో పడేస్తున్నారని వ్యాఖ్యానించింది. కాగా తాజాగా కర్ణాటకలో ఎన్నికల జోరు ఊపందుకోవటంతో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం ఊపందుకుంది. మరోవైపు రాహుల్ గుజరాత్ ఎన్నికల సమయంలో చేసిన ప్రచారం తరహాలోనే ఒకవైపు హిందూ దేవాలయాలు, మరోవైపు మసీదులను సందర్శించి అందరినీ కలుపుకొని ముందుకు దూసుకుపోతున్నారు. దీంతో కర్ణాటక బీజేపీ అభ్యర్థి ఎడ్యూరప్పకు కంటగింపుగా మారి రాహుల్‌పై మాంసం తిని దేవాలయాలకు వెళుతున్నారని విమర్శిస్తున్నారని శివసేన అధినేత ఉద్ధవ్ థాకరే అన్నారు.

రేపు సీడబ్ల్యూసీ సమావేశం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం శనివారం జరగనుంది. పార్టీ అధ్యక్షునిగా రాహుల్ గాంధీ ఎంపికను ధ్రువీకరించేందుకు త్వరలో ప్లీనరీ సమావేశాన్ని నిర్వహించే విషయమై అత్యున్నత విధాన నిర్ణాయక వేదిక వర్కింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారని సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ఏఐసిసి ప్రధాన కార్యాలయంలో వర్కింగ్ కమిటీ సమావేశం జరుగుతుందని వివరించారు. పార్లమెంటు రెండవ విడత బడ్జెట్ సమావేశాలు మార్చి ఐదవ తేదీన జరగనున్నాయి. ఈలోగా కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాన్ని నిర్వహించాలన్నది పార్టీ నాయకుల ఆలోచన.

ఎన్‌కౌంటర్లు ఆపం

యూపీ సీఎం యోగి

లక్నో: యూపీలో రోజు రోజుకూ పేట్రేగి పోతున్న రౌడీలు, కిడ్నాపర్లు, హంతకుల పట్ల యూపీ సర్కార్ ఉక్కుపాదం మోపుతోంది. చట్టానికి దొరక్కుండా తప్పించుకు తిరుగుతూ నేరాలను కొనసాగిస్తున్న వ్యక్తులను ఎన్‌కౌంటర్‌లలో హతమారుస్తున్నారు. ఈవిషయమై ఓ శాసనమండలి సభ్యుడు అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమాధానమిస్తూ.. పోలీస్ ఎన్‌కౌంటర్‌లను ఆపే ప్రసక్తే లేదు. పోలీసులు ప్రస్తుతం అవలంబిస్తున్న కఠిన వైఖరి వల్ల నేరాలు తగ్గుముఖం పడుతున్నాయి. అయినా కొందరు ఇంకా తమ నేర పూరిత ప్రవర్తనను మార్చుకోకుండా సంఘ విద్రోహ శక్తులుగా చెలామణి అవుతున్నారు. వారిపై ఉక్కుపాదం మోపడం తథ్యం. ఈ విషయంలో ప్రభుత్వానికి ప్రజా ప్రతినిధులు అండగా నిలవాలని ఆయన కోరారు.

అత్యాచారానికీ పరిహారం కడతారా?

● ఎంపీ సర్కార్‌పై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ: దేశ వాప్తంగా అత్యాచార బాధితులకు కేంద్రం ఇచ్చే 'నిర్భయ' ఫండ్ పంపకం విషయంలో మధ్య ప్రదేశ్ వైఖరిపై సుప్రీం కోర్టు తీవ్రంగా మండి పడింది. ఆ రాష్ట్రం కేంద్రం నుంచి గరిష్ఠంగా ఫండ్‌ను రాబట్టుకుని బాధితులకు మాత్రం కేవలం 6వేల నుంచి 6వేల 500 వరకూ పంపిణీ చేసింది. 2012 డిసెంబర్ 16న ఢిల్లీలో జరిగిన ఘోర అత్యాచారం, హత్య దేశాన్ని కుదిపేయడమే కాకుండా, మహిళల భద్రతను ప్రశ్నార్థకం చేసింది. దీంతో ఆ కేసుకు నిర్భయ అనే పేరును పెట్టింది కేంద్రం. ఆ పేరుతోనే మహిళల భద్రతకు పలు చట్టాలు చేయడంతో పాటు కోట్ల రూపాయల నిధులను కూడా కేటాయించింది. ఈ నిధుల సరఫరాలో ఉన్న వ్యత్యాసాలు, అవకతవకలపై పలు ఫిర్యాదులు సుప్రీం కోర్టు ముందుకు వచ్చాయి. దీంతో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలు కేంద్రం నుంచి పొందుతున్న నిర్భయ ఫండ్‌ను ఏ విధంగా సద్వినియోగం చేస్తున్నాయో అఫిడవిట్‌లు దాఖలు చేయాలంటూ సుప్రీం ఆదేశాలు జారీ చేసింది.

ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం 1,951 మంది రేప్ బాధితులకు ఒక కోటి రూపాయలను పంపిణీ చేసినట్లు అఫిడవిట్‌ను దాఖలు చేసింది. దీన్ని చూసిన జస్టిస్ మదన్ బి లోకూర్, దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు చూపిన అంకెలు గమనిస్తే ఒక్కో రేప్ బాధితురాలికి మీరు ఇచ్చింది సరాసరి 6 వేల నుంచి 6వేల 500 రూపాయలు. ఇదా మీరు చేస్తున్న సేవ. ఇదేనా మహిళల భద్రత పట్ల మీ చిత్తశుద్ధి. ఇది మీకు సిగ్గుగా అనిపించం లేదా? అంటూ వ్యాఖ్యానించింది బెంచ్. అలాగే అఫిడవిట్‌ను దాఖలు చేయని హర్యానాకు కూడా మొట్టికాయలు వేసింది. మీరు అఫిడవిట్ దాఖలు చేయకపోవడం చూస్తేనే తెలుస్తోంది మహిళల పట్ల మీరు ఎంత జాగ్రత్తగా ఉన్నారో. మీకు కావాల్సినంత సమయం తీసుకోండి. కానీ మీ రాష్ట్రంలోని మహిళల వద్దకు వెళ్లి మీ భద్రతకు మా బాధ్యత లేదు అని చెప్పండి అంటూ మందలించింది. అఫిడవిట్‌లు దాఖలు చేయని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు మరో 4 వారాల గడువును ఇచ్చింది.

ఇప్పుడు పట్టుకోండి చూద్దాం...

ముంబాయి : అక్రమార్కులను పట్టుకోవడానికి నిఘా వ్యవస్థలకు వంద కళ్లు ఉంటే.. వారి నుంచి తప్పించుకోవడానికి వేయి ఉపాయాలను సిద్ధం చేసుకుంటున్నారు అవినీతి పరులు. విధి నిర్వహణలో లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఓ లేడీ పోలీస్ కానిస్టేబుల్ ఏసీబీ ఎత్తులకు పై ఎత్తు వేస్తూ లంచంగా తీసుకున్న వంద నోట్లను నోట్లో వేసుకుని నమిలేసి ఇప్పుడు పట్టుకోండి చూద్దాం అన్నట్లు ఫోజ్ పెట్టింది.

మహారాష్ట్ర కొల్హాపూర్‌లోని చాంద్‌ఘడ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తోంది దీపాలి ఖడ్కే అనే లేడీ కానిస్టేబుల్. స్థానికంగా నివాసం ఉండే ఓ యువకుడు పాస్‌పోర్ట్ కోసం అప్లై చేశాడు. దీనికి సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి కాండాక్ట్ సర్టిఫికెట్ అవసరమయింది. ఇందు కోసం దీపాలి ఖడ్కే అతన్ని 300 లంచం డిమాండ్ చేసింది. విషయం ఏసీబీకి తెలియజేసిన సదరు యువకుడు పోలీస్ స్టేషన్ రికార్డ్స్ రూంలో ఆమెకు లంచం సొమ్ము అందజేశాడు. వెంటనే ఏసీబీ అధికారులు రావడంతో తాను ట్రాప్‌కు గురయ్యానని తెలుసుకున్న ఆమె ఆ నోట్లను నోట్లో వేసుకుని నమిలేసింది. దీంతో ఆమెకు షాక్ ఇస్తూ ఏసీబీ అధికారులు మహిళా కానిస్టేబుళ్లను రంగంలోకి దింపి, ఆమె నోటి నుంచి నోట్లను కక్కించి కేసు నమోదు చేశారు.

నేడు రెండో మహిళా క్రికెట్ టీ20

- సిరీస్ గెలుస్తాం
- కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్

ఈస్ట్ లండన్(దక్షిణాఫ్రికా): తొలి టీ20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై గెలిచి శుభారంభం చేసిన భారత మహిళా క్రికెట్ జట్టు స్థానిక బఫెలో పార్క్‌లో నేడు జరుగనున్న రెండో టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌కు సన్నద్ధమయింది. వన్డే సిరీస్‌ను 2-1 ఆధిక్యంతో గెలుచుకున్న మిథాలి సేన, మంగళవారం జరిగిన టీ20 మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్‌కౌర్ ఆధ్వర్యంలో సఫారీ జట్టుపై 7 వికెట్ల తేడాతో విజయం సాధించి ఆత్మ విశ్వాసంతో ఉంది. తొలి టీ20లో దక్షిణాఫ్రికాను 164 పరుగులకే పరిమితం చేసిన భారత్, అనంతరం 18.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి ప్రశంసలను మూడగట్టుకుంది.ఈ ఆటలో మిథాలి రాజ్ ఆడిన ఇన్నింగ్స్ కీలక పాత్ర పోషించింది. మిథాలి 54 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. తొలిసారిగా అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడుతున్న జెమివా రోడ్రిగ్స్‌తో(37) కలిసి మిథాలి 69 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. అనంతరం నాలుగో వికెట్‌కు వేద కృష్ణమూర్తితో కలిసి మరో 52 పరుగులను జట్టు స్కోరుకు కలిపింది. వేద 37 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. టీ20 అంతర్జాతీయ మ్యాచుల్లో మిథాలి తన 11వ అర్ధ శతకంను పూర్తిచేసుకుంది. ఈ పర్యటనలో అద్భుతంగా రాణిస్తున్న స్మృతి మంధాన నేటి మ్యాచ్‌లోకూడా మరోసారి తన ఆటతో ఆకట్టుకోవడానికి సిద్ధంగా ఉంది. తొలిసారిగా అంతర్జాతీయ కెరియర్‌లోకి అడుగు పెట్టిన ముంబయి క్రీడాకారిణి 17ఏళ్ల రోడ్రిగ్స్ 27 బంతులెదుర్కొని 37 పరుగులు చేసి తనను జట్టులోకి తీసుకోవడం సరైనదేనని ఆమె తన ఆటతో నిరూపించింది. రోడ్రిగ్స్ చేసిన పరుగుల్లో నాలుగు ఫోర్లు, ఒక సిక్స్ ఉన్నాయి. సున్నా పరుగులకే రనౌటయిన స్కిప్పర్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేటి మ్యాచ్‌లో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతుందని ఆశిద్దాం. బ్యాటింగ్ పరంగా భారత మహిళా జట్టు బలంగా ఉన్న ప్పటికి బౌలిం గ్‌లో కొంచెం బలహీనంగా కన్పిస్తోంది. గాయం కారణంగా పేస్ బౌలర్ జులన్ గోస్వామి సిరీస్‌కే దూరకావడం ఇందుకు కారణమని చెప్పవచ్చు. ఫాస్ట్ బౌలర్లు పూజా వస్త్రాకర్, శిఖా పాండే చెరొక వికెట్ తీసినా పరుగులు ఎక్కువగా ఇచ్చారు. టీ20 స్పెషలిస్ట్ స్పిన్నర్ అంజు పాటిల్ 4 ఓవర్లు బౌలింగ్ చేసి 23 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి రాణించింది. ఆమెకు పూనం యాదవ్, రాధా యాదవ్, హర్మన్‌ప్రీత్‌లనుంచి సహకారం లభిస్తే దక్షిణా బ్యాట్స్‌మన్లకు తిప్పలు తప్పవు. దక్షిణాఫ్రికా జట్టును పరిశీలిస్తే.. ఓటములనుంచి పాఠాలు నేర్చుకొని ఆత్మవిశ్వాసంను కూడగట్టుకొని ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌పై ఆశలను నిలబెట్టుకోవాలని చూస్తోంది. మెరుపు ఇన్నింగ్స్ ఆడిన క్లోయి ట్రైయాన్ కేవలం 7 బంతుల్లో 32 పరుగులు చేసింది. సఫారీల బ్యాట్స్‌మన్లు భారత్ బౌలింగ్‌ను దీటుగానే ఎదుర్కొంటున్నారు. స్కిప్పర్ డేన్ వ్యాన్ కెయికెర్క్, లిజెల్లీ లీ, డు ప్రీజ్, డి క్లెర్క్ మంచి ఫామ్‌లోనే ఉన్నారు. టీ20లో పరిస్థితి వేరు కాబట్టి అవసరాన్ని బట్టి రాణిస్తేనే జట్టు విజయానికి తోడ్పడినవారవుతారు. నెకెర్క్ మీడియాతో మాట్లాడుతూ.. జట్టును మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని తెలిపింది. ఫీల్డింగ్‌లో కూడా మా జట్టు మునపటి స్థాయిలో రాణించటంలేదు. దీనిపై దృష్టి పెట్టాల్సి అవసరముందని పేర్కొంది. సిరీస్ మిగతా మ్యాచుల్లో మేము పుంజుకుంటాం అని నెకెర్క్ ఆశాభావం వ్యక్తం చేసింది



క్రీడాప్రభ

దక్షిణాఫ్రికా టీ-20 జట్టుకు డుమిని సారథ్యం

పోర్ట్ ఎలిజబెత్: భారత్‌తో టీ-20 సిరీస్‌లో పాల్గొనే దక్షిణాఫ్రికా జట్టుకు జెపి డుమిని సారథ్యం వహించనున్నాడు. భారత్‌తో డర్బ న్‌లో తొలి వన్డే మ్యాచ్ ఆడుతున్న సమయంలో కెప్టెన్ డు ప్లెస్సిస్ చేతి వేలుకు గాయంతో మిగతా వన్డేలతో పాటు టీ-20లకు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు మంగళ వారం ఒక ప్రకటన చేస్తూ భారత్‌తో జరిగే టీ-20 సిరీస్‌కు డుమిని కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని వెల్లడించింది. కాగా టీ-20 సిరీస్‌కు ప్రస్తుత కెప్టెన్ మర్‌క్రమ్, సీనియర్ బ్యాట్స్‌మన్ హషీం ఆమ్లా, లెగ్ స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్‌లకు రెస్ట్ ఇచ్చారు. అయితే ఆఫ్ స్పిన్నర్లు తాబారిజ్ షమ్సి, ఆరోన్ ఫాన్‌గిసోలకు అవకాశం కల్పించారు. బ్యాట్స్‌మన్ క్రిస్టియాన్ జొంకర్ జట్టులోకి వచ్చాడు. కీపర్ హెన్రిచ్ క్లాసెన్, ఫాస్ట్ బౌలర్ జూనియర్ డాలా కూడా తొలిసారిగా టీ-20 జట్టులోకి వస్తున్నారు. ఫాస్ట్ బౌలర్ మోర్కెల్, రబాడా ఎన్గిడిలు కూడా జట్టులో స్థానం కోల్పోయారు.

దక్షిణాఫ్రికా టీ20 జట్టు: జెపి డుమిని(కెప్టెన్) ఫర్హాన్ బెహార్దీన్, జూనియర్ డాలా, డివిల్లియర్స్, హెండ్రిక్స్, క్రిస్టియాన్ జొంకర్, క్లాసెన్, మిల్లర్, డేన్ పీటర్సన్, ఆరోన్ పాన్‌గిసో, ఆండిలే ఫెహ్లుక్‌వాయో, తాబారిజ్ షమ్సి, జోన్ జోన్ స్మట్స్.





నేడు చివరి వన్డే

సిరీస్ గెలిచి ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్ర స్థానం పొందిన భారత్ జట్టు చివరి వన్డేకు రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. సిరీస్‌ను 5-1 ఆధిక్యంతో గెలుచుకోవాలని భావిస్తుండగా, ఆతిథ్య జట్టు చివరి వన్డేలో గెలిచి వచ్చే టీ20 సిరీస్‌కు ఆత్మవిశ్వాసం కూడగట్టుకోవాలనే యోచనలో ఉంది. సూపర్ స్పోర్ట్స్ మైదానంలో ఇటీవల భారత్ ఆడిన రెండో వన్డేలో.. రెండో టెస్టులో స్పిన్నర్లు విజృంబించారు. ప్రస్తుత మ్యాచ్ డే నైట్ కాబట్టి బంతి జారేపోయే అవకాశం ఎక్కువని.. స్పిన్నర్లు కష్టపడాల్సి ఉంటుందని గ్రౌండ్ క్యురేటర్ అంచనా.

- ఆధిక్యాన్ని పెంచుకుంటాం: కోహ్లీ
- మా వ్యూహం మార్చాం: దక్షిణాఫ్రికా కెప్టెన్ మర్‌క్రమ్

సా. 4.30 గం. నుంచి సోనీ టెన్ 1,2,3 ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం

సెంచూరియన్: నేడు జరుగ నున్న చివరి వన్డేకు దక్షిణాఫ్రికా, భారత జట్లు సమాయత్త మయ్యాయి. చారిత్రాత్మక సిరీస్ విజయం తో భారత్ మంచి ఊపుమీదుండగా, ఓటమితో కుంగిన దక్షిణాఫ్రికా సిరీస్‌లో చివరి వన్డేలో గెలిచితీరాలన్న పట్టుదలతో ఉంది. ఆరు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో కోహ్లీ సేన 4-1 ఆధిక్యంతో సిరీస్‌ను ఇప్పటికే కైవసం చేసుకుని చివరి వన్డే గెలిచి సిరీస్ 5-1 గెలవాలని భావిస్తోంది. ఇదే విషయాన్ని కెప్టెన్ కోహ్లీ ప్రకటిస్తూ.. చివరి వన్డేలో గెలిచి తమ ఆధిక్యాన్ని ఐదుకు పెంచుకుంటామని తెలిపాడు. అయితే వర్షంతో ప్రభావితమైన జొహన్నెస్‌బర్గ్‌లో ఆడిన నాలుగో వన్డేలో భారత్ పరాజయం పొందింది. ఐదో వన్డేలో విజయం తో భారత్ ఐసీసీ వన్డే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అగ్ర స్థానాన్ని దక్షిణాఫ్రికానుంచి కైవసం చేసుకుంది. భారత్ తన ఫామ్‌ను త్వరలో ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌లో కూడా కొనసాగించాల్సి ఉంటుంది. శ్రీలంక టూర్ తర్వాత భారత ఆటగాళ్లు బిజీ షెడ్యూల్లో పడ్డారు. నిరంతరంగా ఆడుతూ పోవడంతో ఈ ఏడాదిలో జరుగనున్న క్రికెట్ పోటీల్లో వారు తగిన సామర్థ్యం ప్రదర్శించలేకపోవచ్చు. దక్షిణాఫ్రికా పర్యటన అనంతరం, లేదా దక్షిణాఫ్రికాతో ఆడనున్న టీ20 జట్టులో మార్పులుండవచ్చు. ఈ విషయాన్ని కెప్టెన్ కోహ్లీ ఇటీవల చూచాయగా పేర్కొన్న విషయం తెలిసిందే.

పేస్ బౌలర్లపై ఒత్తిడి తగ్గించాలి

ముఖ్యంగా పేస్ బౌలర్లు భువనేశ్వర్ కుమార్, బుమ్రాలు తీవ్రంగా ఒత్తిడికి గురవుతున్నారు. శ్రీలంక టూర్ నుంచి చూస్తే బౌలర్లు భువనేశ్వర్ కుమార్ ఇప్పటివరకు 19 ఒడిఐలు, రెండు టెస్టులు, ఆరు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడగా, బుమ్రా 20 ఒడిఐలు, 8 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు దక్షిణాఫ్రికాలో మూడు టెస్టులు ఆడాడు. వచ్చే పోటీల దృష్ట్యా వీరికి కొంత విశ్రాంతి ఇస్తే వారు రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ బరిలోకి దిగుతారని క్రీడావిశ్లేషకులు అంచనా. ప్రత్యామ్నాయంగా భారత్ సెకండ్ లైనప్ పేస్ దాడిపై దృష్టిసారిస్తే.. శ్రీలంక టూర్ తర్వాత ఆడిన 20 వన్డేల్లో భువనేశ్వర్- బుమ్రా జోడీ కలిసి ఆడిన సందర్భాలు ఒకే ఒక్క వన్డే (బెంగళూరులో ఆస్ట్రేలియాపై ఆడిన వన్డే)లో ఉన్నాయి. 2019లో జరుగనున్న ప్రపంచకప్‌కు సమాయత్తం కావడానికి ప్రధాన బౌలర్లయిన వీరిద్దరికి తగిన విశ్రాంతి ఇచ్చి ప్రస్తుత మ్యాచుల్లో ఇతర బౌలర్లను ఆడిస్తే రెండువిధాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణుల భావన.

పేసర్ మహ్మద్ షమి, శార్దూల్ ఠాకూర్‌లు జట్టులో ఉన్నప్పటికి ఈ పర్యటనలో ఉన్నప్పటికి షమికి మాత్రమే టెస్టుల్లో అవకాశం రాగా బాగానే రాణించాడు. ఠాకూర్‌కు ఇంకా ఆడే అవకాశం రాలేదు. భారత్ ప్రస్తుతం బాగా రాణిస్తున్న భువీ- బుమ్రా బౌలింగ్‌పైనే నిర్భరమవుతున్నప్పటికి, వారికి 100 శాతం ప్రత్యమ్నాయ బౌలర్లను భారత్ ఇంకా సమకూర్చుకోలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. షమిని, ఇశాంత్ శర్మలు టెస్టుల్లో పర్వాలేదనిపించారు. ముఖ్యంగా షమి మూడో టెస్టులో భారత్ గెలవడంలో కీలక భూమిక పోషించాడు. మొత్తం రెండు ఇన్నింగ్స్‌ల్లో షమి 6 వికెట్లు తీశాడు. ఇశాంత్ మూడు వికెట్లు తీశాడు. మొత్తం మీద వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు భారత్ బౌలింగ్ వనరులను మెరుగుపరచడమేకాక, పెంచుకోవాల్సిన అవసరముంది. స్పిన్నర్లకు భారత్‌లో కొరతలేదని చెప్పవచ్చు, చాహల్, యాదవ్, ఆశ్విన్, జాదవ్‌లతోపాటు పార్ట్ టైమర్లు ఉన్నారు.

మిడిలార్డర్ మెరుగు పడాలి

ఇక భారత్ బ్యాటింగ్ విషయానికి వస్తే.. భారత మిడిలార్డర్ మెరుగు పడాల్సిన అవసరముంది. నాలుగు నుంచి ఏడవ నంబర్ బ్యాట్స్‌మన్ల మధ్య పరుగుల భాగస్వామ్యం తక్కువగా నమోదవుతోంది. డర్బన్ వన్డేలో రహానే రాణించగా, రెండో వన్డేలో మిడిలార్డర్ పూర్తిగా విఫలమైంది. నాలుగో వన్డేలో ధోనీ 42 పరుగులుచేసి రాణించాడు. మిగతావారు విఫలమయ్యారు. ఐదో వన్డేలో శ్రేయాస్ అయ్యర్ పర్వాలేదనిపించగా మిగతా ఆటగాళ్లు ఉసూరుమనిపించారు. పాండ్యా ఆడిన నాలుగు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 26 పరుగులు మాత్రమే చేశాడు. టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్లు పర్వాలేదనిపించారు. రోహిత్ శర్మ నాలుగు వన్డేల్లో విఫలమైనప్పటికి ఐదో వన్డేలో పుంజుకున్నాడు. నేటి వన్డేలో శర్మ బాగా ఆడి తన ఫామ్‌ను నిరూపించుకోవాల్సి ఉంది. దక్షిణాఫ్రికా ఈ మ్యాచ్‌ను ఎలాగైనా గెలిచి ఈనెల 18 నుంచి భారత్‌తో ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌కు ఆత్మవిశ్వాసం కూడగట్టుకోవాలని భావిస్తోంది. ఇందుకు తాము కొత్త వ్యూహాన్ని అనుసరిస్తామని కెప్టెన్ మర్‌క్రమ్ అన్నాడు. ఐదో వన్డేలో ఆడిన ఆటగాళ్లతోనే ఇరు జట్లు బరిలోకి దిగనున్నాయి.

పెయిర్ ఫిగర్ స్కేటింగ్‌లో ప్రపంచ రికార్డు

- జర్మనీ జంటకు స్వర్ణం



గ్యాంగ్న్యూంజ్: ఒలింపిక్ పెయిర్స్ ఫిగర్ స్కేటింగ్‌లో జర్మనీకి చెందిన జంట అల్జోనా సావచెంకో, బ్రూనో మస్సాట్ తమ అద్భుతమైన డ్యాన్స్‌తో ప్రపంచ రికార్డు సృష్టించి స్వర్ణ పతకంను గెలుపొందారు. గురువారం జరిగిన పోటీలో చైనాకు చెందిన ప్రపంచ ఛాంపియన్లు సుయ్ వెన్‌జింగ్, హ్యాన్ కాంగ్ జంటను నాలుగున్నర నిమిషాల్లో ఓడించారు. చైనా జంటకు జర్మనీ జంటకంటే ఒక పాయింట్ తక్కువగా వచ్చింది. కెనడాకు చెందిన మీగన్ డుహామెల్, ఎరిక్ ర్యాడ్‌ఫోర్డ్ జంట కాంస్య పతకంను పొందింది. వరుసగా ఐదు శీతాకాల ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొంటున్న అల్జోనా సావచెంకో బంగారు పతకం కల ఇప్పు డు నెరవేరింది. ఒక దశలో డ్యాన్స్ సాగుతున్న సమయంలో అల్జోనా సావచెంకో తన భాగ స్వామి మస్సాట్‌ను ఢీకొనే ప్రమాదాన్ని తృటిలో తప్పించుకుంది. పోటీలో భాగంగా బుధవారం జరిగిన డ్యాన్సింగ్‌లో స్కేటింగ్ చేస్తూ (ట్రిపుల్ సాల్చో) మూడుసార్లుదూకాల్సిన సమయంలో మస్సాట్ నిరాశ పర్చాడు. 24 గంటల తర్వాత మస్సాట్ తన తప్పిదాన్ని సవరించుకొని పాటకు అనుగుణంగా స్కేటింగ్ డ్యాన్సింగ్ చేసి ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాడు. చివరి రౌండ్ ముగిసే సరికి జర్మనీ జంట 159.09 పాయింట్లు సాధించారు. గత ఏడాది డిసెంబర్‌లో గ్రాండ్ ప్రిక్స్ ఫైనల్లో వారు సాధించిన ప్రపంచ రికార్డు 157.25ని అధిగమించి సరికొత్త రికార్డును నమోదు చేశారు. మొత్తానికి ఈ పోటీలో జర్మనీ జంట 235.90 పాయింట్లను కైవసం చేసుకుంది. చైనా జంట 235.47 పాయింట్లు సాధించగా, కెనడా జంట 230.5 పాయింట్లు పొందింది.



హాకీ స్పాన్సర్‌గా ఒడిశా ప్రభుత్వం

- కొత్త లోగోతో కూడిన జెర్సీ అవిష్కరణ

న్యూఢిల్లీ: భారత హాకీ క్రీడకు సరికొత్త స్పాన్సర్‌షిప్ దొరికింది. ఒడిశా ప్రభుత్వం వచ్చే ఐదేళ్లకు గాను ఈ క్రీడకు ప్రోత్సాహన్నివ్వాలని నిర్ణయం తీసుకుంది. గురువారం ఒడిశా ముఖ్య మంత్రి నవీన్ పట్నాయక్ మహిళా, పురుషుల హాకీ ఆటగాళ్లు, అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్, భారత ఒలింపిక్స్ అసోసియేషన్(ఐఓఏ) అధ్యక్షుడు నరీం దర్ బాత్రా, ఐఓఏ ప్రధాన కార్యదర్శి రాజీవ్ మెహతా తదితరులు పాల్గొన్న సమావేశంలో ప్రసంగిస్తూ ఈ మేరకు ప్రకటన చేశారు. సమావేశంలో మహిళలు, పురుషుల జట్ల ఆటగాళ్లకు కొత్తగా రూపొందించిన లోగోతో కూడిన జెర్సీని ఒడిశా ప్రభుత్వం ఆవిష్కరిం చింది. కొత్త లోగోలో ప్రసిద్ధ కోణార్క్ ఆలయం రథ చక్రం, రాష్ట్రంలోని ప్రసిద్ధ సముద్ర తీరం, అంతరిం చిపోతున్న అరుదైన తాబేలు జాతీ అలివ్ రిడ్లే, ఒడిస్సీ నృత్యం, హాకీ క్రీడ ను ముద్రించి ఉంటుంది. హాకీ క్రీడ అభి వృద్ధికి ఒడిశా ప్రభుత్వం ఎంత మొత్తంను వ్యయం చేయనుందో ముఖ్యమంత్రి స్పష్టం చేయలేదు. రాష్ట్రంలో హాకీ క్రీడపై నవీన్ పట్నాయక్ వ్యాఖ్యానిస్తూ.. 'ఒడిశాలో హాకీ ఇతర క్రీడలకన్నా భాగా ప్రాచు ర్యంలో ఉంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పిల్లలు నడక శిక్షణను హాకీ స్టిక్స్‌తోనే చేస్తుంటారు. ఒడిశా ఒప్పటికే జాతీయ జట్టుకు అద్భుతమైన హాకీ ఆటగాళ్ల ను అందించింది. ఒక రాష్ట్ర ప్రభుత్వం హాకీ క్రీడను ప్రమోట్ చేయడం ఇదే ప్రథమం. ఇందులో భాగంగా దేశంలో హాకీ అభివృద్ధికి కూడా కృషి జరుగుతుంది. దేశానికి ఒడిశా ఇస్తున్న కానుక ఇది' అని పట్నాయక్ అన్నారు. దిలీప్ తిర్కే, ఇగ్నాస్ తిర్కే, లాజరస్ బార్లా వంటి ప్రముఖ హాకీ క్రీడాకారులను ఒడిశా గతంలో అందించింది. ప్రస్తుతం జట్టులో ఒడిశాకు చెందిన బీరేంద్ర లాక్రా, అమిత్ రోహిదాస్, దీప్‌సెన్ తిర్కే, నమితా టొప్పో తదితర క్రీడాకారులు ఉన్నారు. హాకీ అభివృద్ధికోసం ఒడిశా ఇప్పటికే పలు విధాలుగా కృషిచేస్తోంది. హాకీ ఇండియా లీగ్‌లో కళింగ లాన్సర్‌ను ఒడిశా సొంతం చేసుకుంది. 2014లో భువనేశ్వర్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ, గతేడాది హాకీ వరల్డ్ లీగ్ ఫైనల్‌ను నిర్వహించింది. ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 16వరకు జరుగనున్న ఎఫ్ఐహెచ్ ప్రపంచ హాకీ కప్‌కు ఆతిథ్యమిస్తూ.. స్పాన్సర్‌షిప్‌ను ఒడిశా సొంతంచేసుకుంది. ఐవోఏ అధ్యక్షుడు మాట్లాడుతూ భువనేశ్వర్ భారత్‌కు క్రీడా రాజధానిగా ఉంటుందని పేర్కొన్నాడు. దేశానికి రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై, ఐటీ రాజధాని బెంగళూరు మాదిరిగా క్రీడా రాజధాని భువనేశ్వర్‌ను తీర్చి దిద్దాలని బాత్రా ఒడిశా ప్రభుత్వాన్ని కోరారు.

ఆసియన్ గేమ్స్ టెస్ట్ ఈవెంట్

- భారత బాక్సర్లకు ఐదు స్వర్ణాలు

జకార్తా: ఆసియన్ గేమ్స్ టెస్ట్ ఈవెంట్‌లో భారత బాక్సర్లు ఐదు స్వర్ణాలు గెలుచుకున్నారు. గురువారం ముగిసిన ఈ పోటీల్లో భారత బాక్సర్లు ఐదు స్వర్ణాలు ఒక రజతం నాలుగు కాంస్యాలు భారత్ గెలుచుకుంది. ఇండియా ఓపెన్ స్వర్ణపతక విజేత మనీష్ కౌశిక్ 60కేజీల విభాగంలో వరసగా రెండోసారి అగ్ర బాగాన నిలిచాడు. మహిళల విభాగంలో పవిత్ర (60 కేజీ) స్వర్ణం గెలిచిన ఒకే ఒక మహిళా బాక్సర్‌గా నిలిచింది. మూడు సార్లు కింగ్స్ కప్ స్వర్ణ పతక విజేత శ్యాంకుమార్(49కేజీ) షేక్ సల్మాన్ అన్వర్(52కేజీ) ఆశిష్(64కేజీ) స్వర్ణ పతకాలు గెల్చుకున్నారు. పవిత్ర తన ప్రత్యర్థి థాయ్‌లాండ్‌కు చెందిన నిల్వాన్ టెకాస్యూప్‌ను 5-0 తేడాతో ఓడించింది. శ్యాం కుమార్ మారిషస్‌కు చెందిన బ్లాసుస్ క్యాలిపై 4-1 తేడాతో గెలుపొందాడు. సల్మాన్ అన్వర్ ఫిలిప్పీన్స్‌కు చెందిన రోజెన్‌పై 5-0 తేడాతో గెలుపొందాడు. మనీష్, జపాన్ బాక్సర్ రెంటారక్షకిమురాను ఓడించాడు. ఇండోనేషియా బాక్సర్ సుగర్ రేపై ఆశిష్ గెలిచి స్వర్ణంను సొంతం చేసుకున్నాడు. ఇండియా ఓపెన్‌లో కాంస్య పతక విజేత శశి చోప్రా(57కేజీ) థాయ్‌లాండ్ బాక్సర్ రాటాచదపాన్‌పై 0-5 తేడాతో ఓడి రజత పతకంను గెలుచుకుంది. మహమ్మద్ ఎటేష్ ఖాన్(56కేజీ), రిటు గ్రేవాల్(51 కేజీ) పవన్ కుమార్(69కేజీ) ఆశిష్ కుమార్ (75కేజీ) సెమీఫైనల్లో ఓటమి చెంది కాంస్యపతకాలకే పరిమితమయ్యారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ
లైఫ్
lifepage2012@gmail.com
శుక్రవారం 16 ఫిబ్రవరి 2018

పెళ్లికి...వెళుతున్నాం!
పిల్లలు మెచ్చే ఫ్యాషన్లు







పెళ్లి అనగానే హడావుడి అంతా దుస్తులదే. ఏ పెళ్లికి ఏ బట్టలు ధరించాలి...ఎలా అలంకరించుకోవాలి...అనేవి పెళ్లికి వెళ్లేవారికి చాలా ముఖ్యమైన విషయాలు... ముఖ్యంగా మహిళలు పిల్లలకు. పిల్లలను ఫంక్షన్లకు రెడీ చేయటం పెద్ద ప్రహసనమే. వారికి బట్టలు అందంగా నచ్చినట్టుగానే కాదు సౌకర్యంగా కూడా ఉండాలి. చిన్నారులను అందంగా మెరిపిస్తూ, వారికి సౌకర్యంగా కూడా ఉండే బట్టలను ఎంపిక చేసుకుంటే...వారు మరింత ఆకర్షణీయంగా కనబడతారు.

* పిల్లలకు ఎరుపు పసుపు ఆకుపచ్చ నీలం పింక్ ప్యారట్ గ్రీన్ లాంటి రంగులు బాగా సూటవుతాయి. పెళ్లిళ్లు రాత్రులు అయితే..బ్రైట్ గా ఉండే ఎరుపు పసుపు...గాఢమైన రంగులకు తెలుపుని కలిపితే వచ్చే కలర్స్‌ని ఎంపిక చేసుకోవాలి.
* దుస్తులకు తగిన అలంకరణలను ఎంపిక చేసుకోవాలి. ఆడపిల్లలకు హెయిర్‌బ్యాండ్‌కి పెద్ద పూలు, నడుముకి మెరిసే బెల్టులు, దుస్తులకు తగినట్టుగా ఉండే ఆభరణాలు, కాళ్లకు తగిన చెప్పులు....ఇవన్నీ నిండుదనం తెస్తాయి. మగపిల్లలకు బెల్ట్ రంగులో టై ఉంటే మరింత అందంగా ఉంటుంది.
* చిన్న పిల్లలకు ఏ దుస్తులు వేసినా అందంగానే ఉంటారు. ఆడపిల్లలకు కుచ్చుల గౌన్లు, అనార్కలీ కుర్తా చుడీదార్, లెహంగాలు లాంటివాటిని వేయవచ్చు. మీ అభిరుచికి తగినట్టుగా సాంప్రదాయ, ఆధునిక ఫ్యాషన్లను కలిపి కూడా డిజైన్ చేయించవచ్చు. అయితే లెహంగా కొనాలని అనుకుంటే మరీ ఎక్కువ బరువు వెడల్పు ఉన్నవాటిని కాకుండా సింపుల్ గా ఉండే డిజైన్లను ఎంపిక చేసుకోవాలి. షిఫాన్, బ్రోకేడ్ లాంటివి పిల్లలకు బాగుంటాయి.
* మగపిల్లలకు ముదురు ఎరుపు, నీలం, ఆకుపచ్చ లాంటి రంగులతో రిచ్ కట్స్ ఉన్నవి బాగుంటాయి. కుర్తా పైజమా, పఠానీ కుర్తా లాంటివి వేయవచ్చు. రిచ్‌గా కనిపించే షేర్వానీ, ధోతీ ప్యాంట్లు, బంధ్‌గాలా జాకెట్లు, కూడా బాగుంటాయి.

కాలు కదపకుండానే...విదేశీ పర్యటన!



వర్చువల్ రియాలిటీ టూర్స్ మహిమ

వర్చువల్ రియాలిటీ అనే పదాన్ని ఇప్పుడు మనం ఎక్కువగా వింటున్నాం. నిన్నగాక మొన్న పిల్లలను, యువతను ఉర్రూతలూగించిన పోకెమ్యాన్ గేమ్‌కూడా ఇలాంటి టెక్నాలజీ నుండి పుట్టినదే. ఈ టెక్నాలజీ... లేని ప్రాణులు, ప్రదేశాలు మన కళ్లముందున్నట్టుగా వాటిని మనం చూస్తున్నట్టుగా భ్రమింప చేస్తుంది. ఇప్పుడు వర్చువల్ రియాలిటీ టూర్స్ పేరుతో మరొక అద్భుతం అందుబాటులోకి వచ్చింది. అంటే మనం ఆయా ప్రదేశాలకు వెళ్లకుండానే వెళ్లిన ఫీలింగ్ కలుగుతుందన్నమాట. ఈ వర్చువల్ రియాలిటీ టూర్లతో ప్యారిస్, రోమ్, న్యూయార్క్..... ఇలా మనకు నచ్చిన చోట్లకు ...వెళ్లకుండానే వెళ్లిన అనుభూతిని పొందవచ్చు. జపాన్‌కి చెందిన ఒక కంపెనీ 360 డిగ్రీల వర్చువల్ రియాలిటీ (విఆర్) ఫ్లైట్‌ని ఇందుకోసం ఏర్పాటు చేసింది. ఫ్లైట్ అంటే ఎగురుతుందని అనుకునేరు. ఎగరదు... కానీ అది ఎగిరి మనం కోరుకున్న ప్రదేశానికి చేరినట్టే అనిపిస్తుంది. ఇందులో ఫస్ట్‌క్లాస్ సీట్లు ఉంటాయి, చక్కగా విమానంలో లాగే భోజన సదుపాయాలు కూడా ఉంటాయి. అంటే ఇది విమానం కాని విమానం అన్నమాట. ఇందులో కూర్చున్నవారు...ఎక్కడికి కదలకుండానే...కళ్లకు అమర్చిన పరికరంతో... వర్చువల్ రియాలిటీ సిస్టమ్ ద్వారా ...తాము కోరుకున్న దేశంలో ఉన్న అనుభూతిని పొందుతారు. మొట్టమొదటి రెండుగంటల ప్రయాణ కాలమున్న విమానాల్లాంటి విమానాలు ప్యారిస్, రోమ్, హవాయి న్యూయార్క్..కి వెళుతున్నాయి. 2016లో ఈ వింత ప్రయాణం చేయించే కంపెనీ పనులు మొదలుకాగా...ఇప్పటి వరకు టికెట్లు పూర్తిగా బుక్ అయిపోయాయి. ఈ వారంలో....జపాన్‌లోని సెంట్రల్ టోక్యోలో 12 మంది ప్రయాణికులు మొదటి ప్రయాణం చేశారు. వీరు విమానం ఎగరకుండానే సీటు బెల్టులు పెట్టుకుని, ఫుడ్‌ని ఎంజాయి చేస్తూ... వర్చువల్ రియాలిటీ టూర్‌కి వెళ్లొచ్చేశారు. తాము కోరుకున్న దేశాన్ని చూసిన అనుభూతిని పొందారు. మొదటి విఆర్ ట్రిప్‌లో ప్యారిస్ వెళ్లి వచ్చిన (చూడటం మాత్రమే) టకాషీ సకానో అనే 39 ఏళ్ల వ్యక్తి తరువాత రోమ్ వెళతానంటున్నాడు. కేవలం 6,600 యెన్‌ల (62 డాలర్లు) ఖర్చుతో...మనసుకి నచ్చిన విదేశీ ప్రయాణం చేసిరావటం ఆనందమే కదా మరి. తమ కస్టమర్లలో ఎక్కువమంది వయసు మళ్లినవారే ఉన్నారని...వయసు మీరటం వలన దూర ప్రాంతాలకు వెళ్లలేని వారు ఇలా తమ మనసులోకి కోరికని తీర్చుకుంటున్నారని...కంపెనీ ప్రతినిధి తెలిపారు. ప్రస్తుతం వర్చువల్ రియాలిటీని విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకోసం కూడా వినియోగిస్తున్నాయి ఆయా కంపెనీలు. పిల్లలకు బ్రోచర్‌లు చూపించడం కంటే వర్చువల్ రియాలిటీతో ఆయా దేశాలు, కాలేజీలు క్లాస్ రూములు... వగైరాలను చూపించి ఆకట్టుకుంటున్నారు.

వంటింట్లో మేకప్ మార్గదర్శి

ఒక స్పూనుడు...మేకప్!





మేకప్ కిట్ లో ఏమేం ఉంటాయి అంటే...మేకప్ సామగ్రి పట్ల అవగాహన ఉన్న ఏ అమ్మాయి అయినా ...హెయిర్ బ్రష్, ఐలాష్ కర్లర్, బ్లెండింగ్ బ్రష్..లాంటి పేర్లను టకటకా చెప్పేస్తుంది. మేకప్ కిట్ లో సర్వసాధారణంగా ఇవన్నీ ఉంటాయి. కానీ మేకప్ నిపుణులు ఒక కొత్త మేకప్ టూల్ ని కూడా మీ కిట్ లో చేర్చుకోండి అంటున్నారు. అది మేకప్‌కి కొత్తేకానీ...మనకు బాగా తెలిసిందే. అదే స్పూను. అవును వంటింట్లో అత్యవసరమైన వస్తువు స్పూను... మేకప్ కిట్ కి కూడా అవసరమే అంటున్నారువారు. ఎలాగో చూద్దాం-

అలసిన కళ్లకు...విశ్రాంతిగా...

కంప్యూటర్ ముందు ఎక్కువ గంటలు కూర్చుని పనిచేసేవారి కళ్లు బాగా అలసటకు గురవుతాయి. ఉబ్బినట్టుగా కూడా తయారవుతాయి. ఇలాంటప్పుడు రెండు స్టీలు (లేదా ఏ మెటలైనా) స్పూన్లను తీసుకుని వాటిని అరగంటపాటు లేదా రాత్రంతా ఫ్రీజర్‌లో ఉంచాలి. తరువాత వాటిని తీసుకుని కళ్లు స్పూను లోపలికి వచ్చేలా కళ్లపై ఉంచుకోవాలి. ఇలా చేయటం వలన కళ్ల వాపులు, కళ్ల చుట్టూ నల్లని వలయాలు తగ్గుతాయి. కళ్ల చుట్టూ చర్మం వదులై ఉంటే...ఆ సమస్య కూడా తగ్గుతుంది.

విల్లులాంటి కనుబొమల కోసం...

కనబొమలకు రంగు వేసుకునేటప్పుడు సరిగ్గా ఐబ్రో ఉన్న ప్రదేశంలో మాత్రమే రంగు వేయాలని అనుకుంటే...స్పూనుని... ఐబ్రో లైనుపై ఉంచి రంగు వేయాలి. ఇలా చేస్తే కనుబొమలు విల్లులా కనబడతాయి.

కనురెప్పల మస్కారా చర్మానికి అంటకుండా...

కనురెప్పలకు మస్కారాని వేసుకునేటప్పుడు ఒక సమస్య ఉంటుంది. కనురెప్పలకు వేసిన మస్కారా కంటి పైన కింద అంటుకుంటుంది. అలా కాకుండా ఉండాలంటే...స్పూనుని సరిగ్గా కనురెప్పల పైన ఉంచి మస్కారా వేసుకోవాలి. అప్పుడు రెప్పల వెంట్రుకలు చర్మానికి తగిలి రంగు అంటుకోవటం ఉండదు. అలాగే కింది కనురెప్పలకు మస్కారా వేసుకునేటప్పుడు కూడా స్పూనుని సరిగ్గా అడ్డుపెట్టుకుంటే...మస్కారా చర్మానికి అంటదు.

చెంపల మేకప్‌ని చక్కబెట్టేలా...

మొహానికి మేకప్ వేసుకునేటప్పుడు చెంపల వరకు ఒక షేపులో... చెంపల వెనుక భాగంలో మరొక విధంగా మేకప్ వేసుకోవటం జరుగుతుంది. ఇలాంటప్పుడు స్పూనుని సరిగ్గా చీక్‌బోన్స్‌పై ఉంచాలి. ఇప్పుడు స్పూను చీక్‌బోన్స్‌ని, చెంపల వెనుక ఉన్న ప్రదేశాన్ని సరిగ్గా విడగొడుతుంది. దీంతో మేకప్ రెండురకాలుగా వేసుకోవటం సాధ్యమవుతుంది.

ఐ లైనర్ ముస్తాబు అదిరిపోయేలా...

కళ్లకు కాటుక లేదా ఐలైనర్ పెట్టుకునేటప్పుడు కంటి కొసల్లో ఐలైనర్‌ని పొడిగించడానికి స్పూని వాడవచ్చు. స్పూను వెనుక భాగాన్ని కన్ను చివరి భాగంలో...చిత్రంలో చూపినట్టుగా ఉంచాలి. స్పూను చివరి భాగం...కన్ను చివరి నుండి ఐబ్రో వరకు ఒక సరళరేఖలా ఉండాలి. ఇప్పుడు స్పూను వెంట ఐలైనర్ పెట్టుకుంటే సరిగ్గా...ఐబ్రోని చేరుతున్నట్టుగా అదే లైనులో ఉండి కంటి అందం పెరుగుతుంది.

కనురెప్పల అందం పెంచడానికి...

కనురెప్పలను పైకి తిప్పి వాటి అందం పెంచడం ఐలాష్ కర్లర్ చేసే పని. అయితే మేకప్ కిట్‌లో ఐ లాష్ కర్లర్ లేకపోయినా..స్పూనుతో ఈ పనిచేసేయవచ్చు. స్పూను వెనుక భాగాన్ని కనురెప్పలపై ఉంచి మృదువుగా రెప్పలను వెనుకకు వంచితే...అవి అందమైన ఆకారాన్ని సంతరించుకుంటాయి. అవి అలాగే పైకి ఉండాలంటే..వెంటనే మస్కారాని వేసుకోవాలి. అలాగే రెండుసార్లు స్పూనుని అరచేతితో రుద్దితే...అది కాస్త వేడెక్కి మరింత మంచి ఫలితం ఉంటుంది.

ఐషాడో...లైనుని స్పష్టం చేయడానికి


కనురెప్పల పైభాగంలో చర్మంపై వేసే ఐషాడో సరిగ్గా ఎంతవరకు వేయాలి...అనే విషయాన్ని స్పూను ఆధారంగా నిర్ణయించుకోవచ్చు. సరిగ్గా కంటిపై స్పూనుని ఉంచితే... కనుపాప ఎంత వరకు ఉందో తెలుస్తుంది. కంటిపై స్పూనుని ఉంచి...స్పూను పైన థిక్‌గా ఉన్న ఐషాడోని..స్పూను కింది భాగంలో లైట్ షేడ్ ఉన్న ఐ షాడోని తేలిగ్గా వేసుకోవచ్చు.

ఫౌండేషన్‌ని వేసుకునేందుకు...

కాస్త వయసు పెరిగిన వారు మొహానికి ఫౌండేషన్‌ని వేసుకునేటప్పుడు......మొహంపై ఉన్న సన్నని గీతల్లో ఫౌండేషన్ ఇరుక్కుపోతుంటుంది. దీనికి స్పూనుతో పరిష్కారం ఉంది. బాగా చల్లగా ఉన్న స్పూనుని తీసుకుని దాంతో మొహంపైని గీతలపై మసాజ్ చేసినట్టుగా నిదానంగా రాస్తూ... పోవాలి. లైన్లు ఏ తీరుగా ఏర్పడ్డాయో అదే క్రమంలో ఇలా చేయటం వలన మొహానికి ఫౌండేషన్‌ని చక్కగా వేసుకోవటం సాధ్యమవుతుంది. ఎవరికి వారు మేకప్‌ని వేసుకునేటప్పుడు స్పూను నిజంగా ఒక మార్గదర్శిలాగా పనిచేయటం మంచి విషయమే కదా.

అర్జునుడు ఫాల్గుణ మాసంలో జన్మించాడు కనుక ఆయనకు ఫల్గుణుడు అనే పేరు వచ్చింది. ఆయన ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో పుట్టాడు. ఆ నక్షత్రంలో పుట్టినవారు సహజంగా సాహసికులవుతారని చెబుతారు. దేవ గురువైన బృహస్పతి కూడా ఫాల్గుణ మాసంలోనే జన్మించాడు. గురు రాఘవేంద్రులు కూడా ఫాల్గుణ మాసంలోనే జన్మించారు, శుక్ల పక్ష సప్తమి ఆయన జన్మ తిథి. ఆ రోజును గురు సార్వభౌమ జయంతిగా పిలుస్తారు. పలువురు మధ్వ గురువులు కూడా ఈ మాసంలోనే జన్మించారు.

మహాత్ముల మాసం ఫాల్గుణం



ఫాల్గుణ మాసం వచ్చింది. ఇది తెలుగు పంచాంగంలో చివరిది. శిశిర రుతువులో వచ్చే రెండోది. ఈ మాసంలో చలి తగ్గి వేడి వాతావరణం ప్రారంభమవుతుంది. మొత్తం మీద వాతావరణం చల్లగా ఉంటుంది. చెట్లు కొత్తగా వసంతారంభ సూచకంగా చిగుర్లు వేస్తాయి. వాస్తవానికి ఈ రుతువుకు ఉన్న పేరు విష్ణువుది కనుక దీనిని విష్ణు ప్రీతికరమైన మాసంగా భావించవచ్చు. విష్ణువుకు ఈ రుతువు పేరు ఎక్కడుందనే సందేహం కలుగుతుంది. విష్ణు సహస్రనామంలో శిశిరః అని ఆయనను వ్యవహరించారు. విష్ణువు చల్లనివాడని దీని అర్థం. చల్లనివాడు అంటే కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుని తన చల్లని చూపుతో వారికి స్వస్థత చేకూరుస్తాడని దాని అర్థం. వాస్తవానికి అన్ని రుతువులూ మాసాలూ పరమాత్మకు ప్రీతికరమైనవే. అసలు ఆయనే కాల స్వరూపం అందుకే పరమాత్మకు కాలుడనే పేరుంది. ఉజ్జయినిలో మహాకాళేశ్వరుడుగా ఆయన ఉన్నారు. ఈ మాసం పేరైన ఫాల్గుణం మనకు సుపరిచితమే. అర్జునుని పేరు ఫల్గుణుడు. పిడుగులు పడకుండా ప్రమాదాన్నుంచి రక్షించుకోడానికి చెప్పే అర్జునుని పది నామాల శ్లోకంలో ఇది రెండవ నామం. **అర్జునః ఫల్గుణః పార్థః** అని ఆ శ్లోకం మొదలవుతుంది. అర్జునుడు ఫాల్గుణ మాసంలో జన్మించాడు కనుక ఆయనకు ఆ పేరు వచ్చింది. ఆయన ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో పుట్టాడు. ఆ నక్షత్రంలో పుట్టినవారు సహజంగా సాహసికులవుతారని చెబుతారు. దేవ గురువైన బృహస్పతి కూడా ఫాల్గుణ మాసంలోనే జన్మించాడు. గురు రాఘవేంద్రులు కూడా ఫాల్గుణ మాసంలోనే జన్మించారు, శుక్ల పక్ష సప్తమి ఆయన జన్మ తిథి. ఆ రోజును గురు సార్వభౌమ జయంతిగా పిలుస్తారు. పలువురు మధ్వ గురువులు కూడా ఈ మాసంలోనే జన్మించారు. నక్షత్రాల్లో పూర్వ ఫల్గుణీ, ఉత్తర ఫల్గుణీ నక్షత్రాలు ఉన్నాయి.

ఉత్తరప్రదేశ్‌లో ఫల్గు పేరుతో ఒక నది ఉంది. ఒక కొండ నుంచి పారే లీలాజన్, మోహన జలధారలు కలిసి గయ వద్ద ఫల్గు నదిగా ఏర్పడతాయి. ఇది గంగా నదికి ఉప నది. అయితే ఇది సంవత్సరంలో ఎక్కువ కాలం పొడిగానే ఉంటుంది. సీతాదేవి ఒక సందర్భంలో ఇచ్చిన శాపం కారణంగా అది ఎండిపోయిందని కథ. అయితే ఎండిపోయిన నది ఇసుకను తీసి చెలమగా చేస్తే స్వచ్ఛమైన ని ం ఊరుతుంది. ఈ నది బయటకు కనబడదు కనుక దీనిని గుప్త గంగ అంటారు. ఈ నీటికి కొన్ని రకాల రోగాలను నయం చేసే గుణం ఉందని చెబుతారు. ఈ నది ప్రస్తావన పురాణాల్లో కూడా ఉంది. ఈ నది పేరులోని ఫల, గౌ అంటే ఫలాలిచ్చే గోవు, అంటే కామధేనువు అని అర్థం. కామధేనువు ఏది కోరితే అది ఇస్తుం ది. అదే విధంగా ఈ నది పవిత్ర ఫలాన్ని ఇస్తుం దని చెబుతారు. ఇంకా ముం దుకు వెడితే ఇది గంగానది కన్న పవిత్రమైనదని వాయు పురాణం చెబుతోంది. దానికి కారణం ఫల్గునదిని నది రూపంలో ఉన్న శ్రీ మహా విష్ణువని పేర్కొంటారు. గంగ ఆయన పాదాల నుంచి ఉద్భవించినది.



ఈ మాసం విష్ణు ప్రీతికరమని చెప్పుకున్నాం. ఈ మాస అధిష్ఠాత లేదా మాస నియామకుడు గోవిందుడు. గోవింద అనే పదం విష్ణువుకు అతి ఇష్టమైన నామమని చెబుతారు. గో అంటే గోవు, విందఅంటే మనుగడ సాగించేందుకు, అడ్డంకులను దాటిపోయేందుకు సాయం చేసేవాడనే అర్థాలు ఉన్నాయి. అడ్డంకులు దాటడం అంటే ఏ అడ్డంకులనే ప్రశ్న వస్తుంది, పరమాత్మను తెలుసుకునేందుకు అడ్డంకిగా ఉన్న వాటిని తొలగించడంలో ఆయన సాయం చేస్తాడని దీని అర్థం. ఫాల్గుణ మాసంలో గో, వస్త్ర దానాలు చేయడం మంచిదని చెబుతారు.

ఈ నెలలోనూ పర్వాలు, పండగలు ఉన్నాయి.

ఈ నెలలో ఆచరించే వ్రతాల్లో పయో వ్రతం ఒకటి. ఇది లక్ష్మీనారాయణులకు ఉద్దేశించినది. ఇది 12 రోజుల వ్రతం, ఈ పన్నెండు రోజుల వ్రతం చేసేవారు కేవలం పాలు మాత్రమే తాగి, పాలను మాత్రమే నైవేద్యంగా పెడతారు.

ఈ నెలలో డుండి వినాయకుని పూజిస్తారు. కాశీలోని డుండి వినాయక ఆలయం ప్రసిద్ధమైనది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ శైవ క్షేత్రం ద్రాక్షారామంలో కూడా డుండి వినాయకుడు ఉన్నారు. ఈ నెల శుక్ల చతుర్థి నాడు పుత్ర గణపతి వ్రతం చేస్తారు.

శుక్ల పక్షంలో ఆ తర్వాత వచ్చేది ఆమలక ఏకాదశి. ఆ రోజు ఆమలక వృక్షానికి పూజ చేసి, ఒక ఆమలక ఫలాన్ని దానం చేస్తారు.

ఆమలక ఏకాదశి మర్నాడు వచ్చేది గోవింద ద్వాదశి. ఈ రోజు నదీ స్నానం చేసి విష్ణువును ఆరా ధించాలి. తద్వారా మంచి ఆరోగ్యం చేకూరుతుంది. ఆ తర్వాత వచ్చేది హోళికా పౌర్ణమి లేదా డోలాపౌర్ణమి. ఈ రోజు లక్ష్మీనారాయణ పూజ చేస్తారు. ఇక కృష్ణ పక్షంలో వచ్చే పర్వం బహుళాష్టమి. జనక మహారాజు సీతాదేవిని ఈ తిథి నాడే కనుగొన్నారని చెబుతారు. ఆ తర్వాత వచ్చేది అమావాస్య. అమావాస్య నాడు పితృదేవతలకు తర్పణాదులు వదలడం వంటివి చేస్తారనే విషయం తెలిసిందే. దీనికి మరో విశేషం కూడా ఉంది. ఇది ఈ తెలుగు సంవత్సరంలో చివరి అమావాస్య.

సేకరణ: జిపి

అహింసే పరమధర్మం



శ్రీధర్మరుచి


ధర్మవీర శ్రీధర్మరుచి జైన భిక్షువు. గురు సేవలోఉండేవాడు. ఒకసారి భిక్ష సేకరిద్దామని బయలుదేరాడు. ఒక ఇంటి ముందు ఆగాడు. ఆ గృహిణి నాగశ్రీ కొద్ది సేపటి క్రితం కాకరకాయతో ఏదో వంటకాన్ని తయారుచేసింది. ఆ వంటకం చూడటానికి కూడా బాగుండలేదు. నోటిలో కూడా పెట్టుకొనలేదు ఆమె. ఆ సమయంలో జైన సన్యాసి భిక్షకు వచ్చాడు. ఆ వంటకాన్ని చూస్తే కూర పాడు చేశావని భర్త దూషిస్తాడనే కారణంగా ఆమె దానిని ఆయనకు భిక్షగా వేస్తే సరిపోతుందనుకుంది. అది భిక్షగా వేసింది. ధర్మరుచి దానిని తన గురువు వద్దకు తీసుకెళ్ళాడు. అతీంద్రియ శక్తులున్న గురువు ఆ వంటకాన్ని చూడగానే అది విషపూరితమైనదని గ్రహించాడు.

'అది విషాహారం. దగ్గరున్న అడవిలో ఎక్కడన్నా జాగ్రత్తగా పార వేయి' అన్నాడు గురువు. ఆ విషాహారాన్ని పారవేయటానికి దూరంగా వెళ్ళాడు ధర్మరుచి. ఎక్కడ పారవేయాలా అని ఆలోచిస్తూ కొద్ది సేపు ఒక చోట కూచున్నాడు. అయితే అంతకు ముందే అతను తీసికెడుతున్న ఆహారం నుంచి ఒక తునక కిందపడింది. దానిని తిన్న చీమలు చనిపోయాయి. ఇది చూశాడు ధర్మవీర. ఈ ఆహారాన్ని ఎక్కడ వేసినా అది తిన్న వేలకు వేలు జీవులు మరణిస్తాయి. అవి అలా మరణించడం అతనికి ఇష్టం లేదు. తానే ఆ ఆహారాన్ని తిన్నాడు. ప్రాణం పోయింది. కీర్తి మిగిలింది. అసంఖ్యాక ప్రాణుల కోసం తన జీవితాన్ని త్యాగం చేశాడు. తాను జీవిస్తే ఎంత? మరణిస్తే ఎంత? ఇదీ మహాత్ముల దృక్పథం.

గురువు తర్వాత దివ్య దృష్టితో జరిగింది తెలుసుకున్నాడు.

వద్దంటే వినాలి

త్రైలింగ స్వామి అని ఒక మహనీయుడున్నారు. ఆయన తెలుగువాడే. అయినా ఆయన గురించి అందరికన్నా తెలుగు వారికే తక్కువ తెలుసు. ఆయన భారతదేశ పుణ్యక్షేత్ర పర్యటన చేశారు. ఆయన వేర్వేరు ప్రదేశాలకు వెళ్లినపుడు వేర్వేరు పేర్లు పెట్టుకునేవారు. నేపాల్ దేశంలో పర్యటించినపుడు ఆయన పేరు గణపతి స్వామి. నేపాల్ అడవుల్లో కాయ కసరులు తింటూ ఆయన కొంతకాలం తపస్సు చేశారు. ఆ సమయంలో నేపాల్ రాజు బంధువు అడవిలో వేటకై వచ్చాడు. పులిని చూశాడు. తుపాకీ పేల్చాడు. గురి తప్పింది. ఆ పులి పరుగెత్తుకుంటూ వెళ్ళి తపస్సు చేసుకుంటున్న గణపతి స్వామి పాదాల వద్ద కూర్చుంది. ఆ దృశ్యం చూసి రాజబంధువు ఆశ్చర్యపోయాడు. స్వామి కనులు తెరచి చేయి పైకి ఎత్తారు. అది పులికి రక్షఅయింది. అది పులిని చంపవద్దని రాజ బంధువుకు ఆజ్ఞ అయింది. 'జీవం పోయలేని వారికి జీవిని చంపే హక్కు లేదు' అన్నారు గణపతి స్వామి. రాజబంధువు మహారాజు వద్దకు వెళ్ళి ఆ స్వామి, ఆయన వద్దపులి శరణు పొందడం గురించి చెప్పాడు. మహారాజు గణపతి స్వామి వద్దకు వచ్చాడు. జీవ హింస చేయవద్దని నచ్చజెప్పి ఆ మహారాజుకు దీక్షను ఇచ్చాడు గణపతిస్వామి. ఎందరో మహానుభావులు జీవకారుణ్యాన్ని బోధిస్తూ వచ్చారు. ఆ హితవచనాలను వినేవారు ఎంతో మంది ఉన్నా పాటించే వారు బహు కొద్ది మందే.



త్రైలింగస్వామి

మహనీయుల సేవలో జంతువులు

ఆపద నివారించిన సాయి

పేరాల వాస్తవ్యులైన దేవేంద్రనాథ్ కుమార్తె ఇందిర. ఆయన సాయి భక్తుడు. ఆయన కుమార్తె కూడా తండ్రి వలె సాయి భక్తురాలు. ఒకనాడు ఆమె తన గదిలో పరుండి ఏదో ఆధ్యాత్మిక గ్రంథం చదువుతోంది. ఇంతలో ఆమెకు తన తండ్రి 'ఇందిరా, ఇందిరా' అని పిలిచినట్లనిపించింది. వెంటనే ఆమె బయటకు వెళ్ళి చూసింది. అక్కడ తన తండ్రి లేడు. అయితే తాను పొరపాటున తన తండ్రి గొంతు విన్నట్టు పొరపాటు పడి ఉంటానని సమాధాన పరుచుకుంది. అప్పుడే ఆంజనేయ స్వామి గుడి నుంచి పూజారి ప్రసాదం తెచ్చి ఆమెకు ఇచ్చాడు. ఆమె దానిని జాగ్రత్త చేసి మళ్ళీ మంచం వద్దకు రాబోయింది. అయితే ఆ మంచం మీద పాము కనిపిం చింది. అంతకు ముందు తనను తన పేరుతో పిలిచి మంచం మీద నుంచి లేచేలా చేసి తనను కాపాడింది సాయేనని ఆమె గ్రహించారు. ఆమె 'పాము పాము' అని అరవగా కొందరు వచ్చారు. ఆ పామును చంపుదామనుకున్నారు. ఆమె వారించింది. ఆ పామును ఊరి అవతల ఉన్న అడవిలో విడిచి రమ్మంది. వారు అలాగే చేశారు. ఆమె మాదిరి జీవ కారుణ్యాన్ని ఆచరణలో పెట్టటమే మనం చేయవలసిన పని.

- ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

భగవద్గీత



యజ్ఞపతి ఎవరు?

అధ్యాయం 8
శ్లోకం 2

అధియజ్ఞః కథం కోత్ర
దేహేస్మిన్ మధుసూదన
ప్రయాణకాలే చ కథం
జ్ఞేయోసి నియతాత్మభిః॥

తాత్పర్యం

ఓ మధుసూదనా! యజ్ఞప్రభువెవ్వరు? అతడు ఏ విధముగా దేహములో వసించిఉంటాడు? భక్తి యోగము నందు నిలిచినవారు మరణ సమయాన నిన్నెట్లు ఎరుగగలరు?

భాష్యం

అర్జునుడు తన మనస్సులోని సంశయాలను రాక్షసులతో పోల్చి, రాక్షసులను సంహరించుటలో దిట్టయైన శ్రీ కృష్ణుణ్ని, తన సంశయాలను కూడా అదేవిధంగా పారద్రోలమని ఇక్కడ 'మధుసూదనా' అని సంభోదిస్తున్నాడు. యజ్ఞపతి ఎవరు? అతడు జీవుని శరీరంలో ఏవిధంగా జీవిస్తున్నాడు? అంతేకాక మరణ సమయంలో భక్తుడు కృష్ణుని పై మనస్సును ఎలా లగ్నము చేయగలడు. కులశేఖర మహారాజు భగవంతుణ్ని ఇలా ప్రార్థించాడు. ''దేవా! ప్రస్తుతం నా ఆరోగ్యం బాగా ఉంది. కాబట్టి ఇప్పుడు నేను మరణించినా నా మనస్సు నీపై లగ్నమయ్యే అవకాశం ఉంది. అదే నేను సహజ మృత్యువుకు ఎదురు చూసినట్లయితే శరీర అవయవాలు క్షీణించి, గొంతు మూగబోయి, మనస్సు కలత చెందు సమయంలో నిన్ను స్మరించే అవకాశం ఉండకపోవచ్చునేమో కదా! కాబట్టి నన్ను ఇప్పుడే మరణింపనివ్వు''

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

రాజేడీ-రాజ్యమేదీ?



ఈ మధ్యాహ్నం 'ప్రాచీన శంకర విజయా'న్ని గుఱించిన ప్రసంగం వచ్చి భగవాన్ ఒక భక్తునితో ''ప్రస్తుతం వాడుకలో ఉన్న శంకర విజయాలన్నిటికీ విలక్షణమైనది విద్యారణ్యులదేగదా?'' అన్నారు. ''అవును. వారు చాలా మేధాసంపన్నులు గదా? వారి గ్రంథమే ప్రామాణ్యంగా తీసుకుంటారందరు'' అన్నారా భక్తులు. భగవాన్ చిరునవ్వుతో ''అవును. వారి మేధాశక్తి చాలా గొప్పది. వారు శ్రీవిద్యోపాసకులు గదా? శ్రీ చక్రాకారంగా, పట్నం నిర్మించాలని హంపీలో ప్రారంభించి విఫలమనోరథులై భవిష్యత్తున ఒక చక్రవర్తి రాగలరనీ, వారు శ్రీచక్రాకారంగా పట్నం నిర్మించగలరని వ్రాశారు. ఈ సంగతి కొండమీద ఉండగా నాయన (గణపతి శాస్త్రి)తో నేనంటే, వారొక విచిత్రమైన వ్యాఖ్యానం చేశారు. ఏమనంటే, 'శ్రీ చక్రాకృతి శోణశైలవపుషం శ్రీషోడశార్ణా త్మకం' అని అరుణా చలాష్టకం స్తోత్రంలో ఉన్నది. (శంకరాచార్య విరచితం). అదేగాక అరుణాచల పురాణంలో ఈ గిరి శ్రీచక్రాకారమని ప్రసిద్ధి. అందువల్ల వెతక్కుండానే, మనకీ శ్రీచక్రాకృతిగల స్థానం లభించింది. భగవాన్ చక్రవర్తి. గిరిచుట్టూ పది ఇళ్లు కడితే, ఇదే మహాసామ్రాజ్యం. వారు భవిష్యత్తును గుఱించి వ్రాసింది ఇదే అయి ఉంటుంద'ని వ్యాఖ్యానించి 'ఇదుగో వీడు సేనాధిపతి. వాడు కోశాధ్యక్షుడు. వాడదీ, వీడిది' అంటూ రాజ్యాంగమంతా ఏర్పాటు చేసే వారు. వారిక్కడుండగా అదొక వేడుకగా ఉండేది. అందరూ కూర్చుని 'ఏమోయ్, ఈ రోజున మన దర్బారుకంతా ఫలహారం ఏమిటి?' అనేది; అదనీ, ఇదనీ ప్రోగ్రాం వేసుకునేదీ; చేసేదీ, తినేదీ, అంతా రాజ్యమేలుతున్నట్లే కార్యం నడిపేవాళ్ళు. ఇదుగో, ఈ సుందరేశుడు, ఆ కల్యాణం, అప్పుడిట్లా ఉండేవాళ్ళా; అరే అప్పా, ఒక్కొక్క ఆసామి బలే హుషారుగా ఉండేవాళ్ళు. యోధులమనే అనుకునే వార'న్నారు భగవాన్.

''ఇదంతా ఎప్పుడు'' అన్నాడు శివానందం. ''విరూపాక్ష గుహలో ఉండగానే. ఒక్కొక్కప్పుడు కట్టబోయే పట్నానికి కాగితం మీద ప్లాను గూడా వేసేవారు నాయన. అందులో నాకొక ప్రత్యేకస్థానం. వెనుక అన్ని ప్లానులూ రాజ్యాంగానికి తగినట్లుగా తయారుచేసేవారు. రాజులేడు, రాజ్యం లేదు. ప్లాను మాత్రం సిద్ధమయ్యేది. అట్లా ఎన్ని ప్లానులో. రాజేడీ, రాజ్యమేదీ?'' అన్నారు భగవాన్. ''రాజు లేకేమి. ఎదుటనే ఉన్నారు గదా? అయితే ఈరాజు కౌపీనధారి. అంతేగదా? ఇప్పుడేం తప్పింది? కొండచుట్టూ ఇళ్లు కట్టలేదా? భగవాన్ సన్నిధానం రాజాస్థానం వలె ఉండలేదా? అంతా వారన్నట్లే రాజ్యాంగం నడుస్తూనే ఉన్నది. మామూలు రాజ్యానికీ, దీనికీ కొంచెం భేదం ఉంటుంది. అంతే''నన్నారు నాయన శిష్యులైన సుబ్బారావుగారు.

''అదిసరి, మహారాజుదీ, మహాజ్ఞానిదీ ఒకటే దశ అని నాయన గూడా అంటూ ఉండేవారు. తథాగతుని గుఱించి కాలజ్ఞులు 'ఇతడు చక్రవర్తి అయినా కావాలి, లేక జ్ఞానసంపన్నుడైన సన్యాసి అయినా కావా'లని అంటే ఎక్కడికీ పోనీయక అంతఃపురంలోనే ఉంచి భోగలంపటుని చేయాలని తండ్రి ఎంతో తంటాలు పడ్డాడు. కడకు వారేదో నెపంతో, ఎట్లాగో బయటికి వెడితే, లోకంలో ఉన్న కష్టమే గోచరించింది. పారిపోయి సన్యసించారు. ఏదో ఒకటి'' అన్నారు భగవాన్.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో ప్రతికూల మార్పులు చేకూరుతాయి. ఆర్థిక చిక్కులు లేకపోలేదు. శత్రువృద్ధి ఉంటుంది.

వృషభ రాశి: సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. మానసిక రుగ్మతలు ప్రబలమవుతాయి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో దూకుడు నిర్ణయాలు పనికిరావు. కోర్టు వ్యవహారాల్లో మాత్రం నెగ్గుకురాగలుగుతారు. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: దూరప్రయాణాలు రాణిస్తాయి. వ్యాపార నిర్ణయాలు అనుకూలం. ఆర్థిక ప్రయత్నాలు లాభిస్తాయి. అవమానకర సంఘటనలు బాధిస్తాయి. ఆరోగ్యం అనుకూలం. దురుసు మాటలు సమస్యలను తెస్తాయి. విద్యా పరమైన విషయాల్లో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. గృహసంబంధిత కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. విమర్శలు ఉన్నా పనులను పూర్తిచేయగలుగుతారు. ఆరోగ్యం ఖర్చులు తగ్గుతాయి. శత్రుభీతి తగ్గు తుంది. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. వాహననిర్ణయాలు లాభిస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. విదేశీ ఒప్పందాలు లాభిస్తాయి. ఖర్చులు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆర్థిక నష్టాలను భర్తీ చేసుకొనే ప్రయత్నాలు కొనసాగుతాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. స్థిరాస్తి కొనుగోళ్లు కలసి వస్తాయి. రాజకీయ ప్రతిబంధకాలు పెరుగుతాయి. ఆరోగ్యంలో చిరుసమస్యలు ఉంటాయి. రాజకీయ ప్రతికూలత ఉంటుంది. ఆదాయంలో ఆశించిన విజయాలు సాధించగలుగుతారు.


తులా రాశి: నూతన వస్తు కొనుగోళ్ళు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు కలిసి వస్తాయి. శారీరిక శ్రమ ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. అపార్థాలకి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: దూర ప్రయాణాలు ఆశించిన ప్రయోజనాలని కలిగిస్తాయి. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. శారీరిక రుగ్మతలు పెరుగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో అలసత్వం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: గృహ కార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. ఆరోగ్య పరీక్షలు రక్షణను కలిపిస్తాయి. సహనం తగ్గుతుంది. గతంలోని ఒత్తిడులు ఇంకా కొనసాగుతాయి. వ్యాపార ప్రయత్నాలలో ప్రోత్సాహం ఉంటుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు మాత్రం దగ్గరవుతాయి.

మకర రాశి: ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. గృహకార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. నూతన ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. మంచి కార్యాలలో విజయాలు ఏర్పడతాయి. వరస ప్రయత్నాలతో ఆదాయం పెరుగుతుంది.

కుంభ రాశి: కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు ఉపకరిస్తాయి. చిరు ఆరోగ్య సమస్యలు వెలుగు చూస్తాయి. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. ఒత్తిడులను తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిసితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.



మీన రాశి: వ్యాపార ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చిరుసమస్యలు గృహరీత్యా కొనసాగుతాయి. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పనులలో గతంలోని వేగం తగ్గుతుంది. ఆదాయం పర్వాలేదు.

శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

Business సిరిగమలు

ఆదాయ వృద్ధికి తారకమంత్రం స్థిరాస్తి



రాజు, రవి మంచి స్నేహితులు. ఓ 20 సంవత్సరాల క్రితం రెండు లక్షల పెట్టుబడి పెట్టాలనుకున్నారు. అప్పట్లో స్టాక్ మార్కెట్లు లాభాలు ఆర్జిస్తున్న సమయంలో ఓ మిత్రుడి సలహా తీసుకుని రాజు క్యాపిటల్ మార్కెట్లో పెట్టుబడి పెట్టాడు. అయితే ఏ మాత్రం ఫండమెంటల్స్ లేని కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేయడం వల్ల రెండు లక్షలు పోగొట్టుకోవాల్సి వచ్చింది. అప్పుడు తెలిసొచ్చింది రాజుకి సరైన స్టాక్ బ్రోకర్ లేకుండా పుకార్లు నమ్మి మార్కెట్లోకి ఎంటర్ అయితే నష్టం తప్పదని ఇక రవి ఆ రెండు లక్షలతో హైదరాబాద్ నగర శివార్లలో ఓ ఎకరం పొలం కొన్నాడు. నగర శివార్లలో అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేయడంతో భూముల ధరలు క్రమంగా పెరగడం ప్రారంభం అయ్యాయి. రెండు లక్షలు పలికిన ఎకరం భూమి ఏకంగా కోటి రూపాయలకు ఎగబాకింది. దీనితో రవి కోటీశ్వరుడయ్యాడు. ఆదాయ మార్గాల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు అందించే లాభాలు ఎప్పుడు అగ్రస్థానంలో వుంటాయి. మ్యూచువల్ ఫండ్ బ్యాంక్ డిపాజిట్లు, స్టాక్ మార్కెట్లు బంగారం పెట్టుబడులతో కంటే ఊహించని లాభాలు రియల్ ఎస్టేట్ లో దొరుకుతాయి. అయితే ఎలాంటి ప్రణాళికతో ముందుకెళ్లాలో ఓ సారి పరిశీలిద్దాం.

అంతర్జాతీయంగా ప్రాపర్టీల ధరలను విశ్లేషించే జెఎల్ఎల్ సంస్థ సర్వే ప్రకారం ఆసియా, పసిఫిక్ దేశాలలో భారత్‌ను మొదటి స్థానంలో నిలిచింది. చైనా, జపాన్ కంటే రియల్ డిజిపి వృద్ధిలో భారత్ ముందంజలో వుంది.
2017 సంవత్సరంలో అది 6.2శాతం వుండగా 2018లో 75శాతంగా వుంటుందని జెఎల్ఎల్ అంచనా వేసింది.
రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగం పెరగడం ఈ రంగాల్లో సంస్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతం ఇవ్వటం ఈ రంగం అభివృద్ధికి దోహదం చేస్తున్నాయి. 2008 సంవత్సరంలో వచ్చిన ప్రపంచ ఆర్థిక మాంద్యం, ఆ తర్వాత రాష్ట్ర విభజన వంటి అంశాలు మార్కెట్‌ను అతలాకుతలం చేసినా స్థిరాస్తి రంగం స్థిరంగా పెరుగుతూనే వచ్చింది. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టినవారు దీర్ఘకాలంలో మంచి లాభాలు పొందుతూనే వచ్చారు. పిల్లల భవిష్యత్ కోసం, భవిష్యత్ అవసరాలకోసం ఎక్కువ మంది స్థిరాస్తిలో పెట్టుబడులు పెడతారు. ఆదాయాలు తగ్గే సమయంలో, ఉద్యోగం చేయలేని స్థితిలో వున్నవారికి రియల్ పెట్టుబడులు ఓ వరంగా మారుతాయి.
ప్రపంచ ఆర్థిక మాంద్యం, తెలంగాణ రాష్ట్ర విభజన ఉద్యమంలో కుదేలైన స్థిరాస్థి రంగం ఆ తర్వాత పుంజుకోవడం ప్రారంభించింది. రెండు రాష్ట్రా ల్లో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకొంది.
తెలంగాణలో హైదరాబాద్, వరంగల్ ఖమ్మం జిల్లాల్లో మంచి పురోగతి కనిపిస్తుండగా ఆంధ్రాలో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి, చిత్తూరు ఇలా 8 నుంచి 10 జిల్లాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. అయితే ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఒకటుంది. స్థిరాస్తి రంగంలో ఒకటి, రెండు సంవత్సరాల్లో ఊహించిన లాభాలురావు. మంచి రాబడులు రావాలంటే కనీసం ఎనిమిది సంవత్సరాల కన్నా ఎదురుచూడాల్సి వుంటుంది. ఈ మధ్య కాలంలో కొంత ఒడిదుడుకులు ఎదుర్కొన్నా దీర్ఘకాలంలో లాభాలు వస్తాయి. ఉదాహరణకు హైదరాబాద్ హైటెక్ సిటీ ఏరియాలో 20 సంవత్సరాల క్రితం పెట్టుబడులు పెట్టినవారు 100శాతానికి పైగా లాభం ఆర్జించారు. ఇలాంటి రిటర్న్ ఏ రంగంలోనూ వచ్చే అవకాశం లేదు. అలాగే నగర శివార్లలో స్థిరాస్తి రంగంలో పెట్టుబడి పెట్టినవారు 30శాతానికి పైగా రిటర్న్ పొందారు. అయితే గత 20 సంవత్సరాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న అంశాన్ని మనం మర్చిపోకూడదు. 2008 నుంచి 2014 సంవత్సరాల మధ్య హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం 30శాతం నష్టపోయింది.
అయితే దీర్ఘకాలిక పెట్టుబడులు లాభాలిస్తాయని మర్చిపోకూడదు. రియల్ ఎస్టేట్ రంగంలో ప్రాపర్టీని అద్దెకివ్వడం ద్వారా మంచి లాభాలు ఆర్జించవచ్చు. ముఖ్యంగా హైదరాబాద్‌లో గచ్చిబౌలి, మాదాపూర్, నానక్‌రామ్ గూడ, కూకట్ పల్లి ప్రాంతాల్లో ఆఫీస్, హౌస్ రెంటల్స్‌కు విపరీత ఆదరణ పెరగడం చూశాం. ఈ ప్రాంతాల్లో నిర్మాణ రంగం ఊహించనంత రీతిలో అభివృద్ధి చెంది సామాన్యులను సైతం సంపన్నులను చేసింది. డిమాండ్‌కు మించిన సప్లయ్ జరగడంతో కొన్ని ప్రాపర్టీలు అమ్ముడు పోని స్థితిని గమనించాం. ప్రస్తుతం విశాఖపట్నంలో ఈ తరహా రెంటల్స్ ఊపందుకున్నాయి. ఏపీలో ఎక్కువ కంపెనీలు విశాఖపట్నంలో ఏర్పాటు చేసేందుకు ముందుకురావడంతో రెంటల్ ప్రాపర్టీకి డిమాండ్ బాగా పెరుగుతోంది. భవిష్యత్తులో విజయవాడ, అమరావతి, గుంటూరు తెలంగాణాలో వరంగల్‌లోనూ ఈ తరహా రియల్ ఎస్టేట్ భూమ్ కన్పించనుంది. పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీలతో పాటు వ్యక్తిగతంగా చిన్న డెవలపర్స్ అభివృద్ధికి దోహదపడింది.
మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల తరహాలోనే రియల్ ఎస్టేట్ రంగంలో రిటైల్ పెట్టుబడులు పెంచేందుకు రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్, రీట్స్ ఏర్పాటయిన సంగతి తెల్సిందే. భారతదేశంలో పౌరులందరూ రియల్ ఎస్టేట్‌రంగంలో పెట్టుబడులు పెట్టే అవకాశం రీట్స్ కల్పిస్తుంది. ఆదాయం ఇచ్చే బిల్డింగ్స్‌లో పెట్టుబడులు పెట్టి అద్దె ద్వారా లబ్ది పొందవచ్చు. ఇదొక మంచి ఆదాయంగామారుతుంది. రీట్స్ అభివృద్ధికి కేంద్రం సెబీ ప్రోత్సాహం కల్పిస్తూ విదేశీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. రీట్స్ షేర్స్‌ను స్టాక్ మార్కెట్లలో షేర్స్ లాగా కొనుగోలు చేయవచ్చు. ఈ పెట్టుబడులకు ఆదాయ పన్ను రాయితీ వస్తుంది. అలాగే ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రాజెక్టుల్లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. ఇప్పటివరకూ భారత్‌లో ఏ రీట్ ఫండ్‌ను ప్రవేశపెట్టలేదు. అయితే అభివృద్ధి చెందిన దేశాల్లో రీట్స్ ఫండ్స్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. భారత్ ప్రభుత్వం రీట్స్ ఫండ్స్ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకోవాల్సి వుంది. తద్వారా స్థిరాస్థి రంగంలో సామాన్యులు సైతం భాగస్వాములుగా మారే అవకాశం ఉంటుంది. లిమిటెడ్ ల్యాండ్ ప్రాపర్టీషిప్, ఎల్ఎల్‌పి ద్వారా కొంతమంది ఔత్సాహికులు భాగస్వాములుగా ఏర్పడి రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టారు. భారతదేశంలో కొన్ని ప్రాంతాల్లోనే ఇది చురుకుగా వుంది. నగర శివార్లలో తక్కువ ధరకు లభించే భూములను కొనుగోలు చేయడం ద్వారా మంచి రిటర్న్ లాభాలు సాధించవచ్చు. అయితే ఇవి దీర్ఘకాలిక పెట్టుబడులే అని చెప్పాలి. తగిన రేటు వచ్చేవరకూ వేచిచూసే ఓపిక కావాలి. ప్రస్తుతం ఔటర్ రింగ్ చుట్టూ హైదరాబాద్ మహానగరంలో చాలా యాక్టివిటీ జరుగుతోంది. ఈ ప్రాంతాలకు డిమాండ్ తీసుకొచ్చే విధంగా తెలంగాణ ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు ఇతర జిల్లాలకు కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తోంది.
ఫలితంగా నగరశివార్లభూములకు భారీగా డిమాండ్ పెరగడం గమనిస్తున్నాం. ఉదాహరణకు వరంగల్ నగర అభివృద్ధి, యాదాద్రి అభివృద్ధితో హైదరాబాద్ వరంగల్ రహదారికి మహర్దశ పట్టింది. భూముల ధరలు అమాంతం పెరిగాయి. భవిష్యత్తులో ఇదే పరిస్థితి విజయవాడ జాతీయ రహదారి లోనూ జరుగుతోంది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో మహబూబ్ నగర్ అభివృద్ధి ఆ ప్రాంతంలో భూములకు డిమాండ్ పెంచింది. అమరావతి రాజధాని నిర్మాణంతో గుంటూరు, విజయవాడలో 100 కిలోమీటర్ల పరిధిలో రియల్ ఎస్టేట్ రంగం



ఎలా పెరిగిందో మనం చూస్తూనే వున్నాం. భవిష్యత్తులోనూ ఈ రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టబోయే భారీ ప్రాజెక్టులు భూములకు డిమాండ్ మరింత పెంచనున్నాయి.
హైదరాబాద్ లాంటి మహానగరంలో సిటీలో అద్దెకు వుండి ఇబ్బంది పడేకంటే నగరశివార్లలో స్థిరనివాసం ఏర్పరచుకునేందుకు ఆసక్తి చూపడంతో 25 లక్షల రూపాయలకే గేటెడ్ కమ్యూనిటీ గృహాలు అందుబాటులోకి వస్తున్నాయి. కాస్త సిటీకి దూరంగా వున్నా కాలుష్యం బారినపడకుండా ప్రశాంత జీవనం కోసం నగర ప్రజలు సిద్ధపడుతున్నారు. భవిష్యత్తులో ఈ ట్రెండ్ మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. నగరంలో అపార్ట్‌మెంట్ కొనాలన్నా 50 లక్షల రూపాయలు పెట్టే కంటే చిన్న గేటెడ్ కమ్యూనిటీలో సొంత ఇల్లు బెటర్ అనే భావన పెరుగుతోంది. భవిష్యత్తులో రవాణా సౌకర్యం మరింత పెరిగితే ఈ ప్రాపర్టీలకు మరింత డిమాండ్ పెరుగుతోంది. ఈ ఇళ్లకు మంచి డిమాండ్ వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే నగర శివార్లలోని పంచాయతీలను గ్రేటర్ హైదరాబాద్‌లో కలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీర్ఘకాలంలో నగరంలో అపార్ట్‌మెంట్లకు రీసేల్ వాల్యూ తగ్గుతుందని, కొంచెం నగరానికి దూరంగా ఉన్న భూముల ధరకు ఎప్పటికీ డిమాండ్ వస్తుందన్న అభిప్రాయం ఇన్వెస్టర్లలో నెలకొంది. ఇది వాస్తవం కూడా. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు ప్రస్తుత కాలంలో తప్పక లాభాలు అందిస్తాయి. 2014 నుంచి 2017 వరకు తీసుకుంటే బంగారంలో ఇన్వెస్ట్‌మెంట్స్ 3 శాతం రిటర్న్స్ అందిస్తే ఫిక్స్‌డ్ డిపాజిట్లు 6శాతం స్టాక్ మార్కెట్లు 12శాతం వరకూ రిటర్న్స్ అందించాయి.
ఢిల్లీ, కలకత్తా, ముంబాయి, బెంగుళూరు నగరాల్లో గత నాలుగు సంవత్సరాల్లో స్థిరాస్థి రంగం పెద్దగా వృద్ది చెందకపోయినా హైదరాబాద్, చెన్నయ్ నగరాల్లో ఆశాజనకంగా వుందని నైట్ ఫ్రాంక్ నివేదిక చెబుతోంది. పైగా ఇతర నగరాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రా ల్లో ముఖ్యంగా హైదరాబాద్‌లో స్థిరాస్తి ధరలు బాగా అందుబాటులో వున్నాయన్నది వాదన. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు ఇన్వెస్ట్‌మెంట్ వాతావరణాన్ని మరింత పెంచేందుకు దోహదపడుతున్నాయి. స్థిరాస్తి రంగంలో లాభాలు ఎంత అధికంగా వుంటాయో నష్టాలు అలాగే వుంటాయని గమనించాలి. రిస్క్‌ను జాగ్రత్తగా గమనించాలి. గచ్చిబౌలి ప్రాంతంలో ఐటి రంగాన్ని దృష్టిలో పెట్టుకొని విపరీతంగా రియల్ ఎస్టేట్ ప్రాపర్టీస్ వచ్చిన సంగతి తెల్సిందే. అయితే ఆఫీసు సముదాయాల కోసం నిర్మించిన ప్రాపర్టీలు సంవత్సరాల కొద్ది అమ్ముడుపోకుండా అలాగే వుండిపోయాయి. బ్యాంకుల నుంచి వడ్డీలకు రుణాలు తెచ్చిన స్థిరాస్తి కంపెనీలపై రుణభారం పెరిగిపోయింది. దేశవ్యాప్తంగా ప్రాజెక్టులున్న కంపెనీలు ఈ కుదుపును తట్టుకోగలిగినా చిన్న రియల్ కంపెనీలు పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయాయి. లాభాలు వస్తాయని ఈ రంగంలో దిగిన ప్రయివేటు డెవలపర్లు దివాలా తీసారు. డిమాండ్, సప్లయ్‌ని బేరీజు వేయకుండా లాభాలు వస్తున్నాయి గదాలని ఈ రంగంలో ఇన్వెస్ట్ చేస్తే చేతులు కాలినాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం వుండదని గమనించాలి. అన్నిటికి మంచి క్లియర్ టైటిల్ లేని భూములు కొనుగోలు చేస్తే తీవ్ర ఇబ్బందుల్లో పడే అవకాశం ఉంది. కొంచెం ధర ఎక్కువైనా ప్రభుత్వాలు అప్రూవ్ చేసిన లే అవుట్స్‌లోనే ఒకటికి రెండుసార్లు లాండ్‌డాక్యుమెంట్స్‌ను పరిశీలించి కొనుగోలు చేయాలి. అమ్మిన భూముల్ని మరలా అమ్మే కేటుగాళ్లు ఉంటారు కాబట్టి జాగ్రత్త వహించాలి. కొన్ని భూములు కబ్జాకాకండా చూసుకోవాలి. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు కొంత రిస్క్‌తో కూడుకున్నా ఆదాయ మార్గంలో అది ఒక బ్రహ్మాస్త్రంగా చెప్పక తప్పదు. ఇక చివరగా కేంద్రం ప్రవేశపెట్టిన వస్తుసేవల పన్ను, జీఎస్‌టి ద్వారా స్థిరాస్థిరంగంలో పారదర్శకత పెరగనుంది. రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ డెవలప్‌మెంట్ చట్టం, రెరా అమల్లోకి వస్తే ఈ రంగంలో అటు కొనుగోలు దారుడికి, పెట్టుబడిదారులకు మరింత మంచి జరుగనుంది. స్థిరాస్థిరంగంలో అక్రమాలకు కళ్లెం పడుతోంది. అయితే 2016 రెరా చట్టం ద్వారా ప్రతి రాష్ట్రం రెగ్యులేటరీ ఏజెన్సీని ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా దురదృష్టవశాత్తు రెండు రాష్ట్రా లు కమిటీలతోనే కాలక్షేపం చేస్తున్నాయి. రిటైల్ ఎస్టేట్‌రంగం అభివృద్ధికి రెరా చట్టం అమలు చేయడం ఎంతైనా అవసరమని రెండు రాష్ట్రా లు గమనించాలి.



స్పెర్జి రాజన్
ఆర్థికరంగ విశ్లేషకులు

రుణాలపై వడ్డీ రేట్ల పెంపు!

మార్కెట్ నుంచి నిధుల సేకరణ ఖర్చులు పెరగడంతో మార్జిన్లను కాపాడుకునేందుకు బ్యాంకులు వడ్డీ రేట్ల పెంపు వైపు దృష్టిసారిస్తున్నాయి. డిపాజిట్‌రేట్లను ఆకర్షణీయంగా మార్చేందుకు వడ్డీ రేట్ల పెంపు తప్పనిసరి. ఇదే సమయంలో రుణాలపై వడ్డీ రేట్లు కూడా పెరిగిపోవడం ఖాయం. మార్చి లేదా ఏప్రిల్‌లో వడ్డీ రేట్లను పెంపునకు బ్యాంకులు సిద్ధపడవచ్చని నిపుణులు అంటున్నారు.
బేస్‌రేటును ఎంసీఎల్ఆర్‌తో లింక్ చేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకున్నా.. ఇది ఏప్రిల్ 1 నుంచి అమలుకానుంది. నాలుగేళ్లపాటు తగ్గుతూ వచ్చిన వడ్డీ రేట్లు పెరిగే అవకాశం ఉందని, ఫిబ్రవరి 7న జరిగిన మానిటరీ పాలసీ కమిటీ భేటి అనంతరం సూచనప్రాయంగా తెలిసింది. గత కొన్ని నెలల్లో బాండ్ ఈల్డ్స్ ఒకశాతం పెరిగాయి.దీంతో డిపాజిట్ సర్టిఫికేట్స్‌ను జారీ చేయడం బ్యాంకులకు ఖరీదుగా మారింది. అంతేకాదు మార్కెట్ బారోయింగ్స్ ఖర్చు పెరగడంతో అధిక రేటెడ్ కార్పోరేట్ కంపెనీలు కూడా బ్యాంకులకు క్యూ కడుతున్నాయి. దీంతో వడ్డీ రేట్ల పెంపు వైపునకు బ్యాంకులు సమాలోచనలు జరుపుతున్నాయి. ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిక్ పాయింట్ల మేర పెంచుతూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ప్రయివేటు బ్యాంకులు అయిన యాక్సిస్, కోటక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎస్ బ్యాంక్లు 5-10 బేసిస్ పాయింట్ల మేర ఎంసీఎల్ఆర్ రేటును పెంచాయి. పదేళ్ల ఈల్డ్ 7.5శాతం..ఎస్‌బీఐ హోమ్‌లోన్ రేట్ 8.3శాతంగా ఉన్నాయి. ఈ రెండింటి మధ్య ఇంత తక్కువ అంతరం ఉండడం.. గత నాలుగేళ్లలో ఇదే ప్రథమం. ఇలాంటి అధిక ఈల్డ్ కారణంగా ప్రభుత్వ నిధుల సేకరణ ఖర్చులు పెరుగుతాయి. అవి మానిటరీ పాలసీపై ప్రభావం చూపుతాయి. అందుకే ఎంసీఎల్ఆర్ పెరగడం ప్రారంభమైంది. బల్క్ డిపాజిట్ రేట్లను బ్యాంకులు పెంచడం ప్రారంభించడాన్ని వడ్డీ రేట్లు పెరగడానికి ప్రారంభంగా చెప్పవచ్చు.



ఏడాదికి పైబడ్డ కాలవ్యవధి గల రూ. 1 కోటికి పైగా డిపాజిట్లపై వడ్డీ రేటును కేవలం రెండు నెలల వ్యవధిలోనే 200 బేసిస్ పాయింట్ల మేర పెంచి 6.25శాతానికి చేర్చింది. డిపాజిట్స్ వృద్ధి రేటు 4.5శాతంగా ఉండగా, లోన్ వృద్ధి 1శాతంగా ఉన్నట్లు జనవరి 5 నాటి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాలు చెబుతున్నాయి.
ఈ లిక్విడిటీ పరిస్థితుల ప్రకారం వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని మనీ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.
ఇప్పటివరకూ మార్కెట లీడర్ ఎస్‌బీఐ.. ఎంసీఎల్ఆర్ రేట్‌ను పెంచలేదు. కానీ గతనెలలో బేస్ రేటును 30 బేసిస్ పాయింట్లు తగ్గించినా ఇతర బ్యాంకులు ఏవీ ఈ చర్యను అనుసరించలేదు. బ్యాంకులు తాము అందించే రుణాలను బేస్ రేటుకు మాత్రమే లింక్ చేసి ఉన్నాయి. ఇవి వడ్డీ రేట్ల పెంపునకు మాత్రమే సిద్ధమవుతున్నాయని క్రిసిల్ అంటోంది.

బిగ్ బ్యాంగ్ హోమ్ కార్నివాల్

ప్రఖ్యాతిగాంచిన ప్రాపర్టీ సైట్ మ్యాజిక్ బ్రిక్స్, దేశంలోనే అతిపెద్ద రుణదాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న బిగ్ బ్యాంగ్ హోమ్ కార్నివాల్ క్యాంపెయిన్‌ను ప్రారంభించాయి. ప్రతిభారతీయుడి సొంత ఇంటి కలను నిజం చేయగల ఈ ఆన్‌లైన్ హౌసింగ్ పండుగ నెలరోజులపాటు కొనసాగుతుంది. 2018 మార్చి 9న ప్రారంభమయ్యే ఈ నెలరోజుల ఆన్‌లైన్ హౌసింగ్ పండుగ 22భారతీయ నగరాల్లో 16,000 యూనిట్లను ప్రదర్శిస్తుంది. 97 ప్రాజెక్ట్‌లను ప్రదర్శించడానికి 62 మంది డెవలపర్లు ముందుకురాగా ఎస్‌బిఐ రెరా ఆమోదిత ప్రాజెక్టులపై ఎస్‌బిఐ లోన్లను అందిస్తోంది. బిగ్ బ్యాంగ్ హోమ్ కార్నివాల్ పేరుతో ప్రత్యేక శైలిలో రూపొందిన అతిపెద్ద ఆన్‌లైన్ హౌసింగ్ ఫెస్టివల్ ద్వారా ఖాతాదారులు గొప్ప ప్రయోజనాన్ని పొందుతారు.

ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్

బంధన్ ఎస్‌డబ్ల్యూపీ (సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్) పేరుతో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్. ఒక కొత్త పన్ను ఆదా పెట్టుబడి సాధనాన్ని ప్రకటించింది. వ్యక్తిగతంగా మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్ చేయడం ద్వారా.. కుటుంబంలో వారి తర్వాతి సభ్యులకు నెలవారీగా నగదు పొందే సౌలభ్యం అందించడం తమ కుటుంబ సభ్యులకు ఫండ్ ట్రాన్స్‌ఫర్ చేయడం అనే అంశం బహుమతి కావడంతో దీనికి ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ సీఎంఓ డీపీసింగ్ చెబుతున్నారు. అందుకే బంధన్ ఎస్‌డబ్ల్యూపీ ప్రయోజనకారిగా ఆయన తెలిపారు. డివిడెండ్ పే అవుట్ ప్రణాళికతో పోల్చితే ఇది ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని అన్నారు.



ఈ పథకం ప్రత్యేకత.
ఇప్పటికే ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు చేస్తున్నవారితో పాటు, కొత్త కస్టమర్లకు కూడా. ఇలా నెలవారీగా తమ పెట్టుబడిలోంచి కొంత మొత్తాన్ని ఓపెన్ ఎండెడ్ మ్యూచువల్ ఫండ్ గ్రోత్ ఆప్షన్ నుంచి విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. పెట్టుబడి చేసిన వ్యక్తి పేరెంట్, సోదరి-సోదరుడు, భాగస్వామి పిల్లలలో ఎవరికైనా ఈ ప్రయోజనం అందుతుంది.
డివిడెండ్ పే అవుట్, డివిడెండ్ రీ ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్‌ను ఎంచుకున్న ప్రస్తుత ఇన్వెస్టర్లు.. గ్రోత్ ఆప్షన్‌కు మారడం ద్వారా ఈ విధానంలోకి మారవచ్చు.
నెలకు రూ 5000 చొప్పున కనీసం 12 నెలల పాటు విత్‌డ్రా చేసుకోవచ్చు.
ప్రస్తుత ట్యాక్సింగ్ విధానంలో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ అందిస్తున్న బంధన్ ఎస్‌డబ్ల్యూపీ అత్యంత ప్రభావవంతమైన పన్ను ఆదా సాధనంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈవో అనురాధా రావ్ చెబుతున్నారు. ప్రస్తుతం ఇది ఒక కుటుంబ సభ్యునికి మాత్రమే అమలులో ఉన్నా రాబోయే కాలంలో ఈ సంఖ్యను పెంచే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని వెల్లడించారు.
ప్రస్తుతం మధ్య వయసులో ఉన్న మదుపర్లు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని ట్యాక్సింగ్ నిపుణులు చెబుతున్నారు. ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌పై వచ్చే దీర్ఘకాలిక మూలధన రాబడులపై కూడా 10శాతం పన్ను చెల్లించాలని కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనల తర్వాత ఈ కొత్త పథకానికి రూపకల్పన జరిగింది.



కొత్త దారి ఏర్పడాలంటే ఎవరో ఒకరు ఆ దిశగా నడక మొదలుపెట్టాలి అంటున్నారు నేచురల్ స్టార్ నాని. తెలుగు తెరకు ఓ విభిన్నమైన చిత్రాన్ని అందించాలనే తపనతోనే అ..! నిర్మించానని ఆయన చెబుతున్నారు. కాజల్ అగర్వాల్, రెజీనా, ఈషా రెబ్బా, అవసరాల శ్రీనివాస్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని దర్శకుడు ప్రశాంత్ వర్మ రూపొందించారు. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తున్న అ..! చిత్ర విశేషాలు నాని తెలిపారు.

విభిన్న చిత్రాలకు అ..! స్ఫూర్తి కావాలి

- నాని

☆ చేప పాత్రకు వాయిస్ ఓవర్ చెప్పమని నా దగ్గరకు వచ్చారు ప్రశాంత్ వర్మ. మొత్తం కథ చెప్పాడు. ఆ కథ విన్న నేను ఐదు నిమిషాలు ఆశ్చర్యంతో తేరుకోలేదు. చాలా చిన్న వ్యయంలో ఈ సినిమా రూపొందించాలని అనుకుంటున్నట్లు చెప్పాడు. అయితే ఇంత మంచి కథకు గ్రాఫిక్స్, నటీనటులను ఇస్తే కథకు న్యాయం చేయగలం అనిపించింది. నాకు తెలిసిన మరో ఇద్దరు నిర్మాతలకు చెప్పి పంపిద్దామని అనుకున్నాను. కథను నేను, ప్రశాంత్ ప్రేమించినంతగా ఆ నిర్మాతలు ఇష్టపడతారో లేదు..ఒకవేళ వాళ్లకు నచ్చకుండే ప్రశాంత్‌క ు ఆ కథపై నమ్మకం పోతుందని భావించాను. అందుకే నేనే నిర్మాతగా మారి సినిమా చేశాను.

☆ ఎలాంటి సినిమా నేపథ్యం లేని యువకుడు ఇలాంటి కథను ఆలోచించాడంటే నమ్మలేకపోయాను. అతను వాయిస్ ఓవర్ కోసం నా దగ్గరకు వచ్చి కథ చెప్పినప్పుడే అతని ప్రతిభ ఏంటో తెలిసింది. పాత్రల తీరుతెన్నులు ఊహించిన విధానం...ఖచ్చితంగా బాగా దర్శకత్వం చేయగలడనే నమ్మకాన్ని కలిగించింది. అతనికి పూర్తి సహకారం అందించి సినిమా నిర్మించాను.

☆ మంచి సినిమాలు రావాలంటే ఎక్కడి నుంచో రావు. ఆ ప్రయత్నాలు మన దగ్గర నుంచే మొదలవ్వాలి. ఈ సినిమా గురించి చెపి ్పనప్పుడు కొందరు వాణిజ్య విలువలు ఏమున్నాయి అని అడిగారు. అంటే సినిమా అనే కళాత్మక రంగం వ్యాపారంలో పూర్తిగా మారిపోయింది. వ్యాపారానిదే పైచేయి అవుతోంది. కళారంగంలో సృజన స్వచ్ఛంగా ఉండాలంటే నిజాయితీగా కొత్త ప్రయత్నాలు చేయాలి. అప్పుడే పరిశ్రమలో భిన్నమైన చిత్రాలు వస్తాయి. ఇలాంటి పెయింటింగ్ గీయి..ఇంత డబ్బిస్తే అంటే ఇక ఆ చిత్రకారుడిలో సృజన ఎక్కడ వస్తుంది. అతని బొమ్మలో అందం చూసి ధర చెప్పాలి.

☆ భిన్నమైన పాత్రల కలయికే అ..!. ఒక్క క్షణం కూడా విడిచిపెట్టకుండా సినిమా చూడాలి. కాసేపు ఫోన్‌లో మాట్లాడి మళ్లీ సినిమా చూస్తే కథ ఎక్కడ మలుపు తిరిగిందో గుర్తు పట్టలేరు. పాత్రలు అలా కదులుతూ...చివరలో అన్ని సంఘటనలు ఒకదానికొకటి కలుస్తూ ముగింపుకొస్తాయి. సినిమా అయిపోకముందే ప్రేక్షకులంతా ఆశ్చర్యానికి లోనవుతారు.

☆ నా సినిమాలను చిన్న వయసు నుంచి మహిళలు, పెద్దలు అంతా చూస్తారు. వాళ్లు ఆదరించబట్టే ప్రతి చిత్రానికీ ఎదుగుతున్నాను. అలాంటి వాళ్లంతా ఆనందించేసినిమా అ..! అవుతుంది. ప్రతి సినిమా అందరికీ నచ్చాలని లేదు. చాలా మంది ఇష్టపడే చిత్రమవుతుందని చెప్పగలను..

☆ చిత్ర పరిశ్రమ నాకు చాలా ఇచ్చింది. మా పెద్ద కుటుంబంలో అంతా బాగా చదువుకుని, మంచి మంచి ఉద్యోగాలు చేసేవాళ్లు. విదేశాల్లో స్థిరపడ్డారు. నన్ను ఒకడినే పనికివాలిన వాడిలా చూసేవారు. అలాంటి నాకు ఇక్కడ పేరు, డబ్బూ వచ్చాయి. నేను సంపాదించిన ప్రతి పైసా ఇక్కడే ఖర్చు చేయాలని అనుకుంటున్నాను. దీన్ని కృతజ్ఞత అనుకోకుండా కేవలం సేవగా భావిస్తా.

☆ నేను నిర్మించే చిత్రాల్లో నేను నటిస్తానని చెప్పడం లేదు. నేను నటించే చిత్రాలు నిర్మించేందుకు వేరే నిర్మాతలు ఉన్నారు. కేవలం కొత్త తరహా సినిమాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే వాల్ పోస్టర్ సినిమా అనే నిర్మాణ సంస్థను స్థాపించాను.

☆ నా చిత్రంలో నటించానని ఏ హీరోయిన్ తక్కువ తీసుకోలేదు. వాళ్లపని రోజులను బట్టి పారితోషకం ఇచ్చాము. ఇది నాని సినిమా అనే సానుభూతి చూపించాలని కోరుకోలేదు.

☆ నా చిత్రంలో నటించడంతో పాటు సహాయ దర్శకుడిగానూ పనిచేస్తుంటాను. నాకు అదో సంతృప్తి. అన్నీ దగ్గరుండి చూసుకుంటాను. పేర్లు వేసేప్పుడు నా పేరు దర్శకత్వ శాఖలో వేయమంటా.

☆ నిర్మాతలను ఎప్పుడూ గౌరవిస్తాను. ఈ సినిమా నిర్మించాక...మనకు కనిపించకుండా వాళ్లు పడే ఇబ్బందులు తెలిశాయి.

☆ అ..! విజయవంతం అయితే మరికొంత మంది మా దారిలో నడుస్తారు. లేదంటే...కొత్త ప్రయత్నం అన్నారు ఏమైందా సినిమా అంటూ హేళన చేస్తారు. అయితే కథపై మాకు గట్టి నమ్మకం ఉంది. విక్రమ్ కుమార్, కార్తీక్ ఘట్టమనేని, హను రాఘవపూడి లాంటి దర్శకులతో నా తదుపరి చిత్రాలు ఉంటాయి.

కన్నడ భామపై 'శ్రద్ధ'



టాలీవుడ్‌లో తన అభినయ సత్తా చాటాలని మరో కన్నడ భామ శ్రద్ధ శ్రీనాథ్ ఉవ్విళ్లూరుతోంది. రెండేళ్ల క్రితం మలయాళంలో వచ్చిన కోహినూర్ చిత్రం ద్వారా అరంగేట్రం చేసిన ఆమె ఆ తర్వాత కన్నడంలో యూటర్న్, ఆపరేషన్ అలమేలమ్మ, తమిళంలో విక్రమ్ వేదా వంటి చిత్రాలలో నటించారు. ఇప్పుడు తెలుగు సినీరంగంపై కూడా దృష్టిపెట్టిన ఆమెకు అవకాశాలు వరుసపెడుతున్నాయి. ఇప్పటివరకు ఆమె నటిస్తున్న చిత్రాలు ఒకటీ విడుదల కాకుండా సెట్స్‌పైనే ఉన్నప్పటికీ అవకాశాలు మాత్రం వెంట వెంటనే పలకరిస్తుండటం విశేషం. క్షణం వంటి విజయవంతమైన చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమైన రవికాంత్ పేరెపు దర్శకత్వంలో రూపొందుతున్న హే కృష్ణ ముకుంద మురారి అనే చిత్రం ద్వారా శ్రద్ధ టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఇందులో సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్నారు. ఈ సినిమాతో పాటు సాయికుమార్ తనయుడు ఆది కథానాయకుడిగా విశ్వనాథ్ అరిగెల దర్శకత్వంలో రూపొందే చిత్రంలో కూడా శ్రద్ధ శ్రీనాథే కథానాయికగా నటిస్తోందట. ఇదిలావుండగా నాగార్జున, నాని కథానాయకులుగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ఓ మల్టీస్టారర్ చిత్రానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో నాగార్జున సరసన శ్రద్ధనే ఎంపిక చేశారని విశ్వసనీయ సమాచారం. ఇవే కాకుండా కన్నడంలో కొన్ని చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయని, అలాగే తెలుగులో ఇంకో చిత్రం కూడా ఆమె చేస్తోందని తెలిసింది. మొత్తంమీద ఒక సినిమా కూడా విడుదల కాకమునుపే ఇలా అవకాశాలు దక్కడం లక్కేనని అంటున్నారు. తెలుగులో తన మొదటి చిత్రం హే కృష్ణ ముకుంద మురారి కోసం బైక్‌పై రైడింగ్ చేయడం ఓ మంచి అనుభూతినిచ్చిందని, బుల్లెట్ నడపాలన్న కోరికను ఈ చిత్రం ద్వారా తీర్చుకున్నానని ఆమె అంటోంది. తనదైన గ్లామర్, అభినయాలతో తెలుగు ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంటానన్న నమ్మకం ఉందని ఆమె వివరించింది.

పైరసీ మా శ్రమను దోచేస్తోంది

ఏడాది పాటు సినిమా రూపకల్పన కోసం తాము పడిన శ్రమను పైరసీతో కొంతమంది దోచుకుంటున్నారని మోహన్ బాబు అన్నారు. ఆయన నటించిన తాజా సినిమా గాయత్రి ఆన్‌లైన్‌లోకి వచ్చిన నేపథ్యంలో మోహన్‌బాబు తన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ...గాయత్రి సినిమాను కొంతమంది ఆన్‌లైన్‌లో పెట్టారు. ఈ ఆన్‌లైన్ పైరసీ చిత్రాన్ని రెండు లక్షల మంది చూశారు. ఇది ఆర్థికంగా మాకు నష్టమే. ఓ సినిమా కోసం మేమెంత కష్టపడతామో ఈ పైరసీ చేసేవాళ్లకు తెలియదు. గాయత్రి ఆడపిల్లను కాపాడుకోవాలి అని చెప్పిన చిత్రం. తన బిడ్డను చూసేందుకు ఇరవై ఏళ్లు వేచి చూసిన తండ్రికి ఆ బిడ్డ కనిపించకపోతే ఎంత బాధపడతాడో చూపించాం. ప్రస్తుతం నేను నటుడిగా నిరూపించుకోవాల్సింది ఏమీ లేదు. అయితే నా కొడుకు మంచు విష్ణుకు భవిష్యత్ ఉండాలి. విష్ణు బాగా నటిస్తాడని తెలుసు. అయితే ఈ చిత్రంలో మరింత బాగా అభినయం చూపించాడు. థియేటర్ నుంచి ఎక్కడ పైరసీ జరుగుతుందో తెలియడం లేదు. గాయత్రి చిత్రంతో ఒక నిర్మాతగా నేను నష్టపోలేదు. ఒకవేళ నష్టపోయినా ఫర్వాలేదు. అల్లుడుగారు చిత్రం సమయానికి నా దగ్గర ఏమీ లేదు. ఆ సినిమా విజయం తర్వాత మళ్లీ పుంజుకున్నాను. నా కెరీర్‌లో సూపర్‌హిట్ చిత్రాలతో పాటు పెట్టుబడిపై వడ్డీ కూడా రాని సినిమాలున్నాయి. అసలు పోయినవీ ఉన్నాయి. నటించడం ఒక్కటే మాకు తెలుసు, మాకు గుర్తింపు తెచ్చిన పరిశ్రమలోనే కొనసాగుతాం. అన్నారు.



మోహన్ బాబు

నవ్వుల గోలీసోడా



ఎస్.బి. క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం సోడా గోలీసోడా. మొత్తం గ్యాస్ అనేది ఉప శీర్షిక. మల్లూరి హరిబాబు దర్శకత్వంలో భువనగిరి సత్య సింధూజ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మానస్, నిత్య నరేష్, కారు ణ్య హీరో హీ రోయిన్లుగా నటిస్తు న్నారు. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకువస్తోంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో నిర్మాత సత్య సింధూజ మాట్లాడుతూ సోడా గోలీసోడా మా సంస్థ నిర్మిస్తున్న తొలి సినిమా. పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రంగా తీయడం జరిగింది. నటీనటులందరూ సహకరించారు. వినోదంతో పాటుగా సందేశం కూడా ఉంటుంది. ప్రేక్షకులు మెచ్చుతారని ఆశిస్తున్నాం అన్నారు.

దర్శకుడు హరిబాబు మాట్లాడుతూ కుటుంబం అంతా కలిసి చూసి ఆనందించే సినిమా ఇది. ఈ సినిమా రెండు గంటలు నవ్విస్తుంది. పరిశ్రమలోని హాస్యతారాగణం అంతా నటించారు. హీరో హీరోయిన్లు ఇష్టంతో కష్టపడ్డారు. ఒక మంచి సినిమా ప్రేక్షకుల ముందుకురావాలంటే నిర్మాతల సహకారం కావాలి. అలాంటి సహకారం అందించిన నిర్మాతలకు కృతజ్ఞతలు అన్నారు.

హీరో మానస్ మాట్లాడుతూ సీనియర్ కమేడియన్స్ అంతా ఈ చిత్రంలో ఉన్నారు. వీరంతా ఎందుకున్నారో సినిమా చూస్తే తెలుస్తుంది. పాలకొల్లు, హైదరాబాద్ అందాల నడుమ చిత్రీకరణ జరిగింది. భరత్ సంగీతం అందించారని చెప్పారు. ఓ మంచి కథని ప్రేక్షకులకు అందించాలనే తపనతో దర్శకనిర్మాతలు ఈ చిత్రం రూపొందించారని నటుడు కృష్ణభగవాన్ తెలిపారు.

హీరోయిన్ నిత్య నరేష్, సహ నిర్మాత భువనగిరి శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



